స్వస్థత కన్నా మిన్నగా ఏమున్నదో తెలిసికొనగోరుచున్నారా?!!?
దేవుడు మన యెడల తన చిత్తాన్ని ఎలా బయలు పరుస్తాడో,
మనతో ఎలా సంభాషిస్తాడో తెలుసుకొనగోరుచున్నారా?
దేవుని భక్తుల మరణం దేవుని దృష్టికి ఎందుకు విలువైనదో
తెలుసుకొనగోరుచున్నారా?
క్రైస్తవ మరణం ఏ విధంగా ఉండాలని దేవుడు ఆశిస్తున్నాడో
తెలుసుకొనగోరుచున్నారా?
వివాహమునకు సంబంధించిన విషయాల గురించి
దేవుడు మనకు ఏమి బోధిస్తున్నాడో తెలిసికొనగోరుచున్నారా?
అయితే ప్రార్థనా పూర్వకముగా
శ్రీమతి డా॥ **విజయ సుధ** గారి
జీవితానుభవ సాక్ష్యాన్ని చదవండి!

**స్వస్థత కన్నా మిన్నగా**
Beyond Healing

ప్రథమ ముద్రణ
**2008 నవంబర్**

ప్రతులు
**3,000**

రచయిత
**శ్రీమతి డా॥ విజయ సుధ** MBBS

వెల
**అమూల్యం**

ప్రచురణ
**ఎస్తేరు పబ్లికేషన్స్**

ప్రతులకు
□□. □. □□□□□□ □□□□□ MBBS
W/o **D. RAJENDRA BABU** BE
# 26, SHAKINA, Subbanna Layout
Dodda Bomma Sandra
Behind St. Philomena's School
Vidyaranyapura Road
BANGALORE - 97, Karnataka
Phone : 080 - 28386525

గ్రాఫిక్స్
**గ్రేస్ గ్రాఫిక్స్**
**విజయవాడ-520 003**
ఫోన్ : (0866) 2531128
సెల్ : 93464 83348

# శుభాశీస్సులు



రచయిత్రి శ్రీమతి డా. విజయసుధ M.B.B.S. గురించి పరిచయ వాక్యాలు, శుభాశీస్సులు ఈ సందర్భముగా తెలియజేయడానికి నాకు దేవుడిచ్చిన అవకాశమునకై మొదటిగా దేవునికి వందనములు చెల్లించుచున్నాను.

శ్రీమతి. డా. విజయసుధను (చెల్లి) దేవుడు మాకు 2వ సంతానముగా ఇచ్చారు. దేవుడు తన అనాది సంకల్పముచొప్పున క్రీస్తునందు జగదుత్పత్తికి ముందే నన్ను, నా కుటుంబమును ఏర్పాటు చేసికొన్నాడు. ఆయన తన నిత్యసంకల్పము చొప్పున ఈ పుస్తక రచయిత్రి అయిన శ్రీమతి. డా. విజయసుధను కూడా ఏర్పాటు చేసికొన్నాడు. పిండదశ నుండి అనేక ఉపద్రవాలు, మరణాపాయములనుండి విడిపించి, నన్ను, నా కుటుంబాన్ని ఈ బిడ్డను సజీవులనుగా ఉంచిన జీవదాత, ప్రాణాదాత, పరమవైద్యుడైన క్రీస్తుకు స్తుతులు చెల్లిస్తున్నాను.


శ్రీమతి డా. విజయసుధ బాల్యదశనుండి కూడా క్రీస్తునందు భయభక్తులతో పెంచబడి తన 15 సం.ల వయస్సులోనే ప్రభువును తన రక్షకునిగా అంగీకరించినది. ఈమె తన ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు చదువు కరపలో ముగించి, ఇంటర్మీడియట్ చదువు కాకినాడలోను, మెడిసిన్ ఆంధ్రా మెడికల్ కాలేజీ, విశాఖపట్టణంలోనూ చదవడం జరిగింది. వైద్య విద్య 3 1/2 సం.లు గడిచాక శ్రీ డి. రాజేంద్రబాబు బి.ఇ. తో వివాహం జరిపించడం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు పాప, బాబు. ఆమె చదువును పూర్తి చేసిన తరువాత తన భర్తగారు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిడెట్ (బి.ఇ.ఎల్) బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నందువల్ల బెంగుళూరులో స్థిరపడడం జరిగింది.

ఈమె ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో పని చేస్తుండగా 2002 జూలై నెలలో హఠాత్తుగా వ్యాధిగ్రస్తురాలై, అపాయకర పరిస్థితిలో ఉండగా దేవుడు ఆమెను విడిపించాడు. ఆ వ్యాధికి చికిత్స నిమిత్తం ముమ్మారు ఆపరేషన్ చేయడం, దేవుడు అద్భుతరీతిగా విడిపించడం జరిగింది. ఆమె చికిత్సలో ఉంటుండగా దేవుడు ఆమెను దర్శించి మాట్లాడెను. దానితో ఆమె దేవుని కొరకు సాక్షిగా ఉండాలని, మరియు ఆమెకి ప్రీతిపాత్రయిన సంగీతాన్ని పాటలుగా కట్టి, దేవుని కొరకు పాడాలని దేవుని యొక్క కోరిక ప్రకారం ఆమె 6 క్యాసెట్లు చేసి విడుదల చేయడం జరిగింది. అనేక సభలలో, కూడికలలో తనను సజీవునిగా ఉంచిన క్రీస్తుకు సాక్షిగా నిలబడుతూ ఉంది.

ఇప్పుడు ఈ పుస్తకములో వ్రాయబడిన ఈ సాక్ష్యము ఆమె జీవితములో దేవుడు చేసిన అద్భుతాలు, ఆశ్చర్యకార్యాలు, విడుదలకార్యాలు తెలియచేసేదిగా ఉంటుంది. జీవాధిపతి అయిన దేవుడు ఆమెను ఇంకనూ దీవించి, జీవమునిచ్చి, ఆయుష్షునిచ్చి, ఆరోగ్యమునిచ్చి దేవుని కొరకు సాక్షిగాను, సంఘక్షేమముకొరకు పాఠకుల కొరకు ఈ సాక్ష్యమును ఆశీర్వాదకరముగా చేయును గాక! ఆమెన్.

శుభాశీస్సులతో.... తల్లిదండ్రులు

**శ్రీమతి వి. ఎస్తేర్ రాణి - డా॥ వి. నాగరాజు**
(రిటైర్డ్ జాయింట్ డైరెక్ట్ ఆఫ్ మెడికల్ హెల్త్)



# సంగీత శిక్షణ లేకుండానే పాడగలిగే భక్తిగల గాయని

ప్రఖ్యాత సువార్త సంగీత దర్శకులు, స్వరశిల్పి

**డా॥ పి.జె.డి. కుమార్, హైదరాబాదు**

డా. విజయసుధగారు, ఆవిడ బాల్యతనము నుండి నాకు బాగా సుపరిచితులు. ఆమె మంచి దైవ భక్తి కలిగిన క్రైస్తవ కుటుంబములో పుట్టి, దేవునియందు భయభక్తులతో పెరిగిన యువతి.

నా ముప్పై సంవత్సరాల సంగీత పరిచర్య అనుభవములో నేను ఎంతోమంది పాటలకు సంగీతము అందించగలుగుటకు దేవుడు కృపచూపారు. డా. విజయ సుధగారి విషయంలో కూడా వారి పాటలకు సంగీతం అందించుటకు ప్రభువు అవకాశమిచ్చారు.

డా. విజయసుధగారు సంగీతాన్ని నేర్చుకోకుండా, దానిని అభ్యసించకుండానే ఎంతో బాగా సంగీతము నేర్చుకొని, సంగీతములో బాగా అనుభవము గడించిన వారిని పోలి ఎంతో అర్ధవంతమైన రచనలు వ్రాసి, వాటికి మంచి బాణీలు కూర్చి, స్వరకల్పన చేయడం నన్ను అబ్బురపరచింది.

ఆమె వ్రాసిన పాటలు కూడా ఏదో తన భాషా పరిజ్ఞానాన్ని కవిత్వరూపంలో పొందుపరచాలని కాకుండా ఆధ్యాత్మిక విలువలు కలిగి, పరిశుద్ధ వాక్యాధారముగా, తన జీవిత అనుభవానికి తగినట్లుగా ఉంటాయి.

ఆమెతో రికార్డింగ్ చేసేటప్పుడు మాకు ఎటువంటి అననుకూలతలు ఎదురవ్వలేదు. ఇబ్బందులు కలుగలేదు. నేను, నాతోటి కళాకారులు సైతం ఆమె పాటలను విని ఎంతో ఉత్సాహముతో, సంతోషిస్తూ పని చేసాము. ఆ పాటలను స్టూడియోలో వింటూ ఉండగానే అవి ప్రజల హృదయాలలో ఎటువంటి ముద్రవేస్తాయో ముందే మాకు తెలిసిపోయేది. ఈ విధముగా నేను ఆమె ద్వారా ఆరు ఆల్బమ్‌లు క్రైస్తవ లోకానికి అందించగలుగుటకు దేవుడు నాకు అవకాశమిచ్చారు. అవి ఎంతో ప్రజాదరణ పొందాయి. పాట అర్ధానికి తగిన రాగం, దానికి తగిన సంగీతముతో, ఆ పాటలు ఎంతమందికో దీవెనకరముగా, ఆదరణకరముగా ఉన్నాయని ఎంతోమంది చెప్పుట విని సంతోషిస్తున్నాను.

మన ఆంధ్రక్రైస్తవ స్త్రీలలో పాటలు వ్రాయడం, వాటికి స్వరకల్పన చేసి వాటిని పాడగలిగేవారు బహుకొద్దిమందే. డా. విజయసుధగారు పాటలు వ్రాయడం, స్వరకల్పన చేయడమే కాకుండా తానే అర్ధవంతముగా, మాధుర్యముగా పాటలు పాడడం ఆమె ప్రత్యేకత.

మన రాష్ట్రంలో ఎందరో పేరుపొందిన సంగీదర్శకులుండగా బ్రదర్. రాజేంద్రబాబు, శ్రీమతి. డా. విజయసుధగార్లు చేయుచున్న పరిచర్యలో తోడ్పడానికి ప్రార్ధనాపూర్వకముగా నన్ను సంగీత దర్శకునిగా ఎంపిక చేసికొన్నందుకు నేను వారికి నా తరపున, నా కుటుంబము తరపున నా వందనాలు, అభినందనలు తెలియజేస్తు న్నాను. దేవుడు వీరిని మరెక్కువగా తన పరిచర్యలో వాడుకోవాలని నా ఆకాంక్ష

ప్రభువు డా. విజయసుధగారికి మంచి ఆరోగ్యమునిచ్చి, ఆయుష్షును పొడిగించి, మరెక్కువగా రాబోయేకాలంలో తన సేవలో వాడుకోవాలని హృదయపూర్వకముగా కోరుకొంటున్నాను.

ప్రభువు సేవలో

**స్వరశిల్పి డా. పి.జె.డి. కుమార్** - మ్యూజిక్ డైరెక్టర్

# బాధకరమైన తన జీవితంలో విశేషమైన దేవుని కనికరములు



**బిషప్ ఎర్నెస్ట్ పి. కొమానపల్లి**

**మన్నా/రాక్ చర్చ్ మినిస్ట్రీస్, హైదరాబాదు**

డా. విజయసుధ యొక్క నిశ్చలమైన విశ్వాసముతో కూడిన అద్భుతకరమైన జీవితానుభవ సాక్ష్యమే ఈ పుస్తకం. ఆమెను దేవుడు పాటలు, సాక్ష్యజీవితము ద్వారా తన సేవలో వాడుకొనుచున్నందుకు దేవునికి వందనములు. అపొస్తలుడైన యోహాను ప్రకటన 12:11లో వ్రాసిన రీతిగా మనము ఇచ్చే సాక్ష్యమునుబట్టియు, గొర్రెపిల్ల రక్తమునుబట్టియు జయించిన వారము.

ఈమె నా మేనకోడలైనందుకు తాను పుట్టినప్పటి నుండి నాకు తెలుసు. ఆమె దేవుని యందు భయభక్తులు కలిగి పెంచబడినది. తన అమ్మమ్మగారైన శ్రీమతి. కె.యస్. మిరియాంగారు మరియు తన తల్లిదండ్రుల ద్వారా ప్రభావితము చేయబడినది. ఆమె తన బాల్యములోనే ప్రభువును అంగీకరించి, అన్ని క్రైస్తవ నీతి సూత్రములను అనుసరిస్తూ వచ్చింది. విద్యార్ధినిగా మంచి రికార్డు సంపాదించుకొని, మానవ జాతికి సేవ చేయడానికి వైద్యురాలయ్యింది. దేవుడు ఆమెకు దేవుని ప్రేమించి, దేవుని కొరకు విశ్వాస పాత్రముగా సేవ చేసెడి భర్తను ఇచ్చాడు. ఆమె ఎల్లప్పుడు మృదువైన స్వభావముతో, అణకువ కలిగి తన ప్రవర్తను కాపాడుకొంటూ దేవుని కొరకు తన భర్తతో కలిసి సేవలో కొనసాగుచున్నది.

ఈ పుస్తకములోని సాక్ష్యము ఏమంటే తన బాధకరమైన జీవితములో దేవుడు చూపిన కృప, కనికరములను వివరించడమే. దేవుడు ఆమెను మరణపు కోరల నుండి అనేకమార్లు విడిపించారు. డాక్టర్లు, స్పెషలిస్టులు సైతం తమ ఆశను వదులుకొన్నా, ఆమె మాత్రం యోబు “నా విమోచకుడు సజీవుడు” అని చెప్పినట్టుగా తన విశ్వాసమును విడిచిపెట్టలేదు. ఆమె నిత్యము బాధనను భవిస్తున్నప్పటికీ, ఆమె తన దేవుని ప్రేమించి, ఆరాధించి, తన శ్వాస ఉన్నంతవరకు సేవ చేయాలనే ధ్యేయం కలిగి ఉన్నది.

దేవుడు ఆమె విశ్వాసమును ఘనపర్చి, ఆమెను ఒక ఆశీర్వాదకరముగా నిలిపాడని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. ఆమె తన ఆధ్యాత్మిక జీవితములో బలముగా ఎదుగుతూ, అనేకమైన ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, ఆశానిగ్రము” (గలతీ 5:22-23) లనే ఆత్మీయ ఫలములను ఫలించుచు ఉన్నది.

డా. విజయసుధ తన రక్షకుని ప్రేమించుటకు, సేవించుటకు తన జీవితమును సమర్పించుకొన్నది. అనేకమంది హృదయాలలో ప్రభువైన యేసుక్రీస్తున గూర్చి విశ్వాస బీజమును విత్తుటే ఆమె కోరిక. దేవుని రాజ్యము విస్తరించడము, అభివృద్ధి పొందడము, దేవుని సువార్త విత్తుట ద్వారా జరుగుట చూతునని ఆమె నిశ్చయించుకొన్నది.

మేము ఆమె యొక్క దృఢమైన విశ్వాసమును, నిరీక్షణను ఆమె సాక్ష్యముద్వారా దేవుని మహిమపరచుటను చూచి ఎంతగానో సంతోషిస్తున్నాము. దేవుడు తన మహిమ, ఘనతకొరకు ఆమెను వాడుకొనుచున్నందుకు దేవునికి వందనములు. ఈ పుస్తకమును చదువుచున్న పాఠకులందరిలో కూడా ఆ విశ్వాసమును, నిరీక్షణను కలిగించాలని దేవుని ప్రార్ధించుచున్నాను. దేవుడు ఈ పుస్తక రచయిత్రిని, దాని పాఠకులనందరిని దీవించవలెనని మా ప్రార్ధన.

**బిషప్ ఎర్నెస్ట్. పి. కొమానపల్లి**



## వైద్యం కంటే ఎక్కువగా దేవుని మాటలతో చికిత్స చేసే సేవకురాలు

**పాస్టర్ మాణిక్యమ్మగారు**
**బెంగుళూరు**



ప్రభువునందు ప్రియమైన సహోదరి డా. విజయసుధగారు నాకు 1992 సం.ము నుండి దేవుని కృపవలన నాకు పరిచయమయ్యారు. ఆమె చిన్నతనము నుండి దేవుని చిత్తానుసారముగా దేవుని మహిమకొరకు జీవించుచున్న వ్యక్తి అని ఆమె క్రియలద్వారా నేను తెలిసికొన్నాను. ఈమె జీవితములోని గొప్ప ఆశీర్వాదము వలన అనుగ్రహించబడిన వైద్యవృత్తి బహు ప్రాముఖ్యమైనది.

దేవుడనుగ్రహించిన ఈ వైద్య వృత్తిలో ఈమె చాలా సహనశీలిగా ఉండి దేవుని మహిమార్థమై నమ్మకముగా వైద్యసేవలు అందించారు. అతి చిన్న వయస్సులోనే దేవుడామెకు అనుగ్రహించిన వైద్యవృత్తి ద్వారా మంచి అనుభవశాలి అయిన డాక్టర్ అని ప్రజల ద్వారా పేరు పొందారు.

ఆమెకు అనేకవిధాలైన శారీరక బలహీనతలున్నప్పటికిని, తన వద్దకు కష్టముతో, నొప్పితో వచ్చే ప్రజలను ప్రేమతో ఆహ్వానించి, మంచిమాటలతో ఆదరించి, దేవుని వాక్యముతో వారిని బలపరచేవారు. అనేకులు ఆమె ఇచ్చే మందులకన్నా, ఆమె చేసే ప్రార్థనను ప్రాముఖ్యముగా కోరుకొనేవారు.

ఆమె తన స్వరమును దేవునికి సమర్పించారు. ఆమె స్వయముగా పాటలు వ్రాసి, పాడి దేవుని ఘనపరచారు. అంతేకాక అనేక స్థలములలో దేవుడు తన జీవితములో చేసిన కార్యాలను, పాటలు, సాక్ష్యమును దేవుని వాక్యముతో పంచుకొన్నారు.

నా వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలు, ఆటంకాలు, వేదనలు సంభవించినప్పుడు అందరు చెయ్యి విడిచినప్పుడు నన్ను ఆదుకొని, ఆదరించి బలపరచారు. ముఖ్యముగా నేను ఆధ్యాత్మిక జీవితములో బలహీనపడిన సమయంలో దేవుని వాక్యము ద్వారా బలపరచి, దేవుని వాక్యములోని గూఢార్థములను గ్రహించునట్లు నాకు సహాయము చేసారు. దేవుడు ఆమెను ఎక్కువగా ఆశీర్వదించి, తన సాక్ష్యముద్వారా దేవుని సేవలో వాడబడవలెనని నా ప్రార్థన.

## మహా శ్రమలగుండా పయనించేవారికి ఆదరణకరమైన ఆదర్శం



**రెవ. కార్ల్ & షారోన్ కొమానపల్లి**
**మన్నా సిల్వర్ జూబిలీ చర్చ్**, అమలాపురం

నామేనకోడలైన డా. విజయసుధ భక్తి కలిగిన క్రైస్తవ కుటుంబములో జన్మించి, తన జీవితమును చిరుప్రాయములోనే ప్రభువైన యేసుక్రీస్తుకు సమర్పించుకొనినది. డా. సుధ తనకు ఉన్న అనారోగ్య పరిస్థితివలన ఎన్నో కష్ట సమయాలు, ప్రతికూల పరిస్థితులగుండా పయనిస్తూ ఉన్నది.

“భూమిమీద నరులకాలము యుద్ధకాలము కాదా? వారి దినములు కూలివాని దినములవంటివి కావా?” యోబు 7:1. అనారోగ్యస్థితిలో సైతము ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలలో ఎన్నో సువార్త కూడికలలో, యౌవనస్థుల మీటింగులలో, స్త్రీల కూడికలలో తన మాధుర్యమైన పాటలద్వారా, ఆత్మీయసందేశములద్వారా, సాక్ష్యముద్వారా దేవుని కొరకు ఆత్మలను సంపాదించ వలెనని డా. సుధ పోరాడుచున్నది. అంతా స్పష్టముగా, వ్యతిరిక్తముగా ఉన్నప్పటికిని అటువంటి దేవున్ని పదే పదే విశ్వసించి ప్రేమించుటకు కష్టసాధ్యమైనప్పటికిని ఈమె యోబువలె పోరాడుచున్నది. తన బలహీన పరిస్థితిలో కూడా దేవుని కొరకు ఎంతగానో వైద్యసేవలు అందించినది. క్రీస్తుని పోలిన ఆమె ప్రేమను గుర్తించి పరలోక స్వస్థతను అనేకమంది ఆమె పరిచర్యద్వారా పొందుకొన్నారు. అనేకమంది యేసుక్రీస్తు దేవుని రక్షణ జ్ఞానమును గ్రహించునట్లు చేసి ఆత్మలను సంపాదించుకొనుటకు ఆమె ఒక సాధనము.

తన్ను ఎంతగానో ప్రేమించిన రక్షకుడు, విమోచకుడు, ప్రభువైన యేసుక్రీస్తు కొరకు డా. సుధ హృదయము ప్రేమతో మండు చున్నది. ఆమెలో గొప్ప మనోధైర్యము ఉన్నది. దేవుడు ఆమె జీవితములో గొప్ప అద్భుతాలను చేసారు. ఒక నిజమైన క్రైస్తవునికి రెండు ప్రాముఖ్యమైన దర్శనములున్నవి. అవి విశ్వాసము, శ్రమలు. క్రైస్తవులమైన మనము విశ్వాసులమని యోహాను 14:1లో వ్రాయబడింది. మనము విశ్వసించినందులకు శ్రమలు కూడా అనుభవించాలి. దేవుని పక్షముగా శ్రమలు సహించుట ఒక ఆధిక్యతగా మనకు ఆయన అనుగ్రహించాడు. మనము శ్రమలను క్రీస్తుకొరకు భరించినప్పుడు ఆయనతో అన్యోన్యసహవాసము గలవారమైయుంటాము. ఫిలిప్పీ 1:30.

డా. విజయసుధ తన శ్రమలలో, బాధలలో దేవుని మహిమపరచుచున్నదని దృఢముగా సాక్ష్యమిస్తూ ఉన్నాను. ఎవరైతే మహాశ్రమలగుండా వెళ్తూ ఉన్నారో వారికి ఆమె జీవితము ఒక ప్రకాశమానమైన ఉదాహరణ. తనవలె దేవుని తోటలో శ్రమిస్తూ, ఇటువంటి శ్రమలగుండా వెళ్ళుచూ ఉన్న సేవకులను, క్రైస్తవ విశ్వాసులను తన సాక్ష్యముద్వారా ప్రోత్సహించవలెనని, వారిని పడిపోకుండా బలపరచవలెనని డా. విజయసుధ ఈ పుస్తకమును ముద్రించడం నాకు చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. డా. విజయసుధ తన శ్రమలలో ప్రభువును ఎంతో విశ్వాస పాత్రముగా సేవించుచున్నందుకు ఆమెకు మేనమామయ్యగా గర్విస్తున్నాను.

ఈ పుస్తకము చదువుచున్న పాఠకులకు నిజముగా సంతోషమును, ఆదరణను కలిగించునని మనఃపూర్వకముగా ఆశిస్తున్నాను.

ప్రభువుసేవలో
**రెవ. కార్ల్ డి. కొమానపల్లి**



# ప్రాణాన్ని హరించే వ్యాధిలోను చిరునవ్వుతో దర్శనమిస్తోంది

**డా. రమామణి**

**సిఎం..ఎస్. బి.ఇ.ఎల్. హాస్పిటల్**, బెంగుళూరు

డా. విజయసుధగారు నాకు 6 సం.లుగా తెలుసు. మా ఇద్దరు మధ్యన ఉన్న సంబంధం ఒక డాక్టరు, పేషెంట్‌కి ఉండే సంబంధం కానేకాదు గాని అది ఒక స్నేహ బంధం.

ఆమె జీవిత కథను చూసినప్పుడు రీడర్స్ డైజెస్ట్ వంటి అది పెద్ద పుస్తకాలలో చదివిన కథలా అన్పిస్తుంది. ఆమె జీవితవిధానం చూసినప్పుడు నాకు చాలా సంతోషం కలుగుతూ ఉంటుంది.

బి.ఇ.యల్. ఫాక్టరీలో డి.జి.ఎమ్‌గా పని చేస్తూ ఉన్న శ్రీ రాజేంద్రబాబుగారు 6 సం.ల క్రితము తన భార్య రక్తపు వాంతులు చేసికొంటూ, తీవ్రతరమైన పరిస్థితిలో ఉన్నదని, దానికి మల్య హాస్పిటల్‌లో అడ్మిట్ చేడానికి రిఫరల్ లెటర్ కావాలని ఆ రోజు నైట్ డ్యూటీలో ఉన్న నన్ను అడిగారు. తరువాత 6 రోజులకు నేను మరొక పేషెంటును దర్శించుటకు మల్య హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు ఆ ప్రక్క గదిలోనే నేను రిఫరెన్స్ వ్రాసి ఇచ్చిన డా. విజయసుధ ఉన్నారని తెలిసి ఆమెను కూడా ఒకసారి చూడాలని ఆ రూమ్‌లోనికి వెళ్ళాను. అక్కడ ఒక యౌవన యువతిగా 30 సం.ల వయస్సుతో ముఖములో చిరునవ్వుతో నన్ను పలకరించి, మాట్లాడి తనకు 'క్యాన్సర్ వ్యాధి' అని తన నోటితోనే చెప్పిన ఆమెను చూచి ఆశ్చర్యపోయాను. ఆమె ముఖ కవళికలను చూసి అబ్బురపడ్డాను. ఆమె పేషెంటు స్థానంలో ఉండి, తన గురించి ఒక డాక్టరుగా నాతో తన పరిస్థితి వివరించింది.

ఆ తరువాత రెండున్నర సం.లకు తనకు లివర్‌లో మెటాస్టెసిస్ అయి, ఆపరేషన్ జరిగిన తరువాత నేను ఆమెను ఎక్కువసార్లు కలిసికొని, మాట్లాడడానికి, భీమోథెరపీ, పెట్ సి.టి. స్కాన్‌లకోసము వచ్చినప్పుడు సంభవించినది. ఆమె కుటుంబము గురించి, ఆమె వ్యక్తిత్వముగురించి, వ్యాధి తీవ్రతను గురించి నేను ఆమెతో మాట్లాడడం జరిగింది. ఆమె వెళ్ళిన తరువాత ఆమెను గూర్చి ఎన్నోసార్లు నేను కంట నీరు పెట్టుకోవడం జరిగింది. ఆమె ఎప్పుడూ వ్యాధిగ్రస్తురాలిగా కనిపించలేదు. ఆమె రిపోర్టులు ఎంత బాధాకరముగా బాగోలేవని వచ్చినా ఆమె కళ్ళలో నేను కన్నీళ్ళు చూడలేదుగాని నేను ఆమెను తలంచుకొని విపరీతముగా బాధపడేదాన్ని.

అయితే తరువాత ఆమెతో మాట్లాడుతూ ఉండగా ఆమె కొన్ని ఉచిత వైద్య శిభిరాల ద్వారా వైద్యసేవ చేస్తున్నదని, పేదవారికి తన క్లినిక్‌లోనే సహాయకరముగా ఉన్నదని తెలిసికొన్నాను. ఆమె తన బాధ, దు:ఖము ఎప్పుడూ బయటికి కనబడనివ్వలేదు. ఈ వైఖరిని చూసినప్పుడు నేను రీడర్స్ డైజెస్ట్ వంటి పుస్తకాలలో చదివే కథలాగా అనిపించింది. ఆమె చాలా దయకలిగి, పేషెంటు స్థానంలో తనను ఊహించుకొని ఎదుటివారికి సహాయకరంగా, ఎంతో ధైర్యముతో ఉన్నదని గ్రహించాను.

ఒకనాడు నా టేబుల్‌మీద కొన్ని సిడిలు చూసాను. వాటిని ఇంటికి తీసికొనివెళ్ళి అందులోని పాటలు, జీవితకథను విన్నాను. అవి డా. విజయసుధ స్వయముగా రచించి, స్వరకల్పనచేసి, తానే పాడిన పాటలు. ఆ పాటలలో జీవితఅనుభవ కథ అంతటిలో ఆమె భావాలు, కష్టాలు వాటిలో దేవుడు ఎలా ఆమెను ఆదరించాడో వివరించిన తీరును చూచి ఆ పాటలకై నేను ఆశ్చర్యపోయాను. ఆమె దేవుని కొరకు తన్ను సమర్పించుకొన్నది. కాబట్టే అంత ధైర్యము, బలము, శక్తి దేవుని వద్దనుండి పొందుకొన్నదని నేను దేవుని కొనియాడాను.

తన పిల్లల విషయమై నేను ఆమెను మాట్లాడించినప్పుడు ఆమె "నేను ఎలాగ అన్నిటికి సిద్ధపడ్డానో, అలాగే నా పిల్లలను కూడా ముఖ్యముగా చిన్న బిడ్డను కూడా దేనినైనా ఎదుర్కోవడానికి, ఎంత కష్టము, శ్రమైనా అధిగమించడానికి సిద్ధపరచానని" చెప్పింది. ఒకరోజు తాను పరలోకములో ఉంటుందని అక్కడ పిల్లలకోసం ఎదురు చూస్తానని, వారు అక్కడికి వచ్చినప్పుడు అందరం సంతోషముగా దేవునితో ఉండబోతాము అని బిడ్డలతో చెప్పడం నాకు ఆశ్చర్యము కలిగించింది.

డా. విజయసుధ దేనినైనా అంగీకరించడానికి సిద్ధముగా ఉంది. ఆమె ఎల్లప్పుడూ ముఖాన చిరునవ్వుతో, ఎప్పుడూ ఏ విధమైనా సణుగులేకుండా ఒక యౌవన స్త్రీగా, డాక్టర్‌గా, ఒక మంచి తల్లిగా ఆమెను చూచినప్పుడు ఇటువంటివారిని చూడడం అరుదు అని అనుకొంటారు.

ఆమె నాకు ఒక స్నేహితురాలు మాత్రమే కాదు గాని ఆమె నాకు తన జీవితం ద్వారా ఒక గురువు, ఒక మాదిరి. నేనే ఆమె నుండి ఎన్నో నేర్చుకొన్నాను. మనము ఎంతో చిన్న విషయాలకే ఎంతో నలిగి పోతాము. కాని ఆమె ఇంతటి బాధ తనలో ఉంచుకొని కూడా వేరే ప్రదేశాలలో, చర్చిలలో తన కథను వివరించి ఎలాగ వ్యాధిని, మరణాన్ని అధిగమించాలో వివరించడం చేస్తూ ఉన్నది. "జీవితం చాలా చిన్నది, దానిని మనము అర్థవంతముగా మలచుకోవాలి" అని ఆమె నాతో చెప్పింది.

ఆమె జీవితంలో ఏమేమి జరిగాయో అవన్నీ దేవుని చిత్తములోనే జరిగాయి, దేవుని దీవెనలు ఆమెపై ఉన్నాయి.



# ఆమెలో దిగులు, భయము ఎన్నడు నేను చూడలేదు

**డా. కె.యస్. గోపినాథ్**

ఆంఖో సర్జన్, **మల్య హాస్పిటల్ బెంగుళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంఖాలజి,**

**బెంగుళూరు**

---

నేను ఉదయం లేచినప్పటినుండి ఎంతోమంది రోగులను చూస్తూ ఉంటాను. ఒక్కరోజు కూడా సరళముగా, మృదువుగా సాగని స్థితిలో, భయంకరమైన వ్యాధి క్యాన్సర్ మానవాళిని కబళించడం చూస్తూ ఉంటాను. ఈ వ్యాధిని ట్రీట్ చేసేటప్పుడు కొన్ని గొప్పగా చెప్పుకోదగినప్పటికి, ఎన్నోసార్లు నిరాశ కలిగించే ఫలితాన్నే చూస్తాను. దానికి మరింత సన్నిహితముగా మరణాన్ని చూస్తు ఉంటాను. మరణాన్ని అంత చేరువగా చూసినప్పుడు మానవమాత్రులలో ఏ గొప్పతనమూ లేదు, అన్నీ అంతకు మించి ఉన్నాయని తలుస్తాను.

ఈ అంశానికి ఆధారముగా నా స్నేహితురాలు డా. విజయసుధ ఒక ఋజువుగా ఉన్నది. ఆమె తన వైద్య వృత్తిలో ఎంతో ఓర్పుతో, సహనముతో, సోలిపోని పట్టుదలతో, ఎంతో ప్రతిష్ఠతో, తన గురించి తాను పట్టించుకోకుండా పని చేసేది. తన శరీరము అలసి, నీరసించినా కూడా కొన్నాళ్ళు పేషెంట్లు, కుటుంబము అనుకొంటూ గడిపేసింది.

నేనిచ్చే సలహా ఏమిటంటే మనం ఇతరుల కొరకే కాక మన కొరకు కూడా జాగ్రత్తలు ఆరోగ్య విషయంలో పాటించాలి. డా. విజయసుధ తన రక్త పరీక్షలలో హిమోగ్లోబిన్ చాలా తక్కువౌతునప్పటికి ఎంతో చలాకీగా పని చేస్తూ ఉండేది. అయితే 'అనీమియా' (రక్తహీనత)కై పరీక్షలు జరిపిన సమయానికి ముందు ఆమె అకస్మాత్తుగా రక్తపువాంతి చేసికోవడం, ఎండోస్కోపీ చేసి ఆమె జీర్ణాశయంలో ఒక ట్యూమరును కనుక్కోవడం జరిగింది. పెథాలజీ రిపోర్టులో అది ఒక అరుదైన క్యాన్సరు (జీర్ణశయం, ప్రేవులకు సంబంధించినది) అని తేలింది. ఆమె ఒక డాక్టరు అయి, అన్ని విషయాలు తెలిసీ కూడా ఆమె వ్యాధిని అంగీకరించి, ఎప్పుడు చిరునవ్వుతో దాని పర్యవసానాన్ని కూడా స్వీకరించింది. నేను ఆమెకు ట్రీట్‌మెంటు ఇచ్చిన అన్ని రోజులూ కూడా ఆమెలో నేను దిగులు, భయమును చూడలేదు. ఎంతోమంది విషయం విన్న వెంటనే ఎంతో భయముతో దిగులు చెందుతారు. డిప్రెషన్‌కి గురౌతారు. ఆమె "నేను దేవుని నమ్ముతున్నాను, మీరు చేయగలిగినదంతా చెయ్యండి, నేను విజయంతో తిరిగి వస్తాను" అని థియేటర్‌కి వెళ్తూ చెప్పింది.

దీని నీతి ఏమిటంటే రోగులు ఎవరైనా, ముఖ్యముగా క్యాన్సర్ రోగులు జీవితము మీద ఆశాదృక్పమము కలిగి ఉండాలి. వ్యాధిని మనస్సులో స్వీకరించాలి. రోగికి బ్రతుకుతాననే విశ్వాసం అవసరం.

2002 సం.లో ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ అయ్యాక కాంప్లికేషన్లు కూడా అయ్యాయి. ఆమె జీర్ణాశయం సరిగ్గా పని చేయలేదు కాని ఆమె కొన్ని రోజులకి విజయాన్ని చవి చూసింది. 2005 సం.లో మరల డా. సుధ వచ్చి "అయ్యా! నేను అడ్మిట్ అవ్వాలి, నాకెందుకో బాగోలేదు" అని అన్నది. ఎప్పుడూ డాక్టర్ పేషెంట్‌కి అడ్మిట్ అవ్వాలని చెప్పినప్పుడు పేషెంట్లు వద్దని వెళ్ళిపోవడం చూసాను కాని డా. సుధ, ఒక వైద్యురాలు, ఆమెకి తన స్థితి తెలిసికొన్ని మాతో సహకరించినందుకు మాకు చాలా సంతోషం కల్గింది. ఆమె తన ఆశావాదాన్ని కోల్పోకుండా స్థిరంగా నిల్చింది. లివర్‌లో మెటాస్టాటిక్ లీజన్ వచ్చినప్పుడు కూడా ఆమె దిగులు చెందక ధైర్యముతో సర్జరీకి ఒప్పుకొన్నది. తరువాత ఆమెకు ప్రపంచములోని అతి మంచి భీమోథెరపీ "గ్లీవేక్" ఆ వ్యాధి కొరకు ఇవ్వడం మొదలుపెట్టాము.

ఆమె ఎప్పుడూ ఆశ కలిగి, దిగులుచెందక ధైర్యముతో ముందుకు సాగింది. తన వైద్య వృత్తిని, కుటుంబ జీవితాన్ని నిర్లక్ష్యము చేయకుండా కొనసాగుతూ ఉంది.

ఆమెకు వైద్య వృత్తి మీద ఆసక్తే కాకుండా సంగీతము ఇతర కళలపై మక్కువ ఉన్నదని తెలిసింది. నా సలహా ఏమంటే "మీ వ్యాధి ఏమైనప్పటికి, మీకు మక్కువైన వాటిపై మనస్సుపెట్టండి. కుటుంబజీవితాన్ని నిర్లక్ష్యము చేసికోవద్దు. మీరు ధైర్యముగా, ఆశాదృక్పదముతో ఉన్నప్పుడు, ఆ వ్యాధినుండి త్వరగా బయలుపడగలరు".

ఇప్పటికి 6 సం.లుగా డా. విజయసుధ వ్యాధిగ్రస్తురాలైనప్పటికి అతి మంచి ఫలభరితమైన జీవితాన్ని ఆమె జీవించింది. ఏదో చెయ్యాలని సాధించాలనే తపనతో ధైర్యముతో, పట్టుదలతో, చిరునవ్వుతో, మనోధైర్యముతో ఎన్నో మ్యూజిక్ ఆల్బమ్స్, విడియో ద్వారా తన కథను తయారు చేసి ఎంతోమంది క్యాన్సర్ రోగులకు ఉపయోగకరముగా ప్రోత్సాహకరముగా చేసింది.

డా. విజయసుధ భర్తగారు కూడా ఆమెను గూర్చి చాలా జాగ్రత్త వహించారు. మేము హాస్పిటల్ వార్డులలో, ఆపరేషన్ థియేటర్లలో ఇచ్చే ట్రీట్‌మెంట్ మాత్రమే ప్రాముఖ్యముకాదు. కుటుంబములోని వారు రోగిపట్ల చూపే జాగ్రత్త. ప్రేమ ఆదరణ ఎంతో ముఖ్యమైనది. డా. విజయసుధ ఏ ఏ రిపోర్టులు ఎంత బాధకరముగా వచ్చినప్పటికి, వస్తున్నప్పటికి ఆమెలోని చిరునవ్వు అగిపోలేదు. ఆమె క్యాన్సర్ రోగులందరికి అనుసరించవలసిన ఒక మాదిరి, ఉదాహరణ.

క్యాన్సర్ వ్యాధి ఉన్న రోగి కుటుంబస్థులందరికి కూడా కౌన్సిలింగ్ అవసరము. మానవశరీరములో ఒకసారి డయాగ్నోసిస్ క్యాన్సర్ అని ఋజువైతే కొన్ని మార్పులు కలుగుతాయి. అవి "సైకో ఇమ్యునోలాజికల్ పేరామీటర్స్" అని అంటారు. వాటికి వెనువెంటనే ట్రీట్‌మెంట్ అవసరం. దాన్ని ఆపరేషన్, రేడియోషన్, భీమోథెరపీలతో కాకుండా కుటుంబములోని వ్యక్తులందరికి కౌన్సిలింగ్ ఇచ్చుట ద్వారా అధిగమించవచ్చు. అది రోగిని ఎక్కువ జాగ్రత్తగా చూసికోవడానికి, కనిపెట్టుకోవడానికి అవసరమౌతుంది.

డా. విజయసుధ తానే పేషెంట్ అయి, తన్నుతాను ఒక అర్థవంతమైన దానిగా మార్చుకోవడమే కాక, తన భర్తను, పిల్లలను, అందరిని జీవితంలో దేనినైనా ఎదుర్కొనేటట్లు చేసికోగలిగినందుకు ఆమె జీవితం మనకు అనుసరించదగిన ఒక ఉదాహరణ.



# మనో బలం, మానసిక స్థైర్యం ఎన్నడు వీడదు

**డా. రవి బి. దివాకర్**
మెడికల్ ఆంఖాలజిస్ట్, **మల్యా హాస్పిటల్**
**బెంగుళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంఖాలజి**
**బెంగుళూరు**

2005వ సం.లో డా. విజయసుధ నా వద్దకు ఒక పేషెంటుగా వచ్చింది. ఆమెకు బహు అరుదైన జీర్ణకోశ క్యాన్సరు, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ స్ట్రోమల్ ట్యూమర్. అప్పటికే రెండు పెద్ద ఆపరేషన్లు జరిగాయి. వ్యాధి లివర్‌కి వ్యాపించింది. ఆమె నా దగ్గరకి వచ్చినప్పుడు ముఖాన చిరునవ్వుతో, చాలా సౌమ్యముగా ప్రశాంతతో కనబడింది. ఆమె రోగి అని తెలిసికొని, ఆశ్చర్యపడ్డాను, బాధపడ్డాను. ఆమె వైద్యురాలు అయినప్పటికి చాలా మంచి వ్యక్తిత్వము కలిగిన పేషెంటుగా, ఎంతో అణకువతో నడుచుకొన్నది. అప్పటికి ఆ వ్యాధికి సర్జరీ మాత్రమే ట్రీట్‌మెంటుగా ఉండేది. ఆమె నన్ను సమీపించిన సమయానికి ఒక కీమోథెరపీ ఔషధం 'ఇమాటినిబ్' అనే పేరున విడుదలైంది. అది క్రొత్త ఔషధమైనప్పటికీ, ఫలితము గురించి ఆశించకుండా చెప్పినట్లు విని, క్రమంగా ట్రీట్‌మెంటు తీసికొన్నది.

ఒకనాడు ఆమె ఇచ్చిన కొన్ని మ్యూజిక్ ఆల్బమ్స్ ఇంటికి తీసికొని వెళ్ళి వాటిలోని భక్తి కీర్తనలని విని చాలా సంతోషించాను. ఎంతో మధురముగా తానే స్వయముగా వ్రాసి, స్వరకల్పన చేసి, పాడడం నిజముగా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇంకా ఎంతో సమాజ సేవ చేస్తూ ఉన్న వ్యక్తిగా తన వైద్యవృత్తిని ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా, తన బాధలన్నీ మరచిపోయి, బాధలోనున్నవారిని ప్రోత్సహించుటకు ఆమె కంకణం కట్టుకొని, తన అనుభవాన్ని వారివద్ద వివరించి ఆదరించడం, వారు కోలుకోవడానికి ఆమె కృషి చేయడం ఎంతో ప్రాముఖ్యమైన సంగతి.

ఆమె ట్రీట్‌మెంటు తీసికోవలసిన అవసరతను గుర్తించి, తాను ఆరోగ్యంగా ఉండి ఇతరులు ఆరోగ్యముగా ఉండుట కొరకు వారిని ప్రోత్సహించడం, నేను ట్రీట్ చేస్తున్న ఒక రోగిగా ఆమెను నేను కలిగి ఉండడం ఎంతో గొప్పగా భావిస్తున్నాను.

నేను డా. విజయసుధకు మంచి ఆరోగ్యము, ఆయుష్షును కలగాలని మనసారా కోరుతున్నాను. ఆమె తన వ్యాధి, బాధను మరచి ఇతరులకు సహాయకరముగా ఉండడం వల్ల ఆమె ఒక శక్తివంతమైన వ్యక్తి అని నమ్ముతున్నాను. ఆమె 2006లో మరొక ఆపరేషన్‌కు వెళ్ళడం జరిగింది. దురదృష్టకరముగా ఎన్నో కాంప్లికేషన్లు-ఇన్ఫెక్షన్, జ్వరము, ఎలక్ట్రోలైట్ ఇమ్‌బాలన్స్, స్రావులు సరిగ్గా పనిచేయకపోవడం వంటి కాంప్లికేషన్ ద్వారా వెళ్ళవలసి వచ్చింది. అయితే ఆమె మానసిక స్థైర్యాన్ని వీడలేదు. ఆమె ముఖములోని నవ్వును కోల్పోలేదు. తన మనోబలాన్ని క్రిందికి నెట్టివేసికోలేదు. ఆమె చాలా ధైర్యంతో "నేను తప్పక కోలుకుంటాను, ఈ పోరాటం అంతా కొన్ని రోజులే, విజయవంతముగా తిరిగి వస్తాను" అని చెప్పి, చెప్పిన విధముగానే వ్యాధితో, బాధతో పోరాడింది. ఈ సంగతులు అందరూ ఆమెను చూసి నేర్చుకోవాలి.

డా. విజయసుధకు మరల కీమోథెరపీ ఇవ్వడం మొదలుపెట్టాము. ఆమె ఎంతో ధైర్యముగా ముందుగా వెళ్ళుచున్నది. ఆమె ఎల్లప్పుడు జీవితంతో ఏది సంభవించినప్పటికి సంతోషముగా, చిరునవ్వుతో ఎదుర్కోవాలని మనసారా కోరుకుంటున్నాను.

# వ్యాధి పర్యవసానం తెలిసినా సమాధానంతో, సానుకూలతతో ప్రవర్తిస్తుంది



**డా. యస్. ఎన్. పాటిల్ &**
**శ్రీమతి డా. సువర్ణ పాటిల్**
**సుమతి నర్సింగ్ & మెటర్నిటీ హోం**
బెంగుళూరు

డా. విజయసుధ గారిని గత 14 సం.లుగా ఎరుగుదుము. ఆమె 1994లో ఒక డ్యూటీ డాక్టర్‌గా మా నర్సింగ్ హోమ్‌లో జాయిన్ అయ్యారు. ఆమె మాతో 10 సం.లు కలిసి పని చేసారు. ఆమె డ్యూటీ డాక్టరుగా ఉన్నప్పుడు వార్డులలో ఆమె రౌండ్స్ చేసి, ట్రీట్‌మెంట్ వ్రాసేస్తే నాకు చాలా టెన్షన్ తగ్గిపోయేది. ఎందుకంటే ఆమె అంత నిజాయితీగా, హృదయ ప్రతిష్ఠతో, చాలా నిష్కపటముగా, తన డ్యూటీ అవర్లను అధికమించి పని చేసే వారు. ఆమె పేషెంట్ స్థానములో తన్నుతాను ఊహించుకొని వారి బాధను గ్రహించి వెంటనే వారి బాధ నివృత్తికి ట్రీట్ చేసి పేషెంట్లకు ఏ తొందర కలుగకుండా చూసికొనేవారు.

ఆమె 2001లో గుజరాత్‌లోని భుజ్‌లో భూకంపం సంభవించినప్పుడు 2 వారాలు ఆమె వారికి తన సేవలందించి వచ్చారు. వారందరికి ఉచితముగా వైద్య సేవలందించారు. ఆమె ఎప్పుడూ చిరునవ్వుతో అన్ని వర్గాలు, తెగలవారితో చాలా సులభముగా కలిసిపోయే మంచి వ్యక్తిత్వము కలిగిన మనిషి.

2002 సం.లో ఆవిడ రక్తహీనతవలన నీర్సమవ్వడం ప్రారంభించారు. ఒకరోజు అకస్మాత్తుగా రౌండ్స్ ముగించిన తరువాత రక్తపు వాంతి చేసికొన్నారు. మేము పెప్టిక్ అల్సర్ ఉండవచ్చని తలంచి, గాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డా. సత్యప్రకాశ్ గారిని పిలిపించాము. ఆయన ఎండోస్కోపి చేసినప్పుడు మా అందరిని ఆశ్చర్యపరిచే విధముగా జీర్ణాశయములో ఒక పెద్ద ట్యూమర్ డయాగ్నోసిస్ అయ్యింది. ఆవిడను మల్యా హాస్పిటల్‌లో చేర్చి, ఆపరేషన్ చేయించారు. తరువాత "బరస్ట్ అబ్డమెన్" అనే కాంప్లికేషన్ అయ్యింది. మేము ఆమెను చూడడానికి మల్యహాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు ఆమె చిరునవ్వుతో, ఎంతో సౌమ్యముగా సమతుల్యమైన మానసిక స్థితితో కనిపించారు ఆమె జరిగినదాన్ని తన జీవితములోనికి యదాతథంగా స్వీకరించారు. ఆమెకు తన వ్యాధి, దాని పర్యవసానము ఏమిటో బాగా తెలిసినా ఆమె ఎంతో సమాధానముతో, నెమ్మదితో, జీవితముపట్ల సానుకూల స్పందనతో ముందుకు వెళ్ళడం రోగులందరికి, ముఖ్యముగా క్యాన్సర్ రోగులు ఆమెనుండి నేర్చుకోవలసినది ఎంతైనా ఉంది.

ఆమెకు లివర్‌లో మెటాస్టిసిస్ అయి, తరువాత జీర్ణాశయంలోనే వ్యాధి మరల వచ్చినప్పుడు వాటి కొరకు ఆపరేషన్ చేయబడినా ఆమె తన సానుకూల వైఖరిని, జీవితంపట్ల ఆశాదృక్పథాన్ని కలిగి ఉండడం రోగులందరికి ఒక గొప్ప పాఠం.

ఆమె తన్నుతాను ప్రోత్సహించుకోవడమే కాకుండా, కుటుంబములోని వ్యక్తులందరిని ముఖ్యముగా తన భర్తని, పిల్లలని ఎంతో సుఖకరమైన జీవితం జీవించేటట్లుగా చిరునవ్వుతో, ముఖాన దరహాసాన్ని విడిచిపెట్టలేదు. ఆమె బాధలో ఉన్నవారికి ఒక మాదిరికరమైన ఆదర్శము కలిగిన వ్యక్తి.

దేవుడు ఆమెను జీవితంలో దేన్నైనా ధైర్యముతో, స్థైర్యముతో ఎదుర్కోవడానికి అత్యధికముగా ఆశీర్వదించును గాక!



*ఆమె మమ్మల్ని, మా స్టూడెంట్స్‌ను దర్శించిన ప్రతీసారి కూడా తన జీవితానుభవాలద్వారా ప్రోత్సాహపరుస్తారు*

**బ్రదర్ యం. ప్రీతమ్ లూక్** సెక్రటరీ & కరస్పాండెంట్
**సెంట్‌లూక్స్ కాలేజి ఆఫ్ నర్సింగ్, విశాఖపట్నం**

డా. విజయసుధ ప్రభువు కొరకు వ్రాసిన తన సాక్ష్యపుస్తకములో ఆమెను గూర్చి కొన్ని మాటలు వ్రాయడం నాకు ఎంతో సంతోషం.

నేను ఆమెను విశాఖపట్టణంలో మెడికోగా ఉన్నప్పటి నుండి ఎరుగుదును. ఆమె కొన్ని క్రైస్తవ కూడికలు, మీటింగుల్లో పాడడమే కాక మా సహోదరుడైన ఆశీర్వాద్ దర్శకత్వము వహించిన సిటీక్వయర్‌లో కూడా పాటలు పాడేవారు. ఆమె విద్యార్థిగా జీవిస్తున్నప్పుడే ఆమె విశ్వాసము, దేవుని కొరకు తన సమర్పణను బయలుపరచారు.

దేవుని మార్గాలు ఎంతో మర్మముగా, ఆశ్చర్యకరముగా ఉంటాయి. డా. సుధ జీవితమే అందుకు ఒక నిదర్శనం. దేవుడు తాను ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తాడో వారికే శ్రమలను అనుమతిస్తాడు. ఆమె తన జీవితములో ఎన్నో విభిన్నమైన, కఠినమైన కష్ట పరిస్థితులు కలిగినా, నమ్మదగిన దేవుని గూర్చి నాకెన్నో ప్రశ్నలు కలిగినా, ఆమెలో స్థిరమైన విశ్వాసమును చూసాను. నేను ఒకసారి ఆమెకు అనారోగ్యము కలిగినప్పుడు, ఆమె అనారోగ్యము యొక్క తీవ్రత తెలిసికొని ఆమెను ఆదరించడానికి నేను వెళ్ళాను. కాని ఆమె తిరిగి "దేవుడు తన్ను ప్రేమించేవారికే శ్రమలకు అనుమతిస్తాడు" అని చెప్పి నన్ను ప్రోత్సాహపరచింది. ఈ బాధలు, శ్రమలు మన విశ్వాసమునకు పరీక్ష. దేవుడు మనం సహించుకొనేటంత మాత్రమే అనుమతిస్తాడు. మనము దేవుని కొరకు ప్రతీ పరిస్థితిలోనూ జీవింతాతము సాక్షులుగా ఉండుటకు పిలువబడ్డాము. దేవునికి తన ప్రజల యెడల ఎన్నో ఉద్దేశ్యాలు, ప్రణాళికలు కలిగి ఉన్నాడు. వాటి నెరవేర్పుకై మనము ఏమాత్రము ప్రశ్నించకుండా దేవుని చిత్తానికి అప్పగించు కోవడం మన కర్తవ్యము. ఎందుకంటే "ఆయన తన సమయములోనే అతిసుందర కార్యములు చేయువాడు". ఈనాడు నేను డా. సుధ ప్రభువుపై చూపిన విశ్వాసమును బట్టి అతిశయిస్తున్నాను.

డా. సుధ విశాఖపట్టణములోని మా నర్సింగ్ స్టూడెంట్లకు మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఆమె మమ్మల్ని దర్శించిన ప్రతీసారి కూడా తన జీవితానుభవాలద్వారా వారిని ప్రోత్సాహపరుస్తారు. మా నర్సింగ్ విద్యార్థులు జీవితాలను మార్చే ఆవిడ సాక్ష్యము ద్వారా ఎంతో సంతోషించారు, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి బలం పొందుకొన్నారు.

డా. సుధ మంచి గాయని, గతంలో నేను ఆమెకు ప్రసిద్ధమైన సినీ సంగీతము సూచించాను కాని ఆమె అటువంటి జనసమ్మతమైన ఆకర్షణలకు లొంగలేదు. దేవుని సేవించడంలోనే ఆమె సంపూర్ణ సంతోషాన్ని కనుగొన్నది. దేవుని సేవించి, ఆయనను సంతోష పర్చాలన్నదే ఆమె మనఃపూర్వక ఉద్దేశ్యము. ఆమె పేరున ధ్యాన కీర్తనల సిడిలు, ఆల్బమ్‌లు ఉన్నాయి. తన క్లిష్ట పరిస్థితులలో పరిశుద్ధాత్ముని ప్రేరేపణతో ఎన్నో పాటలు వ్రాసి, స్వరకల్పన చేసి, పాడారు.

ఆమె వివిధ స్థలాలలో పంచుకొనిన సాక్ష్యములు, సందేశాలు, క్యాసెట్లు, సిడిల రూపములో దొరుకుతున్నాయి. అవి ఎంతో మందికి తమ కఠిన పరిస్థితులలో శక్తిని పొందుకొనుటకు సవాలుగా ఉన్నాయి. అవి వారి జీవితాలలో చిక్కు సమస్యలను అధిగమించి బలము, శక్తి పొందుకొనునట్లు చేస్తున్నాయి. ఆమె సాక్ష్యము, పాటలు కలిగిన డివిడిని అనేక వేలమందికి దీవెనకరముగా ఉండి, వారి జీవిత ఆధ్యాత్మిక పయనములో ఆశీర్వాదము పొందుటకు త్వరలోనే మేము సమర్పిస్తున్నాము.

మా హృదయపూర్వక ప్రార్థనలు ఎల్లప్పుడు డా. సుధ మీద ఉన్నవి. నా కుటుంబమంతా ఆమెకు శుభములు తెలియజేస్తున్నాము. నా తల్లిగారైన శ్రీమతి. విజయలూక్‌గారు ఆమె కొరకు నిరంతరము ప్రార్థిస్తున్నారు. మా విద్యార్థులు ఆమెనుబట్టి సంతోషిస్తూ ఆమెపట్ల తమ ప్రేమను తెలియజేయుచున్నారు. ఆమె జీవితములో అంతా శుభమే జరగాలని కోరుకొంటున్నాము. ఈ పుస్తకమును చదవాలని నేను అందరిని కోరుతున్నాను. ఎందుకంటే అది మీకు ఒక సవాలు, మీ జీవితములో మీరు ఎదుర్కొనే బాధలను, వేదనలను, కష్టాలను అధిగమించుటకు తోడ్పడునని విశ్వసిస్తున్నాను. ఈ తరమువారికి డా. సుధ జీవితమే దేవుని విశ్వాస్యతకు ఒక సజీవ సాక్ష్యము.

# శరీరంలో వేదన - ఆత్మలో ఆనందం ఆమె జీవితం



**శ్యామ్ బాబు ఇందుపల్లి**
**గ్రేస్ గ్రాఫిక్స్, విజయవాడ**
ఫోన్ : 9346483348

ఆమె జీవిత కథ తెలిశాక ' ఆమె ఒక గాలిలోని దీపం '. అన్నిటి వలె కాకుండా చకాచకా వేగంగా కరిగే మైనపు వొత్తి. ఆమె జీవం మిణుగురు జ్వాల. వసంత కాలంలోనే కనపడే వసంత కోకిల.

వైద్య విద్య నభ్యసించిన ఆమె రోగులకు చికిత్స సేవ చేయాలనే తన సంకల్పానికి వైకల్యం ఏర్పడింది. ఆకారానికి అందంగా వున్నా అంతరంగంలో అనారోగ్య అంధకారం అతలాకుతలం చేస్తుంది. యౌవ్వన జీవితంలోనే అనారోగ్యపు తుప్పు తినివేస్తుంటే తన జీవపు గమనాన్ని వ్రేళ్ళతో లెక్కించుకునే దుర్భర పరిస్థితి ఆమెను వెంటాడుతుంది. తనలోని రుగ్మత చెద తన మనసుకు నెమ్మది లేకుండ చేస్తున్నా... ప్రభు పరిచర్య కోసం వాడబడాలనే తన ఆశయం ఎంతో గర్వనీయమైనది. గుండెను పిండి చేసే తన గతం కళ్లను నీళ్లతో నింపుతున్నాయి.

'జీవించి యుంటే ప్రభు కొరకు - లేకుంటే క్రీస్తు కడకు' అనే ఈమె స్ఫూర్తి మనకొక స్ఫురదీప్తి. అన్నీ సవ్యంగా ఉంటేనే సరిగా దేవుని పని చేయలేని మనకు ఆమె జీవిత ప్రయాణం మనకొక మేల్కొల్పు. తటస్థిపరిచే చలన సవాలు. ఇలాంటి స్థితిలోను తన భర్తకు మంచి ఇల్లాలుగా - తన పిల్లలకు చల్లని తల్లిగా - తన ఆధ్యాత్మిక బంధువులకు చక్కని సోదరిగా తన స్థానాన్ని పదిల పరచుకుందని చెప్పాలి. తన గళంతో దేవునికి స్వర నైవేద్యం చేస్తూ అనేక సంఘాలలో తన సాక్ష్యాన్ని, ఉపదేశాన్ని పంచుకుంటూ తన పరుగును కొనసాగిస్తున్న విజయసుధ గారికి బాధాతప్త ప్రార్థన జేజేలు!

సతమతపెట్టే సమస్యలోను చిరునవ్వు చిద్విలాసం చేయు మీ ముఖం ఎంత ధన్యకరం! చివరి రక్తపు బొట్టు వరకు ప్రభు పనిలో సాగండి! అంతిమ శ్వాస వరకు అలుపెరుగని దేవుని పనిమనిషిగా ఆయన తోటలో కొనసాగండి. అప్పడే మీ నామధేయంలోని **'విజయ'** కు సార్థకత. మా ప్రార్థనాశీస్సులు ఎప్పడు మీ వెన్నంటే ఉంటాయి. మన నిరీక్షణ - తప్పిపోకుండా కుడియెడంగానైనా పరలోకంలో ప్రవేశించటం, ప్రభువుతో కలకాలం జీవించడం. అదే మన నిత్య రాజ్య నివాసం. ఇదే నేను మీకిచ్చే ఆదరణ. దేవుని రాజ్య వ్యాప్తికై ప్రభువు నోటి బూరగా వాడబడుతున్న మీకు అభినందనలు తెలుపుతూ

మీ సోదరుడు

**శ్యామ్‌బాబు ఇందుపల్లి**



## ఈ లోకంలో భయపడకుండా దేవుడిచ్చే శక్తిని ప్రయోగించడం ఆమె ద్వారా నేను నేర్చుకున్న పాఠం

**బ్రదర్ డి. రాజేంద్రబాబు**
డి.జి.యం.
**భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్**
**బెంగుళూరు**

కిరీటముగా, మేలుగా, దానముగా దేవుడు నాకు ప్రేమతో దయ చేసిన నా సహధర్మచారిణి డా. సుధను బట్టి నేను దేవునికి ఎప్పుడూ ఎంతగానో కృతజ్ఞతలును చెల్లిస్తాను.

ఒక స్నేహితురాలిగా, ఒక భార్యగా, ఒక ఉపాధ్యాయినిగా, ఒక ఆత్మీయ తల్లిగా, ప్రోత్సాహపర్చే వ్యక్తిగా, నన్ను ప్రేమించే ప్రేయసిగా ఈలాంటి గొప్ప లక్షణాలన్ని కలబోసి దేవుడు నాకు దయచేసిన ఆమె రాకవలన నా జీవితంలో ఎంతో ఆత్మీయముగా దేవునిలో బలపడేందుకు దారితీసింది.

ప్రతిరోజు ఆమె దగ్గర నుండి నేను నేర్చుకొంటున్నవి అనేకములు. బాధలో, కష్టములో, ఉపద్రవాలలో, నిరుత్సాహ పరిస్థితులలో కూడా ఈ లోకంలో యేసుప్రభునిపై ఆధారపడి, ఆయనను సంపూర్ణముగా నమ్ముకొన్నవాళ్ళు ఎటువంటి ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండాలో ఆమె జీవితము నిదర్శనము. "యెహోవాయందు భయభక్తులు గలవారియెడల ఆయన దాచి యుంచిన మేలు ఎంతో గొప్పది" అనే వాక్యసారాంశాన్ని ప్రతి నిత్యము ఆమెలో నేను చూస్తు ఉన్నాను. క్రైస్తవ జీవితం థియరీతో మాత్రమే పరిమితం కాకుండా ప్రాక్టికల్‌గా కూడా ఋజువుగా చేయాలని నేను నా భార్య జీవితం ద్వారా నేర్చుకొన్నాను. ఈ లోకములో క్రైస్తవుడు జీవిస్తూ అసాధ్యములైన వాటిని సాధ్యమని నిరూపించుట అన్న నానుడి ఆమె విశ్వాస జీవితంలో నేను గమనించాను.

మొట్టమొదట మన జీవితంలో దేవునికి స్థానమిస్తే దేవుడు ఏ విధంగా గొప్పకార్యాలు చేస్తాడో ఆమె విశ్వాసజీవితము నిదర్శనము.

ప్రతిక్షణము, ప్రతినిమిషంలో భయముతో కృంగి, కృశించి పోతున్న ఈ లోకములో భయపడకుండా దేవుడిచ్చే శక్తిని ప్రయోగించడం ఆమె ద్వారా నేను నేర్చుకొన్న అద్భుతపాఠం.

దేవుని కొరకు మనము నిలబడితే దేవుడు మనలను ఏ విధముగా తన పనిలో వాడుకొనే ఆధిక్యతనిస్తాడో ఆమె విశ్వాస గీతాలే నాకు ప్రేరేపణ. ఈ లోకములో మనుష్యులను నమ్ముకొని వారిని సంతోషపెట్టుకంటే దేవుని నమ్మి ఆయనను సంతోషపరచవలెనని ఆమె తీసికొన్న తీర్మానము నాకు ఉత్తేరకము.

ఈలాంటి ఆత్మీయ గుణాలు కలిగిన ఈమె జీవితానుభవసాక్ష్యము అనేకమందికి ఉపయోగకరముగా, దేవునికి మహిమకరముగా ఉండాలని ఆశిస్తూ, ప్రార్థిస్తూ రాబోవు కాలములో దేవుడు ఇంకా అనేక విధాలుగా తన దాసురాలిని వాడుకొనునని విశ్వసిస్తూ

ప్రభువు పరిచర్యలో - మీ సహోదరుడు
**డి. రాజేంద్రబాబు**

## మా అమ్మ మాకు అద్భుతమైన దీవెన

**కుమారి ఎస్తేర్ ప్రైజీ దాసరి - మాస్టర్ రాన్ సామ్యూల్**



మా అమ్మ నిజముగా మా జీవితానికి అద్భుతమైన దీవెన. ఆమె ఎందరికో తన ధైర్యము, సహనము, పట్టుదల, కష్ట పరిస్థితుల ద్వారా సుపరిచితులు, ఆమె ఒక మంచి తల్లి, మంచి వైద్యురాలు, మంచి బోధకురాలు, మంచిగాయని, మంచి సహధర్మచారిణి. అందుకే ఆమె ఎందరో ప్రేమను పొందగిలిగింది.

మా అమ్మ తన యం.బి.బి.యస్. కోర్సును 1993లో పూర్తి చేసి ఒక ఆసుపత్రిలో 10 సం.లు పని చేసారు. మేము బెంగుళూరులోనే 1991 నుండి స్థిరపడ్డాము.

మా అమ్మకు సంగీతమంటే ఎంతో మక్కువ. పాడడం అంటే ఇష్టము. ఆమెకు మంచి గాత్రము ఉన్నది. మా అమ్మ దేవుని విశ్వాసపాత్రమైన బిడ్డ. ఆమె దేవుని ప్రియమైన కుమార్తె అని మేము నమ్ముతాము. మా చిన్నతనము నుండి ఆమె పెంచబడిన రీతిగానే మమ్మల్ని కూడా మా అమ్మ పెంచింది. వాస్తవానికి మా అమ్మ మాకు ఎన్నో ఇంగ్లీషు కీర్తనలు, పల్లవులను నేర్పారు. దేవుని వాక్యాన్ని ఎలా చదవాలో, ఎలా ప్రార్థించాలో నేర్పారు. మా అమ్మ మా ఇద్దరికి చాలా విలువైన వ్యక్తి.

ఆమె వద్దనుండి మేము ఎన్నో అమూల్యమైన సంగతులను తెలిసికొన్నాము. ఆమె గొప్ప దైవజనురాలు. ఆమె సాక్ష్యమిచ్చుటకుగాని, లేక దేవుని వాక్యము బోధించడానికి గాని నిలువబడినప్పుడు అపవిత్రాత్మలు గడగడ భయముతో వణకడం మేము చూసాము. కాబట్టి ఆమె దేవునికి అతిప్రియమైన కుమార్తె అని నమ్ముతున్నాము.

ఆమె మా చదువు, విద్యాభ్యాసము, వ్యక్తిగత జీవితము విషయమై సలహాలిస్తూ, "సాతాను చేతులలో మాత్రం పడకూడదు" అని బోధించారు. ఆమె నుండి మేము నేర్చుకొన్న గొప్ప సంగతి ఏమిటంటే 'క్షమాపణ'. ఆమె విషయంలో అపనమ్మకముగా ఉండి బాధపరచిన వారు ఎంతటి భయంకరమైన వ్యక్తులైనా వారిని ఆమె క్షమించారు. ఆమెకు వ్యతిరేకముగా మాట్లాడిన వారిని క్రీస్తువలె మన్నించారు.

తన ఆరోగ్యపరిస్థితి క్షీణించిపోతున్న కూడా ఆమె ఎక్కడికైనా వెళ్లుటకు, ఎప్పుడైనా సాక్ష్యమిచ్చుటకు ఆమె సిద్ధము. ఆమెలో ఎప్పుడూ ఒక తేజస్సును, గొప్పవెలుగును, నిరీక్షణను మేము చూస్తూ ఉన్నాము. మేము విచారముగా ఉన్నప్పుడు, సమస్యలతో సతమతమైనప్పుడు మమ్మల్ని సంతోషపరుస్తూ మా ముఖములో నవ్వు వచ్చేలా చేస్తారు.

నిజానికి, ఆమె సాక్ష్యముద్వారా మేము ఎంతగానో చలించబడ్డాము. దేవుడు ఆమెకు ఆరోగ్యాన్ని ప్రసాదించి, ఎక్కువకాలము ఆయుష్షును పొడిగించి దేవదీవెనలు ఆమెపై కుమ్మరించవలెనని ప్రార్థిస్తూ ఉన్నాము. దేవుడు ఆమెకు ఇప్పుడే పిలుచుకొన్నా కూడా మేము విచారించడానికి బదులు సంతోషిస్తాము. ఎందుకంటే మరుక్షణము ఈ ప్రపంచాన్ని, ఈ వేదన, బాధలను, శ్రమలను వీడి పరిశుద్ధులతో, ప్రభువుతో పరలోకములో ఆనందిస్తారని. మేము కూడా ఆమె యొక్క అంతులేని ఆనందములో, సంతోషములో, మహిమలో ఉంటామని గాఢముగా విశ్వసిస్తున్నాము.

"అమ్మా! విషమ పరిస్థితులలో ఏ విధముగా పోరాడి వాటిని అధిగమించాలో మాకు నేర్పినందుకు నీవు మా జీవితము విషయంలో తీసికొంటున్న జాగ్రత్తలకై, చేస్తున్న సమస్తమునకై వందనాలు".

దేవుడు తన కృపా క్షేమములను నీ జీవితాంతము నీ వెనుక తప్పక పంపిస్తాడు.

ప్రేమతో, ముద్దులతో - నీ ప్రియమైన
**ఎస్తేర్ - రాన్**

# [illegible]

**Esther Praisy Dasari**



My mom is truly a great blessing in my life. She is greatly known for her courage, Patience, Perseverence, & afflictions. She is a good mother, Doctor, Preacher, Singer and a good wife, and that is why she is loved by many. She completed her MBBS in the year 1993 and worked as a Doctor for 10 years in a hospital. We settled in Bangalore since 1991.

My mom has great passion for music and loves singing. She has really a great voice. Mom is a faithful child of God. I believe that she is God's dearest daughter. Since my childhood she brought me in a way she was brought up. Infact, she taught me many English choruses and Hymns. She taught me to pray and read Bible.She is very precious to me and to my Brother Ron.

I learnt many beautiful things from her. She is a great woman of God. I strongly believe that when she stands to proclaim her testimony or even preach, demons tremble with fear and they agonise and torment because they know that she is the dearest daughter of God. She advises me through my studies and personal life. She taught me not to fall in the hands of satan. I learnt another great quality from her that is "forgiveness". She forgave all her friends who where disloyal to her no matter how worse they are and who spoke against her, just like Jesus did. She is ready to go everywhere and anywhere to tell her testimony despite her deteriorating health. But I see a glow and a light of hope always in her which will never fade away. She cheers me up when I am sad or confused. Infact, I am very much motivated by her testimony. I pray that God will restore her health back for long time and pour abundant blessings on her. Even if God calls her now, I would feel happy rather sad because the very next moment she will be free from world and the pains she suffered and just keep rejoicing with the saints at heaven. And I strongly believe that I will be there too, to see her overwhelming with joy and happiness in Heavenly glory.

"Mom, thank you so much for teaching me how to encounter difficult situations and thank you for all that you are doing in my life.

God will surely allow goodness and mercies to follow throughout your life"

With huge kisses
Your's loving
Esther Praisy

# My Mom

**Ron Samuel Dasari**



*My mom is a good person. She likes me very much. She is a good mother, preacher and good doctor. She worked in a hospital in Bangalore. She always helps others. Her songs are very melodious. I love them. They helped me a lot. Me and my sister was given a chance to sing in some of the CD's.*

*She makes children very comfortable while giving treatment like injections and some surgical procedures. She did a small operation for me which was painless.*


*I pray God to help her to stay long with good health. Iam confident that one day God will heal her completely because she is God's loving daughter.*

*"I like you deeply more than anything. I want to stay with you always as your loving son".*

*With lot's of love,*
**RON SAMUEL**

I love you Lord
And I lift my voice
To worship you
O my soul, Rejoice
Take joy my king
In what you hear
Let it be a Sweet
Sweet sound in your ears

*"The clear mission of God was given
to me when I was in Mallya
Hospital in 2005 on April 25th,
in Room No 321 (3rd floor).
I could hear the Calling of God so clearly,
to be a Living witness for Him alone &
There's no confusion about it"*





"మన ప్రభువైన యేసుక్రీస్తు నాకు సూచించిన ప్రకారము
నా గుడారమును త్వరగా విడిచిపెట్టవలసి వచ్చునని ఎరిగి,
నేను ఈ గుడారములో ఉన్నంత కాలము
ఈ సంగతులను జ్ఞాపకము చేసి
మిమ్మును రేపుట న్యాయమని ఎంచుకొనుచున్నాను.
నేను మృతి పొందిన తరువాత కూడ
మీరు నిత్యము వీటిని జ్ఞాపకము చేసికొనునట్లు
జాగ్రత్త చేతును"

**- 2 పేతురు 1 : 13-14**

# ఉపోద్ఘాతము

దేవుని నామమునకే స్తోత్రం కలుగును గాక. యేసుక్రీస్తు పరిశుద్ధ నామములో మీకు శుభములు. ఈ సాక్ష్యము ద్వారా మిమ్ములనందరిని ఈ విధముగా కలుసుకోవడానికి, నా విషయాలను మీతో ముచ్చటించడానికి దేవుడు నాకిచ్చిన అవకాశమునకై దేవునికి వందనములు. దీనిని చదువుచున్న పాఠకులందరికి నేను మనవి చేయునది ఏమంటే ఈ సాక్ష్యమును ప్రార్థనా పూర్వకముగా చదవండి, చదివి ఇతరులకు వినిపించండి, చదివించండి. నా ఈ చిన్ని జీవితాన్ని దేవుడు ఎన్నుకొని, అల్పురాలనైన నన్ను తన సేవకు పిలిచి, ఒక ప్రత్యేక రీతిలో సంధించి, నిలబెట్టాడు. యేసుప్రభువు తాను అన్ని విషయాలలో మనకు మాదిరి అని తెలియచేసాడు. ఆ మాదిరిని నేనెలా అనుసరించాలో నాకు నేర్పించాడు. దాన్ని నేర్చుకోడానికి నేను కొన్ని కఠినమైన పరిస్థితుల గుండా వెళ్ళవలసి వచ్చింది. కాని అనుక్షణము, క్షణక్షణము తన అమూల్యమైన సన్నిధిని మరణలోయలలో, కన్నీటి సాగరాలలో కూడా అనుభవించుటకు కృప చూపాడు. ప్రభువు తన పిల్లలకు ఇచ్చే తర్ఫీదును స్వీకరించి, ఆయన కోరుకున్న రీతిలో ప్రయోజన కరమైన పనిముట్టుగా ఉండుటకు ఇష్టపడే ప్రతి ఒక్కరిని ఆయన తన కిష్టము వచ్చినట్టుగా మలచుకుంటాడు, నిలబెట్టుకుంటాడు, వాడుకుంటాడు. తన నామానికి ఘనత తెచ్చుకుంటాడు. వారిని గొప్ప చేస్తాడు. ఇవన్ని నా జీవితంలో ప్రభువు జరిగించాడు. ఆయన కృపలను, క్రియలను వర్ణించుటకు నా ప్రభువు నాకిచ్చిన ధన్యత, ఆధిక్యతకై ఆయనకే నా వందనాలు.

ఏప్రిల్ 25, 2005న ప్రభువు తన సేవ కొరకు ప్రత్యేకమైన సాక్షిగా వాడుకోబోతున్నట్టు నాకు తేటగా చూపించారు. అపుడు నేనున్నది ఒక మరణకరమైన లోయలో. నాకు చాలా తీవ్రమైన, మరణకరమైన, భయంకర వ్యాధి, చాల ముదిరిపోయిన పరిస్థితిలో ఉన్నదని తెలిసినపుడు నా ప్రభువును అడిగాను. "ఎందుకు, నాకు దీనిని అనుమతించావు ప్రభువా" అని. "నీవు నాకు సాక్షిగా బ్రతకాలి" అని అన్నారు నా ప్రభువు. అయితే నేను సరే, అనుకున్నా, సాక్ష్యం చెప్పాలంటే నా వ్యాధిని గురించి అందరికి చెప్పాలి, నా జబ్బు సంగతి తెలిసిపోతుంది, అప్పుడు "దేవుని బిడ్డగా నీకెందుకు ఇది సంభవించినది"? అని అడిగే వారికి ఇవ్వడానికి నా దగ్గర సరైన సమాధానం లేదు కాబట్టి నేను మామూలుగా ఒక సారి చర్చిలో సాక్ష్యమిస్తే చాలని ఊరుకున్నాను. కాని 6 నెలలు నా ప్రభువు చాల సంగతులు నేను అర్థము చేసుకొనేటట్టుగా జ్ఞానమిచ్చారు. నాతో మాట్లాడారు, నాతో ముచ్చటించి, నన్ను ఆదరించారు. తన విశేషమైన ప్రత్యక్షతలు, ముఖ్యముగా "యెహోవా భయభక్తుల మరణం ఆయన దృష్టికి విలువైనది" అనే అంశం మీద తన ప్రత్యక్షత నిచ్చారు. పరిశుద్ధాత్ముడు నాకు ఎన్నో సంగతులు బోధించారు.

ఇలా ఎన్నో సంగతులు అర్థం చేసుకున్న తరువాత ప్రభువు యొక్క చిత్తాన్ని గ్రహించగలిగిన నేను, ఆయన ఉద్దేశాన్ని నెరవేర్చడానికి కంకణం కట్టుకున్నాను. ఇక ఎవరేమి నాకు వ్యతిరేకముగా మాట్లాడినా, ప్రవర్తించినా నా ప్రభువును గూర్చి నేను సిగ్గుపడక సాక్షిగా బ్రతుకుతానని నిర్ణయించుకున్నాను.

ఎందరో క్రైస్తవులు తమ విశ్వాసం కేవలం స్వస్థత వరకు మాత్రమే అనుకుంటారు. అనారోగ్యం కలిగినపుడు విశ్వాసముతో ప్రార్థించాలి, అపుడు ప్రభువు బాగు చేస్తాడని అంటారు. అవును, నిజమే నీవు విశ్వాసముతో ప్రార్థించినా ప్రభువు స్వస్థపరచకపోతే 'నీవు విశ్వసించడం లేదు' అని చాల తేలికగా అనేస్తారు. అంటే అనారోగ్యం నుండి విడుదల-స్వస్థత మాత్రమే మనవారు కోరుకుంటున్నారు. కాని బైబిలులోని నా ప్రభువు **"స్వస్థత కన్నా మిన్నగా"** అనే విషయాన్ని బోధించారు. "బలహీనతలోనే నా శక్తి పరిపూర్ణ మగుచున్నది, నా కృప నీకు చాలు" అనే మాటలను నా జీవితంలో నా ప్రభువు నిజం చేసారు. ఎందరో తమ ఆరోగ్యకర పరిస్థితిలో దేవుని సేవ చేస్తారు. అనారోగ్య పరిస్థితిలో సేవకు ముందుకు రారు. కాని నా ప్రభువు నా బలహీనతలోనే తన కొరకు వాడుకుని, సేవకురాలిగా నిలబెట్టుకున్నాడు. అనారోగ్యముతోనే, బాధలోనే ప్రభువుని హెచ్చించి, పొగడి, ఆయన నామాన్ని చాటుటకు కృప చూపాడు.

ఈ సాక్ష్యము మిమ్మల్ని ప్రారంభము నుండి, చివరి వరకూ ఆసక్తితో చదివించి, చదివిన ప్రతి ఒక్కరి జీవితానికి అర్థము, పరమార్థము ఏమిటో గ్రహించుకోగలుగునట్లుగా, తమ జీవితాలలో దేవుని చిత్తమేమిటో తెలిసికొని, దాని కొరకై జీవించునట్లుగా, అందుకోసము మీ హృదయాలను ఒక ప్రత్యేకమైన రీతిలో గొప్ప సమర్పణ కలిగిన జీవితమును జీవించుటకు ప్రేరేపించగలదని ప్రభువు నాకిచ్చిన మాటను బట్టి నేను మీకు మనవి చేస్తున్నాను.

"నీవు నా కొరకు సాక్షిగా బ్రతకాలి" అని చెప్పిన ప్రభువు దాన్ని భద్రపరచమని కూడా సెలవిచ్చారు. దానిలో భాగంగా ఈ సాక్ష్యమును ఒక పుస్తక రూపములో భద్రము చేసి, దానిని తర్వాత తరములకు ఉపయోగకరముగా చేయుమని చెప్పిన నా ప్రభుని ఆదేశానుసారముగా, దానికి ఋజువుగా అనేక మంది భక్తుల నోట పలికిన మాట ప్రకారముగా ఈ సాక్ష్యమును ముద్రించుట జరిగినది. దీని వెనుక దేవుని ప్రత్యేక పిలుపు, నా సమర్పణ, అనేకుల ప్రార్థనా సహకారమున్నది.

ఎన్నో చీకటి లోయలు, కన్నీటి లోయలు, మరణ లోయల గుండా వెళ్తూ ఉన్న వారికి చీకటిని, కన్నీటిని, మరణాన్ని ధైర్యంతో, క్రీస్తు దేవుని బలముతో ఎదుర్కోవడానికి,

విజయం పొందడానికి నేను కొన్ని నా కుటుంబ జీవితపు అతి ముఖ్యమైనవి, రహస్యముగా ఉండవలసిన వాటిని కూడా చెప్పాను. నేను నా జీవితముతో ముడిపడి ఉన్న వ్యక్తుల గురించి మాత్రమే ప్రస్తావించాను. వారు నా సాక్ష్య జీవితాన్ని ప్రభావితం చేసినవారు. ఈ సాక్ష్యమును చదివే వారికి పరిశుద్ధాత్మ దేవుడు కలిగించే అన్యోన్య సహవాసము, ఐక్యత కలగాలని ముఖ్యంగా కుటుంబాలలో, భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రుల పిల్లల మధ్య, సంఘమునకు, మనకు మధ్య సమాధానము, ఐక్యత కలగాలని, అనేక మంది మేలు కొరకే వాటిని వివరించాను. ముఖ్యముగా నా తల్లిదండ్రుల విషయం. పొరపాట్లు, తప్పులు అందరం చేస్తాము. పెద్ద పెద్ద దైవజనులు కూడా సాతాను పన్నిన పన్నాగములో చాల సులభముగా పడిపోయి, అదే జీవితములో రహస్యముగా కొనసాగుతూ ఉంటారు. కాని నా తండ్రి తన అతిక్రమమును దాచి పెట్టకుండా, దానిని ఒప్పుకొని, విడిచిపెట్టి ఎందరికో మాదిరిగా నిలిచారు. ఆయనను క్షమించి మా తల్లి ఆదరించడం మా అమ్మ చూపిన మాదిరి. కుటుంబములో ఐక్యపరచబడిన తర్వాత కూడా సాతాను నా కుటుంబాన్నే టార్గెట్‌గా పెట్టుకొని చిందరవందర చేసి దేవుని చిత్తం నెరవేర్చకుండా నాశనం చేయడానికి 'అనుమానం', 'అనైక్యత' అనే దుష్టశక్తుల్ని ఉసిగొల్పి నా తల్లిదండ్రుల మధ్య నెమ్మది లేకుండా చెయ్యడానికి ప్రయత్నించాడు. కట్టేవాడు పరిశుద్ధాత్ముడు. కూల్చేవాడు సాతానుడు. ఎంతో భక్తితో, ప్రార్థనలతో, దైవశక్తితో గొప్ప కార్యాలు చేస్తున్న నా తండ్రి విషయమై నేను తీర్పు తీర్చలేను. కాని దురాత్మ శక్తులు దైవజనులలను సహితం ప్రభావితం చేస్తాయని, పీడిస్తాయని మాత్రం చెప్పగలను. మన భక్తి జీవితాన్ని ఇంకా ఎంత మెలకువతో, శ్రద్ధతో, జాగ్రత్తగా కాపాడుకోవాలో తెలుసుకోవడానికే వీటిని వ్రాసాను. నా తల్లిదండ్రులను కించపరచడానికి కాదు. నా తల్లిదండ్రులు ఇరువురు ఈ విషయంలో నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తారనే ఆశ.

నా జీవితానుభవ సాక్ష్యాన్ని పుస్తక రూపంలో విడుదల చేయుటకు సహకరించిన నా స్నేహితులకు, ప్రోత్సాహపరచిన బంధు మిత్రులకు, ఎడిటింగ్ చేయడంలో సహకరించిన శ్రీ పండిట్ కె.వి.కె. చర్చిల్ గారికి వారి కుటుంబస్థులకు, ప్రూఫ్ రీడింగ్‌లో సహకరించిన నా చెల్లెలు శ్రీమతి బ్యూలా కొడాలి గారికి, ఇంత త్వరితగతిని ముద్రణ పని పూర్తి చేయడానికి సహకరించిన గ్రేస్ గ్రాఫిక్స్ అధినేత బ్రదర్ శ్యామ్‌బాబు ఇందుపల్లి గారికి మరియు వారి బృందమునకు నా ప్రత్యేక మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

ఈ నా జీవితానుభవ పుస్తకమును నా హృదయేశ్వరుడు, ప్రాణేశ్వరుడు, అందరికి ప్రభువు, లోక రక్షకుడు, ప్రభువైన యేసుక్రీస్తుకు అంకితము చేయుచున్నాను.

# స్వస్థత కన్నా మిన్నగా!!

శ్రీమతి డా॥ విజయసుధ ఆధ్యాత్మిక జీవిత యాత్ర

# కుటుంబము - బాల్యము

*దేవునికి స్తోత్రం, ప్రభువు నందు ప్రియులారా!*

నా పేరు విజయసుధ. ఆంధ్ర ప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం నా జన్మస్థలం. కొమానపల్లి సుదర్శన్ జోసెఫ్, సుదర్శన్ మిరియాం గార్లు మా తల్లి గారి తల్లిదండ్రులు. వారి స్వస్థలము, 'ఎబినెజర్' గృహములో రెండవ సంతానముగా మా తల్లి దండ్రులైన డాక్టరు నాగరాజుగారు మరియు శ్రీమతి ఎస్తేరు రాణి గార్లకు జన్మించాను. నాకు ముందుగా మా అక్క శాంతి సునీత (చిన్ని), నా తర్వాత ఇద్దరు తమ్ముళ్ళు జబేజ్ సుదర్శన్ రాజు (ప్రూటి), సామ్యూల్ సుదర్శన్ కుమార్ (బున్ని) వారి తర్వాత ఇద్దరు చెల్లెళ్ళు మిరియాం హెప్సీబా (ప్రీతి), ఆఖరిగా శారా కమల (మోని).

మా తండ్రి గారి ఊరు కరకుదురు. విప్పర్తి గంగరాజు మరియు దానమ్మ గార్లు వారి తల్లి దండ్రులు. అమ్మ చాలా ఉన్నత కుటుంబానికి చెందినది. వారి తల్లి దండ్రులు చాల చక్కని మంచి దైవజనులు. అమ్మమ్మ నాకు ఎన్నో విషయాలలో ఆదర్శం చూపింది.

అమ్మా, డాడీలు మమ్మల్నందరిని దైవ భక్తితో పెంచారు. నాకు ఊహ తెలిసేటప్పటికి మేము డాడీ ఉద్యోగ రీత్యా నగరం అనే ఊరిలో ఉన్నాము. ఎందుకంటే నగరంలో జరిగిన సంఘటన ఒకటి ఇప్పటికీ నా కన్నుల ముందు కనిపిస్తుంది.

అమ్మ, డాడీలు నా చిన్నతనం నుండి నేను గర్భంలో ఎలా పడ్డాను, ఎలా పుట్టాను, పుట్టిన తర్వాత ఏమేమి సంగతులు, సంఘటనలు జరిగాయో చెప్తూనే ఉండేవారు. మా అమ్మని ఎక్కువ కష్టపెట్టకుండా అంటే సుఖమైన కాన్పు ద్వారానే నేను పుట్టానని అమ్మ చెప్తూ ఉంటుంది. అప్పుడప్పుడు ముఖ్యంగా నా పుట్టిన రోజులపుడు కుటుంబ ప్రార్థనలో నా పుట్టుక దగ్గర నుండి అంత వరకు జరిగిన సంఘటనలలో ముఖ్యమైనవి చెప్పి దేవుని మేళ్ళను తలంచుకోవడం మా కుటుంబంలో నా చిన్నప్పటి నుండి జరుగుతూ వస్తుంది. పుట్టినపుడు నేను చాల ఆరోగ్యవంతురాలిగా, చాల బొద్దుగా పుట్టానట. మా తల్లి దండ్రులకు రెండవ సంతానముగా పుట్టిన నేను ఆడపిల్లనని కొద్దిగా నిరాశ అనిపించి ఉండవచ్చు. కాని నేను పుట్టిన వారం రోజులకి అమ్మమ్మ ఇంకా కొంత మంది భక్తు రాండ్రతో కలిసి ప్రార్థించు సమయములో అద్భుతమైన దేవుని ప్రవచన వాక్కు వచ్చినట్టు అమ్మ చెప్పింది. అమ్మమ్మ నాకు 13 సం॥లు వచ్చే వరకు బ్రతికే ఉంది. అమె 24 గంటలూ ఒకే పనిచేసేది. అదే ప్రార్థన... ప్రార్థన.... అదీ విజ్ఞాపన, కన్నీటి ప్రార్థనలలో ఎడతెగక ప్రార్థించేది. ఆమె నా గురించి ప్రవచన మెత్తి "దేవుడు ఒక ప్రత్యేకమైన పనికి ఈ బిడ్డను ఏర్పాటు చేస్తున్నాడు, ఈ బిడ్డ దేవుని బహుమానము, దేవుని ద్వారా కలిగినది, ఇది దేవునికే సంబంధించినది" అని నాకు 'చెల్లి' అనే ముద్దు పేరు కూడా పెట్టింది.



నేను అందరికి చెల్లిని. చెల్లి అంటే చిన్నది, కుటుంబంలో అందరికన్నా చిన్నది అన్నట్టు అందరి ప్రత్యేకమైన అభిమానం, ప్రేమలతో, లాలింపుతో పెరిగాను.

డాడీ ఎపుడూ కుటుంబ ప్రార్థన తప్పించే వారు కాదు. ఆయన కూడా ఎక్కువగా వ్యక్తిగత ప్రార్థనలో గడపడం రోజూ చూసేదాన్ని. కుటుంబ ప్రార్థనలో పాటలు పాడి, వాక్యం చదువుకొని, వాక్యం కంఠస్థం చేశాక, బైబిలు కథ లేక వాక్యం అర్థమయేటట్టు డాడీ వాక్యం చెప్పడం ఉండేవి. ఒక వేళ డాడీ ఏదైనా ఊరు వెళ్ళడం జరిగితే అమ్మ కుటుంబ ప్రార్థన జరిగించేది. డాడీ ఉన్నపుడు ఎలాగ జరుగుతుందో అలాగే అమ్మ కూడా జరిగించేది. నా కుటుంబంలో ఏ రోజైనా కుటుంబ ప్రార్థన లేని, జరగని దినం నాకు గుర్తులేదు. ఇంట్లో కుటుంబ ప్రార్థనలో గాని, చర్చిలో గాని బైబిలు చదవడంలో, పాటలు పాడడంలో నేను చాల ఆసక్తి చూపేదాన్ని. డాడీ నా పుట్టిన రోజునాడు ఎక్కువగా యిర్మీయా 1:5వ వచనం, 90వ కీర్తన చదివించేవారు. "గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని" అని దేవుడు చెప్పే మాటలు స్వయంగా నాతోనే చెప్పినట్టు తలంచేదాన్ని.

నా చిన్నతనంలో జరిగిన కొన్ని సంఘటనలు నాకు గుర్తున్నాయి. ఎన్నో మరణాపాయముల నుండి నేను తప్పించబడ్డాను. నర్సాపురంలో (ప.గో.జిల్లా) అమ్మమ్మ వాళ్ళ ఇంటి ముందే చాల పెద్ద కాలువ ఉంది. దానిలో ప్రమాదవశాత్తు పడి, కొట్టుకుని, మునిగి పోతూ ఉండగ కొందరు చూసి బయటికి తీసారు, ఈ విధంగా మరణం నుండి తప్పింపబడ్డాను. రెండవ సారి నగరంలో జరిగింది. ఆ రోజు మా బంధువులు కొందరు ఇంటికి వచ్చారు. వారు పెద్దమ్మ, మామయ్యలు వాళ్ళ కుటుంబాలు. వాళ్ళ పిల్లలు అందరూ ఇంచుమించు నా కన్నా పెద్దవారే. అందరు పొలాల వైపు పరుగు పెట్టడం, అక్కడ ఒక పెద్ద పంట కాలువ, దాని వంతెన మీద వెళ్తూ దాన్ని దాటుతూ ఉండగా నేను నీటిలోకి పడిపోవడం, బురదలో కూరుకుపోవడం నాకు ఇప్పటికీ గుర్తుంది. త్వరగా మిగతా పిల్లలు వెళ్ళి ఇంట్లో చెప్పడం, అంతలో చేపలు పట్టే వాళ్ళు నన్ను నీటి నుండి తీయడం జరిగింది. ఈ విధంగా 2 సార్లు నీటిలో మునిగి, సజీవంగా బ్రతికి బయట పడ్డాను. దేవుని కృప నన్ను ఆ విధంగా వెంటాడింది. "ఉన్నత స్థలము నుండి చెయ్యి చాపి ఆయన నన్ను పట్టుకొనెను. నన్ను పట్టుకొని మహా జలరాశులలో నుండి తీసెను" కీర్తన 18:16.

నేను ఎక్కువగా అమ్మ చెంగుపట్టుకొని తిరిగేదాన్నట. అమ్మ వెనకాలే తిరుగుతూ, అమ్మని విడిచిపెట్టే దాన్ని కాదట. అప్పుడు నా వయసు 3 సం॥లు ఆరోజు ఎలా అమ్మ దగ్గర నుండి తప్పించబడ్డానో తెలియదు కాని ఇంటి నుండి తప్పిపోయి కొన్ని గంటలు ఇంట్లో వారికి సమాధానం లేకుండా చేసానట. డాడీ, ఆయన దగ్గర పనిచేసే గుమాస్తా గారు, ఇంటికి వస్తే 'పాప కనబడడం లేదు' అని అమ్మ చెప్పిందంట. అపుడు వాళ్ళిద్దరూ

స్కూటర్ మీద నర్సాపూర్ అంతా తిరిగేస్తే ఊరి చివర బిక్కుబిక్కుమని ఏడ్చుకుంటూ ఒక్క దాన్నీ తలకు కట్టుకునే రిబ్బను చేతిలో పట్టుకుని ఉంటే డాడీ దూరం నుండి చూసి ఆత్రంగా "ఆ పాప మా పాపలాగే ఉంది" అని ముందుకెళ్ళి 'నేనే' అని గుర్తుపట్టి ఇంటికి తీసుకొచ్చారట. అలాగ దేవుని కృప వలన నేను నా తల్లిదండ్రులకు మరల దొరికాను. దేవుడు నన్ను అనాథగా విడువ లేదు. ఆయన ఇమ్మానుయేలుగా నాకు తోడుగా ఉన్నాడు, నాతోనే ఉన్నాడు. యోహాను 14:18. తర్వాత 4 సంవత్సరాలు అమలాపురంలో ఉన్నాము.

నాకు ఊహ బాగా వచ్చాక నా బాల్యమంతా కరపలోనే జరిగింది. నాకు 8 సం॥ల వయసులో కరపలో ఒక పెద్ద త్రాచుపాము, నా కాలు ప్రక్క నుండి చాలా వేగంగా ముందుకు వచ్చి అలాగే ఏమి చేయకుండా వెళ్ళిపోయింది. "పాలుకుడుచు పిల్ల నాగుపాము పుట్ట యొద్ద ఆట్లాడును, మిడినాగు పుట్ట మీద పాలు విడిచిన పిల్ల తన చెయ్యి చాచును" యెషయా 11:8.

దాన్ని చూసిన భయంతో కొంతసేపు నా నోట మాట రాలేదు. తర్వాత అందర్ని పిలిచినపుడు (అపుడు డాడీ క్లినిక్ జనంతో కిక్కిరిసి ఉంది) వాళ్ళు దాన్ని చంప లేకపోయారు కాని అది గోధుమ వన్నె త్రాచు, చాల ప్రమాదకరమైనది, దేవుడు నన్ను దాని బారి పడకుండా కాపాడాడు అని గుర్తించారు.

నేను 2 సార్లు నీటిలో పడి కొట్టుకొనిపోయినా ప్రభువు నన్ను బ్రతికించినట్లే నా చిన్న తమ్ముడు, చిన్న చెల్లి బున్ని, మోనిల జీవితంలో కూడా జరిగింది. బున్ని అమలాపురంలోని పెద్ద కాలువలో పడిపోయి కాపాడబడ్డాడు. మోని కరపలో తన 3 సం॥ల వయసులో నూతిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. పడిపోయిన సమయంలో అమ్మ, డాడీలు ఇంట్లో లేరు. పిల్లలం మాత్రమే ఉన్నాం. ఇల్లు కడుతూ ఉన్న పనివాళ్ళు పని ముగించి వెళ్ళిపోతున్న సమయంలో ఇది జరిగింది. మేం వాళ్ళకి మోని నూతిలో పడి పోయిందని చెప్తే వెంటనే నిచ్చెన వేసుకుని నూతిలోనికి దిగి "బూరయ్య" అనే తాపీ మేస్త్రీ మోనిని బయటికి తీసాడు. మాకందరికి ఎంతో భయం వేసింది. మోనీ బయటికి వస్తూ తాను తోడే బకెట్టు త్రాడు మాత్రం విడిచిపెట్టకుండా ఎడమ చేత్తో దాన్ని పట్టుకుని వచ్చింది. స్పృహలోనే ఉండింది. అది చూసి మాకు నవ్వు వచ్చింది. అమ్మ కొద్దిసేపయ్యాక వచ్చింది. ఏమి భయపడకుండా మా అందరితో ప్రార్థన చేయించింది. చిన్న చెల్లికి ఏమి కాకూడదని మేము చేసిన ప్రార్థన దేవుడు విన్నాడు. రాత్రంతా అమ్మ నిద్రపోలేదట, మోనీని చూసుకుంటూనే గడిపింది. మేము తెల్లవారాక అందరం మోని చుట్టూ చేరాము. "నూతిలో ఏమి బాలేదు, కంపుకొడుతూ ఉంది" అని అంది.

డాడీ మా ముగ్గురి పుట్టిన రోజున నీటి గండం నుండి తప్పించబడిన మా ముగ్గురి పట్ల దైవజనుడైన మోషే చేసిన పరిచర్య లాంటి సేవే చెయ్యాయాలన్నది దేవుని



సంకల్పమని అటువంటి ప్రత్యేక పిలుపు ఉందని చెప్తూ ఉండేవారు. అవి మా మనసులో నాటుకున్నాయి.

పెద్ద చెల్లి ప్రీతి జీవితంలో కూడా ప్రాణాపాయం 3 సార్లు ఎదురైంది. ప్రీతి నుదుటి మీద ఒక బీరువా పడి చాల పెద్ద గాయం అయింది. విపరీతమైన రక్త స్రావం అయింది. అప్పటికి ప్రీతి వయస్సు 4 సం॥లు. అదే వయస్సులో చాల విషపూరితమైన తేలు కుట్టింది. 8 సం॥ల వయస్సులో ఇంట్లోకి ఒక విషపూరితమైన పాము వచ్చి కాటువేసింది. ఈ 3 సార్లు కూడా డాడీ మాతో ఉండలేదు. ఉద్యోగ రీత్యా వేరే ఊరిలో ఉన్నారు. అది పల్లెటూరు, సరైన వైద్య సౌకర్యంలేని ఊరు. నా తల్లి మొక్కవోని పట్టుదల, ధైర్యం, విశ్వాసంతో మమ్మలందర్నీ ప్రార్థనలో కూర్చోపెట్టి, తాను ప్రార్థన చేస్తూ, ప్రీతి చేత ప్రార్థన చేయిస్తూ గడిపింది. పాము కరిచినపుడు అమ్మ ప్రార్థన చెయ్యడానికి ఆ ఊళ్ళోని పాస్టర్ గారిని పిలిపించింది. ఆ ఊరివాళ్ళందరూ డాక్టర్ గారి పాపని పాము కరిచిందట అని చూడడానికి వచ్చి ఆ పాము రక్త పింజర జాతి అని కనిపెట్టి, విషం విరిగిపోడానికి మంత్రం వేయించమని అమ్మని బలవంతం చేసారు. "నా పాప చనిపోయినా పర్వాలేదు గాని మంత్రం వేయించను, ప్రార్థన చేస్తాము, నా దేవుడు పాపని బ్రతికించినా లేక తీసేసుకున్నా దేవునికే స్తోత్రం" అని చెప్పడం చిన్న పిల్లలమైన మేము చెవులారా విన్నాం. ఆ రోజు రాత్రంతా ప్రార్థన చేసాము. ప్రీతి కూడా "ప్రార్థన చెయ్యండి, డాక్టరు వద్దు, మంత్రము వద్దు" అని అన్నది. విశ్వాస సహితమైన మా ప్రార్థన దేవుడు విని అద్భుతాన్ని జరిగించాడు. ప్రీతికి పాము కరిచిన కాలు కొంత మట్టుకు నల్లగా మారి అది కూడా 2 రోజుల్లోనే తగ్గిపోయింది. మేము నమ్ముకొని ప్రార్థించిన యేసయ్య ప్రాణాపాయం లేకుండా చేసాడు.

డాడీ మేము కడపలో స్థిరపడ్డాక ఏలూరు దగ్గర లింగపాలెం, ఆ తర్వాత ఇందుకూరు పేట, మారేడు మిల్లి, తర్వాత కాకినాడ ఇలాగ వేర్వేరు ఊళ్ళలో పనిచేస్తూ శనివారం ఇంటికి వచ్చి మరల సోమవారం వెళ్ళిపోయేవారు. ఆదివారం మాత్రం మేము సండేస్కూల్‌కి వెళ్ళి వచ్చాక ఇంట్లోనే ఆరాధన జరిగించేవారు. డాడీ డాక్టరే అయినా అపుడపుడు కఠినమైన పేదరికం అనుభవించిన పరిస్థితులు నాకు తెలుసు కూరలు తెచ్చుకోవడానికి డబ్బులేక గంజి అన్నం, లేకపోతే పచ్చడి, పెరుగుతో భోజనం చేసే వాళ్ళం. పాలు, పెరుగు ఇంట్లో పశువులు ఉన్నందుకు అప్పుడప్పుడు లేమి కలిగినా సమృద్ధిగా ఉండేవి. పశువులకి గడ్డి కోయడం, వాటికి తినిపించడం, దాణా పెట్టడం, నీళ్ళు తోడి తాగించడం, వాటి దగ్గర శుభ్రం చేయడం, అప్పుడప్పుడు పొలం పనులు చేయడం, ఆవులకి పాలు పితకడం వంటివి నేర్చుకున్నాను. ఇంట్లో పిల్లలందరం కూడా ఈ పనులు చేసే వాళ్ళం. ఎంతో ధనిక కుటుంబానికి చెందిన అమ్మ, మంచి ఉద్యోగంలో ఉన్న డాడీ కూడా ఈ పనులు చేయడానికి సిగ్గుపడే వారు కాదు. ఆ కాయ కష్టం మాకు

చేస్తున్నపుడు సంతోషాన్నే ఇచ్చింది. ఇపుడు మేము ఆ పనులు చేసామని చెప్పుకోడానికి గర్వంగా ఉంటుంది.

అమ్మ చాల కష్టపడి పనిచేసేది. ఇంట్లో పని మనుషులు ఎవర్నీ పెట్టుకొనేది కాదు. పని చేస్తూ మాకు చిన్నవయస్సులోనే పనులు నేర్పించింది. వంటపని, ఇంటి పని, పొలం పని, బయటి పనులు అన్ని నేర్పించింది. అమ్మ డాడీ దగ్గర వైద్యం చేయడం కూడా నేర్చుకుంది. అప్పుడప్పుడు డాడీ లేని సమయాల్లో చాల పేదవాళ్ళకి ఉచితముగా వైద్యం చేయడం, ఇవ్వగలిగిన వాళ్ళు ఒకటి లేక రెండు రూపాయలు ఇస్తే అది కూరలు తెప్పించడానికి అమ్మవాడేది.

అమ్మ, డాడీ ఇద్దరూ పిల్లలందరిని క్రమశిక్షణలో పెంచడానికి చాల జాగ్రత్త పడేవారు. చిన్న తప్పు చేయడానికైనా మాకు ఇద్దరి భయము చాల ఉండేది. చదువు విషయంలో కూడా మంచి మార్కులు రాకపోతే అమ్మ, డాడీ కొడతారేమోనని చాల భయం ఉండేది. అందుకని స్కూల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని బాగా చదువుకునే దాన్ని. బెత్తం చాలా ఎక్కువగా ఉపయోగించి మమ్మల్ని చాలా క్రమశిక్షణలో పెట్టేవారు. కొట్టిన తర్వాత ఏడుస్తూ ఉన్నపుడు ఏ తప్పు సరిదిద్దుకోవాలో చెప్పి, దగ్గరకి తీసుకొని సముదాయించేవారు. వారి ప్రేమ, లాలన, గద్దింపులు అన్ని మాకు నడవవలసిన మార్గాన్ని బోధించాయి. రోజూ బైబిలు చదవడం, ప్రార్థన చేయడం ఖచ్చితంగా చేస్తున్నామో లేదోనని అమ్మ పరికించి చూసేది. సెలవులు వస్తున్నాయంటే అమ్మ కొన్ని పనులు నాకు, అక్కకి వంతులు వేసేది. అప్పట్లో నేను అమ్మ వెనకాలే ఉండి అమ్మతోనే ఉండడానికి ఇష్టపడేదాన్ని అందుకని అక్కకన్నా నేనే ఎక్కువ పని చేసేదాన్ని. 7వ తరగతి వయస్సులోనే నేను చేసే మాంసాహార వంటలు బాగున్నాయని అమ్మ, డాడీ, ఇంట్లో అందరూ మెచ్చుకునేవారు. సెలవులు వస్తే ఎక్కువ వంట చేయడానికి నేను ఇష్టపడేదాన్ని.

శుభ్రత విషయానికొస్తే అమ్మ అన్ని పనులూ చాల శుభ్రంగా చేసేది. డాడీ డాక్టరు కాబట్టి ఆయనకి తృప్తి కలిగించేంత వరకూ మూడు, నాలుగు సార్లు చెయ్యమని చెప్పేవారు. ఒకసారి చేసిన వెంటనే ఇంకా శుభ్రంగా ఉండాలి అని మళ్ళీ, మళ్ళీ చేయమనే వారు. ఆయన ఎదురుగా ఊరికే కూర్చుని కనబడితే పని చెప్పేవారు. అందుకని డాడీ ఎదురుగా ఊరికే కనబడడానికి ఇష్టపడే వాళ్ళము కాదు. దేని కోసమైనా డాడీ గాని అమ్మగాని ఒక్కసారి పిలిస్తే వెంటనే ఎక్కడున్నా వాళ్ళ ఎదురుగా కనబడాలి. రెండవసారి పిలిచే వరకూ ఉండకూడదు. అంత క్రమశిక్షణతో మమ్మల్ని పెంచారు.

## విద్యాభ్యాసం

అక్క అంటే నాకు చిన్నతనం నుండి నాకన్నా పెద్దది, త్వరగా కోపపడి నన్ను కొడుతుందేమోనని భయం ఉండేది. మా ఇద్దరికీ చిన్నప్పటి నుండి బాగా చదువు కొని డాక్టర్ అవ్వాలనే ఆశ ఉండేది. ఇద్దరం బాగా చదివే వాళ్ళం. డాడీ క్లినిక్‌లో పేషెంట్స్‌ని



చూసే విధానం చూసి అదే ఆటలాడే వాళ్ళం. డాక్టరు, పేషెంటు ఆటలాడడం చూసి డాడీ అక్క గురించి డాక్టర్ అవుతుందేమో అని అంటూండేవారు. డాడీ అమలాపురంలో పనిచేసేటప్పుడు పేషెంట్స్‌ని చూడడానికి ముందు వాక్యం చెప్పి ప్రార్థన చెయ్యడం ఆ ప్రార్థనలోనే చాలా మంది పేషెంట్స్ స్వస్థత పొందుకోవడం, చాల దయ్యాలు వదలిపోవడం, వారు వణకిపోతూ, విలవిలలాడి క్రిందపడి స్పృహ కోల్పోయి, కొన్ని నిమిషాల తరువాత ఆరోగ్యం పొందుకున్నట్టు వారు చెప్పడం నేను గమనించాను. నాకు కూడా డాక్టరు అవ్వాలని, డాడీలాగ వాక్యం చెప్పి, ప్రార్థన చెయ్యాలని, పేషెంట్స్‌ని చూడాలని ఆశ చాలా ఉండేది. నాకు 7-8 సం॥ల వయస్సప్పటి నుండి డాక్టర్ అవ్వాలనే ఆశ మాత్రమే మనసులో ఉండేది. ఒక వేళ డాక్టర్ కాకపోతే అనే తలంపునే భరించలేకపోయేదాన్ని, కాబట్టి మరో తలంపు భవిష్యత్తు గురించి మనసులోనికి రానివ్వడానికి ఇష్టపడేదాన్ని కాదు. అందుకని చదువులో ఎక్కడా కుంటు పడకుండా మంచి మార్కులు తెచ్చుకొనేదాన్ని.

నా స్కూలు చదువు మొదట అమలాపురంలో జరిగింది. దానికి ముందు కొద్ది రోజులు తణుకులో పెద్దమ్మ వాళ్ళ ఇంట్లో ఉండి స్కూలుకి వెళ్ళాను. అక్కడ చదువుకున్నది చాల కొద్ది రోజులే. ఆ తర్వాత అమలాపురంలో ఒక ఇంగ్లీషు మీడియం, కాన్వెంట్‌లో ఒక సంవత్సరం చదివాను. నా ప్రక్కన స్కూల్లో 'గణేష్' అనే అబ్బాయి కూర్చోవడం నాకిప్పటికి జ్ఞాపకమే. నాతో పాటు మామయ్య కొడుకు జ్యోతిబావ (సుదర్శన్ జ్యోతి కొమానపల్లి) బుజ్జి (దీవెన్ కుమార్) వచ్చేవారు. కొన్నాళ్ళకి ఫ్రూటి (జబేజ్ సుదర్శన్ రాజు) నా పెద్ద తమ్ముడు కూడా వచ్చేవాడు. రిక్షాలో వెళ్ళే వాళ్ళం. తర్వాత కొన్నాళ్ళకి ఫ్రూటీని, నన్ను కూడా స్కూలుకి వీర్రాజు అనే మా డాడీ బావమరిది ఆయన సైకిల్ మీద తీసుకెళ్ళి, తీసుకువచ్చేవాడు. ఒక రోజు స్కూలు మధ్యాహ్నం వరకే జరిగింది. చాల ఎండ, వీర్రాజు మామ రాలేదు. చాలసేపు చూసి చూచి 'మనం ఇద్దరం వెళ్ళిపోవచ్చులే, దారి తెలుసు' అనుకుంటూ బయలు దేరాము. కొంత దూరం వరకూ సరిగ్గానే వచ్చినా తర్వాత దారి తప్పిపోయాం. ఇక ఎంత తిరిగినా దారి తెలియక ఇద్దరం ఏడ్చుకుంటూ ముందుకెళ్తూ ఉంటే ఒక షాప్ ఓనరు మమ్మల్ని 'మీరు డాక్టర్ నాగరాజు గారి పిల్లలు కదా' అని అడిగాడు. మేము 'అవును' అని చెప్పి "స్కూల్ నుండి ఇంటికి తీసుకెళ్ళడానికి ఎవరూ రాలేదు, మేము దారి తప్పిపోయామని" చెప్తే ఆయన 'నేను తీసుకెళ్ళి దించుతాను' అని అన్నారు. అలాగే మమ్మల్ని కొంచెం సేపు కూర్చోమని, షాప్ కట్టేసి, సైకిల్ మీద ఎక్కించుకుని తీసుకెళ్ళారు. మేమపుడు అద్దె ఇంట్లో ఉండే వాళ్ళం, అది ఎక్కడుందో చెప్పడానికి తెలియలేదు. అందుకని ఆయన మామయ్య వాళ్ళ ఇంటి దగ్గర దించితే మా అత్త శ్రీమతి రేచల్ జ్యోతి కొమానపల్లిగారు ఇంటికి క్షేమంగా సాగనంపారు. ఇవన్నీ ఇపుడు తలంచుకుంటే దేవుడు ఎంత గొప్పవాడు, మమ్మల్ని విడిచిపెట్టలేదని చాల

సంతోషమౌతుంది. ఆ తర్వాత ఆ స్కూలుని మూసేసారు.

ఆ తర్వాత మొదటి తరగతిలో వెయ్యకుండా 2వ తరగతిలో అమలాపురం మిరియాం స్కూల్లో జాయిన్ చేసారు. 3వ క్లాసు వరకు అమలాపురంలో మిరియాం స్కూల్లో చదివాను. అపుడు మాకు ఒక మాష్టారు ట్యూషన్ చెప్పడానికి ఇంటికే వచ్చేవారు. స్కూలు పాఠాలు, దానితో పాటు కొంత సంగీతం కూడా నేర్పించారు. 1977వ సంవత్సరంలో మేము అమలాపురం నుండి కరప గ్రామానికి వచ్చాము. అక్కడున్న పెంకుటింట్లో మేము పెరిగాము. డాడీకి వెంటనే ఉద్యోగం రాక క్లినిక్ ప్రారంభించారు. 4వ తరగతి నుండి 5 వరకు కరప ఎలిమెంటరీ స్కూలు, తర్వాత కరపలోనే జడ్.పి. హైస్కూల్లో 10 వరకు చదివాను. మా క్లాస్ టీచర్ నుండి హెడ్మాష్టరు వరకు నేను 6వ క్లాసులో ఉండగానే నా పేరు అందరికి తెలుసు. బాగా చదువుకోవడం, మంచి మార్కులు తెచ్చుకోవడం వల్ల నా పేరు స్కూలులో ప్రతి నెలా హెడ్మాష్టరు ఒక రిజిష్టరులో సంతకం చేయించుకుంటూ ఉండేవారు. అందుకని వేరే పై క్లాసు టీచర్లకి కూడా నేను బాగా తెలుసు. అందరూ చాల స్నేహంగా ఉండేవారు. వారి ఆఫీసు పనులు కూడా చాల నాతో చేయించుకునేవారు. నాకు ఒక్క రోజు స్కూలు ఏకారణంగానైనా మానెయ్యాలంటే చాల బాధగా ఉండేది. అంతేకాకుండా స్కూలులో జరిగే ఫంక్షన్లలో ప్రత్యేక పాటలు నాతో పాడించేవారు. ఎక్కువగా దేశభక్తి గీతాలు పాడేదాన్ని తోటి విద్యార్థులు కూడా నాతో స్నేహంగా ఉండేవారు.

అమలాపురంలోని ఇంగ్లీషు మీడియం కాన్వెంటులో కథోలిక్ సిస్టర్లు పాఠాలు చెప్పేవారు. వారు ఒక రోజు పిక్నిక్కి తీసుకెళ్ళి అక్కడ ఉన్న ఒక కథోలిక్ చర్చికి తీసుకెళ్ళారు. ఆ ప్రాంతము పేరు నాకు గుర్తు లేదు. కాని అది చాల పెద్దది, అందమైన చర్చి, పిల్లలందరిని ఒక వరుసలో నిలబెట్టి లోపలికి తీసుకెళ్తూ చూపిస్తున్నారు. బయటికి వచ్చే దగ్గర ఒక బాల యేసు బొమ్మ, దాని చుట్టూ దేవదూత బొమ్మలు ఉన్నాయి. అక్కడ చందా పెట్టె కూడా ఉంది. పిల్లలు తమకు తోచిన చందా వారు వెయ్యాలని సిస్టర్లు చెప్పారు. నా దగ్గర అపుడు 5 పైసలు కూడా లేవు. అయ్యో... ఎలాగ? నా దగ్గర ఏమి లేదు, చందా ఎలా వెయ్యాలి? ఏమి వెయ్యాలి? అని సతమతమౌతూ వరుసలో వస్తూ ఉన్నాను. నా ముందు వ్యక్తి కూడా చందా వేసాడు. నా దగ్గరికి వచ్చే సరికి నాకు బాగా ఏడు పొచ్చింది. ఆగిపోయాను, అందరూ నేనేదో చందా వేస్తానని చూస్తూ ఉన్నారు. నేను చటుక్కున ముద్దొస్తూ ఉన్న బాలయేసు బొమ్మను పట్టుకొని ఏడ్చుకుంటూ, ముద్దు పెట్టుకొని వచ్చేసాను. డబ్బుల్లేక, నేను చేసిన ఈ పని నా హృదయంలో ముద్రించుకుపోయింది.

నాకు చిన్నప్పటి నుండి యేసయ్య అంటే ఇష్టం. అమ్మ, డాడీలు బైబిలు కథలు చెప్తు ఉంటే ఎంత ఆలస్యమైనా, నిద్రవస్తూ ఉన్నా కునికిపాట్లు పడకుండా వినేదాన్ని, వాక్యంలోని వచనాలు చెప్పినపుడు అందరికన్నా ముందు తీసి చదివేదాన్ని. బైబిలులోని విషయాల గురించి ప్రశ్నలు అడిగితే అందరికన్నా ముందు సరైన జవాబు చెప్పేదాన్ని. అలాగ



బైబిలు పరిజ్ఞానం పెరగడానికి డాడీ, అమ్మ నాకు ముఖ్యంగా డాడీ మార్గం చూపారు. అయినా యేసు ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించడం అంటే ఏమిటో అప్పట్లో నాకు తెలియదు. డాడీ బైబిలు రోజూ చదవాలని చెప్పేవారు. కొన్ని అధ్యాయాలు కంఠోపాఠం చేయించేవారు. వాటిలో పది ఆజ్ఞలు, మొదటి కీర్తన, 15వ కీర్తన, 23వ కీర్తన, 90వ కీర్తన, 91 కీర్తన, ఇంకా ఎన్నో బైబిలు వాక్యాలు కంఠోపాఠం చేయించేవారు. బైబిలును ఒక సంవత్సరంలో చదివి పూర్తి చెయ్యమని చెప్పేవారు. అలాగ చెయ్యడానికి5 అధ్యాయాలు రోజుకి చదవమని, 119వ కీర్తన రోజున అదొక్కటే చదవమనేవారు. మోషే వ్రాసిన మొదటి పంచకాండాల్లోని అధ్యాయాల్లో ఒకటి, ప్రవక్తల గ్రంథముల నుండి ఒకటి, కీర్తనలు లేక సామెతల నుండి ఒకటి, సువార్తల నుండి ఒకటి, పత్రికల నుండి ఒకటి ఇలాగ రోజుకి 5 అధ్యాయాలు చదవమని చెప్పేవారు. డాడీ అలాగ చేసి చూపించేవారు. ఇటువంటి క్రమంగా చదివే పద్ధతిని నేను ఇతరులకు చెయ్యమని ఇపుడు సలహా కూడా ఇస్తాను. ఏదైనా కావాలంటే దాని కొరకు మొదట ప్రార్థన చెయ్యమనే వారు. అది పుస్తకాలైనా, పెన్‌లైనా, బట్టలైనా, చెప్పులైనా మరేదైనా సరే ప్రార్థనలో మీకది కావాలి అని దేవున్ని అడగండి అనేవారు. ఆ తర్వాత తెచ్చి ఇచ్చేవారు. డాడీ, అమ్మ ఇద్దరూ మాకు చిన్నప్పటి నుండి బంగారం, ఆభరణాలు వేసుకోకుండానే పెంచారు. మాకు కూడా వాటి మీద ఇష్టం ఎందుకో ఉండలేదు.

మాకు డాడీ సోమవారాలు డ్యూటీకని బయలు దేరేటపుడు పాకెట్ మనీ అని ఇచ్చేవారు. వాటిని చాల భద్రంగా దాచుకునే వాళ్ళం. విచ్చల విడిగా డబ్బు ఖర్చు పెట్టకుండా మాకు ఎక్కువ డబ్బు ఇచ్చేవారు కాదు. అది చాల హాని చేస్తుందని, పిల్లల్ని పాడు చేస్తుందని చెప్పేవారు. మేము కూడా డబ్బు విషయంలో చాల నమ్మకంగా ఎంత తక్కువ డబ్బు ఇచ్చినా అంతలోనే ఖర్చు పెట్టి, కొంచెం మిగుల్చుకోవడం నేర్చుకున్నాం. ఏదైనా పెద్ద అవసరతలు ఉన్నపుడు వాటి కోసం ఉపవాస ప్రార్థన చేయడం నేర్పించారు. వారానికి ఒక రోజు మధ్యలో ఇంకేదైనా పెద్ద అవసరత ఏర్పడితే వాటి కోసం పెద్ద వారి నుండి, చిన్న వారి వరకు అందరూ సాయంత్రం పూట ఉపవాస ప్రార్థన చేసేవాళ్ళం.

## నేను నా తమ్ముళ్ళు

నాకు ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. పెద్ద తమ్ముడు జబేజ్ చదువులో కొంత డల్‌గా ఉండేవాడు. మొదట కరప స్కూల్‌లో చేర్పించినా, కాకినాడలోని ఠాగూర్ కాన్వెంట్‌లో వేస్తే బాగా చదువుతాడేమోనని అక్కడ 7వ తరగతికి చేర్పించారు. వాడిని చూడడానికి వారానికొకసారి వెళ్ళే వాళ్ళం. మంచి భోజనం తయారు చేసి, ఇంకా ఏమైన పిండి వంటలు చేసి తీసుకెళ్ళే వాళ్ళం. ఫ్రూటీ (జబేజ్) మాకు దూరంగా ఉన్నందుకు మాకు బెంగగా ఉండేది. అయితే చదువులో అక్కడేమి ముందుకు రాలేకపోయాడు. మరల కరప స్కూల్లోనే చేర్పించాలని నన్ను మా హెడ్మాష్టరు గారిని (వల్లూరి క్రిష్ణారావుగారు)

సంప్రదించమన్నారు. నేను అప్పటికి 7వ తరగతి మంచి మార్కులతో పాసై అందరికి పరిచయమై, నా మీద అందరికి మంచి అభిప్రాయం ఏర్పడి ఉంది. మా హెడ్మాష్టరుగారు సీటు ఇస్తానని 'ఈ అబ్బాయి' నీకు తమ్ముడైతే నేను సీటు తప్పకుండా ఇస్తానని" అన్నారు. ఆ సంవత్సరం ప్రత్యేకంగా నేను జబేజ్‌కి కోచింగ్ ఇచ్చాను. ముఖ్యంగా పరీక్షల ముందు, చాల సమయం వానికి కేటాయించి నేర్పించాను. అపుడు వాడు పాసైనపుడు నా కష్టఫలితమేనని చాల సంతోషమైంది.

చిన్నతమ్ముడు బున్ని (సుదర్శన్ కుమార్) పుట్టుకతోనే కుడి చేయికి అంగవైకల్యముతో పుట్టాడు. వానిని చూసి మాకు 'అయ్యో' అని చాలా దిగులు అవుతూ ఉండేది. కాని వాని విషయమై 'మగ బిడ్డ పుట్టబోతున్నాడని, వానిని నాకు సమర్పించు' అని వాడు పుట్టుకముందే దేవుడు డాడీకి బయలుపరచాడని, ఆ మాట ప్రకారము డాడీ సమర్పించానని చెప్తారు. అమ్మకి బున్ని పుట్టిన వెంటనే డాక్టరు, అమ్మ అన్న, వదినలు బాబు ఇలా చెయ్యిలేకుండా పుట్టాడని చెప్పడానికి భయపడి వెంటనే చెప్పలేదట. మా అమ్మమ్మ కె.ఎస్. మిరియాంగారు విషయం తెలిసి ఆమెకి ఆరోగ్యం బాగోకపోయినా హాస్పిటల్‌కి వచ్చారట. అంతకు ముందే మామేనమామ గారైన ఐజక్ కొమానపల్లి గారి ద్వారా విషయం తెలిసిన అమ్మ చాల దుఃఖపడుతూ ఉండగా, అమ్మమ్మ కూడా వచ్చి చాలా దుఃఖపడిందంట. బంధువులు, స్నేహితులు కొంత మంది "తల్లిదండ్రులు ఘోర పాపం చేసుంటారు, అందుకే బిడ్డ ఇలాగ పుట్టాడని" మాట్లాడుకోవడం విని వీరికి తట్టుకోవడం కష్టమై, ఆ విషయం ప్రార్థనలో పెట్టారట. దేవుడు "అన్ని అవయవాలు కలిగి వాని ఆత్మ నరకంలో పడడం నీకిష్టమా?" అని మా అమ్మతో ఆమె మనసులో నుండే మాట్లాడితే అమ్మ "వద్దు, వాడు నరకానికి పోకూడదు" అని అన్నదట. అప్పుడు దేవుడు "అలాగైతే ఈ చేదు మాత్ర  వంటిదాన్ని మింగి జీర్ణించుకోవాలి. వానిని గొప్ప వానిగా చేస్తాను "అని వాగ్దాన మిచ్చారట. ఇది జరిగిన రెండు, మూడు రోజులకి అమ్మమ్మ తోటి కోడలు కమలమ్మగారు (కృపానందం తాతయ్య గారి భార్య) ప్రార్థన చేస్తుండగా దేవుడు ప్రవచన వాక్యమిచ్చారట. "ఒంటరిగా ఉన్న ఈ బిడ్డని వేయి మంది యొక్క శక్తి గలవానిగా, ఒక్క చెయ్యి గలవానిని, వేయి చేతులు చేసే పని అంత పనిమంతునిగా నేను చేస్తాను, ఇది నన్ను నేను మహిమపరచుకోవడానికే నేను అనుమతించాను" అన్న ఆ ప్రవచన వాక్యమును బట్టి అందరూ ధైర్యం తెచ్చుకున్నారట. దేవుడు వాగ్ధానము చేసిన రీతిగా బున్ని చిన్నతనం నుండే చాల అద్భుతం, ఆశ్చర్యం అనిపించే విధంగా తన పనులు, ఇతరుల పనులు ఎంతో సులభంగా చేయడం చూసి మేము మా తమ్మునికి  కుడిచేయి లేదు అనే సంగతి మరచిపోయాం. దేవుడు అంత చక్కగా తన వాగ్ధానం నెరవేర్చుకున్నాడు. అతి చిన్న వయసులోనే కుటుంబానికి ఆధారమయ్యాడు. తన నేర్పుతో ఒక స్కూలును "ఎస్తేర్ పబ్లిక్ స్కూల్" అను పేరున



స్థాపించి మంచి స్కూలుగా నిలిపాడు. ఎన్నో ప్రాణాపాయ పరిస్థితులు చిన్నతనం నుండి మా అందరి జీవితాలలో జరిగినా నేటి వరకు అందరిని సజీవంగా కాచి మమ్మల్ని భద్రపరచిన యేసయ్యకి వందనాలు.

నాకు పాటలు పాడడం అంటే చాల ఇష్టం. వాటిని నేర్చుకోవడానికి చాల ఇష్టపడేదాన్ని మొదట బాల్యంలో సినిమాల గురించి, సినిమా పాటల గురించి ఎక్కువగా తెలియకపోయినా వయస్సు పెరుగుతున్న కొలదీ సినిమా పాటలు రేడియో ద్వారా వినేదాన్ని. రాగం ఇష్టమైతే అదే కూనిరాగాలు తీసుకుంటూ ఉండేదాన్ని. అవి పాడకూడదు అని అమ్మ డాడీలు చెప్పినా నేను పెద్దదాన్నవుతూ ఉండగా దేవుని పాటలతో పాటు, సినిమా పాటలు కూడా ఎక్కువగా ఇష్టపడేదాన్ని, స్కూల్లో టీచర్లు పాడమన్నపుడు పాడేదాన్ని అప్పటికి అమ్మ, డాడీల గురించి కొంత కొడతారనే భయం కూడా తగ్గింది.

## అమ్మమ్మతో ఆత్మీయత

నా జీవితంపై మా అమ్మమ్మ గారైన మిరియాం గారి ప్రభావం చాల ఉంది. అమ్మమ్మ ఎపుడూ ఏ ఊరికి వెళ్ళేది కాదు. నర్సాపూర్‌లోని తాతయ్య స్థాపించిన చర్చికి మాత్రం వెళ్ళేది. ఆవిడ, తన తోటికోడళ్ళు, మరి కొందరు స్త్రీలతో ఇంట్లోనూ, చర్చిలోనూ గంటల తరబడి కన్నీటి ప్రార్థనలు చేసేవి. అటువంటి విజ్ఞాపన చేసే స్త్రీని నేను అమ్మమ్మనే చూసాను. ఆమె ప్రార్థించిన స్థలమంతా కన్నీటితో తడిసి ఉండేది. ఊరికెనే ఉన్నప్పుడు కూడా ఎపుడూ ఆమె నోట స్తుతులు ఉండేవి. ఆమె ఆరోగ్యరీత్యా చాలా బలహీనురాలు. ఆస్థమాతో బాధపడేది. కాని ఎపుడూ మందులు తీసుకొనేది కాదు. దేవుడు వ్యాధిని అనుమతించినపుడు దానిని సహించి దేవుని మహిమ పరచాలి అని చెప్పేది. మేము సెలవులు వస్తే అమ్మమ్మ, పెద్దమ్మ ఇంటికి (తణుకు) వెళ్ళడానికి ఇష్టపడేవాళ్ళం. దాని కోసం కొన్ని రోజుల ముందే సిద్ధపడేవాళ్ళం. అమ్మమ్మ కూడా సెలవులకి పిల్లలు వస్తారని ప్రత్యేకంగా ఆ సమయానికి పండ్లు, పలహారాలు సిద్ధం చేసి పెట్టేది. ఎడమవైపు  ఆమెకి పక్షవాతం వచ్చి పూర్తిగా కోలుకోలేకపోయినా చేతనయినన్ని పనులు చేసుకొనేది. మమ్మల్ని కూర్చోబెట్టి పాటలు పాడించి, వాక్యం చెప్పి, ప్రార్థన చేయించేది. ఆమె చెప్పిన వాక్యాల్లో నాకు నచ్చిన మాట "యెహోవా ఉత్తముడని రుచిచూసి తెలిసికొనుడి". ఆవిడ వయసు పెరుగుతూ, ఇంకా బలహీనమైనపుడు మేమే సెలవుల్లో పనులు చేసేవాళ్ళం. అక్కడ ఇంటి దగ్గర ఎన్నో పండ్ల వృక్షాలు, జామి, పనస, మామిడి, సపోట ఉన్నాయి. వాటి పండ్లు తింటూ ఆడుకొంటూ ఉండేవాళ్ళం. అక్కడ రెండు ఇళ్ళ అవతల మా మేనమామగారు ఐజక్ జె. కొమానపల్లిగారు ఉండేవారు. ఇక్కడి నుండి అక్కడికి, అక్కడి నుండి ఇక్కడికి వెళ్తూవస్తూ తీరిక లేనట్టుగా వారి పిల్లలు, మేము ఆటలాడుకొనే వాళ్ళం. అమ్మమ్మ బలహీనపడినపుడు ఆమెకు నేను స్నానం చేయించాను, తల దువ్వాను. ఒక దైవజనురాలికి నేను మొట్టమొదటిగా అమ్మమ్మకి అటువంటి పరిచర్య చేయగల్గానని

అది దేవుడు నాకిచ్చిన ఆధిక్యతగా అనుకొంటాను. ఆమె 1982 ఏప్రిల్ 29న ప్రభువు నందు నిద్రించారు. అప్పటి నుండి నర్సాపూర్ వెళ్ళడం తగ్గిపోయింది. ఆమె దేవుడిచ్చే మరి శ్రేష్ఠమైన పునరుత్థానం, మహిమ పొందడానికి తన జీవితంలో యాతననే ఎక్కువగా కోరుకోవడం నా జీవితంపై చాల ప్రభావం చూపింది. ప్రార్థనా జీవితంలో కూడా ఆమె నాకు మాదిరి చూపించింది.

## రక్షణానుభవం

1984 సంవత్సరం, వేసవికాల సెలవుల్లో నర్సాపూరలో ఒక యూత్ రిట్రీట్ని నిర్వహించారు మా మేనమామగారైన బెంజమిన్ సి.కొమానపల్లిగారు. దానికి నేనుకూడా హాజరయ్యాను. యేసుప్రభువును స్వంత రక్షకుడిగా అంగీరించడం గురించి నాకు విపులంగా తెలిసింది. నేను అంత వరకూ తల్లిదండ్రులు క్రైస్తవులైతే పిల్లలు కూడా క్రైస్తవులే అవుతారు, అనగా యేసుప్రభువు వంశపారంపర్యంగా కుటుంబాల్లో ఒక తరము నుండి మరుసటి తరానికి వస్తాడని నమ్మేదాన్ని. అయితే ఆ యూత్ రిట్రీట్లో యేసుప్రభువును ఎవరైనా హృదయంలోనికి ఆహ్వానించి "నా ప్రభువుగా, దేవుడిగా ఉండు" అని ఆయనను హృదయపూర్వకముగా ఆహ్వానించినపుడే ఆయన వారికి తండ్రిగా, ప్రభువుగా, దేవుడిగా ఉండి నడిపిస్తాడని, దాని కొరకు తీర్మానం తీసుకోవాలని దైవజనులు చెప్పినపుడు మే నెల 23వ తారీఖు నేను యేసు ప్రభువును స్వంతరక్షకుడిగా నా హృదయంలోనికి ఆహ్వానించాను. నేను పాపినని, నామకార్థ క్రైస్తవ్యములో జీవిస్తున్నానని గ్రహించి యేసుప్రభువు నా పాపముల కొరకు సిలువపై యాగమయ్యారని, ఆయనను స్వీకరించుట ద్వారా పాపక్షమాపణ, రక్షణ కలిగిందని నమ్మాను. ఆయన కొరకు నా జీవితాన్ని సమర్పించుకున్నాను. ఈ దినము నా జీవితంలో కలిగినందుకు నేనెంతగానో దేవుని స్తుతిస్తున్నాను. తర్వాత ఇంటికి వచ్చాక ప్రత్యేకమైన జీవితం జీవించాలని అన్ని విషయాల్లో ప్రభువును మహిమ పరచాలని ఇష్టపడేదాన్ని.

నాకెంతో ఇష్టమైన సినిమా పాటల్ని వినడానికి, పాడడానికి ఇష్టం లేకుండా చేసుకోవాలని ప్రయత్నించాను. రేడియోని ముట్టకుండా ఒక 3 నెలలు ఉండగలిగాను. ఇంట్లో నేను కాక మరెవరైనా రేడియోలో పాటలు పెట్టినా మొదట్లో రేడియోని కట్టేసే దాన్ని. కాని కొన్నాళ్ళు అయ్యాక మరల పాటలు వినడం, పాడుకోవడం ప్రారంభించాను. అయితే నేను మరల ఈ విషయమై సమర్పించు కొనేటట్లు దేవుడు ఎలాంటి పరిస్థితులు ఇచ్చాడో, ఇన్నేళ్ళు తర్వాత ఆ సమర్పణ పర్యవసానమేమిటో తర్వాత వివరిస్తాను.

1982 సంవత్సరం నుండి రేడియోలో విశ్వవాణి కార్యక్రమాలు వినేదాన్ని. అందులో "దైవసంకల్పం, దేవుడు మాట్లాడాడు" మొదలైన కార్యక్రమాలు వచ్చేవి. అందులో వచ్చే పాటల్ని చాల ఆసక్తిగా వినడం, నేర్చుకోవడం, పాడడం చేసేదాన్ని. ఆ గాయనీ



గాయకులను నేను మొదట తణుకులో విశ్వవాణి మీటింగ్స్లో చూసాను. మా పెద్దమ్మ శ్రీమతి కమలా తిమోతిగారు కూడా అప్పటికి రేడియోలో మా మేనమామగారైన బిషప్ ఎర్నెస్ట్ పి. కొమానపల్లి గారి మన్నావర్తమానములు కార్యక్రమంలో పాడేవారు. తర్వాత రేడియో విశ్వవాణికి కూడా పాడేవారు. అందువల్ల ఆ గాయనీ గాయకులు స్వర్ణక్క, స్నేహక్క, షీబక్క, (శ్రీమతి స్వర్ణలత జేసన్, శ్రీమతి స్నేహలత స్వామి దాస్, శ్రీమతి షీబా జార్జ్ గార్లు) ఎజ్రా అన్న (శ్రీ ఎజ్రా శాస్త్రీ), పి.జె.డి కుమార్గారితో పరిచయం ఏర్పడింది. తర్వాత ఎన్నో మీటింగుల్లో కుటుంబ ఫంక్షన్లలో వీరు కలిసేవారు. వీరికి వివాహామైన తర్వాత కలవడం తగ్గింది. నేను వారిని కలుసుకోవడం తగ్గింది. వీరి ప్రభావం నా జీవితం పై చాల ఉంది. దేవుని కొరకే వారి తలాంతులను వినియోగించడం నన్ను కూడా ప్రేరేపించింది. నేను వారిని మరల కలుసుకోలేనేమో అని అనుకొనేదాన్ని. ఈ మధ్యనే స్వర్ణక్క, స్నేహక్కలని మరల అంటే 2007వ సంవత్సరములో కలిసికొన్నపుడు నా ఆనందం అంతా ఇంతా కాదు. వారు నన్ను ప్రేమతో పలుకరించినపుడు నాకు కలిగిన సంతోషానికి కారణమైన దేవున్ని నేనెంతగానో స్తుతించాను.

నా హైస్కూల్ చదువు పూర్తయ్యాక ఇంటర్మీడియట్లో బై.పి.సి. తీసుకున్నాను. మొదటి సంవత్సరం ఉమెన్స్ కాలేజీలో చదివాను, 2వ సంవతత్సరం ట్యూషన్లకి వెళ్ళడానికి సమయం అనుకూలంగా ఉంటుందని షిఫ్ట్ పద్ధతిలో క్లాసెస్ జరిగే ఐడియల్ కాలేజీలో చదివాను. ఇంటర్మీడియట్ మంచి మార్కులతో పాస్ అయ్యాను. చిన్నప్పటి నుండి డాక్టరవ్వాలనే ఆశ ఉన్న నేను విశాఖపట్నంలోని గంగాధర్ ట్యూటోరియల్స్లో ఎంసెట్ కోచింగ్కి ఒక నెలపాటు హాజరయ్యను. తర్వాత ఎంసెట్ ఎంట్రన్స్ పరీక్ష వ్రాయడానికి ముందు, తర్వాత కూడా ఉపవాసంతో ప్రార్థన చేసుకొన్నాను. దేవుని చిత్తమైతే నాకు సీటు రావాలని ప్రార్థించాను. 'నీ ఆశ భంగము కానేరదు', అని సామతలు 23వ అధ్యాయం నుండి దేవుడు నాకు ఆశ కలిగించాడు.

విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ మొదట ప్రైవేటు కాలేజ్. కానీ 1986 నుండే దాన్ని గవర్నమెంట్ కాలేజీగా చేసారు. అయితే ముందు వేరే కాలేజీలకి సీట్లు ఇచ్చాక, తర్వాత ర్యాంక్లకి సిద్ధార్థ మెడికల్ కాలేజీకి ఇచ్చారు. నాకు ముందు వేరే కాలేజీల మొదటి లిస్ట్లో సీట్ రాలేదు, కాని సిద్ధార్థ మెడికల్ కాలేజీ మొదటి లిస్ట్లో సీటు వచ్చింది. అయితే దానికి కాపిటేషన్ ఫీజు 12,000రూ/- కట్టాలన్నారు. అంత ఫీజు కట్టి నన్ను మెడికల్ కాలేజీలో జాయిన్ చేస్తారో లేదో నని భయపడుతూ ఉన్నాను. అమ్మ సరిగ్గా అదే సమయానికి నర్సాపూర్ దగ్గర లిఖితపూడిలోని తన పొలాన్ని కొంత అమ్మి దాని డబ్బు తెచ్చింది. దాని ఫిక్సెడ్ డిపాజిట్లో వేసినా నాకు మెడికల్ కాలేజీలో సీటువచ్చిందని అమ్మ వెంటనే బ్యాంక్కి వెళ్ళి ఆ డబ్బు తెచ్చి ఇచ్చింది. ఆ సమయంలో మేము "మెడికల్ కాలేజ్, డాక్టర్ కోర్సు" అని అనగానే "అంత పెద్ద చదువులు మనం

చదివించగలమా? అంత డబ్బు మీకెక్కడుంది"? అని ఇంకొంతమంది "వాళ్ళేమీ ఆ చదువులు చదవలేరు ఊరికే వట్టి మాటలు" అని మాట్లాడిన వారి నోటికి మూత వేయబడింది. దేవుడు సాధ్యపరిచితే ఎవరూ దాని చెడగొట్టలేరు. నేను, డాడీ విజయవాడలో సిద్ధార్థ మెడికల్ కాలేజీకి వెళ్ళాము. నేను జాయిన్ అయ్యాను. కాలేజీలో జాయిన్ అయి బయటికి వచ్చాక డాడీ చెప్పిన మాట నాకిప్పటికీ జ్ఞాపకమే. "ఒరేయ్! చెల్లీ, నీకు ఇపుడు ఇంత డబ్బు కట్టి నీ చదువు కొనసాగేటట్టు చేసాము. నువ్వు పెద్దదాని వయ్యాక చెల్లెళ్ళని, తమ్ముళ్ళని విడిచిపెట్టకూడదు, వారికి కూడా సాయం చెయ్యాలి" అని అన్నారు. ఒక25 రోజుల తర్వాత నేను అప్లై చేసిన కాలేజీల్లో రెండవ లిస్టు విడుదలైంది. అందులో ఒస్మానియా మెడికల్ కాలేజీకి, ఆంధ్ర మెడికల్ కాలేజీ రెండింట్లోను సీటు వచ్చింది. డాడీ చదివినది ఆంధ్ర మెడికల్ కాలేజి కాబట్టి నన్ను అందులోనే జాయిన్ చెయ్యాలని విజయవాడ వచ్చి, నన్ను తీసుకెళ్ళి ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నంలో జాయిన్ చేసారు.

మెడికల్ కాలేజీలో ఎక్కువ ర్యాగింగ్ ఉండేది. నేను క్రొత్తగా జాయిన్ అయ్యాను కాబట్టి అందరూ నాకు క్రొత్తగా అనిపించి వారితో కలవడానికి బెరుకుగా అనిపించేది. తల్లిదండ్రుల్ని విడిచి దూరంగా ఉన్నందుకు చాల ఒంటరితనముగా అనిపించేది. మొదట పాఠాలు అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉండేవి. కాని దేవుడు వాటిని అర్థం చేసుకొనే జ్ఞానం ఇచ్చాడు. పరీక్షల సమయానికి కష్టపడి, చదివి, అన్ని అర్థం చేసుకొని మరల మరల చదివేదాన్ని అవి బాగా గుర్తుండేవి. పరీక్ష పేపరు మీద బాగా వ్రాయగలిగేదాన్ని. అందరూ స్టూడెంట్లు డబ్బులిచ్చి లేక రికమండేషన్ చేయించుకుని పాసయ్యేవారు. "మీ డాడీ డాక్టరు కదా, నువ్వు కూడా ప్రయత్నించి పాసైపోవచ్చు కదా!" అని నా స్నేహితులు అనేవారు కాని నాకు దేవునిపై నమ్మకం అటువంటి పెడత్రోవ పట్టకూడదని డాడీ పేరు బయటికి రానిచ్చేదాన్ని కాదు. అన్ని సబ్జక్టులు కూడా దేవుని దయ వల్ల మొదటి ప్రయత్నంలోనే, ఎవరి రికమండేషన్ లేకుండా పాసయ్యాను.

మొదటి రెండు సంవత్సరాల్లో నా స్నేహితులు నేను పాటలు పాడేది చూసి నన్ను చాలా ప్రోత్సాహ పరచి కాలేజీ ఫంక్షన్లలో పాడమనేవారు. మా ప్రొఫసర్లు కూడా ప్రోత్సహించారు. నేను పాటలు బాగా కాలేజీలో పాడుతూ ఉండేదాన్ని నా రూమ్మేట్స్‌తో, ఫ్రెండ్స్‌తో సినిమాలు, షికార్లకూ వెళ్తు ఉండేదాన్ని. అదే సమయంలో హాస్టల్‌లో బైబిల్ స్టడీ నిర్వహించడానికి వచ్చే సిస్టర్లని ప్రోత్సాహపరచి, నా గదిలోనే జరిపించేదాన్ని, ఆదివారాలు క్రమం తప్పకుండా చర్చికి వెళ్ళేదాన్ని. రోజూ క్రమం తప్పకుండా బైబిలు చదివేదాన్ని. కొంతమంది సిస్టర్లు, నా క్లాస్‌మేట్స్ నా సంపూర్ణ సమర్పణ కోసం ప్రార్థించేవారు.



## 'స్వర సమర్పణ'

ఒక రోజు ఆదివారం ఆరాధనకై చర్చికెళ్ళాను. ఆ రోజు దైవజనులు సంపూర్ణ సమర్పణ విషయమై వాక్యం బోధించారు. నాకు ఒక్కసారిగా 1984 మే నెల 23 తారీఖున తీసుకున్న తీర్మానం జ్ఞాపకానికి వచ్చింది. నేను సంపూర్ణముగా సమర్పించుకోకుండా దేవునితో నేను చేసిన నిబంధన మరచి జీవించానని గ్రహించి ఇక ఏది ఏమైనా నా జీవితంలో దేవునికి మొదటి స్థానం ఇచ్చి, ఆయనని మహిమ పరచాలని, ఆయన చిత్తానికి ఏదీ వ్యతిరేకంగా చేయకూడదని నిర్ణయించుకున్నాను. అదే సమయంలో నాకు పేటర్ సన్ లూక్‌గారి కుటుంబంతో పరిచయం అయింది. వారి పిల్లలు ప్రీతమ్‌లూక్, ఆశీర్వాద్ లూక్, మమత, లూక్ ఆంటీ, అంకుల్ అందరూ నన్ను స్నేహంగా ఆప్యాయంగా పలుకరించేవారు. ఆశీర్వాద్ నన్ను పాటలు పాడమని ప్రోత్సహించేవాడు. నేను నాకు తెల్సిన విధంగా ఆశీర్వాద్‌ని ప్రోత్సాహపరిస్తే, తాను నాకు పాటలు నేర్పించి, ఇంకా బాగా పాడాలని ప్రోత్సాహించేవాడు. వాళ్ళందరితో చాలా స్నేహంగా కలిసిపోయాను. వారికి నర్సింగ్ స్కూల్ ఉండేది. నర్సింగ్ స్టూడెంట్స్ కూడా కొందరు నాతో స్నేహంగా ఉండేవారు. నేను దేవునికి మరల ప్రతిష్ఠించుకున్న సంగతి గురించి ఆశీర్వాద్, ప్రీతమ్, మమతలతో చెప్పాను. "నేను దేవుని నా స్వంత రక్షకుడిగా అంగీకరించినా, నేను పూర్తిగా దేవున్ని మహిమ పరచడం లేదని, నేను సినిమా పాటలు పాడడం ద్వారా దేవునికి కలుగవలసిన మహిమను నేను దొంగిలిస్తున్నానని, దాని ద్వారా దేవునికి దుఃఖం కలుగజేస్తున్నానని, పరిశుద్ధాత్ముడు నాకు తెలియజేసాడని వారితో చెప్పాను. నా స్వరాన్ని దేవునికి సమర్పించాను. స్వర సమర్పణ చేసినందుకు ఇక మీదట నాకెలాంటి పేరు, ప్రఖ్యాతులు కలుగకపోయినా పర్వాలేదని, అయితే నా స్వరం ద్వారా ఎలాంటి లౌకిక సంగీతం పాడనని తీర్మానించుకున్నా విషయం వారితో చెప్పాను నా క్లాస్ మేట్స్,ఫ్రెండ్స్,ప్రొఫెసర్లు చాలా మంది 'ఎందుకు పాడడం లేదని' అడిగారు. నేను ఇలా నిర్ణయించుకొన్నానని తెలిసి వారు ఇక నన్ను బలవంతం చేయలేదు. ఈ నా స్వరం దేవుని గూర్చి పాడి, ఆయన్ని గురించి చెప్పి, ఇతరులను ఆదరిస్తే చాలని, దేవున్ని ఎప్పటికి నాస్వరంతో దూషించకూడదనే నానిర్ణయాన్ని దేవుడు గౌరవించాడు.ఇన్ని సంవత్సరాలైనా ఆ తీర్మానం నన్ను వెంటాడింది.ఈనాడు నా అనుభవాలతో పాటలు వ్రాసి పాడటానికి వాటిని క్యాసెట్, సిడిలలో భద్రపరచటానికి ఆ పాటలు ఎంతోమందికి ఆదరణగా ఉండటానికి కారణం నా స్వర సమర్పణే. ఆతర్వాత నాకెంతో ఇష్టమైన లౌకిక సంగీతంపై దేవుడు నాకు విరక్తిని పుట్టించాడు. అవి మరల నానోట ఇంతవరకు రానియ్యకుండా దేవుడు నాకు సహాయం చేసాడు.నా జీవితంలో ఎన్నో ప్రాణాపాయ సంఘటనలు, మరణముతో సమాన అనుభవాలు కలిగినపుడూ కూడా దేవున్ని మహిమ పరచేటట్టుగానే ఆయన నన్ను ఉంచాడు.

నేను కాలేజిలో ఉండగా నాపాటల జీవితం ఇక ఉండదేమో అని అనుకున్నాను కాని విధ్యార్థుల మధ్య సేవ చేసే ఇవాంజిలికల్ యూనియన్ అనే విద్యార్థి సేవాసంస్థవారు నా సమర్పణ సంగతివిని వారు నిర్వహించే మ్యూజికల్ ఈవెనింగ్స్ అన్నిటిలోను నాకు పాడటానికి అవకాశమిచ్చారు. వారు విద్యార్థులు ముఖ్యంగా మెడికల్, ఇంజనీరింగు చదివేవారికి, యూనివర్సిటి విద్యార్థులకి మధ్య సువార్త ప్రకటించేవారు. విద్యార్థులకి సువార్త చెప్పాలంటే మాటకన్నా పాటే ఎక్కువ పనికొచ్చేది. అందుచేత "శాంతిసంగీతం" అనే బ్యానరుపై పాటలు మధ్యలో కొద్దిగా వాక్యం చెప్పి ఒక్కొక్క ప్రోగ్రాంని చాలా ప్రార్థన పూర్వకంగా నిర్వహించేవారు. ప్రార్ధనా గుంపులు ప్రార్థనలు చేస్తుండగా మేము స్టేజి మీద పాటలు పాడే వాళ్ళం. నేను వారికి ప్రధాన గాయకురాల్ని. నన్ను చాలా అభిమానించేవారు. నన్ను స్వంత చెల్లిలాగ భావించేవారు. ఇంత ప్రార్ధనా పూర్వకంగా సమర్పణతో, ఉపవాసంతో పాటలు పాడినపుడు ఆల్టర్‌కాల్ ఇచ్చినపుడు వందలు వేల విద్యార్థులు సమర్పించుకోవడం చూసి ఆశ్చర్యపోయాను.

## డాక్టర్ కాకుండానే వివాహ బంధం

ఇలా ఉండగా 1989అక్టోబరులో నాకు పెండ్లి సంబంధం తెచ్చారు లాల్ మావయ్య. పెళ్ళికొడుకు నా చిన్ననాటి స్నేహితుడే. అమలాపురం నుండి కరప రావడానికి మూడు నెలల ముందు వాళ్ళు మేముండే ఇంటికి ప్రక్క ఇంట్లో డాక్టర్ ఎస్తేర్ డేవిడ్ గారితో దిగారు కరప వచ్చాక ఒకటి రెండుసార్లు చూసినా పెద్దగా పరిచయం ఉండలేదు. ఆయన పేరు రాజేంద్రబాబు. ఆయన తల్లి పేరు రాజేశ్వరి. ఆయన మెకానికల్ ఇంజనీరింగు చదివారని, బెంగుళూరులో ఉద్యోగం వచ్చి జాయిన్ అవ్వ బోతున్నారని చెప్పారు. ఆయన్ని చిన్నపుడు చూచినట్టు, ఆడుకున్నట్టు జ్ఞాపకం ఉంది. వాళ్ళు నన్ను చూసుకొని వెళ్ళిన తర్వాత అమ్మ, డాడీలు "ఇష్టమా? చేసుకుంటావా"? అని అడిగారు. నేను మొదట ఏమి అనుకోలేదు కాని మరల కాలేజ్ కెళ్ళడానికి (వైజాగ్)కి సిద్ధమవుతూ ఉంటే మరల అడిగారు. "డాక్టరు చదువుతున్నావు కాబట్టి నీకు డాక్టరయితే బాగుంటుంది, ఆలోచించుకో, ఇద్దరూ డాక్టర్లయితే ప్రాక్టీసు పెట్టుకుని, భవిష్యత్తులో స్థిరపడవచ్చు" అన్నారు. అమ్మ, డాడీలకి ఇంజనీరు కదాని వద్దనుకుంటున్నట్టు వారి మాటల్లో తెలిసింది. నేను అంతవరకు నా మనసులో 'అవును' అనుకుంటున్నట్టు నాకే తెలియదు. ఎందుకంటే వారు 'వద్దు' అన్నారని మనసులో దిగులైంది. నేను వైజాగ్ బయల్దేరే ముందు అక్క దగ్గర కూర్చున్నాను. నా మనసులో దిగులైన సంగతి చెప్పాను. అక్క "రాజేంద్ర అంటే నీకిష్టమా? ఎందుకు బాధపడుతున్నావు? అమ్మ డాడీలు నీ మంచి కోసం, నీ భవిష్యత్తు కోసం చెప్పారు" అని అంది. నేను "ఆయన నాకు ఇష్టం అన్న సంగతి నాకు తెలియదు, అర్థం కాలేదు, కాని డాడీ అమ్మవద్దు అన్నారని మాత్రం బాధపడుతున్నా" అని చెప్పాను.



"అంత బాధగా ఉంటే, రాజేంద్ర నీకు ఇష్టమైతే నువ్వు అతనినే చేసుకుందువు గాని, అమ్మ డాడీలతో నేను చెప్తాను" అని అక్క భరోసా ఇచ్చింది. నేను విశాఖపట్టణం వెళ్ళిపోయాను. వెళ్ళిన తరువాత అక్కడ నా గదిలో బైబిలు స్టడీ జరిపే సిస్టరు ప్రిస్కిల్లకి ఈ సంగతి చెప్పి, నేను అతనిని చేసుకోవడం దేవుని చిత్తమా? అవునా కాదా? అని తెలుసుకోవడానికి ఒక రోజు ఉపవాస ప్రార్థన చెయ్యాలని ఆమెని కోరాను. ఇద్దరికి అనుకూలమైన ఒక రోజు ఉపవాస ప్రార్థనలో ఏకీభవించాము. మరుసటి రోజు నా అనుదిన బైబిలు భాగాలు చదివేటపుడు కీర్తన భాగంలో 45వ కీర్తన చదువుతూ ఉండగా ఒక సానుకూల వాక్యభాగం కనబడింది. ప్రిస్కిల్ల సిస్టర్‌కి కూడా చెప్పాను. మరల ఇద్దరం ప్రార్థించాం. దేవుని చిత్తమైతే ఇది జరుగుతుందని అనుకున్నాము. అయితే నాకు చదువు పూర్తయ్యాకే పెళ్ళి చేసుకోవాలనేది నా అభిప్రాయం. పెండ్లి తర్వాత అత్త ఇంటి వారు ప్రోత్సహించకపోతే అవి చదువుకి ఆటంకమౌతుందని ఇప్పటికీ కూడా ఈ విషయంలో నా అభిప్రాయం అదే.

అదే సమయంలో నేను కాలేజీలో క్లాసులకి హాజరవుతూ, ఇవాంజిలికల్ యూనియన్ వాళ్ళ ప్రోగ్రాముల్లో పాడుతూ, ఆత్మీయముగా ఎదుగుతూ, నా గదిలోనే రోజు ప్రార్థనా కూడికలు జరుపుతూ ఉన్నాను. చాల మంది నా క్లాస్‌మేట్స్, సీనియర్లు, జూనియర్లు కూడా దేవున్ని తెలుసుకోవడం, వాక్యంలో, ప్రార్థనలో, దేవుని సహవాసములో ఎదగడం ప్రారంభించారు. నా గది అనేక మందికి సేదతీర్చే ఒక స్థలముగా ఉండేది. చాలా మంది అమ్మాయిలు పరీక్షలపుడు చాల టెన్షన్‌కి గురుయ్యేవారు. వారు నా గదిలో టెన్షన్ ఫ్రీ అయ్యేవారు. ప్రత్యేక ప్రార్థనలు హిందూ స్నేహితులు కూడా కోరేవారు. కొంతమంది జూనియర్లు దేవుని యందు భక్తిలో ఎదుగుతూ, దేవునిలో బలపడడం, వారి ఇండ్లలో ఏమైనా మతమును గూర్చి అవరోధాలు వచ్చినా కృంగిపోక ముందుకు వెళ్ళాలి అనే దృక్పథం కలిగి సాగే వారిని చూసి నా యౌవన జీవితాన్ని దేవుడు అర్థవంతముగా చేసాడు అని సంతోషించే దాన్ని.

నా యౌవన జీవితాన్ని భ్రష్టు పరచి దేవుని మార్గం నుండి బయటికి లాగాలని సాతాను చాల ప్రయత్నించినా నేను నా దేవున్ని మాత్రమే సంతోషపరచాలనే గట్టి మనసుతో ముందుకి సాగాను. దేవుడు నన్ను విడిచిపెట్టకుండా, కాపాడుతూ వచ్చాడు. కొందరు పెండ్లి సంబంధాల పేరుతో వచ్చారు. కాని నేను వారికి నా అభిప్రాయం చెప్పలేదు. చదువయ్యేవరకు పెండ్లి చేసుకోకూడదని నిశ్చయించుకున్నానని వారికి చెప్పాను.

పెండ్లి సంబంధం పేరుతో మామయ్య తీసుకొని వచ్చిన వాళ్ళు మాత్రం నాకు చాల రోజులు అవునని గాని కాదని గాని చెప్పలేదు. వారికి మాకు మధ్యన ఏ విధమైన కమ్యూనికేషన్ లేకుండా ఉండింది. నేను కూడా ఆ విషయం గురించి ఎక్కువగా

పట్టించుకోలేదు. 6 నెలల తర్వాత అమ్మ ఉత్తరంలో వ్రాసింది నిన్ను చేసుకోవడానికి రాజేశ్వరి వాళ్ళు ఒప్పుకున్నారట అని. వాళ్ళు అంత వరకు వేరే అమ్మాయిలని పెండ్లి సంబంధాలలో వెదుకుతూ ఉన్నట్టు తెలిసింది. నేను మరల ఆ విషయం ఆలోచించాను. దేవుని చిత్తమైతే జరుగుతుందని మరల అనుకున్నాను.

క్రిస్మస్ సీజను వచ్చింది. అమ్మ దగ్గర నుండి ఏమీ ఉత్తరాలు రాలేదు. ఆకాలంలో ఫోన్ సౌకర్యం అంత బాగోలేదు కాబట్టి ఉత్తరాలే ఎక్కువ వ్రాసుకునే వాళ్ళం. ఒక రోజు డిసెంబరు 23 తారీఖు ఒక క్రిస్మస్ ప్రోగ్రాంకి సాయంకాలం 4 గంటలకి బయలుదేరాలి. అక్కడ పాటలు పాడాల్సి ఉంది. స్నానానికి వెళ్ళాను. నా రూమ్మేటు జానకి బాత్రూం తలుపు కొట్టి "త్వరగా రండి, మీ పెళ్ళి ఫిక్స్ అయిందట, జనవరి 5న మీ పెళ్ళట" అంది. నేను "మా అక్క పెళ్ళి కుదిరి ఉంటుంది, కార్డులు వచ్చి ఉంటాయి" అని అంటూనే త్వరగా స్నానం ముగించి బయటికి వచ్చాను. ఒక పుస్తకం అంత పార్సిల్ పోస్ట్‌లో వచ్చింది. దాని వాళ్ళు తెరచి చూసారు. అందులో అక్కదీ, నాది కూడా పెళ్ళని, ఒకే కార్డులో ప్రింట్ చేసారు. నాకు తలంతా మొద్దు బారిపోయింది. పెళ్ళి కొడుకు వాళ్ళు కరప వెళ్ళిందీ తెలియదు. అక్కకి ఒక సంబంధం కుదరవచ్చునని అనడమే తప్ప పెళ్ళికి డేట్ ఫిక్స్ అయిందని తెలియదు. నా పెళ్ళికి నాతో నిమిత్తం లేకుండా, నన్నడగకుండా, ఆ వ్యక్తే అయినా, అకస్మాత్తుగా నిర్ణయించారని, నా చదువు పూర్తి కాలేదని, దాన్ని చదవడానికి తర్వాత వీలు కుదురుతుందో లేదో నని చాలా టెన్షన్ అయిపోయాను. నా మెదడులో నరాలు చిట్లి పోతాయేమోనన్పించింది. ఆ పార్సిల్‌లో ఒక చిన్న పేపర్ మీద "నిన్ను 26న పెళ్ళి కూతుర్ని చెయ్యాలని నిర్ణయించాము. 24న బయలుదేరి వచ్చేయి. కార్డులు పంపుతున్నాము. అందరికి పంచు అని అమ్మ వ్రాసింది. నా తల్లిదండ్రుల మీద కూడా తెలియని కోపం వచ్చింది. నాకు టెన్షన్‌తో తలనొప్పి వచ్చి, వాంతులు కూడా అయ్యాయి. నేనంతకు ముందు "ఇంకా 2 సంవత్సరాలకి ఆఖరి సంవత్సర పరీక్షలు కూడా అవుతాయి. అవి వ్రాసిన తర్వాతే నా పెళ్ళి" అని కూడా అమ్మ డాడీలకి చెప్పాను. అయినా ఇద్దరి పెళ్ళిళ్ళు కలిపి పెట్టేస్తే ఖర్చులు కలిసొస్తాయని అనుకున్నా, పెళ్ళి చేసుకోవడం అప్పటికి నాకిష్టం ఉండలేదు. పెళ్ళి కొడుకుగా ఉన్న ఆయన వాళ్ళ తల్లిగారు కూడా 2 సంవత్సరాల వరకు పెళ్ళివద్దు అన్న వాళ్ళు వాళ్ళు కూడా ఒప్పేసుకున్నారు.

సాయంకాలం మ్యూజికల్ ఈవినింగ్ క్రిస్మస్ ప్రోగ్రాంలో నా ఇ.యు. సహోదరులు సహోదరీలకు నా పెళ్ళి సంగతి చెప్పి కార్డులు ఇచ్చాను. మరుసటి రోజు లూక్ అంకుల్ వాళ్ళని కలిసి వాళ్ళకి కూడా కార్డు ఇచ్చాను. అందరూ నేను ఆశ్చర్యపోయి నట్టే నా పెళ్ళి సంగతి విని ఆశ్చర్యపోయారు. పెళ్ళి కొడుకు రక్షణ పొందిన వ్యక్తి అని తెలిసి కొంత సముదాయించుకున్నారు.



ఆ రోజే ఇంటికి బయలుదేరి వెళ్ళాను. డాడీతో పూర్తిగా నా మనసులో సంగతులు చెప్పలేకపోయినా అమ్మతో చెప్పాను. "నా చదువు సంగతేంటని, పెళ్ళి తర్వాత చదువు సాగుతుందా? ఎవరు చదివిస్తారు? ఇంత అర్జంట్‌గా పెళ్ళి ఎందుకు చేస్తున్నారు? వాళ్ళకి పెళ్ళి ఖర్చులకి ఎంత ఇస్తున్నారు"? ఇలాంటి సంగతులు అడిగాను.

అమ్మ "అక్కకి పెళ్ళి సంబంధం కుదిరింది, ఇక ఆలస్యమెందుకని రెండు పెళ్ళిళ్ళు ఒకే సారి పెట్టుకుంటే ఖర్చు కలిసివస్తాయని డాడీ ఇలా నిర్ణయించారు" అని చెప్పింది. అప్పటికే ఇరు పక్షాల మాటల్లో అపార్థాలు చోటు చేసుకున్నాయి. ఆ మాటలు వినే సరికి, డబ్బులు, ఇచ్చి పుచ్చుకోవడం విషయంలో అపార్థాలు ఉన్నందుకు నాకు ఇంకా ఎక్కువ బాధైపోయింది. ఇప్పుడే వాళ్ళు ఇలా మాట్లాడితే, డబ్బివ్వకపోతే పెళ్ళి జరగదని వాళ్ళు అంటే " ఇపుడు ఈ పెళ్ళి ఇంత అపార్థాలు మధ్య చెయ్యడం అవసరమా? అనంటే "పెళ్ళి కార్డుల వరకూ వచ్చింది కదా, ఇపుడు పెళ్ళి ఆగిపోతే కష్టం. నీ చదువు పెళ్ళయ్యాక కూడా మేమే చదివిస్తాం అని వాళ్ళకి కూడా చెప్పాము, వాళ్ళు మగ పెళ్ళి వాళ్ళు కదా! అందుకని ఇవన్నీ మామూలే, నువ్వేమీ ఆలోచించి మనసుపాడుచేసుకో వద్దు" అంది అమ్మ. నాకు కరువు తీరా ఏడ్వాలనిపించింది. మనసులో ఎందుకో అసంతృప్తి, అసమాధానం ఏదీ సవ్యంగా జరగడం లేదు అని అనిపించింది. పెళ్ళి అని అనుకోగానే ఇంత అసమాధానం అయితే చేసుకున్నాక ఇంకెంత అసమాధానము, దుఃఖం ఉంటుందో అని అన్పించింది. డాడీ నాకు బలవంతంగా పెళ్ళి చేసి ఇంట్లో నుంచి తోలేస్తున్నారని అన్పించింది.

డిసెంబరు 26న పెద్దమ్మ వాళ్ళ కుటుంబం, ఇంకా చర్చి నుండి కొందరు సేవకురాండ్ర మధ్య మమ్మల్ని ఇద్దర్ని పెళ్ళి కూతుర్లుగా చేసారు. మనసులో ఉండవలసిన సంతోషం మాత్రం లేదు.

క్రొత్త సంవత్సరం రోజున అంటే 1991 జనవరి 1న నేను బాప్తీస్మం తీసుకున్నాను. ఆయన కూడా అదే రోజున అమలాపురంలో బాప్తీస్మం తీయించుకున్నారని తెల్పింది. ఈ ఒక్క సంగతి కలిసి జరిగిందని నా మనసులో కొంత సంతోషం నింపింది.

1991 జనవరి 4వ తారీఖు రాత్రి ప్రధాన కార్యక్రమం జరిగింది. పెళ్ళి కొడుకు కుటుంబం వాళ్ళు రాత్రి 10 గంటలు అవుతున్నా రాలేదు. నాకు వీళ్ళు పెళ్ళే వద్దనుకున్నారేమో అని అన్పించింది. తర్వాత కాసేపటికి "పెళ్ళి కొడుక్కి పెళ్ళి కోసమని షూస్ కొనడానికి ఇంతసేపైంది. ఇదిగో వచ్చేసారు" అని అన్నారు. ఆ తర్వాత అక్క ప్రధానం జరిగాక, నాది కూడా జరిగింది. లాల్ మామయ్య కారల్ డి. కొమానపల్లిగారు నాకు మేనమామ అయినా, ఆయనకి తండ్రి స్థానంలో ఉండి అన్నీ జరిపించారు.

జనవరి 5వ తారీఖు మా అక్క చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు రెండూ ఒకే పందిరిలో కరప ఇంటి దగ్గర జరిగాయి. అక్క పెళ్ళి చిట్టి మామయ్య (ఐజక్ జె. కొమానపల్లిగారు) జరిగిస్తే, నా

పెళ్ళి చిన్న మామయ్య (ఎర్నెస్ట్ పి. కొమానపల్లి) జరిగించారు. పెళ్ళి ప్రసంగం (అపొస్తలులు పి.ఎల్. పరంజ్యోతిగారు) పరంజ్యోతి తాతయ్య చేసారు. పెళ్ళికి నా మెడికల్ కాలేజి స్నేహితులు రావడం నాకు సంతోషం కలుగజేసింది.

నా పెళ్ళి సమయానికి నా భర్త చాల సన్నగా (నాకంటే సన్నగా, చిన్నగా) చిన్న కుర్రాడిలాగ, 10వ తరగతి చదివే పిల్లాడిలాగ ఉంటే చిన్న పిల్లల్ని కూర్చోపెట్టి బొమ్మల పెళ్ళిళ్ళు లాగ చేసేసారన్నారు కొంత మంది. నా వయసు 20 సంవత్సరాలు దాటితే, ఆయనకి 23వ సంవత్సరం. ఆయన “మీ డాడీ నన్ను తర్వగా పెళ్ళి చేసుకొనేటట్టు, బలవంతంగా ఒప్పించారు, అర్జంటుగా బెంగుళూరు నుండి రప్పించి ఇక ఆలోచించడానికి సమయం ఇవ్వకుండా ఆయన మాటే చెల్లించుకున్నారు. పెద్దాయన బలవంతాన ఇంత త్వరగా చేసుకోడానికి ఒప్పుకున్నాను” అని అన్నారు. డాడీ అలా అర్జంటు చేసి పెళ్ళి కానివ్వడానికి కారణం నాకు 3 నెలల తర్వాత తెలిసింది.

నా భర్త పెళ్ళైన 5 రోజునే కరప నుండి బెంగుళూరుకి వెళ్ళారు. మా అత్తగారు కూడా కొన్నాళ్ళు అమలాపురంలో ఉండి ఆమె కూడా బెంగుళూరుకు వెళ్ళారు. నేను కూడా విశాఖపట్టణం వచ్చేసాను. అందరూ నేనెంతో సంతోషంతో పెళ్ళి కబుర్లు చెప్తాననుకున్నారు. కాని నేనెంతో నిదానంగా, చాలా మాములుగా నా స్నేహితులకి కనబడ్డాను. ఇ.యు. సిస్టర్లు, బ్రదర్లు, లూక్ అంకుల్ కుటుంబం, వారి బావమరిది ప్రేమ్ శేఖర్ అంకుల్ వారి కుటుంబం నా ఎదుట వచ్చే సరికి నాకు కోల్పోయిన సంతోషంలో కొంత తిరిగి వచ్చినట్టైంది.

నేను నా భర్త 1991 జనవరి 26వ తారీఖు మళ్ళీ హైదరాబాద్‌లో రాక్ చర్చ్‌లో జ్యోతి బావ (సుదర్శన్ జ్యోతి కొమానపల్లిగారు) పెళ్ళిలో కలుసుకున్నాం. ఆ రోజు, ఆ మరుసటి రోజు ఇంకా దుఃఖకరంగా అన్పించాయి. నేను పాటలు అంత మందిలో స్టేజ్‌పై పాడడం నా భర్తకి నచ్చలేదు. దాని గురించి చాలా వాదన జరిగింది మా మధ్య. ‘భర్తగా నేను చెప్తున్నాను, నువ్వు పాడడం మానెయ్యాలి అంతే” అని ఆజ్ఞ జారీ చేసారు నా భర్త. నాకు గుండెలో మంటలు రేగాయి. నేను పాడేది, పాడాలనుకునేది దేవుని కోసం. దేవుని సమర్పించబడిన నా స్వరాన్ని, అవకాశం వచ్చినా నేను పాడను అని ఎలా దేవునికి అవిధేయత చూపేది? నా ద్వారా జరగవలసిన దేవుని పనికి ఆటంకంగా ఉండడానికి సాతాను ఎంత కుయుక్తిగా కుట్ర పన్నాడు? నా భర్తనే వాడుకున్నాడు, నాకు మనసులో నెమ్మది లేకుండా చేసాడు. తర్వాత నేను మరల విశాఖపట్టణం వచ్చి క్లాసులకి హాజరవుతున్నా, బైబిల్ స్టడీలకి వెళ్తున్నా, రాత్రుల ప్రార్థనలు జరిగిస్తున్నా నా హృదయంలో నేను నా దేవునికి కొరకు పాడలేకపోతున్నాననే బాధ ఎక్కువైపోయింది.

నేను ఎపుడూ కూడా ఏదో ఒక పాట నా నోటిలో ఆలపిస్తూ ఉండేదాన్ని. ఏ మాత్రం పాటలంటే ఇష్టం చూపని నా రూమ్మేట్ కూడా వాటిని దేవుని మహిమార్థమై పాడడంలోని



సంతోషాన్ని అనుభవించి తాను కూడా క్వయర్‌లో చేరింది. తాను నన్ను ఒక నాలుగు రోజు నేను పాటల పుస్తకం బయటికి తీయక పోవడం, ఏ రాగము లేక పాట గాని ఆలపించకపోవడం గమనించి “మీరేమిటి? ఈ మధ్య ఏదోలా ఉంటున్నారు? మీరు పాటలు పాడడం చూడలేదు, పాటల పుస్తకం తెరవడం లేదు, ఏదో పోగొట్టుకున్నట్టు ఉన్నారు, కారణం ఏమిటి?” అని అడిగింది. తన మాటలు వెంటనే నా చెంప మీద కొట్టినట్టైంది. నేను చేసుకున్న స్వర సమర్పణ గుర్తొచ్చింది. ఎన్ని కష్టాలొచ్చినా దేవుని కోసమే నా స్వరాన్ని వినియోగించాలి, మహిమపరచాలి, అని అనుకున్న తీర్మానం గుర్తొచ్చింది. నేను ఒకటే ప్రార్థించుకున్నాను. నా దేవుడు జీవము కల్గిన వాడైతే, నేను తీసుకున్న నిర్ణయాన్ని ఘనపరుస్తాడు, ఆయన కోసం నన్ను వినియోగించుకుంటాడు, నేను మాత్రం ఆయనే ఘనపరుస్తానని ప్రార్థించుకొని ఒక పాట పాడడానికి పుస్తకం తీసాను. నా గొంతు సహకరించలేదు. గొంతు పెగులుతున్నా అది పాట లాగ రావడం లేదు. నా మీద నాకే చిరాకు వేసింది. మరల మరల ప్రయత్నించాను. అలా మరల రెండు మూడు రోజులకి కొంత వరకూ పర్వాలేదు అనుకున్నాను. ఎంత మానసిక క్షోభపడితే నా గొంతు, నా పాట ఇలాగైందో జ్ఞాపకం వచ్చి మరల ఈ విధంగా ప్రార్థించుకున్నాను “నా దేవుడు తన చిత్తమైతే నా భర్త మనసు మారుస్తాడు, నన్ను మరల దేవుడు తన పనిలో వాడుకుంటాడు. అందుకు నా భర్తనే దేవుడు ప్రేరేపిస్తాడు, ఇది దేవుని కొరకు తీసుకొన్న నిర్ణయం కాబట్టి ఎన్ని అవరోధాలు వచ్చినా నా పాట ఆగకుండా దేవుడు చేస్తాడు” అని విశ్వాసంతో నమ్మి ప్రార్థించాను.

ఫిబ్రవరి మాసంలో నా భర్త నన్ను మొదటి సారి బెంగుళూరుకు తీసుకెళ్ళారు. చుట్టూ ఉన్న అమ్మలక్కలు వారి ఇండ్లకి క్రొత్తగా పెళ్ళైన జంట అని భోజనాలకి పిలవడం, ఈ సమయంలోనే నేనెక్కువ నా భర్తని, అత్తని, వారి యిష్టాలు, అలవాట్లు అన్ని కనిపెట్టడం జరిగింది. 10 రోజుల తర్వాత మరల కాలేజ్ కొచ్చాను. ఎక్కువ మనస్తాపం లేకుండా గడిచినది ఈ ఒక్కసారే. మరల మార్చి నెలలో బెంగుళూరు రావాలని నా భర్త తొందర చేసారు. వారి ఆదేశాను సారం నేను వచ్చి మరల 10 రోజులు ఉండి మళ్ళీ బయలుదేరాను.

నా క్లాసులు మిస్ కావడం, హాస్పిటల్ పోస్టింగ్స్‌కి క్రమం తప్పి వెళ్ళడం జరిగాయి. అంతలోనే ఇ.ఎన్.టి. ఎస్.పి.ఎం. ఆప్థల్‌మాలజీ పరీక్షలు వచ్చాయి. బెంగుళూరులోనే ప్రిపేర్ అవుదువు గాని అని మరల ఆజ్ఞ. నేను సరియైన దీక్షతో చదవలేకపోయాను. నేను హాస్టల్‌కే వెళ్ళిపోవాలి, చదువుకోవాలి అని బలవంతంగా వచ్చాను. అదే సమయంలో నా మొదటి బిడ్డ కడుపున పడింది. చాల విపరీతముగా వాంతులు అయి ఏమి తినలేకుండా అయ్యి స్టార్వేషన్‌కి గురయ్యాను. అప్పుడే అత్తగారి మాటల్లోకి ద్వంద్వార్థాలు, మా డాడీ పెండ్లికి ఇస్తానన్నవి ఇవ్వలేదని, మాటలతో మనసు నొప్పించడం, ఇంట్లో పని అంతా

చేయమని ఆజ్ఞ జారీ చేయడం జరిగింది. నేను మనసులో బాధపడడం, బాధ అపుడపుడు కన్నీళ్ళ రూపంలో బయటికి రావడం జరిగింది. ఒక రోజు నా భర్త ఉన్న సమయంలో ఆయన 2వ షిఫ్ట్ డ్యూటీ నుండి వచ్చాక మధ్య రాత్రిలో ఆవిడ" నీ పెళ్ళాం నన్ను పట్టించుకుంటా లేదని గొడవ చేయడం, ఆమె నన్ను కొట్టే స్థితికి అరుచుకుంటూ రావడం నా భర్త ఆపడం జరిగింది. ఆమె తన కొడుకు తన చెప్పు చేతల్లో నుండి బయటికి వెళ్ళి పోతున్నట్టు, నేను ఎత్తుకొని పోతున్నట్టు మాట్లాడే సరికి నేనక్కడ ఎక్కువ రోజులు ఉండలేననిపించింది. శరీరంలో బలహీనత ఎక్కువైంది. ఆ రాత్రి తప్పునాదికాక పోయినా, ఆమె నన్ను కొట్టడానికొచ్చినా, నేను "క్షమించమని" అడిగాను. ఆమె వయస్సును బట్టి ఆమెకి మర్యాద ఇచ్చి, ఆ వాతావరణం తేలిక చేయడానికి, అది దేవుడే అపుడు నా మనసులో పెట్టిన మంచి ఆలోచన, అంతటితో ఇంకా ఎంతో గొడవైపోతే చూసి ఆనందించాలని చేసిన సాతాను ప్రయత్నానికి గాలి తీసినట్లైంది.

ఆ మరుసటి రోజు నా భర్తని దేవుడు ప్రేరేపించాడనుకుంటాను "నువ్వు ఈ మానసిక బాధ తట్టుకుంటూ, ఆరోగ్యంగా ఉండలేవు, నిన్ను కాలేజీకి పంపేస్తాను, మళ్ళీ చదువు ప్రారంభించు పరీక్షలకి ప్రిపేర్ అవ్వు, మా అమ్మకి నేనేదోలాగ చెప్తాను లే, టికెట్ బుక్ చేస్తాను" అన్నారు నాకు అదే సరనిపించింది.

## అమ్మ సంసారంలో అపశృతులు

నా మానసిక క్షోభ మరింత ఎక్కువైపోవడానికి ఇంకొక కారణం తోడైంది. నేను బెంగుళూరు నుండి కరప వచ్చాను. డాడీ అపుడు పశ్చిమ గోదావరి జిల్లా గౌరీ పట్నంలో పనిచేసేవారు. అమ్మ ఏదో చాలా బాధపడడం, భోంచేయకపోవడం, ఏదో పోగొట్టుకున్నట్టు ఉండడం, అందరూ నా దగ్గర ఏదో దాస్తున్నారనిపించింది. డాడీ నేనుండగా ఒకరోజు వచ్చారు కాని ఎవరితోనూ సరిగ్గా మాట్లాడకపోవడం, నన్ను కూడా ఆప్యాయంగా పలకరించక పోవడం, ఎవరో తెలియని వారిని చూస్తున్నట్టు ముఖంలో ఏ భావాలు లేకుండా ఉండిపోవడం కారణం తెలియక సతమతమయ్యాను. అమ్మ అప్పటికే చాల చిక్కిపోయింది. కారణం ఏంటని బ్రతిమాలితే "నువ్వు ఇవన్నీ ఆలోచించకు నీకు శరీరకంగా, మానసికంగా ఆరోగ్యం బాగుండాలి. అందుకని పట్టించుకో వద్దు" అంది అమ్మ. డాడీ మరల మధ్యాహ్నం వెళ్ళిపోయారు. అపుడు ఇక అమ్మ దాచలేక చెప్పింది. "డాడీ ఎవరో ఒక ఆడ మనిషి వలలో చిక్కుకున్నారు. అది తప్పని దాని నుండి బయట పడాలని కూడా అనుకుంటాలేదు. ఆమె ప్రభావంతో ఇంటిని, నన్ను, పిల్లల్ని పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఆమె ఆయనతో పనిచేసే ఒక నర్సు" అని చెప్పింది. నాకు నమ్మశక్యం కాలేదు. ఇంట్లో తమ్ముళ్లు, చెల్లెళ్ళు అందరూ నిజమే, ఆమె ఈ ఇంటికి కూడా అప్పుడప్పుడు రాత్రులు వచ్చింది" అని అన్నారు. నా బాధ ఇక



చాల భయంకరంగా మారిపోయింది. ఇక కన్నీళ్ళు మాకు ఆహారపానీయాలుగా మారిపోయాయి. మేమెంత ఆశగా ఆయన్ని మాట్లాడించాలని ప్రయత్నించినా ఆయన మాట్లాడేవారు కాదు. ఆయన ఇంటిని పట్టించుకోక, సరైన విధంగా పోషణ చూడక ఇంట్లో పిల్లలందరూ అమ్మతో పాటు ఏడ్చుకుంటూ ఉపవాసాలు చేస్తూ ఉండిపోయారు. డాడీ తరుపు బంధువులలో చాల మంది ఆయనకే వత్తాసు పలికారు. ఎవరూ అమ్మకి, పిల్లలకి ఆదరణగా మాట్లాడలేదు. అమ్మ తరపు బంధువులు (మామయ్యలు) కొంత మంది అడగడానికి ముందుకొచ్చారు. డాడీ "నా భార్యకి క్యాన్సర్, ఆమె బలహీనంగా ఉండి నాకు సుఖాన్ని ఇవ్వలేకపోతుంది. అందుకే నేను ఈమెని పెట్టుకున్నాను, ఈమెని వదిలే ఉద్దేశ్యం లేదు. ఇది నా యిష్టం" అని మొహమాటం లేకుండా చెప్పారు. దైవజనుడిగా, ఎంతో మందితో గొప్పగా చెప్పబడిన మమ్మల్నందర్ని దైవ మార్గంలో చక్కగా నడిపి, నేర్పించి, ఇపుడు అల్లుళ్ళు, మనుమలు వచ్చే కాలంలో ఇలాగైందేమిటని మేము దేవుని సన్నిధిలో కన్నీటి ప్రార్థనలు చేయడం తప్ప ఆమెను వదులుకోవడం ఆయనకిష్టంలేదని తెలిసి మేము ఆయన గురించి "ఎప్పటికైనా వస్తారు. దేవుడు నమ్మదగిన వాడు, ఆయన పడిపోయిన డాడీని మరల లేవనెత్తుతాడు, కృంగిపోయిన మా కుటుంబాన్ని లేవనెత్తుతాడు" అని విశ్వసించాము.

గర్భంతో ఉన్న నాపై ఈ విషయం చాల ప్రభావం చూపింది. మా అత్త భర్తలకి డాడీ విషయం కొద్ది కాలానికి తెలిసి వాళ్ళు కూడా అమ్మ మీద జాలి చూపడం తప్ప మరేమీ చేయలేకపోయారు. దేవుడు నా భర్త విషయంలో మనసు మార్చి నేను పాటలు పాడే విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకొనేటట్టు చేసాడు. నేను వీటన్నిటి గురించి బాధపడుతూ అమ్మ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, పస్తులతో ఉండడం గమనించి, నేను హాస్టల్‌లో నా అవసరాల గురించి నేను చెప్పడం తగ్గించేసాను. నాకెంత కష్టంగా ఉన్నా తినడానికి కొనుక్కోడానికి లేకపోయినా, బ్రెడ్, మంచినీళ్ళతో రోజులు వెళ్ళబుచ్చాను. "నాకు డబ్బు కావాలి" అని అవసరం వస్తే ఎవర్నీ అడిగే తత్వం నాది కాదు. అమ్మైనా, డాడీయైనా, నా భర్తయైనా సరే అడిగే దాన్ని కాదు. మరీ కష్టమైతే ప్రార్థన చేసే దాన్ని. ఇప్పటికీ కూడా నా పద్ధతి అదే.

ఇ.యు. మీటింగ్స్‌లో మళ్ళీ నా భర్త అనుమతించారు. నేను పాడిన పాటల్లో ప్రేక్షకులకి బాగా ఇష్టమైనవి "కల్వరి ప్రేమను తలంచునపుడు, యేసూ నేను పాపిని, సిలువరుధిరం నా క్రయధనం, ఈ నీ దినమందైనా" ఇంకా కొన్ని. దేవుడు నా భర్త మనసు మార్చాడు. నాకు అది సంతోషాన్నిచ్చింది. ఆయన నన్ను, దేవుడ్ని సంతోష పెట్టడానికి ఆయనే కీ బోర్డు ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టారు.

7వ నెలలో నా ఆరోగ్యం క్షీణించి, రక్తహీనత చాల ఏర్పడి అది గుండె మీద ప్రభావం చూపింది. భయంకరమైన ఆయాసం, మనసులో చెప్పుకోలేని బాధ అయినా పోస్టింగ్స్‌కి

హాజరవుతూ 9వ నెల వచ్చే వరకూ హాస్టల్‌లోనే ఉన్నాను. కొన్ని క్రిస్టియన్ మెడికల్ కాన్ఫిరెన్స్‌ల్లో కూడా చాల చురుగ్గా పాల్గొన్నాను. నాకు బాగా రక్తహీనత ఏర్పడినపుడు దేవుడు నా స్నేహితులని, ఇయు వారిని ఎంతో మందిని ప్రేరేపించాడు. వారు నాకు మంచి భోజనాన్ని సిద్ధం చేసి తెచ్చి ఇచ్చేవారు. మా చిన్నాన్న కుటుంబం నుండి (విప్పర్తి సుబ్బారావుగారు) కూడా భోజనం పంపించేవారు. అందరికంటే ఎక్కువగా లూక్ ఆంటీ, అంకులు వారి పిల్లలు నన్ను బాగా ఆదరించారు. ప్రేమ్ శేఖర్ అంకుల్, వారి భార్య కూడా నన్ను చాల ప్రేమించి నన్ను సంతోషపరచడానికి ఆ ఆంటీ కువైట్‌లోని చికెన్ స్పెషల్స్ చేసి తినిపించేవారు. వారు నన్ను అంతగా ప్రేమించడం నాకు నమ్మశక్యంగా ఉండేది కాదు. నన్ను చాల ఆదరించారు. వారి ఇనిస్టిట్యూట్ చాపల్‌లో కూడా నేను మీటింగ్స్ క్రిస్మస్ ప్రోగ్రాముల్లో పాటలు పాడేదాన్ని. 9వ నెల 15 రోజులు అయ్యేంత వరకు కాలేజీ క్లాసులు, పోస్టింగులు, అలాగే మీటింగులూ హాజరవుతూ పాటలు పాడుతూ గడిపేసాను.

నన్ను నేను అంత తీరిక లేకుండా చేసుకోడానికి సరైన విశ్రాంతి తీసుకోకపోవడానికి కారణాలున్నాయి. డాడీ సంగతి అన్నిటికన్నా బాధ కలిగించే విషయం, అమ్మ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వాళ్ళ భవిష్యత్తు ఎలా ఉంటుందోనని బాధపడేదాన్ని. విశ్రాంతి తీసుకోడానికి పడుకున్నపుడు చిన్న చిన్న వింత మనుష్యులు (పిశాచాలనిపించాయి) మంచము చుట్టూ తిరుగుతూన్నట్టు పీడకలలు వచ్చేవి. నా అనారోగ్యం గురించి, డాడీ గురించి, ఇంట్లో వారి గురించి ఆలోచిస్తూ పడుకుంటే ఇక అసలు నిద్రపట్టేది కాదు. అందువల్ల నన్ను నేను బిజీగా ఉంచుకోవడానికి ప్రయత్నించేదాన్ని.

1991 డిసెంబరు 23వ తారీఖున ఒక అద్భుతం జరిగింది. డాడీ విషయమై ఎంతో బాధపడుతున్న మాకు కొంత ఊరట, సంతోషం కలిగింది. ఎందుకంటే అవతలి వ్యక్తితో ఏమి సమస్య కలిగిందో ఏమో తెలియదు గాని డాడీ ఎక్కడికి బయటికీ వెళ్ళకుండా, ఇంటి పట్టునే ఉండి అందరితో చక్కగా మాట్లాడుతూ ప్రార్థనలు చేస్తూ ఎంతో పశ్చాత్తాపపడుతూ ప్రార్థన చేయడం మమ్మల్ని అందరినీ కూడా మునుపటిలాగ ప్రార్థనలో కూర్చోపెట్టి నడపించడం మా కందరికీ నిజమైన పండుగ, వేడుక వాతావరణం ఇంటిలో కలిగింది. ముఖ్యంగా నా అనారోగ్యమంతా దేవుడు తీసేసినట్టు నాకున్న భయములన్నీ తొలగిపోయాయి. దేవుడు నా కాన్పు విషయం, పుట్టబోయే బిడ్డ విషయంలో మాట ఇచ్చి నాకు ధైర్యమిచ్చాడు. ఆ నెల 31వ తారీకు వరకు డాడీ ఉపవాస ప్రార్థనలో వుండి ఆయనకి బంధకాల నుండి విముక్తి కొరకు ప్రార్థించారు మేమందరము ఏకీభవించాము.

డిశంబరు 30 వ తారీఖు రాత్రి 9:30 గంటల నుండి నొప్పులు మొదలయ్యాయి. నాకు మనసులో మాత్రం చాల ధైర్యమొచ్చింది. మరుసటిరోజు 11:30 గంటలకి హస్పటల్‌కి వెళ్ళాము. మధ్యాహం 2:17 నిమిషాలకి ప్రసవమైంది. పాపపుట్టింది. ఆ



రాత్రికే ఇంటికొచ్చేశాము. పాపనిచూసి అందరికీ సంతోషమైంది. చివరికి ఇంట్లో ఉన్న పెంపుడు కుక్క ప్రిన్సికి కూడ చాల సంతోషం. అది చాల కంటికి రెప్పలాగ కాపాడుకోవాలని పాపకి దగ్గర్లోనే ఉండేది.

దేవుని విడుదల కార్యం ఎక్కడ జరిగినా అక్కడ దానికి వ్యతిరేకంగా సాతాను ఎంతో బలంగా శోధిస్తాడు. ఆశోధనలో పడిపోకుండా నిలిస్తే దేవుని ఆశీర్వాదముంటుంది. మా ఇంట్లో డాడీ విషయం లో అవతలి వ్యక్తి చేసే శోధన ఎక్కువైంది. ఆమె ఇంటికి రావడం, గొడవలు చెయ్యడం, రాత్రులు ఇంటిలో చాల అల్లరి చేయడం చాల బెదిరింపులు చేయడం ఎక్కువైంది. డాడీ ఒక నెల రోజులు ఇంటిపట్టునే ఉన్నా మరల ఆయన పతనం మొదలవడానికి ఎంతో సమయం పట్టలేదు.

నాకు ఫైనలియరు పరీక్షల తేదీలు అనౌన్స్ చేశారు. డాడీ ఎంతో మంచిగా మారి మాకు సంతోషం ఇచ్చింది కొన్నాళ్ళే. ఈ లోపల చాల దు:ఖకరమైన సంగతులు విషయాలు జరిగాయి. జనవరి 13వ తారీకున విశాఖపట్నం లోని పేటర్ సన్ లూక్ అంకుల్ హార్ట్ ఎటాక్‌తో మరణించారని వార్తవచ్చింది. దానికి మనసంతా చాలా దుఃఖంతో నిండిపోయింది. అయినా వారిని ఓదార్చడానికి నేను వెంటనే వెళ్ళలేక పోయినా దేవుని లో మనకున్న నిరీక్షణను బట్టి ధైర్యం పొంది వారికి ఉత్తరం రాశాను. మరొక సంగతి పాపకి పుట్టిన తర్వాత ఆరోగ్యం బాగోలేక 15 రోజులు చాల బాధపడింది. దానికి కారణం తల్లి పాలు బిడ్డకిపడలేదు. అది ఎలర్జీ అయిందన్నారు, మాన్పించెయ్యాలన్నారు. తల్లిగా నేను ఆనందించలేక పోయాను ఈ వార్త విని. అయినా బిడ్డ ఆరోగ్యం నాకు ముఖ్యం కాబట్టి గుండెను దిట్టపరచుకున్నాను. ఇంకొక విషయం ఏమంటే మా అత్త గారికి గర్భకోశంలో క్యాన్సర్‌వ్యాధి, 3వ స్టేజ్ లో ఉందని దానికి రేడియో థెరపీ ఇవ్వాలని నిర్ణయించారని నా భర్త ఫోన్ చేసి చెప్పారు. ఇవన్నీ నా ప్రసవం అయిన 15 రోజులకే జరిగాయి. శోధన చాల ఎక్కువైంది నాకు. మానసికంగా చాల నలుగుడు కలిగింది.

ఎంతో కష్టపడి 9 వ నెలలో కూడ క్లాసులు, పోస్టింగులకి హాజరవుతూ ఆరోగ్యం కూడా పట్టించుకోకుండా నేను కష్టపడినది అన్ని జ్ఞాపకం చేసుకుని, ఇపుడు బిడ్డని నెల రోజులకే అమ్మదగ్గర వదిలి, గుండె రాయి చేసుకుని తర్వాత పరీక్షలు వ్రాస్తే, చదువు త్వరగా పూర్తవుతుంది, అందరూ కలిసి ఒకే దగ్గర ఉండవచ్చునన్న ఆలోచనతో విశాఖపట్టణం వెళ్ళాను.

పాప ఆరోగ్యవిషయం ఏనాడూ బాగుండ లేదు. డాడీయే ట్రీట్‌మెంటు ఇస్తూ ఉన్నారు. ఒక గంటకూడ మంచిగా పాప నిద్రపోయేది కాదు, విపరీతమైన కడుపు నొప్పి వస్తూ ఉండేది. నేను అంతకు ముందు వారానికి ఒక రోజు ఉపవాసముండి ప్రార్థన చేసేదాన్ని. అయితే పాప పుట్టాక, పాప ఆరోగ్యం గురించే వారంలో ప్రతి బుధవారం కూడ ఉపవాసం ప్రతిష్ట చేసుకొని ప్రత్యేకంగా పాప కొరకు ప్రార్థించేదాన్ని. పాప పేరు పుట్టుక ముందే

‘ ప్రెయిజీ ’ అని పెట్టాలని నిర్ణయించుకున్నాను. అప్పట్లో ఫోను సౌకర్యం ఎక్కువగా లేదు. కాబట్టి వారానికొకసారి ఇంటికి ఫోను చేసి పాప గురించి కనుక్కొనేదాన్ని.

ఫిబ్రవరి నెలలో “ డాడీ సంగతి మళ్ళీ మామూలే , ఆయన మళ్ళీ ఆమె వలలో చిక్కుకుపోయారు, మునుపటికన్నా చాల ఎక్కువగా హీనస్థితికి దిగజారిపోయారు. ఆయన మరల మనవైపు తిరిగి మారుమనస్సుతో వస్తారో లేదో ” నని అమ్మ ఒక రోజు చెప్పింది. చాల దుఃఖం కల్గింది. డాడీ ప్రార్థన చేస్తూ ఆ యింట్లో ఉంటూంటే నా పాప ఆ ప్రార్థనల వలన క్షేమంగా ఉంటుందని ధైర్యముండేది. ఇపుడు ఆ విషయంలో అధైర్యమొచ్చేసింది. పరీక్షలకి చదువుతూ ఉన్నా ఎపుడు ఏ వార్త వినవలసి వస్తుందోనని భయం ఉండేది. అందుకే నేనే ఉపవాస ప్రార్థనలు ఎక్కువ చేసేదాన్ని.

మార్చి 6 వ తారీఖు ఇంటికి ఫోన్ చేస్తే డాడీ ఆ రోజు ఇంటికి కొచ్చారు. ఏమి ఎరగనట్టు నాతో పాప గురించి మళ్ళీ బాగోలేదని చెప్పారు. అయితే తీవ్రమైన ఇన్ఫెక్షన్ కాదు అన్నారు. మరుసటి ఆదివారం నాకు లైన్ దొరకలేదు. సోమవారం ఉదయం నేను పరీక్షలలో వచ్చే కేసులుచూడడానికి వార్డ్స్‌కి వెళ్ళాను. మళ్ళీ హాస్టల్‌కి వచ్చేసరికి నాకోసం నా ఫ్రెండ్స్ ఎదురు చూస్తూ ఉన్నారు. విషయం ఏమిటి అని అడిగితే ఇంటి దగ్గర నుండి ఫోన్ వచ్చిందని, పాపకి చాలా సీరియస్ అయి హాస్పటల్ లో పెట్టారని, వెంటనే బయలుదేరి రమ్మని, ‘ ప్రాణానికి అపాయంగా వుందని ’ చెప్పమన్నారని నా స్నేహితులు చెప్పారు. నేను ఇక ఏమి ఆలోచించకుండా ఒక్క అరగంటలో కాకినాడ వెళ్ళే బస్‌లో వున్నాను. నా స్నేహితులందరు ‘పాపకి ఏమి జరగదు, నువ్వు ధైర్యంగా ఉండు’ అని చెప్పి పంపించారు.

బస్‌లో కూర్చొని ప్రార్థించని క్షణం లేదు. పాప చనిపోయిందేమో అన్న ఆలోచన వచ్చేది. దుఃఖంవచ్చేది. కన్నీళ్ళు కారుస్తూ బస్‌లో కూర్చున్నంతసేపూ ‘నా పాపకి ఏమీ జరగనివ్వద్దు ప్రభువా ’ అని వేడుకుంటూ ఉన్నాను. ఆ వారంలో బుధవారం పాప గురించి ఉపవాస ప్రార్థనలో కూర్చొని వాక్యం చదువుతూ ఉన్నప్పుడు అమాంతంగా కిటికి వైపు నుండి ఒకరు పెద్ద హేళన చేస్తున్నట్టుగా వెకిలి నవ్వుతో లోనికి వచ్చి నా వద్ద నిలిచి “ ఏంటి ? ఉపవాసాలు ఎక్కువ చేస్తున్నావు? నీకుటుంబములో నెమ్మది కావాలనే కదా! నువ్వు ఎలా ఉపవాసాలు చేస్తావో చూస్తాను. నీకు నెమ్మది లేకుండా చేస్తాను”. అన్న భావంతో నవ్వి, మరల హేళన చేస్తూ, ఎలా వచ్చిందో అలాగే కిటికీలో నుండి బయటకి పోయినట్లైంది. సినిమాహాల్లో సౌండ్ సిస్టమ్, హర్రర్ పిక్చర్లకి పెట్టే శబ్దం గుర్తొచ్చింది ఆ నవ్వు శబ్దానికి. నన్ను నేనే గిల్లుకుని, ఇది కలకాదు నిజమే, అయితే సాతాను పాప విషయమై నన్ను భయపెట్టడానికి వచ్చాడని అర్థమైంది. బస్సులో కూర్చున్న నాకు ఈ సంగతి గుర్తుకొచ్చి ఇంకా తీవ్రంగా ప్రార్థన చేసాను.

సాయంత్రము 4 గంటలకి బస్ కాకినాడ వచ్చింది. డైరెక్టుగా హాస్పిటల్‌కే



వెళ్ళాను. ఎంతో వాలిపోయి, ఏమి కదలికలు లేకుండ, కళ్ళు లోపలికి పోయి, చావుకళతో, అపస్మారక స్థితిలో ఉంది పాప. చేతికి ఇంట్రా వీనస్ డ్రిప్ పెట్టారు. ఆస్థితిలో పాపను చూసి దుఃఖము పొంగుకొచ్చింది. అమ్మ ప్రక్కనే ఉంది. కొంత సముదాయించుకొని ‘ఏంజరిగిందని’ అడిగాను. అంతకు ముందు వారం ఫోన్ చేసినపుడు తీవ్రంగాలేదని చెప్పిన విషయం గుర్తుచేసి, అప్పటినుండి రోజురోజుకీ పరిస్థితి విషయమించిందని, డాడీ ట్రీట్ మెంట్ ఇచ్చినా ఫలితం లేదని, బ్రాంకో న్యుమోనియా, గ్రాస్ట్రో ఎంటిరైటిస్, సివియర్ డీహైడ్రేషన్ అయ్యింది” అని చెప్పింది. అది గవర్నమెంట్ హాస్పిటల్ లోని పిల్లల వార్డు. వార్డు వాతావరణం బాగోలేదు. పాప బ్రతికే ఉందన్న సంతోషం ఉన్నా, చాల సీరియస్ గా ఉండడం చూసి ‘ నా పాపేనా’ అని ఆశ్చర్యం వార్డు అనుకూలంగా లేదని రాత్రికి ఉండడం ఎలా అని ఆలోచిస్తుంటే డాడీ డాక్టరుతో మాట్లాడి, రాత్రికి ఇంటికి తీసుకెళ్ళి, మళ్ళీ ఉదయం వస్తామని చెప్పారు. ఆయన అనుమతి ఇచ్చారు. రాత్రంతా పాపతోనే కూర్చున్నాం. డాడీ మళ్ళీ ఉదయం డ్రిప్ స్టార్ట్ చేశారు. హాస్పటల్‌కి తీసుకు వెళ్ళ లేదు. డాడీయే ఇంజక్షన్లు ఇచ్చారు. పాప అలాగే నీర్సంగా ఉంది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అకస్మాత్తుగ పాప విచిత్రమైన కేక పెట్టింది. ప్రక్కనే వున్న అమ్మ, నేను తుళ్ళిపడ్డాము. వెంటనే చిత్రమైన కదలికలు చేసి ఒక్కసారే శ్వాస విడిచేసింది పాప. డాడీ వేరే మంచం మీద పడుకున్నారు. ‘డాడీ’ అని ఒక్క సారే అరచి పాపకేమో అయిందన్నాను. డాడీ పాప నాడి పట్టుకొని చూశారు, హర్టు బీటు చూశారు. ఏమీ ఊపిరాడడం లేదు. డాడీ వెంటనే ఛాతిపై రుద్దుతూ ప్రార్థన చేయడం మొదలు పెట్టారు. మేము కూడ రోధిస్తూ ప్రార్థన చేశాము. 5 నిమిషాల తర్వాత పెద్ద శ్వాస తీసుకుంది పాప. నీలంగా మారిన పాప శరీరమంతా మామూలుగా కాసాగింది. కాసేపటికి కళ్ళు తెరచింది. దేవుడు పాపని ముట్టాడు. మరణించిన దాన్ని సజీవంగా లేపాడు. ఆయన అదృశ్య హస్తం, తోడు నేను అనుభవించాను. ఇక అన్నీ తగ్గుముఖం పట్టి మరుసటి రోజుకి పూర్తిగా ఆరోగ్యవంతురాలైంది. రెండు రోజుల్లోనే మరలా బొద్దుగా తయారైంది. నేనే మరలా గుండె రాయి చేసుకుని పరీక్షలు రాయడానికి విశాఖపట్టణం వెళ్ళాను. పాస్ అవుతానన్న నమ్మకం ఏ మాత్రం లేదు. అయితే చాలా కష్టపడ్డాను. రిజల్ట్స్ ఇంకా తెలియక ముందే మా అత్త గారింటికి బెంగుళురుకు పాపని తీసుకుని ప్రయాణమయ్యాము.

## అత్తగారి అనారోగ్యం-నాపై నిందలు

మా అత్తగారింటికి, నా భర్తకి పిల్ల చాలా చిక్కిపోయిందని,అమ్మ,డాడీలు సరిగ్గా చూసుకోలేదని, బాగోలేనప్పుడు గవర్నమెంట్ హాస్పటల్ లో పెట్టారని, వారికి అవసరమైన సమయంలో నన్ను పంపలేదని కోపంగా వుంది. ఈ మాటల్ని లెక్క చేయకుండా నన్ను నేను సముదాయించుకుని పాపని, అత్తగారిని చూసుకోవడం మొదలు పెట్టాను. అమ్మ ఇలాంటి మాటలు పడవలసి వచ్చిందని చాలా బాధతో తిరిగి వెళ్ళింది.

మా అత్తగారి సమక్షంలో దేవుని సన్నిధిలో పాపని ప్రతిష్ఠించి, "ఎస్తేరు ప్రైయిజీ" అనే పేరు పెట్టాము. మా అత్తగారు పాపతో బాగా కాలక్షేపం చేస్తూ సంతోషంగా గడిపేవారు.

మా అత్తగారికి అది క్యాన్సర్ కాదని అల్సర్ అని చెప్పాము. ఎందుకంటే ఆమె ఎక్కువ కృంగిపోయి, చావుకు దగ్గరైపోతుందేమోనని ఎపుడు ఆమెను సంతోషంగా ఉంచేందుకే ప్రయత్నించేదాన్ని. ఆమె ఒక 3 నెలలు చలాకీగానే తిరుగుతూ బాగానే ఉండింది. ఇంట్లో పనిమనిషి మానేసింది. పనంతా నేనే చేసుకొనేదాన్ని. కొన్నాళ్ళకు అత్తగారి ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. అపుడు కూడ ఎంతో సహనముతో పరిచర్య చేశాను. అయితే ఆమె స్నేహితురాళ్ళు చుట్టుపక్కల ఇళ్ళలో వుండేవారు ఆమె మనసు పాడు చేశారు. "మీ కోడలు మీ ఇంట్లో కాలు పెట్టినందువల్లే మీకు బాగుండడంలేదు, మీ ఆరోగ్యం పాడైపోవడానికి ఆమె నీకు మందు పెట్టి ఉండవచ్చు" అని చెప్పారు ఆమెతో. వారు మాట్లాడు కొనేది తమిళంలో. నాకు కొంత వరకు అర్ధమవుతూవుండేది. అందుకని నేను అర్ధంచేసుకుంటున్నానని కనిపెట్టి వారు నా ఎదురుగా ఏమీ మాట్లాడేవారు కారు. నాకు ఈ వైఖరి చూసి బాధ కలిగించినా, నా పని, పరిచర్య అంతా సక్రమంగానే చేశాను. ఆమె బాత్రూమ్‌కి లేచి వెళ్ళలేని పరిస్ధితిలో అన్నీ మంచము పైనే జరిగేటపుడు కూడా విసుగు నాలో లేకుండా నా నోట ఎపుడూ పాట వుండేది. నా ముఖాన్న చిరునవ్వు చెరగలేదు. నా ఆరోగ్యం మధ్యలో పాడైనా నా సహనం వీడకుండా వున్నాను. ఈ రోజు నేను ఇలా జబ్బుపడినపుడు ఎంతో మంది నాకు పరిచర్యచేయాలని ఇష్టపూర్వకంగా ముందుకి రావడానికి కారణం నేను ముందు ఆవిడకి చేసిన కొద్దిరోజుల పరిచర్యేనని నా నమ్మకం. దీనికి ఎవరోకాదు, దేవుడే సాక్షి.

అత్తగారిని సెయింటు మార్తస్ హాస్పిటల్ లో అడ్మిట్ చేసినపుడు ఆమె పరిస్ధితి విషమించిందని డాక్టర్లు చెప్పారు. మేము ఆమెను అమలాపురం తీసుకెళ్ళాలని ఆమెను ఒప్పించడానికి చాలా సమయం పట్టింది. ఆమె ఒప్పుకొనే సమయానికి లాల్ మామయ్య, చంటత్త కూడ బెంగుళూరుకి వచ్చారు. అపుడు కూడ చుట్టు పక్కల అమ్మలక్కలు అత్తతో 'సుధ ఇంటికి వచ్చాక ఆమె ఆరోగ్యం పాడైంది" అని చెప్పడం విన్నాను. అత్త కూడ ఆ విషయమై బాధపడి, "వాళ్ళు క్రైస్తవులు కారు కదా చెల్లీ, అందుకే వాళ్ళలా మాట్లాడుతున్నారు. నువ్వు ఏమీ బాధపడకు" అంది.

అమలాపురం బయలుదేరడానికి 3 నెలలకి ముందే నా రిజల్ట్స్ తెలిసాయి. అన్ని సబ్జక్టుల్లోనూ పాస్ అయ్యానని నా ఫ్రెండ్స్ టెలిగ్రాం పంపించారు. అయితే వెంటనే వెళ్ళి హౌస్ సర్జన్సీలో చేరలేని పరిస్ధితి. పాపని అమ్మ దగ్గరకు పంపించి, నేను అమలాపురంలో మాఅత్తగారితో ఉన్నాను. అక్కడ ఆమె ఆరోగ్యము ఇంకా విషమించింది. నా భర్త ఆ సమయంలో ట్రైనింగ్ పేరట తిరుచిలో ఉన్నారు. అమలాపురం వచ్చిన 13



రోజులకి ఆమె బిపి, పల్స్ తగ్గడం మొదలు పెట్టింది. బెంగుళూరుకి ఫ్యాక్టరీ ఆఫీస్‌కి ఫోన్ చేసి తిరుచిలో ఉన్న నాభర్తకి సమాచారము అందించమని చెప్పాను. వారు ఆయనకి తెలియజేయడానికి 2 రోజులు పట్టింది.

అయితే 2 రోజులకు మరల ఆమె కోలుకుంటున్నట్టుగా బిపి, పల్స్ నార్మల్‌కి రావడం మొదలైంది. ఆమె కళ్ళు తెరచి మాట్లాడింది. ఆమెను దేవుడు క్షమించాడని, పరలోకంలో చోటివ్వబోతున్నాడని, అయితే కొడుకును చూడలని ఇంకా 2 రోజులు బ్రతికించమని ప్రభువుని వేడుకున్నానని, అయితే చేసినది పెద్ద తప్పిదము కాబట్టి దేవుడు తీసుకెళ్ళిపోతున్నాడని" చెప్పింది. ఈ మాటలు చెప్పినప్పుడు లాల్ మామయ్య , ఇంకా కొంత మంది సహోదరులు, సహోదరీలు ఉన్నారు. ఆమె చేసిన తప్పిదమేమిటో కూడా వివరించింది. ఏంటంటే – ఆమె స్నేహితురాళ్ళు బెంగుళూరులో ఆమెకి జాండిస్ అయిఉండవచ్చునని, దానికి పసరు మందు ఇచ్చే ఒకతను శివాజీ నగర్‌లో ఉన్నాడని, ఆమందు కోసం ఆమెని అక్కడికి అర్ధరాత్రిలో తీసుకెళ్ళాలని ఒకరోజు అమెను తీసుకెళ్ళారు. తెల్లవారి మరల 6గం॥లకి వచ్చారు. నేనేది తయారుచేసిచ్చినా ఆమె తీసుకొనేది కాదు ఒక మూడురోజుల వరకు. ఆ 3 రోజులు వాళ్ళే ఏమేమో పానీయాలు చేసి తేస్తే ఆమె త్రాగేది. ఆ సంగతి ఇపుడు గుర్తుచేసుకొని "నేను జాండిస్ కొరకు మందు తీసుకోలేదు. తనకు సుధ మందు పెట్టిందని, అందుకే ఆరోగ్యం ఇలాగైందని" అందరు తన మనస్సు పాడుచేసారని, అందుకోసం మందు కక్కించుకోవడానికి భూతవైద్యుడి వద్దకు వెళ్ళానని, అది చాల ఘోరమైన తప్పిదముగా దేవుడు ఎంచి జీవితకాలాన్ని పొడిగించలేదని ఆమె చెప్పింది. కొడుకు కోసం 2 రోజులు జీవంతో ఉండనిమ్మని దేవున్ని వేడుకున్నానని చెప్పింది. నాకు ఈ సంగతి విని చాల బాధ అయింది. ఆమె నన్ను క్షమించమని కూడా అడిగింది. పట్టించుకోకుండా ఆమెని వదిలెయ్యాలన్నంత కోపం కలిగినా, ఇన్నాళ్ళ నా సహనానికి, పరిచర్యకి అర్ధం ఉండదని, కోపం దిగమింగుకొని, నా నిర్దోషత్వాన్ని బట్టి దేవుడు మాకు ప్రతిఫలం దయచేస్తాడని నమ్మి ఆమెని క్షమించమని ప్రభువును వేడుకున్నాను.

నా భర్త ఫోన్ చేసి "నేను రావాలా" అని అడిగారు. నేను "వచ్చేయండి", ఆమె చాల కలవరిస్తూందని" చెప్పాను. ఆయన మరసటి రోజు సాయంకాలానికి వచ్చారు. ఆమె కొడుకుని చూసింది. సంతోషపడింది. అమ్మ,పాపని తీసు కొని ఆ సమయానికి వచ్చింది. పాపని చూసి కూడ సంతోష పడింది. గోంగూర, పచ్చిరొయ్యల కూరతో అన్నం కలిపి తినిపించమని అమ్మని అడిగింది. కొద్దిగా తిన్నది. ఆమె అంత చురుకుగా ఉండడం చూసి ఇంకా కొన్నాళ్ళు బ్రతకవచ్చు అని అనుకున్నాను. రాత్రంతా మంచిగా నిద్రపోయింది. తెల్లవారి 5 గంటలకు కొద్దికొద్దిగా ఊపిరి తీసుకోవడం తగ్గి 5:30 కి ఆమె చనిపోయింది. కాని ఆమె ముందు చెప్పిన సాక్ష్యం బట్టి ఆమె దేవుని చేత

క్షమించబడి, ప్రభువులో నిద్రించిందని నేను నమ్మాను. అంత్యక్రియలన్ని లాల్ మామయ్య దగ్గరుండి జరిపించారు. నాకు మామయ్య దంపతులు ఆ సమయంలో చేసిన సహాయం ఎప్పటికీ మరచిపోలేను. అమలాపురం విడిచి వెళ్తున్నపుడు చాల దుఃఖమైంది.

అయితే నేను మనస్ఫూర్తిగా నా మనసులో మా అత్తగారిని క్షమించడానికి దేవుడు క్షమాపణ గురించి నేర్పించడానికి కొన్ని పరిస్థితుల గుండా నడిపించాడు. వాటిని తర్వాత వివరిస్తాను.

బెంగుళూరుకి వచ్చాక త్వరలోనే ఇల్లు ఖాళీ చేసేసి, ఫ్యాక్టరీ క్వాటర్స్‌కి వెళ్ళి పోయాము. తర్వాత నేను హౌస్‌సర్జన్‌గా విశాఖపట్నంలో చేరాను, రూరల్ పోస్టింగ్స్ తప్పకుండా ఏకాలేజీలో చదివామో, అదే కాలేజీ హాస్పటల్‌లోనే చెయ్యాలి.నా భర్తకి బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకు రావాలని ప్రయత్నించడం మొదలు పెట్టారు. ఆయన ప్రయత్నాలు ఫలించే సరికి 4 నెలలు గడిచింది అంతలో నా రూరల్ పోస్టింగ్సు పూర్తయ్యాయి. ఒక నెల మెడిసిన్ పోస్టింగ్ కూడ హాజరయ్యాను.

ఇంతలో డాడీ పరిస్థితి మరీ విషమించింది. ఇంటికి రావడం తగ్గించేశారు. "ఆడపిల్ల పెళ్ళిళ్ళు త్వరగా చేసేస్తే బాధ్యతలు తీరిపోతాయి. సుఖంగా ఆమెతో జీవనం చేయవచ్చు" అని ఆయన ఉద్దేశం మాకు అప్పుడు బయటపడింది. ప్రీతి ఇంకా మేజర్ అవ్వలేదు. అయినా పెళ్ళి సంబంధం కుదిర్చి పెళ్ళి తేది నిర్ణయించేశారు. ప్రీతి దానికి తలవంచింది. అమ్మ కూడ ఏమి చేయలేక పోయింది. అయినా ఎవరైన ఏదైనా చెప్పినా ఆయన వినిపించుకునే స్థితిలో లేరు.

డాడీ ప్రీతి పెళ్ళి సమయానికి ఇంటికొచ్చారు కాని అన్నింటికి పరాయివ్యక్తి లాగ బయటే ఉండిపోయారు. అంటే ఆమె ఆయన్ని ఎందులోను పాలు పంచుకోనివ్వలేదు. ఎందుకో డాడీ మా చెయ్యిదాటి పోతున్నారని చాల దుఃఖపడుతూనే పెళ్ళి పనులు పూర్తి చేసాము. హౌస్ సర్జన్సీలో నా సంపాదనతో ప్రీతి పెళ్ళికి గిఫ్ట్ తీయగల్గాను. పెళ్ళి కూతుర్ని కూడ చేశాను. డాడీ చేసిన నిర్లక్ష్యానికి చిన్న వయస్సు లోనే మాకు మా బాధ్యతలు ఎక్కువయ్యాయి.

ఆ తర్వాత నా మిగతా హౌస్ సర్జన్సీ బెంగుళూరులోని ఎమ్.ఎస్. రామయ్య మెడికల్ టీచింగ్ హాస్పటల్‌లో పూర్తి చేశాను. నా సర్టిఫికెట్లు తీసుకోవడానికి విశాఖపట్టణం, తర్వాత హైదరాబాదు వెళ్ళాము. నేను డాక్టర్ అని నా సర్టిఫికెట్ అందుకున్నపుడు ఎందుకో సంతోషం కలగలేదు. చాలా మామూలుగా అనిపించింది. అప్పటికే నా ఫ్రెండ్స్ కొంత మంది పి.జి.లో జాయిన్ అయ్యారు. నాకిక పైకి చదువుకునే అవకాశం లేదు కదా అని బాధవేసింది.

నా భర్త పైకి చదువుకోవడానికి ప్రోత్సాహించ లేదు కాని ఏదైనా ప్రైవేటు హాస్పిటల్ లో, రాత్రి డ్యూటీలు పడకుండా ఉండేటట్టు, ఇంటికి దగ్గరగా వుండే హాస్పిటల్‌లో



పని చేయడానికి అనుమతించారు. నేను అలాగే జాయిన్ అయ్యాను. నేను జాయిన్ అయినపుడు నా జీతం1800 రుపాయలు. ఆ హాస్పటల్ ఓనరు డాక్టర్.పాటిల్, వారి భార్య నన్ను అభిమానంగానే చూసుకొనేవారు. అప్పటికి ఇంట్లోకి ఏమీ సామాన్లు సమకూర్చుకోలేదు. కాబట్టి ఒక్కొక్కటే సమకూర్చుకోవడం మొదలుపెట్టాము. పాపని బుచ్చు అని ముద్దుగా పిలుస్తాము. బుచ్చుని రప్పించుకొని మాతోనే అమ్మని కొన్నాళ్ళుంచుకొని, ఆతర్వాత అమ్మని కరప పంపించాము. అప్పటికి డాడీ పూర్తిగా ఇంటికి రావడం మానేశారు. పిల్లల అవసరాలు చూడడం మానేసారు.

ఫ్రూటీ కొన్నాళ్ళు బెంగుళూరు వచ్చి మాతో ఉండి మరల వస్తానని వెళ్ళాడు. అప్పటికే డాడీ కరకుదురులో ఇల్లు కట్టించి ఆమెను తెచ్చి ఆయింట్లో పెట్టి కాపురం మొదలుపెట్టారు. దానికి మా డాడీ తరపు బంధువులు అందరూ సమ్మతించారు. ఎందుకంటే ఆయనే ఆ ఊర్లో బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేసేది. ఆయనకి ఎదురు చెప్పడం ఎవరికీ అవలేదు. అమ్మకి తన వాళ్ళెవరితోనైనా కలవాలన్నా, పెళ్ళిళ్ళకి గాని, మరేదైనా పండుగలకి గాని కలవాలంటే అవమానంగా ఉండేది. "అమ్మకి క్యాన్సరు, అందుకే నేనిలా చేశాను" అని డాడీ నాతో, ఫ్రూటీతో కూడ చెప్పారు. నేను చాల దూరంలో ఉన్నాను కాబట్టి నాకు తెలిసింది చాల తక్కువ. నా తమ్ముళ్ళు బయటికి, కాలేజీకి వెళ్ళి వచ్చేటప్పుడు చాల అవమానాలుపడ్డారు. ఎంతో నిదానంగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకోవడం, ప్రవర్తించడం చేసే ఫ్రూటీలో డాడీ గురించి పొందిన అవమానాలు కోపానికి గురి చేశాయి. అది ఎంత వరకూ అంటే డాడీని, ఆమె చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. అదే సమయంలో చెయ్యని నేరానికి పోలీసులు నక్సలైట్ అని, తీవ్రవాది అని ఇంకా ఏమేమో కేసులు నమోదు చేసి ఫ్రూటీని పోలిస్ స్టేషన్‌లో ఉంచారు. ఒకవేళ ఆ సమయంలో తన పైన వారు ఆ కేసు నమోదు చెయ్యక పోయుంటే నేను నిజంగా నరహంతకుడిని అయ్యుండేవాడిని అని ఇపుడు ఫ్రూటీ అంటాడు. అమ్మకి ఇది ఇంకా ఎంతో దుఃఖాన్ని కలిగించిన విషయం. డాడీ ఏవిధంగాను కుటుంబానికి ఆసరాగ ఉండకపోవడం ఆమెని చాల కృంగదీశాయి. తాను, ఇంటిల్లి పాదీ పిల్లలందరూ చనిపోవాలని ఆమె ఎన్నో సార్లు ప్రయత్నించింది. కాని దేవుడు ఘోరం జరగకుండా ఆపాడు. ఫ్రూటీని బెయిల్ మీద విడుదల చేశారు. కొన్నాళ్ళకి ఆ కేసుని కొట్టేసారు. ఫ్రూటీ నిర్దోషి అని తేల్చారు. ఇంత జరిగాక కూడా నాకీసంగతులు తెలియనివ్వలేదు ఎందుకంటే నేను పాపతో చాల సతమతమౌతూ ఉన్నాను. బుచ్చు బెంగుళూరు వచ్చినప్పటి నుండి అమ్మమీద బెంగపెట్టుకుని శారీరకంగా, మానసికంగా కూడ నలిగిపోయింది. నేను పనికి వెళ్ళడం, సెలవులు పెట్టడానికి వీలు కాకపోవడం, పాప ప్రతీరోజు ఏదో ఒక అనారోగ్యం పాలవ్వడం నన్ను మానసికంగా కృంగదీశాయి. పాప మానసికంగా అమ్మపై బెంగపెట్టుకుని నత్తిగా మాట్లాడడం మెదలుపెట్టింది. ఇది

చాల దుఃఖాన్ని కలిగించింది నాకు. 3 సార్లు న్యుమోనియా అయి చాలా సీరియస్ అయి హాస్పిటల్ లో అడ్మిట్ చేయడం జరిగింది. అదీ ఒక్క సంవత్సరంలోనే డాక్టర్లకి టి.బి.జబ్బు ఉండొచ్చని, బ్లడ్ క్యాన్సర్ ఉండొచ్చని చాల అనుమానాలు కలిగి అన్ని రకాల పరీక్షలు చేశారు. బుచ్చుకి ఎలాంటి జబ్బు ఉండకూడదని మళ్ళీ ముందులాగే వారానికి 2 సార్లు ఉపవాసం ఉంటూ ప్రార్థించేదాన్ని.

ఇక్కడ మేము హాజరయ్యే తెలుగు చర్చి పాస్టర్ రెవ॥వందనంగారు, వారి సతీమణీ మాకు ఆదరణగా నిలిచారు. పాప విషయమై చాలా ప్రార్థించారు. నా మానసిక ఒత్తిడి అంతా తెలుసుకుని, ప్రార్థన చేస్తూ నాకు ఆసరానిచ్చారు. మరలా నేను బెంగుళూరు లో పాటలు పాడడానికి కారణం పాస్టర్ వందనంగారే. ఆయన మీటింగులకి ఎక్కడికి వెళ్ళినా నా చేత ప్రత్యేకంగా పాటలు పాడించేవారు. పాటలు పాడడం దేవుని కొరకు నిరాటంకముగా జరగాలని నేను చేసుకున్న సమర్పణకు ప్రోత్సాహం ఇచ్చినది పాస్టరు గారు. నేను పాడుతున్నపుడు దేవుని సన్నిధిని ఆయన అనుభవించారు. ఆంధ్రాలో పలుచోట సువార్త కూడికల్లో ఆయనతో వెళ్ళినపుడు పాటల ద్వారా, స్త్రీల పరిచర్య ద్వారా దేవుడు నన్ను సేవలో వాడుకున్నాడు.

నాకు ఇక్కడి సంగతులు, అక్కడ కుటుంబంలో జరిగే సంగతులు నన్ను కృంగదీస్తుంటే అలాగే ఇక్కడ పాప ఆరోగ్యం గురించి అమ్మకూడా ఇంకా కృంగిపోయింది. మేము కరప వెళ్ళిన ప్రతీసారీ డాడీని కలవాలని ప్రయత్నించి కొన్ని సార్లు భంగపడేవాళ్ళం. ఎందుకంటే కొన్ని సార్లు ఆమె ప్రోద్భలంవల్ల డాడీ మమ్మల్ని కలవడానికి ఇష్టపడేవారు కారు. డాడీ అందర్ని ప్రేమిస్తున్నారని తలంచేదాన్ని. కాని ఒక్కొక్కరికి ఒక్కోలాగ ప్రవర్తించేవారు. అమ్మనైతే శత్రువే అన్నట్టు ప్రవర్తించేవారు. మేము కరకుదురు ఆయన్ని చూడడానికి వెళ్తే ఏదో ఒక గొడవ పెట్టుకుని ఆమె డాడీకి మనశ్శాంతి లేకుండా చేసేదట. డాడీ అంతలో ఉద్యోగంలో మంచి స్థాయికి ఎదిగారు. జిల్లా స్థాయిలో కూడా డి.ఎమ్&హెచ్.ఒ.గా కాకినాడలో, తర్వాత శ్రీకాకుళంలో పనిచేశారు. అవినీతి, లంచగొండితనం విషయంలో ఆయన పై ఆరోపణలు వచ్చినపుడు మా డాడీకి ఇలాంటి చెడ్డ పేరు కలిగిందని బాధతో, ఆయన విడుదల పొందాలని అందరం ప్రార్థన చేసే వాళ్ళం. బున్ని, ఫ్రూటీలు వాళ్ళ కాళ్ళపై వాళ్ళు నిలబడాలని కొన్ని వ్యాపారాలు చేసి నష్టపోయారు. కొద్దిగా వారికి, వారి అవసరాలకి సహాయం చెయ్యడం తప్ప నేనేమీ వాళ్ళకి ఎక్కువగా చెయ్యలేకపోయాను.

ఇంతలో బుచ్చు ఒంటరితనముతో బాధపడుతూందని, దాన్ని పోగొట్టడానికి తనకి తోడు అవసరమని గమనించాము. మేము బుచ్చు ఆరోగ్యం విషయంలో పడిన బాధతో రెండవ బిడ్డతోనూ అదేవిధంగా బాధపడవలసి వస్తుందేమో అని రెండవది వద్దనుకున్నాము. కాని బుచ్చు మానసిక స్థితి అర్థమయ్యాక ఆ విషయం ప్రార్థించడం



మొదలుపెట్టాను.

అప్పటికి ప్రీతికి కూడ ఒక పాప పుట్టింది. అక్కకి అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు. నేను ఇంట్లో మొదటి ఆడపిల్లని కన్నానని, అందుకే అందరికి ఆడపిల్లలు పుట్టారని, మళ్ళీ చెల్లక్కే మగపిల్లాడిని కనాలని ప్రీతీ అన్నదట. అమ్మకి కూడా మనుమడు కావాలని, ప్రార్థనలో ఆ విషయం పెట్టానని అంది. నేను కూడా పట్టుదలతో దేవుడు నాకు 2వ బిడ్డనివ్వడం ఆయన చిత్తమైతే నాకు కుమారుడినే ఇవ్వమని ' హన్నా' ప్రార్థించినట్టు, వానికి "సమూయేలు" అనే పేరు పెడతామని, వాడు దేవుని సేవకుడుగా ఉంటాడని ప్రార్థించాను. అలా ప్రార్థించడం ప్రారంభించిన మరుసటి నెలలోనే బాబు కడుపున పడ్డాడు. అది 1996 వ సంవత్సరం.

మొదట్లో నేను నా పనికి క్రమం తప్పకుండా వెళ్ళాను కాని 3వ నెల ఇంకారాక ముందే సాతాను చాల గలిబిలి సృష్టించాడు. గర్భంలో పెరుగుతున్న పిండము పై సాతాను కన్ను పడింది. అది అబార్షన్ అయ్యేలాగ గలిబిలి సృష్టించాడు. ఒక దేవుని సేవకుడు ప్రార్థనలకు ఫలితంగా పుట్టాడానికి ముందే ప్రతిష్టించబడితే, ఆ సేవకుడు పుట్టాకుండా చేయడానికి వాడు ఎన్నైనా ప్రయత్నాలు చేస్తాడు. అలాగే చేశాడు. కాని ఎడతెగని ప్రార్థనలతో పాస్టర్ వందనంగారు, వారి సతీమణి గార్ల ఆతిథ్యంతో, 9 నెలలు గడిచింది.

8వ నెలలో ప్రపంచ ప్రఖ్యాత సువార్త గాయకుడు రాన్‌కెనోలీ గారు బెంగుళూరు వచ్చారు. ఆయన ఆరాధించే పద్ధతి, అభిషేకంతో కూడిన ఆయన ఆరాధన క్రమం చూసి మాకు పుట్టబోయే బిడ్డకి 'రాన్‌సామ్యూల్' అనే పేరు నిర్ణయించేసాము. 8వ నెలలో అమ్మ నా దగ్గరకి వచ్చింది. బి.పి కొంచెం పెరిగి కొంత గలిబిలి అయింది. కాని దేవుడు కాపాడాడు. కాంప్లికేషన్లు రాకుండా చేశాడు.

9 నెల పూర్తవుతూ ఉండగా నా భర్తకి ఉద్యోగం పనిమీద ఢిల్లీ వెళ్ళ వలసి వచ్చింది. డెలివరీ సమయానికి వచ్చేస్తానని వెళ్ళారు. ఆయన వచ్చే సమయానికి ముందే రెండు రోజులుగా నొప్పులు వస్తున్నా పెరగలేదు. శనివారం రాత్రికి ఆయన వచ్చారు. తెల్లవారుతూండగా నొప్పులు పెరిగాయి. ఆదివారం 8 గం॥లకు హాస్పిటల్ కి వెళ్ళాము. కాన్పు కష్టమైంది 10:28 నిమిషాలకి ప్రసవమైంది. అది 1997 ఏప్రియల్ 13వ తారీఖు. పుట్టినపుడు వెంటనే బాబు 2 నిమిషాలు ఏడవలేదు, చాల నీలంగా అయిపోయాడు. ఎందుకంటే మెడ చుట్టూ మూడు, ఒక భుజానికి ఒకటి అంబిలికల్ కార్డ్ మెలికలు వేసుకుని పుట్టాడు. తర్వాత ఆక్సిజన్ ఇస్తూ, రిససిటేషన్ చేసిన తర్వాత తేరుకున్నాడు. పుట్టిన 21 వ రోజున ఆదివారం చర్చిలో అమ్మ సమక్షంలో వానికి 'రాన్ సామ్యూల్' అనే పేరు పెట్టి దేవునికి ప్రతిష్టించాము.

బాబుని తీసుకుని కరప వెళ్ళాము దసరా సెలవులకి. డాడీకి బాబుని చూపించాలనే

ఉద్దేశంతో కరకుదురు అందరం వెళ్ళాం. అక్కడ బాబుని ఎత్తుకోవడానికి డాడీ ఆమెకి ఇవ్వమని, మోని ఇవ్వనని తీసుకొనే సరికి అక్కడ చాల గొడవ జరిగింది. బాధతో తిరిగి వచ్చేశాము. అమ్మ మాత్రం కరపలోనే ఉండింది. సంగతి తెలిసి బాధపడింది.

బాబుని ముద్దుగా రాన్ బాబు, రోని అని పిలుస్తాము. వాని జీవితంలో కూడ ఎన్నో మేళ్ళు దేవుడు చేశాడు. ఇంట్లో సహాయకారిగా ఉండడానికి ఒక కుర్రాడిని కరప నుండి తీసుకుని వచ్చాము. అప్పటికి మాకు ఒక అంబాసిడర్ కారుని దేవుడిచ్చాడు. ఒక రోజు నేను క్లినిక్‌కి వెళ్ళినపుడు, నా భర్త కూడ లేని సమయంలో ఆ కుర్రాడికి కారు నేర్చుకోవాలి, నడపాలి అని ఆశ కలిగింది. కాని అది బాబుని చంపడానికి సాతాను వేసిన పన్నాగం. వాడు బాబుని కార్లో ప్రక్కన పడుకోబెట్టుకుని, కారు బయటికి తీసివేసి చాల స్పీడుగా నడిపించి ఒక ఫ్యాక్టరీ క్వార్టర్ కున్న కాంపౌండు వాల్ ని గట్టిగా ఢీకొట్టాడు. బాబు ఆ దెబ్బకి క్రింద పడి ఏడుస్తున్న శబ్దానికి అందరూ అక్కడికి వచ్చి వాన్ని బయటికి లాగి, బాబుని ఎత్తుకుని ఇంటికి పంపించారు. అప్పటికి బాబుకి 6వ నెల వచ్చింది. నష్టం 30,000రూ॥ లవరకు జరిగింది. మేము ఆ దెబ్బకు మానసికంగా తేరుకోవడానికి చాల సమయమే పట్టింది. ఆ కుర్రాడికి ఏమీ దెబ్బలు తగల్లేదు, బాబుకి కూడా ఏమీ తగల్లేదు. దేవుని అద్భుతమైన కాపుదల అపుడు అనుభవించాము. పాస్టరు గారు మమ్మల్ని చాల సముదాయించారు.

అయితే డాడీ, ఆమె మళ్ళీ పిల్లల్ని కనడానికి చెయ్యని ప్రయత్నం అంటూ లేదు,చాల ఖర్చుపెడుతున్నారు అని తెలిసింది. మనుమలు,మనమరాళ్ళతో ఆడుకోవలసిన సమయంలో ఇదేమిటీ అని ఇవన్ని తెలిసినా ప్రార్థించడం తప్ప మేమింకేమీ చెయ్యలేకపోయాము.

డాడీకి శ్రీకాకుళం ట్రాన్సఫర్ అయింది.అక్కడికి వారెళ్ళిపోయారు. ఆమె "నేనే" డాక్టర్ గారికి భార్యని అని చాల ఎక్కువగా కనుపరచుకున్నది.చాల మంది నమ్మారు. డాడీ కుటుంబ సభ్యులు ఆయన ఇచ్చే డబ్బు సహాయం కొరకు ఆయనకే వత్తాసు పలికారు.

మోని (ఆఖరు చెల్లి) కి పెళ్ళి చెయ్యాలని అందరం తలంచాము. అబ్బాయిని చూసి పెళ్ళి తేదీ ఈసారి డాడీ లేకుండానే నిర్ణయించారు. బున్ని, ఫ్రూటీ, అమ్మ అన్ని పనులు చూసుకున్నారు. నేను కూడ చేతనయినంత సహాయం చేసాను. పెళ్ళి నిర్ణయమైనదని డాడీకి చెప్పి రమ్మని బ్రతిమాలితే "నాకాలు బాగోలేదు ప్రయాణం చెయ్యలేను, ఎవరైనా తోడుంటే తప్ప" అని అన్నారట. నా భర్తగారే శ్రీకాకుళం ప్రయాణమై వెళ్ళారు. చాల బ్రతిమాలి "దగ్గరుండి తీసుకెళ్తానని" చెప్పినా ఆయన రాలేదు. డాడీ లేరని దుఃఖం మమ్మల్ని ఆవరించింది. ఇంచుమించు ఆ రోజంతా నేను ఏడుస్తూనే ఉన్నాను డాడీ మోని పెళ్ళికి రాలేదని. తర్వాత మళ్ళీ మామూలు పనుల్లో పడిపోయాము.



అయితే ఎంత మంచి దైవజనుడ్ని లొంగదీసుకొని సాతాను ఎంత భయంకరంగా మాట్లాడో, దానికి తోడైన డాడీ అవిధేయత, మొండితనం చూస్తే "ఈయన ఎన్నటికి మారరు, ఇక డాడీ మన డాడీ కారు, ఆయన దుష్టుని చేతిలోనే మరణించి నరకానికి పోతారేమో! అని ఎంతో భయం ఆవరించేది కాని అలా జరగకూడదనే మా కన్నీటి ప్రార్థనలు రోజు దైవసన్నిధికి వెళ్ళేవి.

బుచ్చు రాన్ బాబు పుట్టాక చాలా తేరుకుంది ఒంటరి తనం లేకుండా ఇంట్లోనే ఆడుకోటానికి బొమ్మ ఉన్నట్టు రాన్‌ని బాగా ఆడించేది, ఎత్తుకోనేది, చిన్న వయసు నుండే వాని విషయంలో చాలా బాధ్యతగా ప్రవర్తించేది, చాలా జాగ్రత్తగా కాపాడుకొనేది. మొదటి బిడ్డ నాకు పాప అయినందుకు నాకు చాలా ఆనందం అనిపించేది. చదువులో కూడా చురుకుగా ఉంటుంది.

రాన్ బాబుకి ఒక సంవత్సరం నిండేటప్పటికి నాకు ఆరోగ్యం కొంత కుంటు పడింది. అది చిన్న ఆపరేషన్‌తో సరైపోయింది.

నేను పనిచేసేది చిన్న 25పడకల ఆసుపత్రి అన్ని విధాల పేషెంట్లని చూసి చాలా అనుభవం వచ్చింది. అక్కడికి వచ్చే పెద్ద పెద్ద స్పెషలిస్టులు, కన్సల్టెంట్లు, పేషంట్‌ని చూసి, ట్రీట్ చేసే విధానంలోని నా అనుభవం అంతా కనిపెట్టి మా ఓనర్‌తో 'మీకు మంచి డాక్టరు దొరికారు, అదృష్టవంతులు, మీకు ఆవిడ ఉన్నందుకు నిశ్చింతగా ఉండవచ్చు' అని అనేవారు. క్లినికల్‌గా దేవుడు నాకిచ్చిన పరిజ్ఞానం చూస్తే నాకే ఆశ్చర్యం వేసేది. పెద్ద పెద్ద డాక్టర్లు, స్పెషలిస్టులు కూడ దయాగ్నోసిస్ మిస్ అయ్యేవారు. అన్ని రిపోర్టులు ఉన్నా మేజర్ ప్రోబ్లమ్ కనుక్కోలేకపోయేవారు. నాకు దేవుడు ఎలాంటి జ్ఞానం ఇచ్చాడంటే పేషంట్‌ని పరీక్ష చేయడం, ఇంకా ఏ పరీక్షలు చెయ్యకముందే పెద్ద జబ్బుల్ని సైతం డయాగ్నోసిస్ చేసేదాన్ని. పేషెంట్ అటెండర్లతో మాట్లాడే విధానంలో, వారికి అంతా వివరించి చెప్పడంలో నైపుణ్యత దేవుడిచ్చాడు. వేరే వేరే హాస్పటల్ వారు కూడ నన్ను ఇక్కడ విడచి తమ వద్దకు వచ్చేయ్యమనే వారు. మా ఓనరు డాక్టరు, వారి సతీమణి నన్ను చాల ఆప్యాయంగా చూసుకొనేవారు. పిల్లల్ని కూడా బాగ చూశారు. అందుకే నేను అక్కడ అన్ని సంవత్సరాలు పని చేయగల్గాను.

## బిడ్డల పట్ల దేవుని కాపుదల

రాన్ బాబు $1\ ^1/_2$ సం॥ల వయస్సుకి వచ్చాడు. బాగా ఆరోగ్యంగా ఉండి చాల చురుకుగా ఉండేవాడు. విసిగించకుండా మంచిగా ఆడుకొనే వాడు. వాడికి కొద్ది రోజులుగా టాయిలెట్‌కి వెళ్ళినపుడు కొద్దిగా చీము, రక్తము పడుతూ ఉండేది. పదేపదే వెళ్తుండేది చూసి ఇన్‌ఫెక్షన్ అని ఒక కోర్సు యాంటిబయోటిక్స్ ఇచ్చాను. కొద్ది రోజులు తగ్గి మళ్ళీ మొదలైంది. తర్వాత అది మందులతో తగ్గలేదు. వాడిని కడుగుతూ వుండగా ఒకరోజు మలద్వారం దగ్గర చిన్న గోలి కాయంత గడ్డ కనిపించింది. అది చూచి ఇదేదో పెద్ద

సమస్య చేసేటట్టు ఉందని మరల టెన్షన్ అయిపోయాను. మరుసటి రోజు మా సర్జన్‌తో మాట్లాడాను. ఆయన మణిపాల్ హాస్పిటల్ లోని ఒక పిడియాట్రిక్ సర్జన్ వద్దకి పంపారు. నేను రాన్‌ని హాస్పటల్‌కి తీసుకువెళ్ళడానికి కూడా ఆ రోజు చేతిలో పైసలు చాలినంత ఉండలేదు. అయినా ఆలస్యం చేయకుండా స్నేహితుల దగ్గర డబ్బు తీసుకుని మణిపాల్ హాస్పటల్‌కి తీసుకెళ్ళాను. ఆ డాక్టరు గారు పరీక్ష చేసి దాని గురించి సరైన విధంగా ఆలోచనచెప్పి కొలోనోస్కోపిక్ రిమూవల్ చేయవచ్చని చెప్పారు. తర్వాత ఎమ్.ఎస్. రామయ్య హాస్పిటల్ లో గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ నాకు మంచి స్నేహితులు డాక్టర్. సత్యప్రకాష్ గారి ద్వారా ఆ ప్రోసిజర్ చేయించాను. ఎంతో టెన్షన్‌గా అయిపోయిన నాకు మరల దేవుడు చాల సులువుగా ఆ ఆపరేషన్‌లో సహాయం చేసి, మళ్ళీ రాన్ 2 రోజుల్లో నార్మల్‌కి వచ్చేటట్టు చేశాడు.

రాన్ బాబుకి 3 సంవత్సరాలు వచ్చే వరకు బేబి సిట్టింగ్‌లో వదిలి, బుచ్చును స్కూల్లో వదిలి నేను డ్యూటీకి వెళ్ళేదాన్ని. రాన్‌కి 3సం॥లు పూర్తయ్యాక మాంటిస్సోరీలో వేశాను. మేము ముగ్గురం ఒకరోజు బయల్దేరి ఇంకా బస్‌స్టాప్‌కి వస్తూండగా ముగ్గురు చాల వడిగా నడుపుతూ స్కూటర్ మీద దూసుకొచ్చేశారు. స్పీడును వాళ్ళు కంట్రోల్ చెయ్యలేకపోయారు. నేను రాన్‌ని కాపాడగలిగాను, నేను తప్పుకున్నాను కాని వాళ్ళు బుచ్చును చాల బలంగా గుద్ది, రోడ్డు మీద ఒక 15 మీటర్లు ఈడ్చుకొని వెళ్ళిపోయారు. నాకు గుండె నీరైపోయింది. బుచ్చుకి ఎన్నో ఫ్రాక్చర్లు అయిపోయుంటాయని చాలా టెన్షన్ అయి నాకు నోట మాట రాలేదు. రాన్ అయితే తేరుకొని చాల కోపంతో వారిని అరిచాడు వచ్చీరాని మాటల్లో. అక్కని వాళ్ళు గుద్దేశారన్న టెన్షన్‌లో వాడు పాస్ కూడ పోసేసుకున్నాడు. అక్కంటే వాడికి ఎంత ప్రేమో నాకు అర్థమైంది. బుచ్చును మెల్లగా ఎత్తి చూస్తే ఎక్కడా కూడా ఒక దెబ్బకూడ లేదు. చాలా సులువుగా లేచి నడిచింది. దేవుని కాపుదల ఎంత గొప్పదో మరొక సారి ఋజువు చేసాడు. మనం బయటికి ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు "దేవా మాతో మీరు రండి " అని చేసే చిన్న ప్రార్థన అందులోను చిన్న పిల్లల ప్రార్థన ఎంత శక్తివంతమైనదో అర్థమైంది. దేవుని అదృశ్యహస్త కాపుదల అనుభవించాము. అదే రోజు హాస్పిటల్‌లో ఒక 18సం॥ల అమ్మాయి మధ్యాహ్నం అడ్మిట్ అయింది. ఆమెను రోడ్డు దాటుతూవుండగా స్కూటర్ గుద్దిందట. ఆమెకి పెల్విక్‌బోన్‌లో 6 చోట్ల ఫ్రాక్చర్లు అయ్యాయి. బుచ్చుకి, ఆమెకి ఎంత తేడా? అదే దేవుని కాపుదల.

బుచ్చుకి 8సం॥ల వయస్సులో కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. ఒకరోజు అది అపెండిసైటిస్‌గా గమనించి యాంటీబయోటిక్స్ ఇవ్వడం ప్రారంభించాను. అపుడు మార్చి నెల తనకి ఆఖరి పరీక్షలు జరిగే సమయం. నొప్పి 4 రోజులు తగ్గింది, 5వ రోజున అకస్మాత్తుగా నొప్పితో విలవిలలాడుతూ, వంగిపోతూ నడిచి, కొంతసేపయ్యాక స్పృహ తప్పి పడిపోయి, పాలిపోయినట్టయింది. అప్పటికి రాత్రి 8గం॥ అయింది. నేను



వెంటనే హాస్పిటల్ తీసుకెళ్ళి సర్జన్ కి చూపించి ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేశాను. ఆపరేషన్ జరిగినంతసేపు చాల బేలగా, భయంగా అయిపోయాను, నాభర్తగారికి ఆపరేషన్ పూర్తయాక సంగతి తెలిసిందే. ఆపరేషన్ అంతా మంచిగా జరిగింది, మరుసటి రోజే బాగా నడిచింది. బాగా కోలుకున్నది. ఈ విధంగా ఎన్నో విషమ పరిస్థితుల గుండా వెళ్ళవలసి వచ్చినా దేవుడు పిల్లలను విడిచిపెట్టలేదు.

డాడీ రిటైర్ అయ్యారు. ఆయన రిటైర్ అయ్యేటప్పటికి ఆయన జాయింట్ డైరెక్టరుగా ప్రమోషన్ పొంది, హైదరాబాద్ లోనే ఉద్యోగం చేస్తూ ఉన్నారు. ఆయన అంత ఎత్తుకు ఎదిగారని సంతోషం మాకు ఉన్నా మాతో లేరని మాకు దుఃఖం ఎక్కువ అవుతూ వచ్చింది. ఆయన కరకుదురులో ఉన్నప్పుడు పిల్లలందరం కలసి 'ఇలా ఎంతకాలం?' అని అడిగాము. దానికి ఏ మాత్రం సరైన సమాధానం చెప్పలేదు. కాని "సమయం వస్తుంది, అంతా సరిగ్గా సెటిల్ చేస్తాను, జూలై 5వ తారీఖుకి రండి, దేవుడు విడుదల ఇస్తున్నాడు" అన్నారు.

ఆ మాట విని వేమందరం 'ఆయన ఆమెని విడిచిపెట్టడానికి ఇష్టపడుతున్నట్టున్నారు, మరల మనం ఆయనతో కలసి సంతోషంగా గడిపే రోజులు వస్తున్నాయని" అనుకున్నాం. అనుకున్నట్టుగానే జూలై 5వ తారీఖున కరకుదురులో కలిశాము.ఆ రోజు ఆయన రిటైర్ అయ్యాక కృతజ్ఞతాకూటం లాగ చర్చిలో మీటింగ్ పెట్టారు. దానికి పెద్ద మామయ్య జాన్ జె.కొమానపల్లి గారు కూడ వచ్చారు. కాని మేమనుకున్నట్టు డాడీ మాతో మనసు విప్పి మాట్లాడలేదు. పరాయి వాళ్ళని చూసినట్టు చూశారు. మేమందరం రాత్రికి బయలుదేరి వచ్చేసాం.

బున్ని ఈ లోపల స్కూల్ ప్రారంభించాడు. దానికి కావలసిన సలహాలు, సహాయం కొంత డాడీనే బున్నికి ఇచ్చారు. బున్ని స్కూల్ కోసం చాల కష్టపడి, దాన్ని ఒక మంచి రూపానికి తెచ్చాడు. దానికి బస్సులు కూడా కొన్నాడు. డాడీ కొద్దికొద్దిగా మారుతున్నట్టు ఒక్కోసారి సంతోష పడినా, వెంటనే మరల ఆయనలో చాల మార్పు కనబడేది. పిల్లన్ని ఎవరో అన్నట్టు చూసేవారు.

ఈ విషయమై ఎపుడూ నేనిక్కడ పంచుకోవడానికి నాకు ఆత్మీయంగా దేవుడు పాస్టర్ గారిని, పాస్టరమ్మ గారిని, ఆత్మీయ తల్లి దండ్రులు గా ఇచ్చాడు.వారు నాకు చాల ధైర్యం చెప్పి, ప్రోత్సహించే వారు. నేను వారికి అనారోగ్యం కలిగినపుడు డాక్టరులాగే కాకుండా, కుమార్తె లాగ వారికి పరిచర్య చేశాను. ముఖ్యంగా పాస్టరుగారికి లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్ అయి పలుమార్లు హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. అలా అయినన్ని సార్లు ఆయనకి ప్రత్యేకమైన ఆహారం ఇయ్యవలసి వచ్చేది. నేను డ్యూటీ ముగించి, పాస్టరు గారి దగ్గరకి వెళ్ళి వంట పూర్తి చేసి భోజనానికి ఇచ్చి, ఇంజెక్షన్లు ఇచ్చి, తర్వాత ఇంటికి వచ్చేదాన్ని. దీని వెనుక నాకున్న ఒకే ఒక్క ఆలోచన ఏమిటంటే

" దైవజనులకి పరిచర్య చేయడం ఆశీర్వాదం" అని మాత్రమే. దానికి కొందరు అపార్థాలు చేసుకుని నన్ను మానసికంగా విసిగించారు. చివరిసారిగా పాస్టర్‌గారు జూలై మాసంలో ఆరోగ్యం క్షీణించి మల్య హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. ఆయన కోసం హాస్పిటల్‌లో కాచుకుని కూర్చోవడం, డాక్టర్లతో మాట్లాడడం, ఆయన రక్తపు వాంతులు చేసుకొని ఇంకా ఆరోగ్యం క్షీణించి సి.సి.యు కి మార్చడం అక్కడ 28 వ తారీఖున ప్రభువుతో నిద్రించడం ఇవన్ని నాకు కళ్ళకు కట్టినట్లు ఉంటుంది. నేను పాష్టరుగారి నుండి దేనిని ఆశించలేదు గాని, ఆయనకి పరిచర్య చేయడం వల్ల దేవుని నుండి ఆశీర్వాదాన్ని కోరుకున్నాను. నాకొకవేళ దేవుడు ఆ ఆశీర్వాదం ఇప్పుడు ఇవ్వకపోయినా, నా పిల్లలకైనా ఆ ఆశీర్వాదం దక్కుతుందని ఆశించి పరిచర్య చేశాను. ఇది నూటికి నూరుపాళ్ళ నిజం. పాష్టర్‌గారి మెమోరియల్ మీటింగుకు ఆయన గురించి రెండు పాటలు వ్రాసి, ఒకటి క్వయిర్ పాడితే, మరొకటి నేను పాడాను. నేను మొదటిగా వ్రాసి, ట్యూన్ చేసిన పాట " ధన్యమూ నీ జీవితం "

జూలై 2001 సం॥లో నిజంగానే కొంత మార్పు మేము డాడీలో చూడగలిగాము. జూలై 1వ తారీఖు బున్ని ఫోన్ చేశాడు. "అమ్మకి చాల కడుపు నొప్పి వచ్చి విలవిలలాడిపోయి రాత్రంతా నిద్రపోలేదు " అని చెప్పాడు. నేను నొప్పి వివరాలు కనుక్కొని, అపెండిసైటిస్‌గా గుర్తించి, మందులు ఏమేమి ఇవ్వాలో చెప్పి ఆపరేషన్ కి బెంగుళూరు పంపమని చెప్పాను. అనుకున్నట్టుగానే అమ్మ 3వ తారీఖు బయలుదేరి 4వ తేదీకి ఇక్కడికి వచ్చింది. సర్జన్ కి చూపించి అమ్మ ఆపరేషన్‌కి అన్ని ఏర్పాట్లు చేశాను. 4 వ తేదీన ఈ విషయం డాడీకి బున్ని ఫోన్‌లో చెప్పాడట. డాడీ వెంటనే బయలుదేరి వచ్చేసారు. బెంగుళూరుకి అమ్మకి 6వ తారీఖు ఉదయం ఆపరేషన్ చేశాను. డాడీ దగ్గరుండి అమ్మని థియేటర్‌కి పంపడం, తర్వాత 2 రోజులు ఇక్కడే ఉండడం మాకు నమ్మలేని నిజం. అమ్మతో అంతకు ముందు మనసు విప్పి మాట్లాడని ఆయన ఈసారి కొన్ని విషయాలు మాట్లాడారట. అమ్మ అల్ప సంతోషి. అంత దానికే చాల సంతోషపడింది. మేము కూడ దేవుడు మా ప్రార్థనలకి జవాబిచ్చాడు, డాడీ చెప్పిన జూలై 5వ తారీఖు ఈ సారే అని నమ్మాము. దేవుడు విడుదల ఇచ్చాడని ఆశించాము. కాని డాడీ" నేను హైదరాబాదు వెళ్ళాలి, వెనకాల ఆమె తరుముకొని వస్తుంది, నేను తప్పించుకోవాలి" అని టికెట్ చేయించుకుని హైదరాబాదు వెళ్ళారు. ఆయన చెప్పినట్టుగానే ఆమె మరుసటి రోజే బయలుదేరి బెంగుళూరు వచ్చింది. అమ్మని డిశ్చార్జ్ చేయించుకొని ఇంటికి తీసుకువచ్చేసాను. ఆమె డాడీ ఇంట్లో ఉన్నారేమోనని చాల దర్జాగా, తలుపు తోసుకొని పొద్దున్నే లోపలికొచ్చి అన్ని గదులూ వెతికేసింది. తర్వాత "మీ మీద పోలీసు కేసు పెడుతున్నాను" అని బెదిరించింది. "ఏమైనా చేసుకో" అని చెప్పాను. "ఎక్కడికి వెళ్ళారు, ఎక్కడున్నారు చెప్పండి?" అని ఆరాతీసింది. 'ఆయన్ని మీకు దక్కనీయను' అని



చాల అరచి బయటకి పోయింది. అది క్వార్టర్స్ ఏరియా. అక్కడంతా కుటుంబ పరువు అంతా బయట పెట్టి రాత్రి 11:30గం॥లకు ఆమెవెళ్లిపోయింది.డాడీ హైదరాబాదే వెళ్ళి ఉంటారని ఆమె ఊహించి హైదరాబాదుకు వెళ్ళిందట. డాడీ హైదరాబాదు నుండి ప్రీతి దగ్గరకి విశాఖపట్టణం వెళ్ళారు. ఈమె డాడీ హైదరాబాదులో లేరని తెలిసి విశాఖపట్టణం బయలుదేరి వెళ్ళింది. అక్కడ డాడీ ఆమెకి దొరికి పోయారు. ఆమె డాడీని ఈడ్చుకొనే, అందరిలో అవమానపరచి తనమనుష్యులతో తీసుకొని వెళ్ళిపోయింది.

కొన్నిరోజుల వరకు మాకు డాడీ ఆచూకీ తెలియలేదు. ఒక వారానికి డాడీని కరకుదురులోనే గృహనిర్బంధంలో ఉంచిందని తెలిసింది. మేము ఈసారి ఇలా జరిగిందేమిటని ప్రార్థన చేసాము. అయితే డాడీ మనసు పూర్తిగా మారిందని, ఆయన జరిగిన దానికి పశ్చాత్తాపడుతున్నారని, విడిపింపబడడానికి ఇష్టపడుతున్నారని మాకు స్పష్టంగా అర్థమైంది. ఆయన ప్రార్థనా జీవితంలో మరల పుంజుకొని, బలపడినట్టుగా కూడ గ్రహించాం. డాడీ చాల చిక్కిపోయి, సన్నబడిపోయారు, దానికి కారణం ఇంచు మించు రోజూ ఉపవాస ప్రార్థనలే అని తెలిసింది.

మేమందరం ప్రార్థించాము. అమ్మ ఆపరేషన్ బలహీనత కన్నా మరేదైనా గొప్ప కారణం ఉంటేనే తప్ప ఆయన మళ్ళీ బయటికి రాలేరని అనిపించింది.

అమ్మ తేరుకుంది. అదేసమయానికి నాకు కొద్దిరోజులు రక్తహీనత ఉందని గ్రహించి రక్తపెరుగుదలకి నేను మాత్రలు తీసుకుంటూ ఉన్నాను. స్కానింగ్, రక్త పరీక్షలు చేయించాను. నాకు కడుపులో పైభాగంలో కొద్దిగా నొప్పి, అనసుకూలత ఉండేది. అల్సరు నొప్పి ఉండవచ్చనని దానికి కూడ మాత్రలు తీసుకుంటూ ఉన్నాను. అయినా నా పరిచర్యలో ఏ మాత్రం కుంటపడలేదు. అదే సంవత్సరం గుజరాత్ లో భూకంపం కలిగింది. దానికి ఫిబ్రవరి నెలలో వెళ్ళి వచ్చాను. అక్కడ కొద్దిరోజులు పరిచర్య చేసే అవకాశం దేవుడు నాకిచ్చినందుకు దేవునికి వందనాలు. నాహాస్పిటల్ పనిలో కూడా ఏమాత్రం అలసట అనేది లేకుండా చక్కగా అందరికీ ప్రీతిపాత్రంగా ఉన్నాను. జులై 28 వ తారీఖు 2001 సం॥ము పాష్టర్ వందనంగారి మొదటి డెత్‌యానివర్సరీ జరిగింది. దానికి అమ్మ కూడ ఇక్కడే ఉంది. ఆ సాయంకాలం మీటింగ్ జరిగాక రాత్రి భోజనంలో బిర్యానీ పెట్టారు. మామూలుగానే తిన్నాను. రాత్రి ఇంటికి వెళ్ళి రక్తహీనత కొరకైన మాత్రలు వేసుకొని పడుకున్నాను. తెల్లవారి నాకు చాలా బాగోకుండ అయి, రాత్రి తిన్నది అరగక వాంతి రూపంలో బయటికి కొచ్చింది. అది ఎర్రగా అన్నంతో కలిసి వచ్చింది. కాని నేను రక్తమని అనుకోలేదు ఎందుకంటే రాత్రి తీసుకున్న మాత్రల రంగు అలా వచ్చి ఉండవచ్చుననుకొన్నాను. అయితే ఎసిడిటీకి తీసుకునే మాత్రలు తీసుకుంటూనే వున్నాను. ఆ రోజే అమ్మ మరల కరప వెళ్ళింది. ఈ సంగతి అమ్మకి కూడ చెప్పలేదు. అయితే అది రక్తపువాంతేనని ఖచ్చితంగా ఒక సంవత్సరానికి తెల్సింది.

డాడీని పూర్తిగా గృహనిర్బంధంలో ఉంచి, ఇద్దరు వ్యక్తుల్ని ఆమె కాపలా ఉంచిందని డాడీ పరిస్థితి చాల దుర్భరంగా ఉందని తెలిసింది. విడుదల కార్యం కొరకు ప్రార్థన చేస్తూ ఉన్నాము. 2001 డిసెంబరు నెల వచ్చింది. క్రిస్మస్ హడావిడీ ఎక్కువగా ఉంది. కాని నేను "ఈ సంవత్సరాంత దినాలలో నన్ను దర్శించు ప్రభువా" అని నిత్యము ముఖ్యంగా డిశంబరు మాసమంతా ప్రార్థన చేస్తూ వచ్చాను. నాకు కడుపు నొప్పి రాత్రుల్లో వచ్చేది ఎక్కువైంది. మరల పరీక్షలు చేయించాను. ఏమీ కారణం తెలియలేదు.

డిశంబరు 31 వ తారీఖు వచ్చింది. ఆ రోజు బుచ్చు పుట్టిన రోజు. మరుసటి రోజు జనవరి 1వ తారీఖు, నా భర్త పుట్టిన రోజు. కేక్ కోసం, ఇంకా పూల బొకే కొనాలని డ్యూటీ నుండి బయటకి వచ్చి ముందు బొకే తీసుకొని, ముందు నడుచుకొంటూ వచ్చి బేకరీలో కేక్ బుచ్చు కోసం తీసుకొని, ఆటో ఎక్కి ఇంటికి వచ్చాను. అప్పుడింకా క్వార్టర్స్‌లోనే ఉన్నాము. ఇంటి లోపలికి వెళ్ళి బొకే, కేకులు టేబుల్ మీద పెడుతుండగా గమనించాను. నా ఎడమ చేతి మధ్యవ్రేలికి ఉన్న బంగారపు ఉంగరం కనిపించలేదు. వెంటనే మనసు నిండా కలత చేరుకుంది. ఆ బంగారపు ఉంగరం నేను రు॥75 కి ఒక లక్కీ డ్రాలో పొందుకున్నాను. దానికి నేను ఖర్చు పెట్టింది తక్కువే అయినా అది బంగారం కాబట్టి చాల బాధ కలిగింది. మరల ఆటో దిగినంత వరకూ వెళ్ళి అంతా వెదికాను. కాని కన్పించలేదు. ఒక 20 నిమిషాల పాటు అంతా వెదికాక మనసులో ఇలా అనుకుంటూ వచ్చాను. "ఏమిటి ఇలా అయ్యింది? నేను కొత్త సంవత్సరం లోనికి దిగులుతో, బాధతో, మంచి ప్రశస్తమైన వస్తువును పోగొట్టుకొని వెళ్తున్నానా? ఇలా ఎందుకు జరిగింది ? అది 75 రు॥లకే వచ్చింది. నేను పూర్తిగ సొమ్ము చెల్లించనందుకే ఇలా జరిగిందా? అయినా అది నా పేరులో లక్కీగా తగిలిన గిఫ్ట్ కదా; అది అలాగే పోవాలని ఉందా?" అనుకుంటూ ఉన్నాను. అంతలో నా ఆలోచన దేవునిపై మళ్ళింది" "నన్ను సంవత్సరాంత దినాల్లో ఒకసారి దర్శించు ప్రభువా అని వేడుకొంటుంటే నీవు నన్ను ఎందుకు ఇలా బాధతో క్రొత్త సంవత్సరానికి పంపిస్తున్నావు? నాకేదైన నేర్పించాలనా ఇలా చేశావు?" అని మనసులోనే దేవున్ని అడుగుతూ బుచ్చు పుట్టిన రోజు కేక్ కటింగ్ చేయించడానికి సిద్ధంచేస్తూ ఉన్నాను. బుచ్చు ఫ్రెండ్స్ అందరూ వచ్చారు. నేను కేక్ బయటికి కవరులో నుండి తీస్తుండగా పోయిన రింగు అందులో కనబడింది. ఒక్క సారిగా నాలో ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. సంతోషంగా కేక్‌ని తీసి టేబుల్ మీద పెట్టబోతూండగా దేవుని వాక్కు నాలో నుండి నాకు వినిపించడం మొదలుపెట్టింది. "నన్ను దర్శించు, ఈ సంవత్సరాంత దినాల్లో అని ప్రార్థన చేస్తున్నావు కదా, ఇపుడు నీకు జరిగిన విధంగా, అంటే ఎంతో అమూల్యమైన బంగారం వంటిది, నువ్వు కొన్నాళ్ళు పోగొట్టుకొనినా, నేను దాన్ని మరల నీకిస్తాను. అది పోయిన ఈ కొద్ది సమయంలో నువ్వు ఎంత తొందరపడి, ఆందోళన చెందావు! అయినా దానికి నేను అంతం పలికిన



ఈ 2002 లో నేను దాన్ని నెరవేరుస్తాను, సమకూరుస్తాను " అని విన్పించింది. బంగారం వంటి వ్యక్తిని నేను పోగొట్టుకున్నానా? ఆ వ్యక్తి ఎవరు అని ప్రశ్నించుకోగానే "డాడీ" అనే జవాబు నా మనసు చెప్పింది. నాకు నిజంగా సంతోషం అయింది. దేవుడు ఈ విధంగా కూడా మాట్లాడి,మనుష్యులకు తన వాక్కు విన్పించి, తన ప్రణాళిక నెరవేర్పును వివరిస్తాడని నాకు తెల్సింది రూఢిగా ఇపుడే.

## నేను నా అనారోగ్యం

అప్పటి నుండి ఇంకా పట్టుదలగా ప్రార్థిస్తూ ఉన్నాను. నా వాళ్ళందరితో కూడ దీని గురించి చెప్పి డాడీ విడుదలకై ప్రార్థించమని చెప్పాను. నాకు కడుపులో నొప్పి ఎక్కువైంది కాని అది మధ్యరాత్రిలో వచ్చేది. చల్లని నీళ్ళు, లేకపోతే మజ్జిగ త్రాగితే వెంటనే తగ్గిపోయేది. ఎండోస్కోపీ చేయించుకోవాలని చాలసార్లు ప్రయత్నించాను. నా రూపం మాత్రం ఏమీ చెక్కుచెదర లేదు. చాల ఆరోగ్యంగా ఉండి, చురుకుగా నా పనులన్ని చేసుకొనేదాన్ని. హాస్పిటల్‌లో కూడ చాల చురుకుగా ఉండేదాన్ని. గాస్ట్రో ఎంటెరోలజిస్ట్ డా॥సత్యప్రకాష్ గారు నాతో చాల స్నేహంగా ఉంటారు, మంచిగా మాట్లాడతారు. ఆయనను చాలసార్లు నాకు కడుపులో రాత్రులు వచ్చే బాధ గురించి చెప్పి "నాకు కూడ పరీక్ష చెయ్యండి, నా బాధేంటో చెప్పండి" అని అడిగాను కాని ఆయన " మీరు చాల ఆరోగ్యంగా కన్పిస్తున్నారు. మిమ్మల్ని పేషంట్ లాగ పడుకోబెట్టడం నాకిష్టం లేదు, మీకు ఏమీ ఉండదు" అని నవ్వుతూనే అనే వారు. నేను కూడా వేరే పరీక్షల్లో ఏమీ లేదు కాబట్టి 'ఏమి ఉండదులే' అని అనుకున్నాను.

ఇంతలో అమ్మ ఆరోగ్యం కొంచెం దెబ్బతింది. అమ్మకి గుండె నొప్పి వచ్చి కార్డియాలజిస్ట్‌కి చూపిస్తే ఆయన ఏంజియోగ్రామ్ చేయించాలని సలహాయిచ్చారు. నేను కూడా ఆయన్ని పరిచయం చేసుకుని, కలసి అమ్మ గురించి మాట్లాడాను. ఆయన అన్ని వివరించారు. ఏంజియోగ్రామ్ తప్పక చెయ్యాలన్నారు. నేను అమ్మ రిపోర్టులన్ని తెచ్చి బెంగుళూరులో నాకు బాగా తెలిసిన కార్డియాలజిస్టుకి చూపించి సలహా అడిగాను. ఆయన కూడ ముందు డాక్టర్ చెప్పినట్టుగానే చెప్పారు. నేను జూన్‌లో వెళ్ళి అమ్మకి యాంజియోగ్రామ్ చేయించాలని, డబ్బు సమకూర్చుకున్నాను. ఇంతలో నాభర్తకి ఉద్యోగంలో ఒక సంతోషకరమైన వార్త చెప్పారు. అదేంటంటే ఆయనకి ఇశ్రాయేల్ దేశానికి వెళ్ళడానికి ఫ్యాక్టరీ అవకాశం ఇచ్చింది. ఆయన టూర్ ముగించుకొని వచ్చిన వెంటనే అమ్మ పని మీద కరప వెళ్ళాలనుకున్నాను. జూన్ ఆఖరు వారంలో ఆయన ఇజ్రాయేల్‌కి వెళ్ళి వచ్చారు.

ఆయన వచ్చేసరికి నాకు కడుపులో రాత్రులే కాక పగలు కూడా నొప్పి రావడం గమనించి ఆయనకి కూడ చెప్పాను. వచ్చే వారంలో కరప బయలుదేరి వెళ్ళాను అని

చెప్పాను. ఆయన సరేనన్నారు. పిల్లలకి స్కూలు ఉన్నా వాళ్ళని కూడ తీసుకొని వెళ్ళాలని తలంచాను.

జూలై 3వ తారీఖు ఎప్పటి లాగానే ఉదయాన్నే లేచాను. వంట గదిలో పని చేయడానికి వెళ్లినపుడు కళ్ళు మసక మసకగా అయింది. ఒక 5 నిమిషాలు కూర్చుని మళ్ళీ పని చేసుకొని, నేను, పిల్లలు సిద్ధం అయ్యి, నేను డ్యూటీకి, పిల్లలు స్కూల్‌కి వెళ్లాము.

నేను హాస్పిటల్‌లో నా రౌండ్స్ చెయ్యడానికి వెళ్ళాను. ఆకస్మాత్తుగా కళ్ళు బైర్లు కమ్మాయి. కడుపులో దేవినట్టయింది. చమట్లు పట్టాయి. నన్ను కాసేపు విశ్రాంతి తీసుకోమని, నేను పేషంట్లను చూస్తానని నా అసిస్టెంటు డాక్టరు చెప్పింది. నేను ఒక 15 నిమిషాలు విశ్రాంతి తీసుకొని ఓ.పి.డి కి వచ్చాను. మధ్యాహం 12:45 ని॥ల వరకు పేషంట్లను చూశాను. అపుడే కొద్దిగా రష్ తగ్గింది. మళ్ళీ ఉదయం అయినట్టే నాకు కడుపులో దేవినట్టయి, కళ్ళు బైర్లు కమ్మి, చమట్లు పట్టి వాంతి కొచ్చినట్టయి వెంటనే షింక్ దగ్గరికి పరుగు పెట్టాను. పక్కనే ఉన్న రాడ్‌ని పట్టుకుని వాంతి చేసుకున్నాను. స్పృహ తప్పినట్లయింది కొన్ని సెకండ్లు. మళ్ళీ స్పృహ లోనికి వచ్చాను. చూసుకుంటే షింక్ నిండా రక్తం. సిస్టర్ అప్పటికే నన్ను గట్టిగా పట్టుకుంది. షింక్ లోనిది రక్తమేమో చూడమంటే ఈ సిస్టరు కూడ "అవును రక్తమే 3/4 లీటరంత రక్తమే " అని చెప్పి, నన్ను నోరు కడిగించి, కూర్చోబెట్టి, డాక్టరు పాటిల్‌గార్ని పిలవడానికి పరుగెత్తింది. ఆయన చాల ఆతృతగా పరుగుపెట్టి వచ్చారు. షింక్ లోనిది చూసి కంగారైపోయారు. నేను అప్పటికే నీర్సంగా అయ్యాను. ఆయన చాలా బాధపడుతూ ఉన్నారు. ఎంత పెద్ద జబ్బు కాక పోతే ఇంత రక్తం వాంతి రూపంలో వస్తుంది? అని నన్ను ప్రశ్నలు వేస్తూ ఉన్నారు ఏమైంది? ఏలా జరిగింది? అంటూ నేను చెప్పాను. వెంటనే నాలో ఉన్న నీరసం అంతా ఆయనకే ఆవరించినంతగా ఆయన ఢీలా పడిపోయారు. నాకు బిపి, పల్స్ చూసారు. వెంటనే రూమ్ సిద్ధం చేయమని, స్కానింగ్‌కి, ఎండోస్కోపీకి, అలాగే రక్తపరీక్షలకి చెప్పారు. నా రక్తం 7 గ్రాములు ఉందని చెప్పింది లాబ్ టెక్నీషియన్. నాకు 'నా వ్యాధి ఏమైయుంటుందా? క్యాన్సరు ఉండొచ్చా "? అని మాటిమాటికీ అదే ప్రశ్న మనసులో నుండి పుట్టుకొస్తుంది. మనసులో కృంగిపోవడం మొదలైంది.

స్కానింగ్ చేసే డాక్టరు వచ్చారు. ఆయన నన్ను ఎంతో అభిమానిస్తారు ముఖ్యంగా నా పనితనాన్ని, వ్యాధిని డయాగ్నోసిస్ చెయ్యడాన్ని చాల మెచ్చుకుంటారు. నన్ను ఈ పరిస్థితిలో చూసి చాల ఢీలా పడిపోయారు. స్కానింగ్ చేశారు. ఆయనకి ఏమీ కానరాలేదు. నేను ముఖ్యంగా నా స్టొమక్ అంటే జీర్ణాశయాన్ని చూడమన్నాను. పెప్టిక్ అల్సరు ఉండవచ్చనుకున్నారు. స్కానింగ్ అయ్యాక గ్లూకోజ్ సెలైన్ డ్రిప్ ఆన్ చేశారు. డా॥పాటిల్ గారు నాభర్తకి కూడ ఫోన్ చేసి రమ్మని చెప్పారు.



అంతలో గాస్ట్రో ఎంటిరోలజిస్ట్ డా॥సత్యప్రకాష్ గారు వచ్చారు. ఆయన వస్తూనే చాల జోకులు వేసి నవ్విస్తూ పని ముగించేస్తారు. అలాగే నవ్వుతూ వచ్చి " మీకే జబ్బు ఉండదు, ఊరికినే అందరిని జడిపిస్తున్నారు" అని మెల్లగా కొద్ది సెడేషన్ ఇచ్చారు. డా॥ పాటిల్ గారు ప్రక్కనే ఉండి ఎండోస్కోపీ చేస్తుంటే చూస్తున్నారు. నాకు కొంచెం తల దిమ్ముగా అనిపించింది. ట్యూబ్ పాస్ చేశారు. సత్యప్రకాష్‌గారు, పాటిల్‌గారికి చూపించారు. డా॥పాటిల్ గారు ఏడుస్తూ కళ్ళు తుడుచుకోవడం నేను చూసి 'ఏముందని' అడిగాను. సిస్టర్లు ఏడ్వవద్దని పాటిల్‌గారికి చెప్తున్నారు. సత్యప్రకాష్‌గారు అంతవరకూ జోకులు వేస్తూ నవ్వించిన ఆయన ముఖంలో నవ్వు మాయమై పోయింది. ట్యూబ్ తీసాక " ఏముందని " అడిగాను. ఆయన "మీరు ఎన్నో సార్లు మీకు ఎండో స్కోపీ చెయ్యమని అడిగితే సరదాగ అడుగుతున్నారనుకున్నానమ్మా, చూస్తే మీకు లోపల 10 సెంటిమీ॥ల సైజులో ఒక గడ్డ ఉండి దాన్నుండి చాలా రక్తస్రావం జరుగుతూంది. నాకు చాలా బాధేస్తుంది. మీరు ఇంత జబ్బు, బాధ లోపల పెట్టుకుని నవ్వుతూ,చురుకుగా ఎలా పనిచేసేవారు? ఊహించరాని జబ్బు మీలో ఉంది.అయినా మీరు అందంగా,ఆరోగ్యంగా ఎలా కనిపిస్తున్నారో నాకర్థం కావడం లేదు, అది ఆపరేషన్ చేస్తే సరిపోతుంది, క్యాన్సర్ ఉండకపోవచ్చు, మీ వయస్సుకి క్యాన్సర్ కాకపోవచ్చు" అని బాధపడుతూ వెళ్ళారు.

ఇక ఆ హాస్పటల్‌కి వచ్చే స్పెషలిస్టులు, కన్సల్టెంట్స్ నాకు ఇలాగైందని తెలిసి నాదగ్గరకు రావడం, పరామర్శించడం. క్యాన్సర్ అనే భయపడుతూ నాకు ధైర్యం చెప్పడానికి బదులు వాళ్ళే ఏడుస్తూ కనిపించారు. "మీరే డాక్టరు, మీకన్ని తెలుసు, మీకే ఇలాగైతే మేమేమని మీకు ధైర్యం చెప్పగలం? అయినా మీకేమీ జరగదు, మీరుబాగవుతారు, మీరు ఎంతో మందికి చేసిన సేవ ఊరికే పోదు" అని ధైర్యంగా చెప్పడానికి బదులు భయపడుతూ, ఏడుస్తూ చెప్పి నన్నింకా ఏడిపిస్తూ వచ్చారు. స్కానింగ్ డాక్టరుకి మతి పోయినట్లయింది. స్కానింగ్‌లో ఏమీ కనిపించలేదని చెప్పినందుకు చాల బాధపడుతూ ఆయన బెంగుళూరు లోని గొప్ప గొప్ప కేన్సర్ సర్జన్‌లను గూర్చి వాకబ్ చేస్తూ వచ్చి చివరికి డా॥గోపినాధ్ గారి గురించి చెప్పి, మల్య హాస్పిటల్‌కి రిఫర్ చేస్తే మంచిదన్నారు. నా భర్తగారికి కూడా వివరించారు.

నన్ను గదిలో పడుకోబెట్టారు. నేను పాష్టరమ్మ గారికి కబురు పెట్టాను. పిల్లల్ని స్కూల్ నుండి నేరుగా నాకు చూపించకుండా ఇంటికి తీసుకుపోయారు. నా భర్త నా ఆరోగ్య సమస్య చిన్నదే అని చెప్పినా వాళ్ళు రాత్రికి అమ్మని చూడాలని వచ్చారు. నా కుమార్తెకి 11 సంవత్సరాలు, బాబుకి 5 సం॥ల వయస్సు. వాళ్ళకి ఏమి చెప్పిన అర్థం కాదు. కాని ఒక్కటి వారికి అర్థమయిందేమిటంటే "అమ్మకి అనారోగ్యం. చిన్నది కాదు" అని. వాళ్ళ ఎదురుగా నవ్వుతూ ఉండడానికి ప్రయత్నించాను. "హాస్పిటల్‌లో కొద్ది

రోజులుండి వచ్చేస్తాను. బాగైపోతాను, మీరు జాగ్రత్తగా ఉండండి" అని చెప్పాను. నాకు మాట్లాడాతే దుఃఖం. పాస్టరమ్మగారు కూడ చాల దుఃఖపడ్డారు. ఇక చూడడానికి వచ్చేవాళ్ళందరూ పిల్లల గురించి కూడ దుఃఖపడడం మొదలు పెట్టారు.

రక్తం ఎక్కించడానికి 2 బాటిల్స్ రక్తం సిద్ధం చేశారు. ఒకటి నా భర్త ఇస్తే, మరొకటి పిడియాట్రీషియన్ డా॥సుభాష్ రెడ్డి ఇచ్చారు. నాలో ఉన్న నీరసం పెరిగింది, అలసట ఎక్కువైంది. మానసిక స్థైర్యం పోయింది. ఒకే ఒక్క ప్రశ్ననాముందు పదే పదే నిలిచింది ఏంటంటే "ఎందుకిలా అయింది"? రక్తం అంతా ఎక్కించాక నేను పడుకుని ఆలోచిస్తున్నాను. పిల్లల్ని తీసుకొని ఆయన ఇంటికి వెళ్ళారు.

నేను ఆలోచిస్తున్నాను "ఎందుకిలా జరిగింది?నాకే అకస్మాత్తు గా ఎందుకయింది? అందరూ క్యాన్సరని అనుమానిస్తున్నారు? నిజంగా క్యాన్సరేనా? ఇన్నాళ్ళూ రాత్రులు నొప్పితో బాధపడ్డాను కదా? అది ఈ కారణం వల్లనేనా? ఒక వేళ క్యాన్సర్ అయితే నా పరిస్థితి ఎలా ఉంటుంది? నా పిల్లలు ఏమైపోతారు, చాల చిన్న వాళ్ళు కదా ! త్వరగా తల్లి లేని అనాధలైపోతారా? వాళ్ళని ఎవరు చూసుకుంటారు" ఇలా ఎన్నో ఆలోచనలతో నిద్రపోలేదు. నీర్సం ఎక్కువైంది. మనసులో కుమిలి పోవడం ఎక్కువైంది. కళ్ళలో కన్నీరు ఎడతెరిపి లేకుండా కారుతూ ఉంది.

4వ తారీఖున నా ఫ్రెండ్స్ కొంత మంది డాక్టర్లు. నన్ను చూడడానికి వచ్చారు. వారి నోట కూడ ఏమీ ధైర్యం చెప్పడానికి మాటరాలేదు. చర్చిలోని కొందరు విశ్వాసులు వచ్చారు. వారు కూడ ధైర్యం చెప్పలేదు. నాకు బైబిలు కావాలి. చదవాలనిపించింది. నేను మల్యా హాస్పిటల్లో చేరే రోజు అంటే 4వ తారీఖు ఉదయం బైబిలు చదవడానికి తెరిస్తే అంతా అయోమయంగా, ఏమీ అర్థం కాకుండా నా మనసు చదివేది అర్థం చేసుకోలేకుండా ఉండింది. బైబిల్లోని పేజీలు త్రిప్పుతూ ఒక దగ్గర ఆగాను. అది మలాకీ 7వ అధ్యాయం. చదవమని ప్రేరణ కలుగుతున్నా, చదివినా అర్థం కాలేదు. కీర్తనలు నాకు చాల ఇష్టమైనవి. అందుకు ఆ భాగం తీస్తే 30వ కీర్తన ఎదురుగా నిలిచింది. అది స్వస్థత పొందాక చదివే వాక్యం. అయినా 'దేవుడు' విశ్వాసులను కాపాడును' అనే వాక్యం 31వ కీర్తనలో చదివాక ఉదయం 8:30గంటలకు హాస్పిటల్కు బయలుదేరాను.

మల్యా హాస్పటల్లో క్యాజువాలిటీలో నన్ను పడుకోపెట్టారు. డా॥గోపినాథ్ గారు వచ్చారు. నాతో తెచ్చిన రిపోర్టులు చూశారు. "ఇంకా 6 బాటిల్స్ రక్తం కావాలి, ఆమె చాల నీరసించి పోయి, సీరియస్గా ఉన్నారు, ఇంకా సి.టి స్కాన్ చెయ్యాలి. అన్ని తెలుసుకొన్నాక, ఆమెని ఆపరేషన్కి ఫిట్ అయ్యేటట్టు చేసి, అపుడు సర్జరీ చేస్తాం, ఇదంతా 3-4 రోజులు పడుతుంది. అంత వరకూ ఐ.సి.యు.లో ఉండాలి" అని చెప్పారు.

నా భర్త, పిల్లల పరిస్థితి చాల దయనీయంగా అనిపించింది. ఐ.సి.యులో సిస్టర్లు



నన్ను నడవనియ్యలేదు. కొన్ని గంటలు గడిచేటప్పటికి నాలో ఇంకా రక్తస్రావం జరుగుతున్న కారణంగా నేను నడవలేని స్థితికి వచ్చాను. పూర్తిగా మంచాన పడినట్లయింది. అన్నిటికి సిస్టర్లు సహాయం తీసుకోవాలి. లేదంటే వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటూ, టైముకు మందులిచ్చు కుంటూ ఉండిపోతారు. అయినా ఆ సిస్టర్లు నేను డాక్టర్నని తెలిసి ఇంకా సానుభూతిని చూపిస్తూ, నాతో పాటు ఏడుస్తూ, నా పనులన్ని చేస్తూ, నన్ను బాగా చూసుకున్నారు. 4వ తారీఖు చాల బాధగా, నీర్సంగా, నిస్పృహగా, మనసులో కృంగు పాటు ఎక్కువై ఏడుస్తూ, కంటి మీద కునుకు రాక గడిపాను.

5వ తారీఖు రాత్రి నా మనసులోని ఆందోళన, కలత ఎక్కువైంది. 4వ తారీఖున ఆంధ్రాలో నా యింటి వారందరికి తెలిసింది. వారు బయలుదేరి రావడానికి టికెట్ 5వ తారీఖుకి చేసుకున్నారు.

నా చిన్నతమ్ముడు బున్ని డాడీకి ఫోన్లో ప్రయత్నిస్తే దొరికారట. "నీ కుమార్తె చావడానికి సిద్ధంగా ఉంది, ఈ సమయంలో నైనా నీ బంధకాలని తెంచుకొని బయటకి వస్తే సరే, మేము చేర్చుకుని ఆదరిస్తాము, లేదు ఇంకా కుదరదు, రాను అనంటే ఇక నిన్ను ఎవరూ విడిపించలేరు, తర్వాత మా సహాయం కూడ నీకు అందకపోవచ్చు, రేపు బెంగుళూరు బయలు దేరుతున్నాము, ఏమిటి సంగతి?వస్తారా?లేదా?" అని అడిగితే "నాకు కూడ టికెట్ బుక్ చెయ్యండి" అని డాడీ అన్నారట. వచ్చే వరకు వారికి నమ్మకం లేదు.

హాస్పిటల్ కి వెళ్ళాక నాకు సంబంధించినవి ఏమీ ఐ.సి.యు. లోనికి అనుమతించ లేదు. అయితే నాకు 4వ తారీఖు సాయంకాలం బైబిలు ఉంటే ధైర్యవచనం దేవుడు నా కిచ్చి ఉండును, బైబిలు లేదే అనే బాధ ఎక్కువైంది. నన్ను చూడడానికి వచ్చిన వారితో మరుసటి రోజు వచ్చేటపుడు బైబిలు తీసుకొని రమ్మని చెప్పాను. రాత్రిలో బయట పాస్టరమ్మ గారు, నా భర్త ఉండిపోయారు. 5వ తారీఖు పిల్లల పరిస్థితి గురించి నాకు బెంగ ఎక్కువైంది. నాకు ఇపుడు ప్రాణాపాయ పరిస్థితి, నాకేదయినా అయితే నా బిడ్డలని ఎవరు చూసుకుంటారు? వాళ్ళు అనాధలైపోతారు కదా! ఒకవేళ నా భర్త 2వ పెళ్ళి చేసుకుంటే ఆయనకి భార్య దొరుకుంది, సుఖంగా ఉంటారు కాని నా పిల్లలకి తల్లి రాదు కదా? అని ఆలోచిస్తున్న నాకు చాల దుఃఖం ఎక్కువైంది. నేను త్వరలో చనిపోతాను అని నా వ్యాధి నాకు గుర్తు చేస్తూంటే, పిల్లలు అనాధలుగా మిగిలిపోతారు అనే వాస్తవం నన్ను భయపెడుతూంటే, ఆదరణకరమైన, ధైర్యకరమైన మాటెవరూ చెప్పకుండా నన్ను అధైర్యపరుస్తూ ఉంటే బైబిలు నా దగ్గర లేనందున నా దుఃఖం మరింత ఎక్కువై నాహృదయం భారభరితమైపోయింది. నాకిప్పుడు 'ఎవరైనా నువ్వు చనిపోవు, పూర్తిగా జీవితకాలమంతా బ్రతికే పూర్ణ ఆయుష్షు నీకు ఉంటుంది'. అనే భరోసా కల్గిన మాట కావాలి. డాక్టర్లు సాయంకాలం వచ్చి వెళ్ళిపోయారు. వారు కూడ ఎవరూ సూటిగా నావ్యాధి గురించి మాట్లాడ లేదు. నేను డాక్టర్నయినందుకు నాకు నా వ్యాధి పరిస్థితి,

దాని తీవ్రత అంతా తెలుసునని, నాతో ఏమి చెప్పినా ప్రయోజనంలేదని వారు కూడ బాధపడుతున్నారు. ఆ రెండు రాత్రుల్లో ముగ్గురు పేషంట్లు చనిపోయారు. ఆ ఐ.సి.యులో నావంటి సమస్యతో 19 ఏళ్ళ అమ్మాయి బ్లీడింగ్ కంట్రోల్ కాక చనిపోయింది.

ఐ.సి.యు.లో సిస్టర్లని అడిగితే కాని సమయం తెలియదు. రాత్రో పగలో అర్ధం కాదు. 5 వతారీఖు అర్ధరాత్రి అయింది. జూలై 6 వ తారీఖు వచ్చింది. ఆరోజు శుక్రవారం 'చర్చిలో ఆల్‌నైట్ ప్రేయర్ జరుగుతుంది. నేను కూడ వెళ్ళి నీ కోసం ప్రార్ధన చేయిస్తాను' అని నా భర్త వెళ్ళారు.పాష్టరమ్మగారు బయటే ఉన్నారు. నాలోని దుఃఖం ఎక్కువౌతుంటే ఏడుస్తూ "నేనిక ఇంతేనా? నా పరిస్థితి ఇక మారదా? నేను కోలుకుని ఇంటికి వెళ్ళ లేనా? నా పిల్లలు అనాధలైపోతారా? నా కెందుకు ఇలాంటి భయంకరమైన, మరణకరమైన పరిస్ధితి అకస్మాత్తుగా  కలిగింది?" అని ప్రశ్నించుకుంటూండగా నాకు వెంటనే దేవుడు గుర్తొచ్చాడు. దేవుడు నన్ను విడిచి పెట్టినందుకే నేను ఇలాంటి భయంకరమైన పరిస్ధితికి వచ్చాను అనిపించింది. నేను నా 15 సం॥ల వయసులో నేను దేవుని కొరకు చేసుకొనిన నిబంధన జ్ఞాపకానికి వచ్చింది. "నేను నిన్ను విడువను, ఎడబాయను" అనే మాట గుర్తొచ్చింది. అపుడు దేవుడు నాలో ఒక ఆలోచన పెట్టాడు. ఇంతటి కృంగిన సమయంలో, అర్ధరాత్రిలో దేవుణ్ణి నేను గుర్తుచేసుకున్నానంటే ఆయనని గుర్తు చేసిన వ్యక్తి పరిశుద్ధాత్మ దేవుడు నాతో ఉంటేనే కదా! అన్న ఆలోచన తట్టింది. అపుడు నేను ఒంటరిగా లేను. ఆదరణకర్త అయిన పరిశుద్ధాత్ముడు నాతోనే ఉన్నాడని కొద్దిగా ధైర్యం పొందాను. ఇక ఆయనతో ముఖాముఖిగా నా హృదయం మాట్లాడడం మొదలుపెట్టింది. "నువ్వు నాతో ఉండి కూడా నాతో ఎందుకు మాట్లాడడం లేదు? నువ్వు ఆదరణకర్తవు కదా! నాకు ఇపుడు నీ ఆదరణ, ధైర్యం, బలము, ఓదార్పు కావాలి. నన్ను విడిచి దూరంగా ఉండకు" అని ఏడుస్తూ ప్రాధేయపడుతూ ఉన్నాను. అపుడు నా ప్రశ్నలకి జవాబుగా మరొక మెల్లని స్వరం నా హృదయంలో నుండే విన్పించడం మొదలు పెట్టింది. "దేవుడు నిన్ను విడిచిపెట్టాడని ఎందుకు తలస్తూ ఉన్నావు?" నేను "అందరూ వచ్చి నన్ను మరింత ఏడ్పిస్తున్నారు. బలహీన పరుస్తున్నారు, ఒక్కరూ ధైర్యం వచ్చే మాట చెప్పడం లేదు, బైబిలు చదివితే నాకు నెమ్మది దొరుకుతుందనుకుంటే బైబిలు నా దగ్గర లేదు, రేపు తీసుకొస్తారు, నేను అంతవరకూ ఆగలేను" అన్నాను. అపుడు ఆమెల్లని, తియ్యని స్వరం "బైబిలు నీ వద్ద లేదని బాధపడకు, చిన్నపుడు నీవు నేర్చుకున్న వాక్యాలు గుర్తు చేసుకో" అని అన్నది. వెంటనే నాకు 23వ కీర్తన గుర్తుకొచ్చింది. బైబిల్‌ను తెరచి పెద్దపెద్ద అక్షరాలతో 23వ కీర్తన నాముందుంచినట్లైంది." యెహోవా నా కాపరి" అని చూడగానే "అవును ప్రభువా, నీవు నా కాపరివి, నేను నీ గొర్రెపిల్లని కదా, అయితే నన్ను ఎందుకు విడిచావు"? అని అడిగాను. అయితే దేవుని స్వరం "నేను నిన్ను విడిచి పోలేదు, నేను నీతో ఉన్నాను, భయపడకు. నీవున్నది ఒక మరణకరమైన లోయ. నువ్వు నడువలేని



మరణకరమైన లోయలో నేను నిన్ను ఎత్తుకొని అవతలికి చేరుస్తాను.నీ శత్రువులకి నిన్ను నిందాస్పదము కాకుండా చేస్తాను. నీ బ్రతుకు కాలమంతా నా కృపా క్షేమములు నీవెంట వస్తాయి, ధైర్యంగా ఉండు, ఆదరణ పొందుకో" అని చెప్పాడు. ఆయన నాకీ మాటలు గుర్తుచేస్తూ, నాతో మాట్లాడుతూ, నా పెనుగులాటను మాన్పి, నాకు తన వాక్యాన్ని సజీవమైనదిగా, బలమైనదిగా నా ఎదుట ఉంచాడు. వెంటనే నాలో ఉన్న వేదన,దుఃఖం, భారం అంతా పటాపంచలైపోయింది. నా బాధ అదతా ఒక చేతితో తుడిచిపెట్టినట్లయి, నా హృదయం తేలికైంది. "ఎంత ధైర్యం, ఎంత ఆదరణ! ప్రభువా, నీవు సెలవిచ్చే మాట నన్ను బ్రతికిస్తుంది, నాలో జీవంపోస్తుంది. ఎంత బలమైనది నీ వాక్యం? ఎంత సజీవమైనది నీ వాక్కు! నీ మాటలలోని జీవం నాలో ప్రవహిస్తూంది, నీవు నిశ్చయంగా నాతో ఉన్నావు, నన్ను విడిచిపెట్టలేదు, నీ వెంత గొప్ప దేవుడవు"! అని ఆయన నా శ్రమలో నన్ను ఆదరించిన తీరును కొనియాడాను. నన్ను పసిపాపలా ఎత్తుకొని, ముద్దాడిన నా పరమ తండ్రి ప్రేమను నేను కీర్తించాను. నా బ్రతుకంతటికి, కావలసినవి, సరిపోయిన మాటలు నాకిచ్చి దేవుడు నన్ను బలపరిచాడు. నేను వెంటనే "నేను ఎంతటి కష్టమైనా భరిస్తాను. అది క్యాన్సర్ అయినా అనుభవిస్తాను, నువ్వు నాతో ఉంటే చాలు, నేను మాత్రం నీ నామాన్ని ఎపుడూ దూషించకూడదు, ఈ శారీరక,మానసిక శ్రమను తట్టుకునే శక్తి నివ్వు. నీ కృప నాకు చాలు " అని ప్రార్ధించాను.

మరుసటి రోజు ధైర్యంగా ఉన్న నన్ను చూచి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డాక్టర్ గోపీనాధ్‌గారు కూడ నాపరిస్ధితి ఎలా ఉందని అడిగినవారికి "She is very joyful" అని ఆయన కూడ సంతోషంగా చెప్పారు.

నాకింకొక మరింత సంతోషాన్ని కలిగించిన విషయం ఏమిటంటే డాడీ కూడా అమ్మ, తమ్ముళ్ళతో బెంగుళూరు రావడానికి స్టేషన్ కొచ్చారు, ట్రైన్ ఎక్కారు అని తెల్సింది. నాకు పాష్టరమ్మ గారు బైబిలు తెచ్చి ఇచ్చారు. మలాకీ 7వ అధ్యాయం మళ్ళీ చదివాను." నీవు అంధకారంలో ఉన్నా నేను నీకు వెలుగుగా ఉంటాను. నీ శత్రువు నీపై అతిశయించ వీలులేదు. ఎందుకంటే నీవు క్రింద పడినా నేను లేపుతాను. నీ దేవుడు ఎక్కడ అనిన నీశత్రువు అవమానము నొందును. అది నీ కండ్లకు అగపడును. నీ గోడలు మరల కట్టించు దినము వచ్చుచున్నది, నీ సరిహద్దులు విశాలపరచబడును అని ఉన్న ఈ వచనాలు చదివి "ధైర్యం పొందుకోమని దేవుడు ముందుగానే ఆ వాక్యాన్ని నాకు ఇచ్చినా నేను గ్రహించకుండా, ఎంత క్షోభ అనుభవించానో అని నా పరిస్ధితి ఆలోచించుకుంటే నాకు సిగ్గైంది. దేవుని ఆదరణ, శక్తి, బలము, జీవము నన్ను మేఘములా కమ్మివేశాయి. ఇక ఏమాత్రం అధైర్యపడలేదు. ఏదో ఒక మేలు చేయడానికే దేవుడు దీనిని అనుమతించాడని నమ్మాను. ముఖ్యంగా డాడీ విడుదల నా ద్వారా ఇలా జరిగిందని చాల సంతోషంగా అన్పించింది.

మరుసటి రోజు 7వ తారీఖు హాస్పిటల్‌కి అందరూ వచ్చారు. నన్ను ఆరోజు సాయంకాలం వార్డుకి వేసారు. ఆరోజు పిల్లలతో మాట్లాడాను. జంటగా వచ్చిన అమ్మ, డాడీలను చూసి సంతోషించాను. ఆ మరుసటినాడు ఆపరేషన్ చేశారు.

నా చేతికున్న బంగారపు రింగు పోయి దొరికినపుడు 'నీవు తాత్కాలికంగా పోగొట్టు కొనినది, అమూల్యమైనది నీవు మరల పొందుతావు అయితే దానికి ముందు కొంత లోటు, అసమాధానం కన్పిస్తుంది, నువ్వు దానికి సిద్ధమా అని అడిగిన ప్రభువుకు "నీ చిత్తం నెరవేర్చుటకు నాకు సంతోషం" అని ప్రార్థన ఫలితం నా కండ్లకు ఎదురుగా అగపడుతూ ఉంటే నేను చాల సంతోషంగా థియేటర్‌కు వెళ్ళాను. ఆపరేషన్ బాగా జరిగింది. ఇంకా మత్తుగా ఉండగానే థియేటర్ నుండి I.C.U కి షిఫ్ట్ చేసారు. డాడీ డాక్టరు కాబట్టి నన్ను చూడడానికి ముందు I.C.U కి వచ్చారు. "ఒరేయ్, చెల్లీ! నేను రావడం అయితే వచ్చేసాను, కాని శత్రువు వెనుక తరుముకొని వస్తూవుంది. నేనిక్కడ వుంటే నీకు కూడా ప్రమాదం. ఇక నువ్వు బాగుంటావు, నేను ప్రార్థన చేస్తూ ఉంటాను, నువ్వు ధైర్యంగా ఉండు, నేను ఇక్కడ నుండి ఈ రాత్రికే హైదరాబాదు వెళ్తాను. అక్కడ ఎన్నాళ్ళుంటానో తెలియదు. కాని మనమందరం కలసి సంతోషించే రోజు వస్తుంది. నే వెళ్తాను రా" అని అన్నారు. నాకు బాధ కలిగినా ఆయన్ని కాపాడుకోవాలి కాబట్టి సరేనన్నాను. డాడీతో ఫ్రూటీ కూడా వెళ్ళాడు.

డాడీని కాపాడుకోవడానికి బున్ని పడిన టెన్షన్ అంతా ఇంతా కాదు. బంధువులని కొందరిని ప్రాధేయపడగా నా మేనమామ ఐజక్. కొమానపల్లి గారు వారి కుటుంబం ఆదుకొని, డాడీని సురక్షితమైన స్థలంలో 40 రోజులు దాచి ఉంచారు. వారి ఋణం ఎన్నటికి తీరకుండా అలాగే ఉండిపోతుంది. ఎప్పటికపుడు ఆయన క్షేమం గురించి కనుక్కుంటూ ఉన్నాము. అలాగ ఆయన బయటికి వచ్చిన రోజు జూలై5.

ఇంతలో ఆంధ్రా నుండి అందరూ అక్క, చెల్లెళ్ళు, వాళ్ళ పిల్లలు అందరూ బెంగుళూరు వచ్చారు. అందరూ ఇటు రావడంతో, డాడీ ఎక్కడున్నారో తెలియకపోవడంతో డాడీని తరుముకుంటూ 'ఆమె' బయలు దేరి వచ్చే ప్రయత్నాలు చేస్తూందని, చిన్నపిల్లల్లో ఎవరినైనా 'కిడ్నాప్' చేస్తే డాడీని వదిలేస్తారు అనే ప్లాన్‌తో ఆమె వస్తూందని తెలిసింది. మరల వచ్చిన వారినందరిని సురక్షితంగా పంపించడానికి, నా భర్త పడిన టెన్షన్ అంతా యింతా కాదు. పిల్లల్ని, పెద్దవారిని అందరిని ఇంట్లో ఉంచకుండా ఒక రోజు హోటల్ లో భద్రంగా ఉంచి 2 రోజుల్లోనే వారిని బయలుదేరదీశారు. మధ్యాహ్నం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఎక్కించడానికి అందరిని స్టేషన్‌కి తీసుకెళ్తే అపుడే ఆమె వచ్చిన ట్రైన్ సిటీస్టేషన్‌లో ఆగింది. ఆమె కంట వారిని పడనివ్వకుండా, క్షేమంగా ట్రైన్ ఎక్కించి వచ్చారు. ఈ టెన్షన్‌లో నాసంగతి అంతగా పట్టించు కోలేదు. వాళ్ళు బయలు దేరే ముందు రోజు రాత్రి నా భర్త హస్పిటల్‌లో నాకు తోడుగా పడుకోవడానికి రావడానికి రాత్రి 1 గం॥ట



అయింది. నాకు ఈ విషయాలన్ని ఆలోచిస్తుంటే చాల మానసిక ఒత్తిడి ఎక్కువైంది. అంతకు 2 రోజులకు ముందు పాస్టరమ్మగారు చిన్న పాపకి నడక నేర్పిస్తున్నట్టు తడబడే అడుగులు వేస్తూ నడుస్తున్న నాకు ఆసరాగ వుండి నడిపించారు. అదే మాట ఆవిడతో అన్నాను "మీరు పసిబిడ్డకి తల్లిలాగ నడక నాకు నేర్పిస్తున్నారు" అని ఆమెకి సంతోషంతో ఏడుపొచ్చేసింది.ఆమె నాకు నిజంగా తల్లి కన్నా ఎక్కువ. అప్పటివరకు ఎవరి తోడైనా తీసుకుని నడిచిన నాకు ఇపుడు ఈటెన్షన్‌లో నిద్రరాక మెల్లగ ఒక్కదాన్నే లేచి కిటికీ వద్దకి నడిచాను. మనసులో ధైర్యం ఉన్నా ఒక మూల పిల్లలకి (అమ్మ,డాడీల మనుమలు, మనువరాండ్రు అప్పటికి 9 మంది) ఏదైన అఘాయిత్యం ఆమె తలపెడుతుందేమో నన్న టెన్షన్‌తో కిటికీ వద్ద నిలబడి ప్రార్థన చేసుకుంటున్నా. వెంటనే దేవుని వాక్కు నాలో నుండి వినిపించడం మొదలుపెట్టింది. నేను నా పరిశుద్దదూతల సమూహములతో దిగి వచ్చాను. నువ్వు ధైర్యంగా ఉండు" అని దేవుని స్వరం వినిపించింది. మళ్ళీ మెల్లగా వచ్చి పడుకున్నాను. అంతలో నా భర్త వచ్చారు. ఆయన "అందరూ సురక్షితంగా ఉన్నారు," ధైర్యంగా ఉండు, రేపు వెళ్ళిపోతున్నా"రని చెప్పారు.

దేవుడిచ్చిన మాట ప్రకారం అందరూ సురక్షితంగా కాకినాడ చేరారు. అక్కడ పిల్లల్ని, ఇక్కడ నా పిల్లల్ని కిడ్నాప్ చేసే ప్రయత్నాలు జరిగాయి. అయినా దేవుడు పిల్లలందరిని క్షేమంగా కాపాడాడు. వారిని క్షేమముగా ట్రైన్ ఎక్కించడానికి సహాయంచేసిన వ్యక్తి, సహోదరుడు జాన్. వారు చేసిన పరిచర్య చాల గొప్పది.

హాస్పిటల్‌లో ఆపరేషన్ అయిన 9వ రోజు నాకు సగం కుట్లు విప్పారు. అంతా మంచిగా ఉంటే 2రోజుల్లో డిశ్చార్జ్ చేస్తానన్నారు డాక్టర్‌గారు. అప్పటికి లిక్విడ్ డయట్ ఇస్తున్నారు. ఇక మిగతా సమయమంతా పాటలు వినేదాన్ని. నాకు ఆ సమయంలో బాగా నచ్చిన పాటలు "We offer praises" అనే రాన్ కెనోలి గారి ఆల్బమ్ పాటలు. నా కష్టానికి ఆదరణకరంగా, లాలించినట్టు ఉంటాయి ఆపాటలు. ఎంతో మంది నామీద ప్రేమ, అభిమానంతో నన్ను చూడటానికి హాస్పిటల్‌కి వచ్చేవారు. నాకు తెలియని వారు, అంటే వేరే చర్చిలకు సంబంధించిన వారు, పెద్దపెద్ద క్రైస్తవ నాయకులు వారి ఆరోగ్యం బాగోక పోయినా నన్ను చూచి ఆదరించి, ప్రార్థించి వెళ్ళేవారు. నా డాక్టర్ స్నేహితులు ఎంతో మంది వచ్చి పరామర్శించారు. పాస్టరమ్మగారు, రోజీ, జాన్‌లు నాకు చాల పరిచర్య చేశారు. కొందరు నాకు రక్తదానం చేశారు. వారందరికి నేనెంతో కృతజ్ఞురాలిని.

సగంకుట్లు విప్పిన రాత్రి వేసిన డ్రెస్సింగ్‌తో పాటు, నేను పడుకున్న మంచం గాయం కారి అంతా తడిసిపోయింది. నేను డాక్టర్‌కి చెప్తే మర్నాడు ఉదయం డా॥ గోపీనాథ్ గారు పరీక్ష చేసి ఇది Burst abdomen అని దానికి మరల ఆపరేషన్ థియేటర్ కు తీసుకెళ్ళి ఎనస్థిషియా ఇచ్చి మళ్ళీ రిపేర్ చేయాలన్నారు. నా భర్త డ్యూటీకి వెళ్ళారు. ఫోన్ చేస్తే వచ్చారు. ఇంటికి రేపే వెళ్ళిపోతున్నానని సంబరపడి నాకు గాయం మరల

ఇలా అయిపోవడం బాధకలిగించింది. అపుడు కూడ మీకా 7:7-11 వచనాలు నన్ను బలపరిచాయి. అది కూడా నా మేలు కొరకే అని తలంచాను.

మరల 'సెకండరీ సూచరింగ్' చేసారు. గాయం పూర్తిగా మాని కుట్లు మళ్ళీ విప్పే వరకు హాస్పిటల్‌లోనే ఉండాలని నా భర్త నిర్ణయించారు. ఇంటికి వెళ్తే 'ఆమె'ద్వారా ఏమైన ముప్పు వాటిల్లుతుందేమోనని భయం. మొదటి ఆపరేషన్ అప్పటి కన్నా ఈ సారి నొప్పి చాల ఎక్కువగా ఉండింది.

నాకు ఆపరేషన్ చేసి తీసిన "ట్యూమరు రిపోర్టు" వచ్చింది. అది Borderline Malignant tumor అంటే క్యాన్సర్ అని రిపోర్ట్ చేశారు. డాక్టరు గోపీనాధ్ గారికి ఆరిపోర్ట్ చూసినపుడు ముఖంలో చిరునవ్వు లేదు. చాల బాధపడ్డారు. నాకు ఆరిపోర్ట్ సంగతి తెల్సినా నేను నా ధైర్యాన్ని విడిచిపెట్టలేదు. ఏదో బలమైన కారణం లేకుండా దేవుడు అనుమతించాడు, అది నా మేలు కొరకే అని నమ్మాను.

పూర్తిగా 24 రోజులు తర్వాత డిశ్చార్జ్ చేయించుకొని మరల ఇంటికి వస్తూండగా మమ్మల్ని 'ఆమె', ఆమె మనుష్యులు వెంటాడారు. కార్‌ని ప్రక్కన ఆపి అక్కడే ఉన్న 'హొయ్సళ' పోలీస్‌కి "మమ్మల్ని ఎవరో వెంటాడుతున్నారని" చెప్పడం చూసిన ఆమె, ఆమె మనుష్యులు వెనక్కి తిరిగేసారు. మేము ధైర్యంగా ఇంటికి వచ్చేశాము. పిల్లలతో మరల ఇంటిని తిరిగి చూసిన నాకు చాల సంతోషమైంది. దేవుడు నమ్మదగినవాడు. ఎంతైనా నమ్మదగినవాడు అని కీర్తించాను. 23వ కీర్తనని గుర్తు చేసి నన్ను దేవుడు ధైర్యపరచిన క్షణాలు తలంచుకుని కీర్తన భాగం నాకు ఎంత మాధూర్యంగా, రమ్యముగ అనిపించిందో మనసుకు తెచ్చుకొని "నా శైలమా నాకేడెమా, ఆశ్చర్యమే అద్భుతమే ప్రభువా" అనే పాటలు వ్రాశాను. మరుసటి రోజే చర్చిలో సాక్ష్యమిచ్చాను.

4 నెలలు ఇంట్లో విశ్రాంతి తీసుకున్నాను. పిల్లల విషయంలో బెడద తగ్గింది. డాడీని హైదరాబాదు నుండి క్షేమంగా కరప తీసుకొచ్చారు. 3నెలల వరకు కరప ఇంట్లోనే డాడీ ఉన్నట్టు పనిమనిషులకి కూడ తెలియకుండా రహస్యంగా ఉంచారు. డాడీ పూర్తిగా మామనిషే అన్న నమ్మకం మాకు కల్గింది. ఆయన్ని కాపాడుకోవడానికి ఎంత కష్టపడాల్సి వచ్చిందో! మోనికి 2వ పాప షాలూ పుట్టింది. 'మహిత షాలోమ్ ' అని పేరు పెట్టారు. ఎందుకంటే ఆ పాప పుట్టిన 2వ నెలలోనె విడుదల జరిగి, సమాధానం కలిగిందని ఆ పాపతో డాడీకి సమయం బాగా జరిగిపోయేది. మిగతా మనుమలు, మనుమరాండ్రందరి సహవాసం ఇన్నాళ్ళు కోల్పోయినందుకు బాధపడుతూ ఇప్పటికైనా దేవుడు ఆ అవకాశం ఇచ్చాడని వాళ్ళతో సంతోషంగా గడిపారు. ఎక్కువ ఉపవాస ప్రార్ధనలు చేస్తూ గడిపేవారు. ఎపుడు చూసినా ప్రార్ధన చేస్తూ ఉండేవారు. డాడీ మరల ఆత్మలో తీవ్రత పూర్వపు స్థితి కన్నా ఎక్కువ పొందుకున్నారు.

ఫ్రూటీ పెళ్ళి అక్టోబరు 7న నిర్ణయించారు. అదే రోజు డాడీ ఇంట్లోనే ఉన్నట్టు



అందరికీ తెల్సింది. మళ్ళీ 'ఆమె' ద్వారా శోధన ఎక్కువైంది. కాని డాడీ మెత్తబడ లేదు కాబట్టి వాటన్నిటిలో విజయమే కలిగింది. డాడీని విడుదల చేయడానికి దేవుడు నాకు మరణానుభవము ఇచ్చినందుకు, నిజంగా నన్ను దేవుడు ఉపయోగించుకున్నందుకు దేవునికి వందనాలు.

నేను మళ్ళీ డ్యూటీలో జాయిన్ అయ్యాను. మునుపటిలాగానే పనులు చేస్తూ నా పనితనంలో కుంటుపడకుండా ఉంటూ వచ్చాను. హాస్పిటల్ డాక్టర్లు నన్ను మంచిగానే చూసుకుంటూ వచ్చారు. 6 నెలలకొక సారి నా చెకప్‌కి వెళ్తూ వచ్చాను. దేవునికి ఇష్ట కరంగా మలచబడాలంటే దేవుడు మనలను కష్టాలకి, అవమానాలకి గురిచేస్తాడు. ఆ కష్టకాలంలో తన కృప చూపి ఎన్నో పాఠాలు నేర్పుతాడు. ఒక సంవత్సరంన్నర జరిగింది. తర్వాత హాస్పిటల్ డాక్టరు నా విషయంలో అభ్యంతరపడడం గమనించాను. నాక్రింద మరొక లేడీ డాక్టరు తన లాభం కొరకు నాపై, నా పనితనము మీద లేని పోనివి వారికి చెప్పి, నా మీద ఉన్న మంచి అభిప్రాయాన్ని చెడగొట్టింది. వారు అంత త్వరగా నమ్మినందుకు, వారు నమ్మినది తప్పు అని తర్వాత తెలుసుకొని చింతించారు. కాని దానికి ముందు నాకు ఇది చాల మనస్థాపమైంది. నన్ను పని నుండి తొలగించాలని వారనుకున్నట్టు తెల్సిన వెంటనే "నేను రేపటి నుండి పనికి రాను" అని ఓనర్ గారికి చెప్పాను. ఆడాక్టరు తప్ప మిగతా అందరూ నా పరిస్థితికి, వారు నాకిచ్చిన అమర్యాదకి చింతించారు. నేను చాల కృంగిపోయాను. ఎన్నోసార్లు నాకు అనారోగ్యం కలిగినా నాపని నిర్లక్ష్యం చేయలేదు. పిల్లలకి అనారోగ్యం కలిగినా నేను పనిని అలక్ష్యం చేయలేదు. 10సం॥ల నా పనితనాన్ని, గుణాన్ని నమ్మకుండా క్రొత్తగా వచ్చిన ఆమె మాటల్ని వీరు విని అభ్యంతరపడినందుకు నా మనసులో దుఃఖం కలిగింది. ఇంట్లో ఖాళీగా కృంగి ఉన్న ఆ సమయంలో దేవుడు నన్ను మరల సంధించాడు. "సేవ చేయడానికి అదొక్కటే హాస్పిటల్ కాదు ఈ లోకంలో ఉన్నది, ఎక్కడైనా, ఎలాగైన పని చేయవచ్చు, నీ అనుభవాలలో పాటలు వ్రాసి వాటికి రాగాలు కూర్చు, నేనింకా నిన్ను వాడుకుంటాను. నా పరిచర్యలో వినియోగించు కుంటాను" అని ప్రభువు నాకు ధైర్యమిచ్చారు. Man's disappointent is always God's appointment.

ఈ కృంగిన సమయంలో ప్రభువు నన్ను ప్రేరేపించిన కొలది పాటలు వ్రాయగలిగాను. కాని రాగాలు కూర్చటానికి నేను సంగీతము నేర్చుకోలేదు. అప్పుడు ప్రార్థన చేసుకున్నాను. నా పాటలకు నేనే రాగం కూర్చాలని, నేను ప్రార్థన పూర్వకంగా కూర్చునప్పుడు నా నోట ఎన్నో రాగాలు వచ్చాయి. అవి ఒక ప్రవాహములాగ నన్ను చుట్టు ముట్టాయి. నాకు నిజంగా ఆశ్చర్యమేసింది.

నేను పని మానేసిన ఒక్క వారంలోనే ఆ హాస్పిటల్‌లో ఇద్దరు పేషంట్లు చనిపోయారని, అందువలన డాక్టర్లు "తాము నన్ను తప్పుగా అర్థం చేసుకున్నామని, మీరుండి ఉంటే ఈ

విధంగా జరిగి ఉండేదని కాదని మళ్ళీ పనికి మా హాస్పిటల్‌కి రండి” అని స్వయంగా పిలిచారు. నేను అవునని చెప్పలేదు. దేవుడు నన్ను వెళ్ళమని ప్రేరేపించలేదు.

నేను నేర్చుకోవాలని తలంచినవి కొన్ని ఉన్నాయి కాని వాటికి నా భర్త అనుమతించలేదు. అయితే నేను చేయగలిగిన సేవ మాత్రం ఇంకా ఎక్కువ మొదలు పెట్టాను. ఫ్రీ మెడికల్ క్యాంప్‌లు పెట్టి, పేదలకు వైద్యసేవ అందించాను. సువార్త పనిలో దేవుడు ఎక్కువగా వాడుకున్నాడు.

ఇంతలో ఏప్రియల్ వచ్చింది. సెలవులకి ఊరెళ్ళి, పిల్లల్ని కరపలో వదిలి వచ్చాము. ఇక్కడ ఇంటికి దగ్గరలోని ఒక హాస్పిటల్ వారు నన్ను ఛీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఉండడానికి పిలిచారు. నేను నా ఆరోగ్య పరిస్థితి వివరించి “నేను అన్ని చెకప్‌లు చేయించుకుని, నార్మల్‌గా ఉంటే వస్తానని చెప్పాను. అయితే నాకు కడుపులో నొప్పి కొద్ది రోజులుగా వస్తుంది. అందుకే అలాగ చెప్పాను. వెంటనే డాక్టర్ గోపీనాథ్‌గారిని కలిసి, హాస్పిటల్‌లో అడ్మిటయ్యి పరీక్షలు చేయించుకుంటానని చెప్పి 20వ తారీఖు రాత్రి మల్య హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాను. ఇన్ పేషంట్‌గా అయితే బిల్ ఫ్యాక్టరీ కడుతుందని అలా చేశాను. డాక్టరు కొన్ని రక్త పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్‌కి వ్రాశారు.

మరుసటి రోజు స్కానింగ్‌కి పంపి, అదయ్యాక మరల ఎండోస్కోపి అన్నారు. స్కానింగ్ డాక్టరు నాతో మామూలుగా అంతా ఓకే అని పంపారు. అయితే ఎండోస్కోపీ డాక్టర్ ఎండోస్కోపీ చేసే ముందు మరొక డాక్టరుతో నా స్కానింగ్ రిపోర్ట్ గురించి మాట్లాడుతూ లివర్‌లో 2.5 సెంll ల ట్యూమర్ మెటాస్టేసిస్  ఉందట అని అన్నారు. నేను “మీరు నా గురించేనా మాట్లాడాదేది?” అని అడిగి దాని గురించి వివరాలు అడిగాను. ఎండోస్కోపి నార్మల్ అని పరీక్ష చేసి చెప్పారు.

ఇపుడు లివర్‌లోని ట్యూమర్ గురించి బయాప్సీ చెయ్యాలని, దానికి ముందు యమ్.ఆర్.ఐ చేయించారు. దాని రిపోర్ట్ రావడానికి 4 రోజులు పట్టింది. నేను లివర్‌లో సెకండరీస్ అంటే అది అడ్వాన్స్‌డ్  స్టేజ్ క్యాన్సర్. క్యాన్సర్ వ్యాధికి డాక్టర్లు 4 స్టేజెస్ చెప్తారు. 1,2,3,4 స్టేజెస్. నాది 4 వ స్టేజ్. కొన్ని క్యాన్సర్ వ్యాధులు, ఆపరేషన్ తోను,లేక ఆపరేషన్ మరియు కీమోథెరపి, లేక ఆపరేషన్ మరియు కీమోథెరపి మరియు రేడియో థెరపీలకి లొంగవచ్చు. జీవితకాలం పొడిగించబడుతుంది. కొందరు ఈ ట్రీట్‌మెంట్ తట్టుకోలేక అక్కడే చనిపోతారు కూడా. నాకు వచ్చింది 4 స్టేజ్ అంటే నాకు జీవితకాలం చాల తగ్గిపోయి 3 నెలలకి పడిపోయినట్లే. డాక్టర్లు ఎమ్.ఆర్.ఐ రిపోర్ట్ వచ్చాక CT guided FNAC చేశారు. స్లైడ్లు, ట్యూమర్ నుండి తీసిన రక్తం కేన్సర్ కణాలు కోసం పంపారు. అది రావడానికి ఇంకొక 4 రోజులు గడిచాయి. నేను పరీక్షల కోసం హాస్పిటల్ లో జాయిన్ అయినట్టు అమ్మకి, మిగతా వారందరికి తెలుసు కాని ఇలాగ లివర్ లో గడ్డ ఉందని మాత్రం డాడీకి, బున్నికి మాత్రమే చెప్పాను. వారు ప్రార్థన చేస్తూ ఉన్నారు.



డాడీ,అమ్మ హైదరాబాదులో చిట్టి మామయ్యకి బాగోలేకపోతే వెళ్ళారని చెప్పాడు బున్ని.

మామయ్యకి (ఐజక్ జె. కొమానపల్లి గారు) బ్రెయిన్‌లో బ్లీడింగ్ అయి చాల సీరియస్‌గా ఉన్నారని ఏరోజుకారోజు పరిస్థితి విషమిస్తున్నట్టు చెపూ్త వచ్చారు. అందుకని నా దగ్గర ‘నా’ అన్నవాళ్ళు ఎవరూ ఉండలేదు. నా భర్త కూడ డ్యూటీకి వెళ్తూ రాత్రి ఎపుడో 9 గంll ల తర్వాత వచ్చేవారు. నేను ఇలాంటి ఒంటరి పరిస్థితికి ఎందుకొచ్చాను? నన్నాదరించే వాళ్ళు ఎవరూ నా దగ్గర లేరే! అని, నా అనారోగ్య పరిస్థితి భయంకరమైన విషమస్థితికి చేరుకుందన్న నిజం నన్ను మరింత ఎక్కువగా ఆలోచింపచేస్తూంటే నేను దేవుని మీద ఆధారపడ్డాను. కృంగిపోయి, ఏడ్చి ‘గీ’ పెట్టకుండా “ఏ మేలు నీవు నాకు దీని ద్వారా అనుమతిస్తున్నావు? దేవుని ప్రేమించే వారికి సమస్తము మేలు కొరకు సమకూడి జరుగును” అని నీ వాక్యం చెపూ్తంది, ఈ శ్రమ వెనుక ఉన్న నీ చిత్తం ఏమిటి? నేనెలాగ జీవించాలి? నాకు నీ సంకల్పము బయలుపరచు” అని మోకాళ్ళపై ఉండి ప్రార్థించడం మొదలుపెట్టాను. ఆయన మెల్లని స్వరము వినడానికి ఇష్టపడ్డాను. 24.4.05న నా వాక్య భాగంలోని ఒక చిన్న భాగం నహూము 1:14 ఆఖరి భాగం చదివాను. “నేను నీకు సమాధి సిద్ధపరుస్తున్నాను”.

నేను రోజుకి బైబిలులోని 5 అధ్యాయాలు చదవడం అలవాటు. ఒకటి మొదటి పంచకాండాల నుండి,2వది కీర్తనల నుండి, 3వది సువార్తల నుండి, 4వది ప్రవక్తల గ్రంధాల నుండి, 5వది పత్రికల నుండి.కాని హాస్పిటల్‌లో ఎక్కువ సమయం ఒంటరిగా ఉండడంవలన ఇంకా ఎక్కువగా చదవడం, ధ్యానం చేయడం చేసేదాన్ని. నహూము భాగాన్ని చూసాక “దేవా నన్ను నీవద్ద చేర్చుకోవడం నీ చిత్తమా? అని ప్రార్థించడం మొదలు పెట్టాను. డాక్టర్లు నాకు “బెస్ట్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని, సెకండరీస్ లివర్‌లో ఒక్కటే ఉంది కాబట్టి దాన్ని ఆపరేషన్ చేసి తీసివేసి, ఖీమోథెరపీ ఇవ్వాలని” అన్నారు. ఈ అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ట్రీట్‌మెంట్ ఇచ్చి ఏమైనా ప్రయోజనం ఉందా? అని వారినడిగాను.“ ఇపుడు latest concept treatment. దీని ద్వారా ఆరోగ్యంగా ఇంకొన్నాళ్ళు బ్రతకవచ్చు” అన్నారు.

లివర్ ఆపరేషన్ అంటే నా దృష్టిలో చాల ప్రమాదకరమైనది. ఎందుకంటే నేను విశాఖపట్టణంలో చదువుకొనే రోజుల్లో ఒక పేషంట్‌కి లివర్ బయాప్సీ చేసారు. మరుసటి రోజుకి ఆ బెడ్ ఖాళీగా వుంది. సిస్టర్లని అడిగితే ఆపేషెంట్ లివర్‌లో ఎక్కువ బ్లీడింగ్ అయినందువలన చనిపోయాడని అన్నారు. అందుకే నాలో తీవ్రమైన టెన్షన్ అనుభవించాను.

25వ తారీఖున పత్రికల భాగం మొదటిగా చదవడం మొదలుపెట్టాను. అది 2వ పేతురు.మొదటి అధ్యాయం 13-15 వచనాలు చదివిన వెంటనే అవి నా కోసమే అన్నట్టు ఆ నిమిషంలో అనిపించింది. నేనపుడు “చనిపోవడం ఖాయమా? నా దినాలు

త్వరగా గడిచిపోతున్నాయా? సరే ఈ సమయాన్ని నేనెలా నీ కోసం వినియోగించాలి ప్రభువా" అని అడిగినపుడు దేవుడు నాలో "మరణం అందరికీ ఎలాగతధ్యమో, నీకు కూడా అంతే, అయితే నువ్వు నా కోసం కొన్ని పనులు చెయ్యాలి" అని వినిపించాడు "అదేమిటి ప్రభువా" అనడిగితే నువ్వు ఈ వాక్యభాగంలో ఉన్నది ధ్యానం చెయ్యమన్నాడు. "మరియు మన ప్రభువైన యేసు క్రీస్తు నాకు సూచించిన ప్రకారము నా గుడారమును త్వరగా విడిచి పెట్టవలసి వచ్చునవి ఎరిగి నేను ఈ గుడారము లో ఉన్నంత కాలము ఈ సంగతులను జ్ఞాపకము చేసి మిమ్మును రేపుట న్యాయమని ఎంచుకొనుచున్నాను. నేను మృతి పొందిన తరువాత కూడ మీరు నిత్యము వీటిని జ్ఞాపకము చేసి కొనునట్లు జాగ్రత్త చేతును." 26 వ తేదీన నేను చేయవలసిన పనులు చేసి, తర్వాత తరాలకు కూడ వాటిని భద్రం చెయ్యాలన్న సంగతి పై వాక్యం నుండి బోధపరచాడు. నేను మోకాళ్ళపై "ఏ సంగతులు జ్ఞాపకం చెయ్యాలి? ఏమి జాగ్రత్త చెయ్యాలి" అని ప్రార్థించాను. దేవుడు ఆశ్చర్యకరంగా 3 చిత్రాలు నాకు ఒకదాని తర్వాత ఒకటి త్వరత్వరగా నా కళ్ళముందుంచారు.

1. నేను నా శ్రమానుభవంలో వ్రాసిన పాటలు జాగ్రత్త చెయ్యాలి, వాటిని నేనే పాడి ఎంతో మంది బలహీనులకు ప్రోత్సాహన్ని ఇవ్వాలి. శ్రమలో ఉన్నవారిని అవి ఆదరించేవిగా ఉండాలి. వాటిని నేను పాడుతున్నట్టుగా దేవుడు చూపించాడు.

2. నా సాక్ష్యం అనేక మందికి ఎన్ని రకాలుగా చేరగలదో అన్ని రకాలుగా వినిపించాలి, ముద్రించి, ప్రచురించి భద్రం చెయ్యాలి. నేను నా సాక్ష్యాన్ని ఎంతో మందికి వివరిస్తున్నట్టుగా చూపించాడు.

3. నా వాక్య పరిచర్యలో నా అనుభవాలే ఉదాహరణగా ఉండే వాక్యాన్ని వినిపించి, వాటిని కూడా భద్రం చెయ్యాలి. ఇలా వాక్య పరిచర్య చేస్తున్నట్టు చూపించాడు. నేను నా స్వానుభవ పాటలు పాడుతున్నట్టు, నేను సాక్ష్యమిస్తున్నట్టు , వాక్యపరిచర్య చేస్తూన్న 3 చిత్రాల ద్వారా పై విధంగా నన్ను ప్రేరేపించాడు దేవుడు.

వెంటనే నేను నా ఆపరేషన్ కన్నా ఈ పనులు ముఖ్యమని, అవి చెయ్యాలని త్వరపడి డిశ్చార్జ్ చేయించుకొని ఇంటికి వెళ్ళిపోవాలనుకున్నాను.

డాక్టర్లతో మాట్లాడాను. పెథోలజిస్ట్ డా.సుధీంద్ర గారితో కూడా వివరంగా మాట్లాడాను. ఆయన "అది 100% సెకండరీస్ లివర్, ప్రైమరీ స్టోమక్ ఉండవచ్చు" అన్నారు.

దేవుడు నా వాక్య భాగాల ద్వారా ధైర్యపరచడం మొదలు పెట్టాడు. నా తల వెంట్రుకలలో ఒక్కటైనా ఊడి పడాలంటే నా దేవుని అనుమతి కావాలి. దేవుని అనుమతి తోనే ఈ వ్యాధి నా జీవితంలోనికి వచ్చింది, కాబట్టి నా శ్రమను నేను వినయంతో భరించి, దేవుని కొరకు విశ్వాసం కాపాడుకొని, నీతికిరీటం పొందాలని గట్టిగా



నిర్ణయించుకున్నాను.

రోమా8:18,8:28 వాక్యంలో నేను పరలోకంలో పొందబోయే మహిమ ఎదుట ఇపుడు పొందే శ్రమ శారీరకమైనా, మానసికమైనా అది ఎన్నతగినది కాదని, దేవుని పిల్లలకు సమస్తం మేలు కొరకే సమకూడి జరుగును అని విశ్వసించాను.

అంకుల్ ఎరిక్ గారి జీవిత చరిత్ర చదివాను. దాని ద్వారా కూడా చాల సంగతులు తెలుసుకొని బలపడ్డాను. 'అయితే నన్నే ఎందుకు ఎన్నుకున్నావు?' అని ప్రార్థించినందుకు రోమా 9:20-24 వరకు చూపించాడు. అవును గాని మనుష్యుడా! దేవునికి ఎదురు చెప్పుటకు నీవెవడవు ? నన్నెందుకీలాగు చేసితివని రూపింపబడినది రూపించిన వానితో చెప్పునా...."

ఈ వాక్యం చదివి 'నువ్వు నన్ను సాక్షిగా ఉండమన్నావు? అంటే నువ్వు స్వస్థపరుస్తావా? ఒక వేళ బాధతోనే ఉండి సాక్షిగా ఉండమంటే నేనేమని సాక్ష్యమివ్వను? నాకు ఇంత వరకు తెలిసిన సాక్ష్యం స్వస్థత పొందితేనే ! అయితే ఈ బాధను ఎలాగ తట్టుకోగలను? నేను తట్టుకోలేనేమో! నేను సహించుకుంటూ నా దేవుడు ఇది మేలుకే ఇచ్చాడు అని నేను చెప్పలేనేమో! నేను క్రైస్తవురాలిని, అయినా మహా పాపి అందుకే దేవుడు శిక్షిస్తున్నాడని అందరూ నిందిస్తారేమో! నా వలన నీ నామం దూషణ పాలౌతుందేమో ప్రభువా" అని ప్రార్థన చేసినపుడు "నేను నిన్ను స్వస్థత పొందిన దానిగా కాక బలహీనతలోనే నేను నిన్ను వాడుకుంటాను. బలహీనతలోనే నా శక్తి పరిపూర్ణమగుచున్నది, నాకృప నీకు చాలు" అని సెలవిచ్చాడు. ఈ లోకంలో ఉన్న మనకు ఉన్న శరీరము మంటి శరీరము. కాబట్టి ఈ మంటి శరీరము ఒకవేళ క్యాన్సర్ నుండి స్వస్థత పొందినా, వేరే వ్యాధి ఏదైనా మరల సంభవించవచ్చు, ఎందుకంటే ఇది పాపిష్టి శరీరం. పూర్తిగా స్వస్థత పొందిన శరీరం కావాలని, ఎప్పటికీ ఏ వ్యాధి సంభవించకూడదంటే అది మరలా క్రీస్తుతో మహిమ శరీరముగా లేపబడిన క్షణం వస్తుంది. కాబట్టి అశాశ్వతమైన ఈ లోకములో బలహీనతతో ఉండగా నిరంతరం దేవుని మీద ఆధారపడుతూ ఆయన శక్తిని క్షణ క్షణం అనుభవించాలనే జ్ఞానం దేవుడిచ్చాడు.

రోమా 8:35-39 క్రీస్తు ప్రేమ నుండి నిన్ను ఏమియూ ఎడబాపనేరవు. నువ్వు నా చేతిలో ఉన్నావు, వుంటావు అని భరోసా ఇచ్చాడు దేవుడు. అప్పటి నుండి మనసులో వచ్చే వ్యతిరేక ఆలోచనలను పారద్రోలుటకు దేవుడు సహాయం చేసాడు.

'నా దినముల అంతము ఎలా ఉండబోతూంది? నా దినముల ప్రమాణము ఎంత ప్రభువా?' అని ప్రార్థించినపుడు 'నాదృష్టికి బెత్తెడంత' అని తన వాక్యము నా ముందు పెట్టాడు. అయితే "నీచులకు నన్ను నిందాస్పదముగా చేయకు, నేను వెళ్ళిపోయి లేకపోకమునుపు నేను తెప్పరిల్లునట్లు నన్ను కోపముతో చూడకు, దేవా! నీ చిత్తము

నెరవేర్చుట నాకు సంతోషము" అని ప్రార్థించాను.

మామయ్య పరిస్థితి రోజు రోజుకీ విషమిస్తూందని, వెంటిలేటర్ మీద పెట్టారు అని బున్ని చెప్పాడు. నాకు కూడా మామయ్యని చూడాలని మనసులో చాల కోరిక ఉంది. ఆపరేషన్ చేయించుకుంటే బ్రతుకుతాననే నమ్మకం నాలో లేదు. నా ఆయిష్షు 3 నెలలే అయితే నేను చేయాలని దేవుడిచ్చిన పనులు త్వరగా పూర్తి చెయ్యాలని చాలా ఆశగా ఉంది. అయితే డాక్టర్లు ఆపరేషన్ చేయించుకుంటే మంచిది అని చెప్తూ వచ్చారు. డాక్టర్లు అందరూ ఈ నిర్ణయం తీసుకొనే సరికి 7 రోజులు గడిచాయి.

నేను ఆపరేషన్‌కి అంగీకరించకూడదని డాడీ చెప్తున్నారని బున్ని ఫోన్‌లో చెప్పాడు. డాడీకి సంగతి బాగా తెలిసి కూడా నా దగ్గరకు రాకుండా అక్కడే ఉండి మాట్లాడుతున్నారేంటి అని సందేహం కలిగినా ఏదో బలమైన కారణం ఉండే ఉంటుంది. ఆయన బెంగుళూరు రాకపోవడానికి ఏమైె ఉంటుంది అని ఆలోచిస్తూ డాడీని నాతో ఫోన్‌లో మాట్లాడమని చెప్పాను బున్నితో. డాక్టరు గోపీనాథ్‌గారు ముందు డయాగ్నోస్టిక్ లేప్రోస్కోపీ చేసి తర్వాత ప్రొసీజరు ఏమి చెయ్యాలో థియేటర్‌లో టేబుల్ మీద నిర్ణయిస్తాం. అది లివర్‌లోని గడ్డ మాత్రం తీసెయ్యడం లేక అలా వీలుకాకపోతే లివర్ లోబ్ పూర్తిగా తీసెయ్యడం" అని చెప్పారు. ఇదే విషయం డాడీతో చెప్తే డాడీ చాల కోపంగా, టెన్షన్‌తో ఫోన్‌లో అరిచారు. "ఆపరేషన్‌కి వెళ్ళవద్దు. మన దేవుని మీద నీకు విశ్వాసం లేదా? ఆయన మృతులను సజీవులనుగా, లేనివాటిని ఉన్నట్టుగా పిలిచేవాడు. అందుకని డయాగ్నోస్టిక్ లాప్రోస్కోపీలో దాన్ని తీసేటట్టుగా వీలైతే దానికి మాత్రమే ఒప్పుకో అంతేకాని లివర్ లోబెక్టమీ వద్దని" చెప్పమన్నారు. నేను "ఎక్కువ ప్రార్థన చెయ్యండి, టెన్షన్ పడవద్దు" అని నేను చాలా పట్టుదలగా ప్రార్థించాను.

27వ తారీఖు ఉదయం 8 గంటలకు నేను ప్రార్థనలో కూర్చున్నాను. నేను ఆపరేషన్‌కి ఒప్పుకోవాలా? వద్దా? నాకు ఖచ్చితమైన జవాబు కావాలి అని ప్రార్థన చేసి నీ వాక్యం ద్వారా నన్ను నడిపించు ప్రభువా! ఏ భాగం తీసి చదవను? అని ప్రశ్నించుకున్నాను. ప్రవక్త గ్రంథంలోని నీ డైలీ పోర్షన్‌లో తీసి చదువు అనే మెల్లని, చల్లని, మెత్తని స్వరాన్ని నా మనసులో నుండే నేను విన్నాను. ఆ రోజు యోబు 2వ అధ్యాయం చదవాలి. చదువుతూ ఉండగా 6వ వచనం వద్ద ఆగాను "అతడు నీ వశమున ఉన్నాడు, అతని ప్రాణమును మాత్రము నీవు ముట్టవద్దని" సాతానుతో యెహోవా దేవుడు చెప్పిన మాట ఉంది. ఆ మాట విని వాడు వెంటనే వెళ్ళి యోబును నడినెత్తి నుండి అరికాలి వరకు బాధగల కురుపులలో మొత్తెను అని వ్రాసి ఉంది. అపుడు దేవుని వాక్కు నన్ను ఇలా ఆదరించడం మొదలు పెట్టింది. "నీ శరీరములో ఎన్ని కత్తి పోట్లు పడినా, ఆపరేషన్‌లు జరిగినా, నీ ప్రాణానికి మాత్రం ముప్పు ఉండదు" అని. నాలో అంత వరకూ "ఆపరేషనే వద్దు ఇంటికి పోదాం" అని అంటున్న నాలో ఆపరేషన్‌కి వెళ్ళాలి అనే మనసును దేవుడు



నాలో పెట్టాడు.

నేను వెంటనే సాతానుతో నా ప్రార్థనలో ఇలా చెప్పాను. "సాతానా విను! నా ప్రాణాత్మ శరీరాలు దేవుని చేతిలో ఉన్నాయి. నువ్వు నన్ను నడినెత్తి నుండి అరికాలి వరకూ మొత్తాలని దేవుడు నీకు అనుమతించినా నా ప్రాణము తీయుటకు నీకు అధికారము లేదు, నా శ్రమలో నేను దేవుని ఘనపరుస్తాను, ఈ ఆపరేషన్ జరగడం ద్వారా మరణచ్ఛాయలో కూడా ప్రభువును ఎలా స్తుతించాలో నా ప్రభువు నాకు నేర్పిస్తాడు, నువ్వు నన్నేమి చేయలేవు, యేసు నామంలో నేను విజయాన్ని పొందుకున్న దానను".

"దేవా నీ కట్టడలను నెర్చుకొనునట్లు శ్రమ నొందియుండుట నాకు మేలాయెను నా శ్రమలో నా యదార్థతను విడువకుందును" నాకు కలిగిన ఈ హింసకై, బాధకై శ్రమకై స్తుతి చెల్లించాను.

లివర్ FNAC రిపోర్ట్‌ను మరొక పేరు మోసిన పెథాలజిస్ట్‌తో మరల 2వ అభిప్రాయం తీసుకున్నారు డాక్టర్లు. ఇంకా కొన్ని చేయవలసిన టెస్టులు చేసి ఏప్రిల్ 30వ తారీఖు ఉదయానికి ఆపరేషన్‌కి ఏర్పాటు చేసారు. ఇప్పటికే చాల ఆలస్యమైనదని, ఇక ఆపరేషన్ వాయిదా వేసే ఉద్దేశం లేదని డాక్టరు చెప్పారు.

Beacause He lives I can face Tomorrow

Beacause He lives all fear is gone

Beacause I know I know

He holds my future

and Life is worth living

Just because He lives.

డాడీ రాత్రికి మాట్లాడారు. ధైర్యంగా ఉండమన్నారు. ఎంత వరకు అవసరమో అంతే ఆపరేషన్ చేసి ముగించి బయటికి వచ్చేటట్టుగా డాక్టర్లకి జ్ఞానమివ్వండి అని ప్రార్థించమని, నేను కూడా ప్రార్థించాను.

నాకు ఆపరేషన్ నిర్ణయమైన సంగతి అమ్మకి, నా పిల్లలకి ఇంట్లో ఇంకా చాలా మందికి తెలియదు. బంధువులెవ్వరికి కూడా తెలియదు. అందరూ మామయ్య అనారోగ్య పరిస్థితి గురించే ఆలోచిస్తున్నామని అన్నారు. అయితే డాడీ, బున్నిలు మాట్లాడుతున్నంత సేపూ వారి మాటల్లో తీవ్రమైన కలవరం. ఆంధోళన ఉన్నట్టు గ్రహించాను. నేను ఇలా ఉన్నా మామయ్య అనారోగ్య కారణంగా నా దగ్గరికి రాలేకపోతున్నందుకు కలవరపడుతున్నారేమో అని అనుకున్నాను. నాకు మాత్రం దేవుడు యోబు గ్రంథం నుండి మాట్లాడి ధైర్యమిచ్చాక నాలో మరల అధైర్యమే రాలేదు.

హాస్పిటల్‌లో నేనున్న రూములో ప్రక్క బెడ్ మీద మొదటిగా భవ్య అనే అమ్మాయి, ఇంజనీరింగు స్టూడెంటు 2 కాళ్ళు విరిగి ఆపరేషన్ జరిగి ఉండింది. నేను చేరేటప్పటికే

ఆమె నడవవలసినది కాని లేవలేకుండా డాక్టర్లు, ఫిజియోథెరపిస్టు చెప్పిన సలహా వినకుండా నొప్పి అని చెప్తు వచ్చింది. ఒకరోజు డాక్టరు బాగా గదమాయించి నడవకపోతే ఇక ఇంతే నువ్వు అని వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి భోరుమని ఏడ్వడం మొదలు పెట్టింది. ఆమె నొప్పి గురించి ఏడ్వడం లేదు కాని తనకే ఎందుకిలా జరిగింది అని ఏడుస్తున్నట్టు ఆమె మాటల ద్వారా తెలుసుకుని, ఆమె మనసు అర్థం చేసుకుని, నా గురించి చెప్పి దేవుడిచ్చిన మనస్థైర్యం నువ్వూ పొందుకోవచ్చు అని చెప్పి ప్రార్థన చేసాను. మరుసటి రోజు లేచి నిలువబడి నడిచింది. ఆ మరుసటి రోజు డిశ్చార్జ్ అయింది.

ఇంకొక 21 నెలల బాబుని కడుపు నొప్పి, వాంతులు అని అడ్మిట్ చేసాను. వాళ్ళు ముస్లిములు. చిన్న పిల్లాడితో తల్లి దండ్రులు బాగా నలిగిపోయేవారు. ఆ బాబుకి మందులతోనే ట్రీట్మెంట్ ఇస్తూ ఉన్నారు. పుట్టిన వెంటనే ఆ బాబుకి ప్రేవులకి సంబంధించిన ఆపరేషన్ చేసారట. ఇపుడు కూడా మందులతో కుదరకపోతే ఆపరేషన్ అవసరం అని వాళ్ళ డాక్టరు చెప్పారు. వారు చాల కృంగిపోయి ఉన్నారు. సిస్టర్లు చేసే పని కూడా కొంత వాళ్ళకి నచ్చలేదు. నేను వాళ్ళకి బిడ్డ గురించి సహనంతో ఉండాలని, వాళ్ళని సాధుపరచి, Intestinal Obstruction ఎలాంటిదో వారికి స్నేహపూర్వకంగా వివరించి ధైర్యం చెప్పాను. మాకు ధైర్యం చెప్పడానికే దేవుడు మిమ్మల్ని ఇక్కడ ఉంచాడు అని వారన్నారు. పిల్లవాడి వల్ల నాకు చాల డిస్టర్బెన్స్గా ఉన్నా వేరే గదికి మారిపోదామని అనుకున్నా వీరిని ధైర్యపరచాలని ఉండిపోయాను. నా వ్యాధి గురించి కనుక్కుని మీరింత ధైర్యంగా నవ్వుతూ ఎలా ఉండగలుగుతున్నారు? అని అడిగాడు బాబునాన్న నేను చెప్పాను. "I am in the hands of JESUS. He knows everything about me. He allows everything which suits me, for my benifit sake, even if it is a painful condition Because He holds my future". “మీరు ఇంతగా దేవుని నమ్ముతున్నారు. అందుకే వేరే వారి మీద ఆధారపడకుండా ఉండగలుగుతున్నారు” అని అన్నాడు బాబునాన్న. తల్లిని కూడా మాట్లాడించి ధైర్యపరచి వాళ్ళు పిల్లవాని వద్ద ఎలా ఉండాలో అంతా చెప్పాను. వాళ్ళు ఏడవకుండా ఆపగలిగాను. సర్జరీ లేకుండా నయమై డిశ్చార్జ్ చేయించుకొని వెళ్ళారు.

రేపు ఉదయమే నా ఆపరేషన్ అని తెలిసాక బుచ్చుకు రానీకి, నా భర్తకి, బున్నికి చెప్పవలసిన నా మాటలు కొన్ని పుస్తకంలో వ్రాసి భద్రపరిచాను. వారు తర్వాత వాటిని చదువుకొని నా మాటలు పట్టించుకుంటారని ఆశ.

సమాధి సిద్ధపరుస్తున్నానని వచ్చిన వాక్యం తర్వాత అయితే అది ఇపుడే కాదు అన్నట్టుగా, నాకు ప్రోత్సాహం కలిగించేలా నాకు రోజు వాక్య భాగాలు వస్తూనే ఉన్నాయి. 116వ కీర్తన, 118వ కీర్తనలలో దేవుడు నాలో శక్తి నింపాడు. నా భర్త కూడా “సమస్తం మేలు కోసమే మనకు సమకూడి జరుగుతుంది, దేవుని చేతిలో పెట్టాము కదా, ధైర్యంగా ఉండు” అని అన్నారు. చర్చిలో వారికి కూడా నా గురించి, ఆపరేషన్ గురించి



తెలియదు. అసలు నేను హాస్పిటల్లో ఉన్న సంగతి పాస్టర్ గారికి తప్ప మరెవరికీ తెలియదు. ప్రభువు నమ్మదగినవాడు ఆయన మిమ్మును స్థిరపరచి ప్రతి దుష్టత్వము నుండి కాపాడును అని వ్రాయబడిన 2 థెస్స 3:3 ద్వారా చాలా ధైర్యంగా థియేటర్కి వెళ్ళాను. దేవా నేను నీదానను, నీ బిడ్డను అనే అనుకుంటూ మత్తు ఇంజెక్షన్తో కళ్ళు మూసాను.

In His time, In His time
He makes all things beautiful
In His time
Lord please show me everyday
As you're teaching me your way
That you do just what you say
In your time
In your time, In your time
You make all things beautiful
In your time
Lord my Life to you I bring
May each song I have to sing
Be to you a Lovely thing
In your time.

ఏప్రిల్ 30న నాకు ఆపరేషన్ జరిగింది. చాల రిస్క్తో కూడుకున్న సర్జరీ అయినా దేవుడు నాకిచ్చిన భరోసాతో చాలా బాగా జరిగింది. మనసంతా చాల నెమ్మదితో నిండుకొని ఉంది. భయము, దిగులు అసలు ఉండలేదు. ఎంతో నొప్పి ఉన్నా దాన్ని సహించుకుని, భరించగల శక్తి ఉంది. సర్జరీ అయ్యాక నా భర్త, పాస్టరమ్మగారు లోపలికి వచ్చారు. చిన్న ఆపరేషనే అట జరిగిందని వారు మాటిమాటికి నాతో అంటూంటే లాప్రోస్కోపిక్ సర్జరిలోనే తీసేసారేమో అని అనుకున్నాను. కాని 4వ రోజు డ్రెస్సింగ్ మార్చారు. అపుడు చూసుకుంటే పెద్ద గాయమే. పెద్ద ఆపరేషనే దగ్గు కూడా ఎక్కువై నొప్పి ఎక్కువగా ఉన్నా భరించే శక్తి వచ్చింది. తట్టుకొనే శక్తి దేవుడు ఇచ్చాడు.

డాడీ మే 1వ తారీకు అంటే మరుసటి రోజు వచ్చారు. నన్ను తర్వాత వార్డుకు ఐ.సి.యు నుండి షిఫ్ట్ చేసారు. మామయ్య ఎలా ఉన్నారని అడిగితే ఇంకా సీరియస్ గానే ఉన్నారని అన్నారు. వెంటిలేటర్ మీదే ఉన్నారన్నారు. నాకు ఆరోజు రాత్రి ఒక కలవచ్చింది. చిట్టత్త (మామయ్య భార్య) చాల నిరాసక్తంగా కూర్చున్నట్టు, నేను రెండు రకాల పువ్వులు ఆమె చేతిలో పెట్టబోతూంటే వద్దని చెప్పినట్టు ఉంది ఆకలలో. నేను నా

భర్తతో, డాడీతో కూడా ఆ కల గురించి చెప్పాను. దేవుడు ఆయనను తీసుకుంటాడేమో అని అన్నారు. మామయ్య గురించి చాల విషయాలు నేను నా భర్తకి చెప్పాను.

నేను వార్డుకి వచ్చాక పిల్లలతో ఫోన్‌లో మాట్లాడాను. వాళ్ళు నా మాట స్వరం విని సంతోషపడ్డారు. నేను ఇంట్లో ఉన్నట్టే చెప్పాను. ముందు డల్‌గా మాట్లాడినా తర్వాత వాళ్ళు మామూలైపోయారు.

ఆ మరునాడు నర్సాపురం నుండి మాట్లాడుతున్నట్టుగా అమ్మ పెద్దమ్మ ప్రీతి మాట్లాడారు. నాకు ఈ లివర్ ఆపరేషన్ అయిన సంగతి అమ్మకి పిల్లలకి, అందరికి తెలిసిందట. విషయం వినగానే అమ్మకి, పిల్లలకి చాల దిగులై దుఃఖపడ్డారు. అయితే నేను "ధైర్యంగా ఉండండి. నేను బాగానే ఉన్నాను. బాగానే రికవర్ అయ్యాను. త్వరగా ఇంటి కెళ్ళేటట్టు ప్రార్థన చేయండి" అని చెప్పాను. మామయ్య సంగతి అడిగాను. "మామయ్య హైదరాబాదులోనే హాస్పిటల్‌లోనే ఉన్నారు, మేము నర్సాపురం వచ్చాము, వెంటిలేటర్ పెట్టినా లాభం లేదట. అందుకని తీసేసారు. అయినా ప్రాణంతోనే కోమాలో ఉన్నారు". అని చెప్పారు. నాకు మామయ్య హైదరాబాదులో ఉంటే వీళ్ళు నర్సాపూర్ ఎందుకు వెళ్ళారు? అని అనుమానం వచ్చింది కాని కారణం అడగలేదు. డాడీ అప్పటికి 2 రోజులు క్రితమే మరల కరప వెళ్ళిపోయారు.

మే 6వ తారీఖున నా కజిన్ జాయిసి బెంగుళూరు వచ్చినట్టు నన్ను కలవాలని ఫోన్ చేసింది. తనని కూడా మామయ్య విషయం అడిగాను. తను చాలా మాములుగా 13 తారీఖున జ్ఞాపకార్థ కూడిక అని అంది. నేను ఖంగుతిని "మామయ్య చనిపోయారా?" అని అడిగితే "అక్కా నీకు తెలియదా? అయితే నాకూ తెలియదక్కా" అని కంగారు పడిపోయింది. నాకు మనస్సు స్థబ్దంగా అయిపోయింది. జాయిసి వెంటనే "రేపు కలుస్తానక్కా" అని ఫోన్ పెట్టేసింది. ప్రక్కనే ఉన్న నా భర్త ఆయన బ్యాగ్‌లో నుండి కొన్ని పేపర్లు తీసి ఇచ్చారు వెంటనే. అవి మామయ్య భూస్థాపన ప్రోగ్రాం షీట్స్ ఆయన జీవిత చరిత్రను తెలిపే న్యూస్ పేపర్లు. అయితే ప్రోగ్రామ్ షీట్ మీద ఉన్న **మహిమ ప్రవేశం** అనే మాట మనసులో నుండి పొంగి పొరలి బయటికి వస్తున్న నా దుఃఖాన్ని ఆపింది. నా మనస్సును, హృదయాన్ని సముదాయించింది. ఆ మాట ఎంత సూటిగా నా హృదయంలోనికి వెళ్ళిందంటే నాకు వెంటనే ఆదరణగా అనిపించింది. అన్ని వివరాలు నా భర్తని అడిగితే మామయ్య ఏప్రిల్ 27వ తారీఖు మధ్యాహ్నం చనిపోయారని అన్నారు. "నాకెందుకు చెప్పలేదు? ఈ మామయ్య ఒక్కరే మనకి మీ అమ్మ (మా అత్తగారు) చనిపోయిన తర్వాత కండోలెన్సెస్ తెలుపుతూ ఉత్తరం వ్రాసారు, నాకు చెప్పకుండా ఎందుకు దాచారు?" అని అడిగితే "డాక్టరుగారు నీకు ఆపరేషన్ ముందు ఈ విషయం తెలిస్తే డిప్రెషన్‌లోనికి వెళ్ళిపోతావు. సర్జరీకి ఫిట్‌కాదు, మరల రికవర్ అయ్యేసరికి వ్యాధి ఎక్కువైపోతుంది. చనిపోయిన ఆయన ఎలాగూ తిరిగిరారు. ఇపుడు డిశ్చార్జ్



చేయించుకున్నా భూస్థాపన కార్యక్రమానికి మీరు చేరలేరు, అందుకని ఈ సంగతి నీకు చెప్పకపోవడమే మంచిది" అని చెప్పారు అని అన్నారు.

నేను త్వరగా కోలుకున్నాను. 8వ రోజుకి డ్రెస్సింగ్ మార్చారు. డ్రెస్సింగ్ చెయ్యడానికి వచ్చిన డాక్టరు క్రిష్ణారెడ్డిగారు, "ఒకటి టెస్ట్ రిపోర్ట్ రావాలి. అది వస్తే ఏ విధమైన కీమో థెరపీ ఇవ్వాలో నిర్ణయిస్తాము. అది పాజిటివ్ వస్తే రోజూ మింగే నోటి మాత్రలు ఇస్తాము, నెగటివ్ వస్తే ఇంజెక్షన్స్ ఇవ్వాలి, ఏ కీమోథెరపీ అయినా చాల నీర్సం కలిగిస్తాయి. కాబట్టి మిమ్మల్ని చూసుకుంటూ, కనిపెట్టుకొని ఉండడానికి ఎవరో ఒకర్ని హెల్పర్‌గా ఇంట్లో తప్పక ఉంచుకోవాలి. 24 గంటలూ ఉండాలి" అని అన్నారు. జుట్టు రాలడం గురించి అడిగాను. ఆయన "మీ స్వంత జుట్టునే విగ్‌గా తయారు చేయించుకొని అదే ఉపయోగించుకుంటూ మీరు హాస్పిటల్‌లో కీమోథెరపీకి అడ్మిట్ అవ్వండి. మీ జుట్టు మీరు కలిగి యున్నారనే తృప్తి మీకుంటుంది". అన్నారు. నేను మరల "నా ఈ పరిస్థితికి మీరు ఇచ్చే జీవిత కాలం ఎంత ఉండచ్చు? కీమో తీసుకుంటే ఎంత, తీసుకోకపోతే ఎంత?" అని అడిగాను. ఆయన దానికి సూటిగా సమాధానం ఇవ్వలేదు. "దేనికైనా గ్యారంటీ ఉంటుంది కాని మనిషి జీవితానికి గ్యారంటీ లేదు. 10 సం॥రాలు ఖచ్చితంగా బ్రతుకుతారు అని అనుకున్నవారు త్వరగానే చనిపోయారు. చాల తక్కువ కాలమే బ్రతుకుతారు అని అన్నవారు చాలకాలం బ్రతికారు. మీరైనా మేమైనా ఎప్పటికైనా ఈ కారణంగానైనా లేదా వేరే కారణంగానైనా ఎపుడైనా చనిపోవచ్చు. అందుకని జీవితకాలం ఎంత అని ఆలోచించడం మానేసి మీ మనసును బిజీగా పెట్టుకోండి. ఓపిక ఉన్నంత కాలం పని చేసుకోండి, ఎక్కువగా అలసిపోయేంత పని చేయవద్దు. ఏదో ఒక పనిలో నిమగ్నమైతే ఈ భయంకర పరిస్థితి నుండి బయటికొస్తారు" అని అన్నారు.నేను కీమోథెరపి తీసుకోనని అన్నాను. ఆయన చిన్న పిల్లని మందలించినట్టుగా "వద్దు అని అనకూడదు. తీసుకుంటే తప్పక మంచే జరుగుతుంది" అని అన్నారు.

తర్వాత డిశ్చార్జ్ చేశారు కుట్లు తీయించుకోవడానికి 12వ తారీఖు రమ్మన్నారు. అంతలో చర్చిలో ఒక స్త్రీల రిట్రీట్ జరిగింది. నా చేత రిట్రీట్‌కి ప్రారంభ ప్రార్థన చేయించాలనుకుని పాస్టరమ్మగారు ఫోన్ చేసి అడిగారు. నేను దేవుడిచ్చిన మహా భాగ్యంగా ఎంచుకుని కుట్లు తీయకపోయినా, అలాగే బలహీనంగా ఉన్నా చర్చికి వెళ్ళాను. నేను ప్రారంభ ప్రార్థన చేసాను. తర్వాత ఒక పాట పాడి, కొద్ది సేపు కూర్చుని ఇంటికి వచ్చేసాను. చర్చిలో కూడుకున్న స్త్రీలందరికి నేను మెల్లగా నడవడం, చిక్కిపోవడం చూసి "ఏం జరిగింది? మాకు తెలియజేయలేదు, ఎందుకు?" అని చుట్టూ మూగారు. నేను అన్నిటికి చిరునవ్వుతోనే సమాధాన మిచ్చాను. నేను చాల మొండిదాన్నని కూడా అన్నారు.

నేను చర్చిలో ఎవరికీ తెలియపరచకపోవడానికి కారణం ఉంది. సాతాను చర్చిలో

సహోదర, సహోదరీల మధ్య అభ్యంతరాలు కలిగించాడు. అందుకని నా భర్త మీద చాల మంది వ్యతిరేకముగా మాట్లాడుతూ ఉన్నారు. మాకు తెలిసి పొరపాటు చెయ్యలేదు. అయితే ఎందుకు అందరూ వ్యతిరేకంగా మాట్లాడారో, అలా ప్రవర్తించారో తెలియలేదు. దాన్ని బట్టి నా అనారోగ్య పరిస్థితి తెలియచెప్పలేదు. అయినా వారికి నా విషయం తెలిసాక కొన్ని మాటలు నా మనసును కష్టపెట్టాయి. క్యాన్సర్ వ్యాధి గురించి ఇంకా వారికి తెలియదు కాని అప్పటికే దేవుని దృష్టికి నా భక్తి సరైనది కాదు, అందుకే దేవుడు మాటి మాటికి అనారోగ్యం కలిగిస్తున్నాడు అని మాట్లాడేవారు చర్చిలోను, బంధువుల్లోను బయలుదేరారు. ఈ మాటలు వినేటపుడు నా మనసులో చాల దుఃఖమైంది.

ప్రభువు మీద ఎక్కువగా ఆధారపడడం మొదలు పెట్టాను. ఆపరేషన్ జరిగిన తర్వాత కూడా నా హృదయంలో నేను అల్పాయుష్కురాలిని అనే అభద్రతా భావం నన్ను ఎపుడూ వెంటాడుతూ ఉండేది. నేను 2006 జనవరి 1వ తారీకు లోపలే చనిపోతానని నేను డాక్టరుగా నా ఆయుష్షు అంతేనని నిర్ణయించేసుకున్నాను. దేవుడు నన్ను చెయ్యమని అప్పగించిన పనులు త్వరగా చెయ్యాలని ఆతృత చాల ఎక్కువగా ఉండింది. పాటలు ఇంకా కొన్ని వ్రాసాను, రాగాలు కట్టాను. అన్ని అనుభవాల్ని నేను అక్షరరూపం చేసి దేవుడు ప్రేరేపించగా వ్రాసినవే. నా పాటలలో నా మనసును, హృదయాన్ని పొందుపరచి, దేవుని సహాయం ఎలా పొందుకున్నానో అదే అనుభవం నా పాటల్లో వ్రాసాను. దుఃఖం కలిగిన సమయాల్లో నా హృదయ వేదనను అక్షర రూపము చేసినవి కూడా వాటిలో ఉన్నాయి. ఆ పాటలు ఇపుడు వింటూంటే నాలో అప్పటి భారభరితమైన హృదయం గుర్తుకొచ్చి "దేవుడు ఎంత దయగలవాడు, ఎంత గొప్పవాడు, నన్ను ఈనాటికి సజీవిగా ఉంచాడు" అని ఎంతో సంతోషంతో కొనియాడాను. నా పాటలు నాకే ఒక తల్లి తన బిడ్డను కౌగిలించుకొని, ముద్దాడి, ఆదరించినట్టుగా అనిపిస్తుంది. నా పాటలకు ఆల్బమ్‌గా చెయ్యాలని దేవుడు నాకిచ్చిన పరిచర్య అని తెల్పిన వెంటనే నా భర్త నన్ను ప్రోత్సాహపరచి, క్యాసెట్ రికార్డింగ్ చెయ్యడానికి పూనుకుని ప్రముఖ సువార్త సంగీత దర్శకులైన బ్రదర్ పి.జె.డి కుమార్ గారిని సంప్రదించారు. ఆయన, వారి సతీమణి నన్ను ప్రోత్సాహపరచారు. త్వరగా దానికి చెయ్యవలసిన ఏర్పాట్లు చేసారు. రికార్డింగ్ హైదరాబాద్‌లోని అమృతవాణి స్టూడియోలో చాల సంతృప్తికరముగా జరిగింది. ఒక క్యాసెట్ రూపములో నా పాటలు మొట్టమొదటిగా "నా శైలమా నా కేడెమా" అను పేరున నా జన్మదినపు ఆదివారపు ఆరాధనలో విడుదల చేసాము.

ఆపరేషన్ జరిగిన మే నెల నుండి అక్టోబరు నెల వరకు దేవుడు నాకు ఎన్నో విషయాలు బోధించారు. కొందరు విశ్వాసులు, బంధువులు నేను పాపిని కాబట్టే దేవుడు ఇలా శిక్షిస్తున్నాడని మాట్లాడినపుడు నేనెంతో దుఃఖముతో దేవుని పాదాల దగ్గరర నా సమయాన్ని గడిపాను. "ప్రభువా! నువ్వు నీ సాక్షిగా ఉండాలని నాకు సెలవిచ్చావు. దానికి నేను



కూడా స్థిరమైన మనసుతో సిద్ధముగా ఉన్నాను. అయితే సాక్ష్యములో నేనేమి చెప్పాలి ప్రభువా? ఇంత వరకు నాకు తెలిసిన సాక్ష్యము స్వస్థత పొందానని చెప్పి దేవున్ని మహిమ పరచడమే అయితే నా విషయములో నేను స్వస్థత పొందలేదు కదా ప్రభువా! దాన్ని నన్ను అడగవద్దని, బలహీనతలోనే నా శక్తిని పరిపూర్ణము చేస్తానని వాగ్ధానమిచ్చావు కదా! ఏ విధముగా నేను చెప్పాలి? నా సాక్ష్యానికి అవకాశము ఎవరిస్తారు? నాకై నేను ఇపుడు నా వ్యాధి అతి భయంకరమైనది, మందులకి ఆపరేషన్లకి లొంగని క్యాన్సరని, చివరి స్టేజీలో ఉన్నానని కలిస్తే ఇక వ్యతిరేకముగా మాట్లాడే వారి మాటలు నేను విని భరించగలనా? నాతో మాట్లాడు ప్రభువా! నన్ను ధైర్యపరచు" అని ప్రార్థించినపుడు ప్రభువు తన వాక్యములో నుండి ఎన్నో గొప్ప సంగతులు, మహా భక్తులకే తెలియని విషయాలు నాకు బయలుపరచి "గొప్ప గొప్ప దైవజనులు, సేవకులు, విశ్వాసులు, దేవుని పిల్లలు నా మనసు అర్థము చేసుకొనేటట్టుగా నువ్వు చెయ్యాలి, అందుకు ముందు నువ్వు నా మనసును అర్థము చేసుకోవాలి. నేను శ్రమపడి నీకు మాదిరి ఉంచాను కదా! ఆ మాదిరిని నువ్వు తెలిసికోవాలి, ఎంతో విశ్వాస పాత్రముగా సేవ చేసినా ఇలాంటి వ్యాధితో నన్నెందుకు మొత్తాడో అని దుఃఖపడే దైవ బిడ్డలను నువ్వు ప్రోత్సాహపరచి, ఆదరించాలి, నీ సాక్ష్యముతో ఎంతో మందిని దేవుని సన్నిధికి నడిపించాలి. అదే నేను నీకిచ్చే పరిచర్య నేను నీకు పొడిగించి ఇచ్చిన ఆయుష్కాలములో ఈ పనులు చెయ్యాలి" అని నా ప్రభువు నాకు బోధించాడు. నేను కొంత వరకైనా దేవుని అర్థము చేసుకున్నాక సాక్ష్యమివ్వడానికి సిద్ధమయ్యాను.

కీమోథెరపీ విషయమై డాడీ చాల వ్యతిరేకించారు. తీసుకోవద్దని మాటిమాటికి చెప్తూ వచ్చారు. చెకప్‌కి ఒక నెల తర్వాత మరల డాక్టరు గారి దగ్గరకి వెళ్ళినపుడు ఆయన కీమోథెరపీ విషయమై మెడికల్ ఆంకోలజిస్ట్‌ను కలవమని చెప్పారు. ట్రీట్‌మెంట్ తప్పక తీసుకోవాలని ఖచ్చితంగా చెప్పారు. రిపోర్టు బాంబే నుండి వచ్చింది. అది పాజిటివ్ అంటే దానికి ఉన్న కీమోథెరపీ నోటి మాత్రలు రోజూ మింగాలి అని అన్నారు. నేను ఇంటికి వచ్చి పిల్లలతో ఈ మాట చెప్పాను.

పిల్లలు ఇద్దరు కూడా చాల ఎక్కువగా కీమోథెరపీ నుండి వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ గురించి ముఖ్యంగా జుట్టు రాలడం విషయం వారు ఆలోచిస్తున్నట్టు వారి మాటల ద్వారా తెలుసుకున్నాను. వాళ్ళని బాధపడకూడదని దగ్గరకి తీసుకొని ఓదార్చాను. మరుసటి రోజు నేను డాక్టరు రవి దివాకర్ గారిని కలవడానికి వెళ్ళడానికి అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాను. డాక్టర్ దగ్గరకి వెళ్తున్నట్టు పిల్లలు స్కూల్ కెళ్ళే ముందు వాళ్ళకి చెప్పాను. రాన్ బాబు అప్పటికే కళ్ళలో నీళ్ళతో నిలబడ్డాడు. సంగతి ఏమని అడిగితే ఆగకుండా వెక్కిపడుతూ, దుఃఖపడుతూనే ఉన్నాడు. నేను బుజ్జగించి అడిగితే జుట్టు పూర్తిగా ఊడిపోతే నా ముఖం చాల వికారంగా ట్రీట్‌మెంట్ సైడ్ ఎఫెక్ట్స్‌తో ఏమన్నా అయిపోతానేమో

అన్న బాధ వ్యక్తం చేసాడు. నాకు గుండెలు పిండినట్లయింది. పిల్లల్ని దగ్గరకి తీసుకున్నాను. "దేవుని ప్రేమించే వారికి సమస్తం మేలు కొరకే జరుగుతాయి" అని మరల వారికి చెప్పి "ప్రార్థన చెయ్యండి. అలాంటి ట్రీట్‌మెంట్ కాకూడదని ఎక్కువ పట్టుదలగా ప్రార్థన చెయ్యండి, చిన్న పిల్లలు మీరు దేవుడ్ని అడిగితే తప్పక మీరు అడిగినట్టే దేవుడు చేస్తాడు" అని చెప్పాను. జుట్టు ఊడి పోయే ట్రీట్‌మెంట్ అయితే తీసుకోనని చెప్పాను. ఆ మాట అప్పటికి బాబుని సముదాయించడానికి చెప్పాను.

డా॥ రవి దివాకర్ గారికి నా రిపోర్ట్స్ అన్ని చూపించాను. ఆయన "పేషెంట్‌ని తీసుకురాలేదా నేను ఒకసారి చూడాలి అన్నారు. "పేషెంట్‌ని నేనే" అని చెప్పాను. చాల నిస్పృహ, అయ్యో అనే భావం ఆయనలో కనిపించాయి. నేను పేషెంట్‌లాగ కనిపించడం లేదని ఆశ్చర్యపోయారు. నేను "ఎప్పుడూ ఎవరికీ రోగిగా కనబడకూడదు" అని నేను చేసుకొనే ప్రార్థనా ఫలితమే ఇది. నిజంగా నా దేవుడు గొప్ప వాడు. ఆయన అన్ని చూసి "ఇది అడ్వాన్స్‌డ్ స్టేజ్ క్యాన్సర్ ఇపుడు తప్పక ఖీమోథెరపీ ఇవ్వాలి. అది తీసుకుంటేనే వ్యాధి కంట్రోల్‌లో ఉంటుంది. అయితే అది కేన్సర్‌ను నివారించదు, కొన్నాళ్ళు వ్యాధిని కంట్రోల్ చేస్తూ, జీవితకాలం పొడిగించడానికే ఈ ట్రీట్‌మెంట్. C-KIT టెస్ట్ రిపోర్ట్ పాజిటివ్ కాబట్టి మీకిచ్చే ఖీమోథెరపీ నోటి మాత్రలు రోజూ తీసుకోవాలి, ఇంచుమించు 1సం॥ తీసుకున్నా తరువాత టెస్ట్ చేసి చూడాలి, 3వారాలకి ఒకసారి రక్తపరీక్షలు చేయించుకుంటుండాలి. చెకప్‌కి రావాలి అని ఆ ఖీమోథెరపీ సైడ్ ఎఫెక్ట్స్ గురించి చెప్పారు. ఇంజెక్షన్లతో ఉండే సైడ్ ఎఫెక్ట్స్ అన్ని ఉంటాయి, జుట్టు రాలడం అంతగా ఉండకపోవచ్చు అని అన్నారు. తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, వాంతులు, నీరసం, ఆకలి తగ్గిపోవడం వంటివి, కండరాల నొప్పులు ఇవన్ని సర్వ సామాన్యంగా ఉంటాయి" అని చెప్పారు. నాకు ఆ మందులు కంట్రోల్ చెయ్యడానికే గాని క్యూర్ చెయ్యడానికి కాదని చెప్పినందుకు హృదయం చాల బరువైంది నా పిల్లల్ని తలంచుకొని కాని అది కొంత సమయం మాత్రమే మరల దేవున్ని బట్టి ధైర్యం పెంచుకున్నాను. దేవుడు నాకు స్థలము సిద్ధపరచి, నన్ను పరలోకానికి ఆహ్వానిస్తే ఇహలోక భారాల్ని, బాధల్ని విడిచి దేవుని రొమ్మున అనుకొని నిత్యమూ విశ్రాంతి పొందే జీవితమే ఎంతో ధన్యకరమైనది అని తలంచి "పరలోక మందున్న తండ్రి, నా రక్షణ ఆనందమా" అనే పాటలు క్లినిక్‌లో కూర్చుని రాసి రాగాలు కూర్చాను. నా పిల్లలను దేవుడు అనాథలుగా చెయ్యడని నా విశ్వాసం.

డాక్టరుగారు చెప్పినట్లే అన్ని పరీక్షలు చేయించి, ఖీమోథెరపీ మెడిసిన్ కోసం బి.ఇ.ఎల్. హాస్పిటల్ సి.ఎమ్.ఎస్ డా॥ రమామణిగారిని సంప్రదించాను. నా మొదట సారి ఆపరేషన్ సమయంలో హాస్పిటల్‌లో ఉన్న నన్ను మల్యా హాస్పిటల్‌లో దర్శించారు. ఆమెకు నేనంటే చాల అభిమానమని ఆవిడ మాట్లాడేతీరు చూస్తే అర్థమౌతుంది. ఆవిడ నాకు అన్ని



విధాల సహకరించి మెడిసిన్స్ ఇప్పించారు. ఆమె నా విషయంలో చాల జాలిగా చూడడం, నిరుత్సాహంగా మాట్లాడడం గమనించాను. తర్వాత నేను ధైర్యం పొందిన విధానం, నా సాక్ష్యం ఆమెతో పంచుకున్నపుడు ఆమెలో కూడా సంతోషాన్ని చూడగల్గాను. ఖీమోథెరపీ తీసుకోవడం మొదలు పెట్టాను.

నేను సాక్షిగా ప్రభువు కొరకు వాడబడే విషయమై ప్రభువే నాకు అవకాశం ఇవ్వాలని ప్రార్థిస్తూ వచ్చాను. దేవుడు తన సేవకులైన జేమ్స్ W. స్టార్ గారిని, పాస్టరు జె.డి.మోజెస్ గారిని ప్రేరేపించి మొదటిసారిగా నన్ను విజయవాడలో జరిగిన విజన్ 2020 ఆసియా కాన్ఫిరెన్స్‌కి పాటలు పాడడానికి, స్త్రీల ప్రత్యేక కూడికలో వాక్యం బోధించడానికి ఆహ్వానించారు. వాక్యంలో బోధనా అంశాలు కూడా వారే నాకిచ్చారు. 4 మీటింగ్స్‌లో నన్ను మాట్లాడాలన్నారు. అందులో ఒకటి "దేవుని చిత్తములో శ్రమలు" అనే అంశము కూడా ఉంది. ఆ అంశానికి తోడుగా నా సాక్ష్యము కూడా ఉదాహరణగా ఉండాలని వారు దేవుని ప్రేరేపణను బట్టి నాకు సూచించారు. నేను వాక్యముతో పాటు, నా సాక్ష్యాన్ని పంచుకోవడానికి భయపడలేదు, సిగ్గుపడలేదు, ఎవరైనా ఏమన్నా అనుకుంటారేమోనని చింతించలేదు. అలాగ మొట్ట మొదటిగా స్త్రీల కూడికలో నా సాక్ష్యాన్ని వివరించాను. వెంటనే ఆ కాన్ఫిరెన్స్‌లో, కూడికలలో చాల కలకలము, స్పందన కలిగింది. ఆ రాత్రికే జరిగిన మీటింగ్‌లో బహిరంగంముగా దేవుడు నాకు సాక్ష్యమివ్వడానికి కృపచూపాడు. నేను తెలుగులో చెప్తూ ఉంటే రెవ॥జిమ్‌స్టార్‌గారికి ప్రక్కన కూర్చున్న వారు ఇంగ్లీషులో విడమర్చి చెప్పారు. ఆయన దేవుడు నాకు బయలు పరచిన సత్యాలు ఎంతమందినో ఆదరించగలదని గ్రహించి, ఇక ఎన్నోచోట్ల సాక్ష్యం చెప్పించడానికి ఆయన కంకణం కట్టుకున్నారు. మరుసటిరోజు వ్యాపారవేత్తల మధ్య జరిగిన మీటింగ్‌లో సాక్ష్యం చెప్పించారు. ఎంతోమంది క్రైస్తవేతరులు కూడా ఆ మీటింగ్‌కి వచ్చి దీవెనలు పొందుకున్నామని నాతో చెప్పారు.

అపుడే నా సాక్ష్యాన్ని ప్రచురించాలని 'స్వర్ణ దీపిక' పత్రిక ఎడిట్ శ్రీ శివాజి రాజుగారు, ఫ్రైడే మెయిల్ పత్రిక నుండి బ్రదర్ ప్రసన్న కుమార్, పాస్టర్ టి.బాబురావుగారు అడిగారు. ఆ పత్రికల్లో సాక్ష్యం ముద్రించబడి ఎందరినో ఆకర్షించింది. ఎంతోమంది దీవెనలు పొందారు. తరువాత మన్నా పత్రిక ఎడిటర్‌గారు, మా మేనమామ దంపతులు బిషప్ ఎర్నెస్ట్ పి. కొమానపల్లిగారు కూడా తమ పత్రికలో నా సాక్ష్యాన్ని ముద్రించారు.

నా విజయ రహస్యం ఏమిటంటే దేవుడు ఏ శ్రమ మనకి అనుమతించినా సణుగుడు, గొణుగుడు, దూషణ చెయ్యకుండా, సహించుకుంటూ దేవుని నామాన్ని అధికంగా హెచ్చించడమే. ఆశ్రమ దేవున్ని మరింత అర్థం చేసుకోడానికి శ్రమని మేలుకరంగా భావించడమే. శ్రమలో నేను అతిశయించడమే. ఇది గొప్ప ఆత్మీయ పోరాటమే. అందుకే నా పోరాటం మంచి పోరాటముగా ఉండాలని అంతము వరకు విశ్వాసము

కాపాడుకోవాలని, బహుమానము కొరకు గమ్యాన్ని చేరుకోవాలనే ఆశ మాటిమాటికి ఎక్కువ అవుతూ, ఆ ఆశే నాకు ఊపిరి పోసింది. 'యేసులోని మాధుర్యం' అనే ఆల్బమ్‌లోని డాక్టర్ గంధం వేదవేశ్వరరావు గారు వ్రాసిన 'మంచి పోరాటము' అనే పాట నాకు చాల బాగా నచ్చింది. నా సాక్ష్యానికి  తగ్గట్టుగా ఉంటుంది. ఆ పాట నాకు ఎంతో ఆదరణ కరంగా నిలిచింది.

మీటింగుల్లో దేవుడు నాకిచ్చిన పాటల్లో 'నా శైలమా నా కేడెమా', ఏ హేతువు లేకయే అనే పాటలు ప్రజాదరణ పొందాయి. అవే కాకుండా మిగతా పాటలు కూడా దేవుడు నాకు నా అనుభవాలలో ఇచ్చినవే కాబట్టి నాకున్న అనుభవాల వంటి వాటి గుండా వెళ్ళే ప్రతి ఒక్కరిని లాలించి, ఆదరించాయి. అంత మంచి అభిషేకము ఆ పాటలలో దేవుడు ఉంచాడు. ఆ తర్వాత కొన్ని సంఘాలలో సహోదరులున్న సమావేశాల్లో స్త్రీలు నిలబడి పాటలు పాడడం, సాక్ష్యమివ్వడం చెయ్యకూడదనే రూల్స్ ఉన్నప్పటికీ నేను వెళ్ళిన తర్వాత 'సాక్ష్యం చెప్పకుండా' నేను వెనక్కి తిరిగి వెళ్ళకూడదు ప్రభూ, నాకు అవకాశం ఇవ్వు' అని చేసే చిన్న ప్రార్థనకి ఫలితంగా దేవుడు ఆ సేవకులను ప్రేరేపించి అవకాశం ఇచ్చి, రికార్డు బ్రద్దలయ్యేటట్టు చేసాడు.

ఈ సంఘటనల ద్వారా, ఇతరులు ఇచ్చిన సాక్ష్యాల ద్వారా నా సాక్ష్యము వారికి దీవెనకరముగా ఉన్నదని నేనింకా ఎక్కువగా దేవుని స్తుతించాలి, ఘనపరచాలి, కొనియాడాలి, ఎంత బాధలో ఉన్నా దేవుని గూర్చిన స్తుతి నా నోట ఎల్లపుడూ ఉండాలి అనే ఆతురత, పట్టుదల, ఆశ నాలో ఎక్కువ అవుతూ వచ్చింది.

అవకాశం దొరికేకొలది నేను దూరప్రయాణాలు చేయడం, ఒంటరిగా ప్రయాణించవలసి వచ్చినా ధైర్యముగా వెళ్ళుతూ ఉన్నాను. దేవున్ని నేను ఘనపరచిన కొలదీ ఆయన నన్ను ఘనపరచారు.

దేవుడు నన్ను పంపించేది కూడా నాకై నేను పాట పాడాలని గాని, సాక్ష్యానికి సమయమివ్వమని మనుష్యులను అడగడం ద్వారా కాదు. నేనెప్పుడూ 'ప్రభువా, నువ్వు వారిని ప్రేరేపించి నన్ను అడిగేటట్టు చెయ్యి, అపుడు అది వారికి దీవెనకరముగా ఉంటుంది. నాకై నేను అడిగితే అది నా పేరు గొప్ప చేసుకోవడమే అవుతుంది, అది నాకు ఇష్టం లేదు, నేను తగ్గించబడాలి. నువ్వు హెచ్చింపబడాలి' అని ప్రార్థిస్తాను. దేవుని చిత్తముకు అప్పగించు కోవడం ద్వారా దేవుడే ఇతరులను ప్రేరేపించి వారికై వారు అడిగేటట్టు చేసాడు. అది దేవుని ద్వారా ముద్రించబడినది అని నేను కనిపెట్టడానికి ఒక సూచనగా నేను పెట్టుకున్నాను. ఒక వేళ ఎవరైనా నన్ను పిలచిన చోట నాకు తక్కువే సమయం ఇచ్చినా ఆ తక్కువ సమయాన్నే అనేక మందికి ఆశీర్వాదకరముగా చేయడం నేను చూస్తు ఉన్నాను. కనీసం ఒక్క ఆత్మయైనా బలపడితే చాలని ప్రార్థనతో వెళ్తాను.

దేవుడే తనంతట తాను నాకు బయలుపరచుకొని నేను ఇంకా ఆయనను అర్థం



చేసుకోడానికి ఎలా సహాయపడ్డాడో కొన్నింటిని వివరిస్తాను.

1. ఎందరో నా వెనుక నా భక్తి సరైంది కాదు, పాపాత్మురాలు అందుకే దేవుడు శిక్షిస్తున్నాడు అని మాట్లాడిన మాటలకు నా గుండె బ్రద్దలైంది. ఈ మాటలు నేను ఎవరితోనైనా ఆప్తులతో చెప్పుకొని ఆదరణ పొందుదామనుకుంటే వారు కూడా నన్ను తృణీకరించినపుడు నేను ప్రభువు పాదాల వద్దే విన్నవించుకోవడం, నా భారం పూర్తిగా తగ్గే వరకు, దేవుడు నా ప్రార్థన ఆలకించాడు అనే నిశ్చింత కలిగేంత వరకూ ప్రార్థనలో గడపడం అలవాటు చేసుకున్నాను. అపుడు దేవుడు "నీవు నా ప్రియమైన కుమార్తెవు, నేను నిన్నింకా శుద్ధిచేసి, శుద్ధమైన సువర్ణముగా మార్చి, అధికమైన నా పరిశుద్ధతలో మరింత ఎదగడానికే నేను నిన్ను శ్రమకి అప్పగించాను. అది నీమేలు కొరకే, నువ్వింకానానీతిని పొందుకోవాడానికే. నువ్వు పాపివే కాని  నారక్తముతో కడగబడ్డావు. ఒకవేళ నేను పాపాత్ములనందరిని,శిక్షంచాలనుకుంటే ఈ భూమి మీద ఎవరూ మిగలరు, ఎందుకంటే నీతిమంతుడు ఒక్కడూ లేడు. నువ్వు పాపిని అని మాట్లడిన వాళ్ళు కూడా పాపులే నువ్వు నాకృప పొందుకున్నావు కాబట్టి నేను నిన్నుఈవ్యాధి ద్వారా దర్శించాను. ఈ వ్యాధి ద్వారా నువ్వు నాకు దగ్గరగా జీవించు, నన్ను ఎక్కువగా అర్థంచేసుకో, ఏమాత్రం అలసిపోకుండా నాపైన ఆనుకో, నాపైన ఎక్కువగా ఆధారపడు. నా సార్వభౌమత్వాన్ని అర్థం చేసుకో, నువ్వు నా కుమార్తెవు కాబట్టే నీ తలవెంట్రుకలన్ని లెక్కించిన వాడను, నిన్ను తల్లి గర్భములో రూపించినవాడను. నీ శరీరములో ఉన్న ఒక్క వెంట్రుక రాలి భూమిమీద పడాలి అంటే నా అనుమతి కావాలి, కాబట్టి ఈ వ్యాధిని నేను అనుమతించాను. నా సెలవుతోనే ఇంత భయంకరమైన వ్యాధి నీలో ప్రవేశించింది. నీ సాక్ష్యం ఇతరుల సాక్ష్యాల్లాగ మామూలుగా ఉండకూడదు. అది ఎంతో గొప్పగా, శక్తివంతముగా, నిరీక్షణ, విశ్వాసం, ధైర్యం, ఆదరణ, ఆత్మ బలములేని వారికి నా నామంలో వాటిని కలిగించడానికే నీ సాక్ష్యం ఇంకా బలమైనదిగా ఉండడానికే నేను ఈ భయంకరమైన క్యాన్సర్‌ని అనుమతించాను. నా సంపూర్ణ చిత్తమును నీ ద్వారా, నీవిచ్చే సాక్ష్యము ద్వారా నేను నెరవేర్చుకుంటాను. అనేక మందికి నిన్ను ఆశీర్వాదకరముగా చేస్తాను" అని నన్ను ఆదరించాడు, ధైర్యపరచాడు. నేను దేవుడు బోధించే విషయాలను అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. ఇది శిక్షకాదని 'శిక్షణ' అని అర్థమైంది.

కాబట్టి ఆయన శక్తిని, గొప్ప తనమును, సార్వభౌమత్వాన్ని కొంతైనా అర్థం చేసుకోడానికి దేవుడు కృప చూపించాడు.

2. నా శరీరంలో శక్తి, బలము క్షీణించడం నాకు తెలుస్తూనే ఉంది. రోజూ నొప్పి అనుభవించడం నా జీవితంలో భాగమైపోయింది. అది నాకు ఎపుడూ నేను మరణానికి అతి చేరువుగా ఉన్నానని గుర్తుచేస్తూ ఉంటుంది. కాబట్టి నేను నా శక్తిపైనగాని, నా చుట్టు ఉండే మనుష్యులపైనగాని ఆధారపడకుండా దేవునిపైనే ఆధారపడడం

నేర్చుకున్నాను. కూర్చున్నా, పడుకున్నా, పనిచేస్తూ ఉన్నా, నిద్రపోతూ ఉన్నా నా ఆత్మ దేవునితో సంభాషించడం, నా నోరు దేవున్ని కీర్తించడం గమనించాను. ఒక 5 నిమిషాలు కూడా ఒక్కదాన్నే బయటికి వెళ్ళి రావటానికి నా మీద నాకు నమ్మకం లేని దాన్ని కాని వెళ్ళేటపుడు "నువ్వు నాతో రా ప్రభువా" అని దేవునితో చెప్పడం వెళ్ళడం, దీర్ఘ ప్రయాణాలైనా సరే చేయడం జరుగుతూ ఉంది. అందుకు దేవున్ని ఇంకా మహిమ పరచడం చేస్తూ ఉన్నాను.

3. నా దినములు త్వరగా గడిచి మరణిస్తానని ఒక డాక్టరుగా నా గురించి నేను అనుకున్నపుడు, లేక డాక్టర్లు నా గురించి అనుకున్నపుడు నాకు అనిపిస్తుంది "దేవునికి నేను దగ్గరగా వెళ్తున్నాను. సాతాను దగ్గరకు కాదు. నన్ను నిర్మించిన నిర్మాణకుడు, సృష్టించిన సృష్టికర్తకు సమీపముగా జరుగుతున్నాననే" ఆలోచన నాకు తృప్తి ఇస్తుంది. ఎందుకంటే **దేవుడు తన పిల్లలకు మరణాన్ని సహితం ఆశీర్వాదకరముగా** చేసి నిరంతరం ఆయనతో జీవించడానికే అనుమతిస్తాడు. ఇటువంటి వేదన, శ్రమతో కూడిన మరణం తన కృపతోనే అనుమతిస్తాడు.

నేను నా తల్లిని కలిసి, మరల తిరిగి వచ్చేటపుడు ఆమె నన్ను అక్కున చేర్చుకొని, నన్ను ఎంతగానో ప్రేమించే వ్యక్తిగా ఒక్క నిమిషం పాటు నా వెన్ను నిమిరినపుడు ఆ క్షణాలు నాకు చాల మధురంగా అనిపిస్తాయి. అది ఇంకా కావాలని నా మనసు కోరుకుంటుంది. అది తాత్కాలికమైనది. మాకు వియోగం ఏర్పడినపుడు కన్నీళ్ళు ఉబికి వస్తాయి. భారమైన హృదయముతో నేను తిరుగు ముఖం పడతాను. అయితే నన్ను సృష్టించి, నిర్మించిన, నా దేవుడు నిరంతరం తన రొమ్మున నన్ను ఆన్చుకొని ఆదరించే సమయం, నా దేవుడు నా కన్నీటిని తుడిచి నన్ను హెచ్చించే సమయం దగ్గరలోనే అతి సమీపములోనే ఉన్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. దేవుడిచ్చే ఈ ఆదరణ శాశ్వతమైనది. ఆ ఆలోచనే నాకు అతి మధురంగా అనిపిస్తుంది.

4. నా మొదటి ఆపరేషన్ ద్వారా నాకు తెలిసిన సత్యం ఏమిటంటే ఒకసారి మనం దేవునితో ఆయన కొరకు జీవిస్తానని మనం చేసే నిబంధన విషయంలో మనం అపనమ్మకముగా ఉన్నా, మన పరమతండ్రి దానిని మరువక, తన కృప చూపిస్తూనే ఉంటాడు. మనకి కలిగే విపత్తులలో, ఆపదలలో ఆయన మన చేయి విడిచాడేమో అనే సందేహం వచ్చినా, అది మరల మరల రాకుండా ఉండడానికే ఆయన మనతోనే ఉన్నాడని మనం గుర్తించడానికే మన ప్రక్కనే ఉంటాడు. మనల్ని తన మాటతో ధైర్యపరచి బలపరుస్తాడు. అది మరణకరమైన లోయవంటి ఆపదలైనా, ఉపద్రవాలైనా సరే, ఇక 'దేవుడు నన్ను విడిచి పెట్టాడు' అనే ఆలోచనే కాకుండా 'ఆయన నాతోనే ఉన్నాడు, నన్ను నడిపిస్తాడు' అని సానుకూలముగా ఆలోచించేటట్టు చేస్తాడు. అపుడు ఆ మరణలోయలో ఆయన ఉనికిని గుర్తించి, ఆయన చేయిపట్టి నడవగలము,



భయపడకుండా ఆయనపై ఆనుకోగలము. దేవుడు మృత్యుంజయుడు, ఆయన మరణాన్ని జయించినవాడు, ఆ పునరుత్థాన శక్తి మనకి కూడా ఇవ్వాలనే ఇష్టం కలిగియున్నవాడు, ఆ మృత్యుంజయుని పునరుత్థాన బలము మనము అనుభవించాలంటే మరణానుభవము మనలో ఉండాలి. అదే క్రీస్తుతో సమానమైన అనుభవము. మరణానుభవము కోరుకోక పోతే మనం పునరుత్థాన శక్తి అనుభవించలేము. మరణం అంటే ఏమిటో తెలిసినపుడు జీవము యొక్క విలువ తెలుస్తుంది. కీడు తెలిసినపుడు మేలు కొరకు ప్రాకులాడతాము. శాపము తెలిసినపుడు ఆశీర్వాదము కొరకు ప్రయాసపడతాము. నేను మరణం వరకు వెళ్ళి జీవముతో బయటికి వచ్చినపుడు నేను నమ్మిన దేవుడు మృత్యుంజయుడు అని అనుభవ పూర్వకముగా స్థిరపరచి, సాక్షిగా ప్రచురము చేయగలను. ఆయన నన్ను బ్రతికించడం ద్వారా ఆయన మరణం లోనికి సమానాను భవము నేను పొందాను. తద్వారా పునరుత్థాన బలము, శక్తి అంటే ఏమిటో నాకు తెలిసింది. దేవుడు నాకు ఇటువంటి అనుభవం నాకిచ్చినందుకు ఆయనకే వందనాలు.

నా 2వ ఆపరేషన్ ద్వారా మరణానుభవము నుండి తప్పించబడడమే కాకుండా, **'మరణచ్ఛాయలో ఉండి కూడా దేవుని స్తుతించడం'** ఎంతో అనుభవ పూర్వకముగా తెలిసింది. ఎంతో మంది మరణకరము కాని వ్యాధులు, బాధలు కలిగినపుడు కూడా దేవున్ని దూషిస్తారు, దేవునికి దూరంగా జీవిస్తారు, దేవుడు మేలు చేస్తేనే అంగీకరించి, చెడు జరిగిన వెంటనే దేవునికి వ్యతిరేకముగా మాట్లాడుతారు. కాని నేను మరణచ్ఛాయలో ఉండి ప్రభువును స్తుతించగలుగుచున్నాను. ఇటువంటి అనుభవం, కష్టకాలంలో నా నోట కీర్తనలుంచిన నా దేవుడు అధిక ఘనత వహించినవాడు.

5. 2వ ఆపరేషన్ అయ్యాక నాలోని శక్తి, బలం క్షీణించుట ద్వారా నేనెందుకూ పనికిరానిదానినని ఎవరికీ ఏ విధముగాను ఉపయోగపడలేనని ఎన్నో సందర్భాలలో ఋజువైంది. మనుష్యులు మన ద్వారా ప్రయోజనం ఉంది, సహాయం కలుగుతూ ఉంది అనంటేనే కొంచెమైనా మర్యాద ఇస్తారు. అలాంటిది నేను సంపాదించేది ఏమీ లేదు కాబట్టి నా కోసం ఖర్చుపెట్టడం, నన్ను చూసుకోవడం వృధా, బ్రతికుండి ఏమి ప్రయోజనం లేదు అని, నా చావు తర్వాత ఏమేమి చెయ్యాలోనని ఇప్పటి నుండే ఆలోచించే వారిని చూసాను. అది నా హృదయానికి బాధ కలిగించినా నాకు ఎవరు ఎలాంటి మనుష్యులో నన్ను ఏ విధంగా ప్రేమిస్తున్నారో లేక ద్వేషిస్తున్నారో, నా చావు కోరుకొనే వారెవరో, సాతాను ఎవరెవరిని ఆ విధంగా ప్రేరేపిస్తున్నాడో గమనించగలిగాను. వివేకము గల హృదయాన్ని దేవుడిచ్చాడు కాబట్టి పరిస్థితులను సరిగ్గా అంచనా వేసి, నేనేమి చేస్తే మనుష్యులను కాక దేవున్ని సంతోష పెట్టగలనో ఆయా విషయాలలో నన్ను నేను తీరిక లేకుండా చేసుకోగలిగాను. విరామము తీసుకోకుండా ప్రభువు సేవలో పోరాడాను. ఎంతో మందిని ప్రభువువద్దకి నడిపించగలిగాను. ఈ రోజుల్లో సేవకులమని చెప్పుకొనే

వారు తమ పరచర్య అంతటిలో కనీసం ఒక్కరినైనా ప్రభువు వద్దకి నడిపించలేని పెద్ద పెద్ద సేవకుల కంటే ప్రభువు నా కిచ్చిన చిన్ని జీవితములో ఎంతో మంది నా సాక్ష్యము ద్వారా మార్చబడి ప్రభువు వద్దకి నడిపించడం దేవుడు నా యెడల చేసిన గొప్ప మేలు. నన్ను ప్రేమించవలసిన వారు ప్రేమించలేకపోయినా, తృణీకరించినా, నన్ను అభిమానించి నిరంతరం నా కొరకు విజ్ఞాపనలు చేసే వారిని, నా క్షేమం కోరుతూ ఉపవాస ప్రార్థనలు చేసే ఎంతో మందిని నా దేవుడు సిద్ధం చేసాడు. దీన్ని బట్టి నాకు అర్థమైనదేమిటంటే నేను లోకానికి పనికి రాకపోయినా నా ప్రభువు నన్ను కోరుకుంటున్నాడు, తన మహత్తరమైన సేవలో నన్ను కూడా వాడుకోవడానికి ఇష్టపడ్డాడు అనే దృఢమైన విశ్వాసం కలిగింది. దేవుడు నన్ను కోరుకోవడానికి నాలో ఎటువంటి యోగ్యత లేదు. దానికి నే నెంతమాత్రము పాత్రురాలను కాదు. ఇది నిజముగా అల్పురాలనైన నా పట్ల దేవుడు చూపిన అధికమైన కృప.

6. నాలో వ్యాధి పెరుగుతూ ఉన్నదని నాలో ఉన్న బాధ, నొప్పి నాకు గుర్తు చేస్తూ ఉంటాయి. నా హాస్పిటల్ రిపోర్టులు కూడా దానిని ధృవీకరిస్తున్నాయి. అయినా వ్యాధి నాలో ముదురుతున్న కొలదీ దేవునితో నా సంబంధము పెరుగుతూ ఉంది. దేవునిపై ఇంకా ఆధారపడడం నేర్చుకుంటున్నాను. నా ప్రార్థన సమయాన్ని ఎక్కువ చేసింది, దేవునితో నా సహవాసమును పెంచింది నా వ్యాధి. దేవునితో అనుక్షణము నేను ముచ్చటించడం నిద్రలో ఉన్నా నా ఆత్మ మేల్కొని దేవునితో సంభాషించడం చేయడానికి, దేవునికి అతి దగ్గరగా జీవించడానికి సహాయపడింది నా వ్యాధి. అందును బట్టి నేను దేవునిలో అతిశయించడం, ఆనందించడం నేర్చుకున్నాను.

7. నాలోని బలహీనత ద్వారా నా దిన చర్యలోని చిన్న పనులు కూడా కొన్ని సార్లు చేసుకోలేని పరిస్థితి ఏర్పడినపుడు ఆ బలహీనత నా మనస్సును చుట్టుకొని మానసికంగా బలహీనపడతాను. అపుడు సాతాను 'నువ్వు త్వరగా చనిపోతావు', చనిపోతావు అనే ఆలోచన పెట్టి నాలో భారం కల్గిస్తాడు. ఆ భారాన్ని నేను నా ప్రియమైన వారితో కూడా పంచుకోలేను, ఎవరితోనూ సంభాషించలేను. నన్ను అమితంగా ప్రేమించే వారెవరూ కూడా దానిలో కొంతైనా తీసుకోలేరు. సంతోషాన్ని పంచుకోవడానికి మనుష్యులు ఇష్టపడతారు కాని దుఃఖాన్ని ఎవరూ పంచుకోడానికి ఇష్టపడరు. నా బాధ, భారం ప్రియమైన వారితో చెప్తే నాలో కొంతైన భారం తగ్గుతుందని మొదట్లో తలంచేదాన్ని. కాని నన్ను ప్రేమించే వారెవరు నా దుఃఖం చూడలేరు, ఇంకా నా కన్నా వారు ఎక్కువ బాధపడడం, నాతో పాటు వారి హృదయం కూడా భారభరితమవ్వడం గమనించాను. అపుడే నేను గట్టి నిర్ణయం తీసుకున్నాను. శత్రువు నన్నెంతగా కృంగదీసినా నా ప్రియమైన వారి దగ్గర పంచుకోకూడదని. ఎందుకంటే వారు నేను దుఃఖపడడం సహించలేరు. వారి కోసం నేను సంతోషంగా ఎప్పుడూ కనబడాలి అనంటే నా హృదయం సంతోషంతో



నిండి ఉండాలి. అందుకే 'ఎంత కష్టములోనైనా నేను సంతోషించేటట్టు నాకు సహాయం చేయి ప్రభువా' అని నా దుఃఖం అంతా పోయే వరకు నా మోకాళ్ళపై కన్నీటి ప్రార్థన చేసి, దేవుని వద్ద నా భారం అంతా వదలి, సంతోషంతో మోకాళ్ళపై నుండి లేవడం అలవాటు చేసుకున్నాను. 'ఓ సాతానా! నువ్వు నన్నేమీ చేయలేవు. నేను నా ప్రభువు ద్వారా నెమ్మది పొందుకుంటున్నాను' అని విశ్వసించి చెప్పినపుడు 'నువ్వు చనిపోతావు' అని చెప్పే సాతాను దూరంగా పారిపోవడం చూసాను. కాబట్టి మనుష్యులను ఆశ్రయించడం కంటే యెహోవాను ఆశ్రయించడం మేలు.

8. నా మొదటి ఆపరేషన్ తర్వాత దేవుడు నన్ను పూర్తిగా స్వస్థపరచి ఉంటే నా సాక్ష్యం స్వస్థత వరకే పరిమితమై ఉండేది. "స్వస్థత కన్నా మిన్నగా" ఉన్న అనేక విషయాలు అనుభవ పూర్వకముగా తెలుసుకొనేదాన్ని కాదు. కాని దేవుడు నన్ను ఇన్ని అనుభవాల గుండా తీసుకు వెళ్ళి నాకెన్నో సత్యాలు నేర్పించిన ప్రభువునకు నేను వందనాలు తెలియజేస్తున్నాను. నేను నేర్చుకున్న ఈ సత్యాలు ఎందరినో ఆదరించి, ప్రోత్సాహపరచేవిగా ఉండాలంటే నేను వాటిని తప్పక అనుభవించి తీరాలి. కాబట్టి బలహీనతలోనే దేవుని శక్తి పరిపూర్ణమవ్వడం నేను తనివితీరా అనుభవించాను.

9. యేసు ప్రభువు కూడా శ్రమననుభవించి, ఆయన అడుగు జాడలలలో మనం నడవాలని మనకి మాదిరి ఉంచాడు. యేసుప్రభుని జననం, జీవిత విధానం, ప్రార్థనా సేవ, పరిచర్య, జీవితం, ఆయన మరణం, పునరుత్థానం అన్ని కూడా మనకి మాదిరే. ఆ మాదిరిని మనం మన జీవితంలోని అన్ని విధానాలలో అనుసరించాలి. ముఖ్యముగా మన మరణంలో కూడా. అన్ని విషయాలలో క్రీస్తును పోలి ఉండాలని ప్రయత్నిస్తాము కాని మరణంలో ఆ మాదిరిని మనం కోరుకోము. మనమందరం శరీరంలో ఏ నొప్పి, వేదన భరించడానికి ఇష్టపడము. బాధ కలిగింది అనంటే అది అనారోగ్యమే అవుతుంది. మనలో ఎవ్వరం కూడా అనారోగ్యము కలిగి ఉండాలని కోరుకోము. మన జీవిత కాలమంతా ఆరోగ్యవంతులముగా ఉండాలనే అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటాము ఒక్కోసారి ఎంత జాగ్రత్త వహించినా కొన్ని వ్యాధులు మన శరీరంలో ప్రవేశిస్తాయి. కొన్ని తెలిసినా కూడా జాగ్రత్త పడనందుకు వస్తాయి. ఏ జాగ్రత్త వహించినా, వహించకపోయినా అనారోగ్యాన్ని భరించడం ఎవరికీ ఇష్టం ఉండదు. మన చివరి శ్వాస విడిచేటపుడు ఎవరం మంచం మీద ఉండాలని కోరుకోము. నొప్పిని భరించడం గాని ఎవరినైనా కష్టపెట్టడం గాని, ఎవరి చేతనైనా నిరసన భావముతో, ఈసడింపులతో సేవ చేయించుకోవాలని గాని, ఇంట్లో వారికి భారంగా ఉండాలని గాని ఎవ్వరం కూడా కోరుకోము. "చివరి కాలంలో మనం దేవుడిచ్చే శ్రమను అది కొన్ని గంటలైనా, కొన్ని రోజులైనా లేక నెలలైనా భరించి ఆయన చిత్త ప్రకారం ప్రతి శ్రమలో ఆయన సంపూర్ణ చిత్తాన్ని నెరవేర్చి ఆయన కొరకు ఇంకా పరిశుద్ధముగా తీర్చబడి ఆయన ఇచ్చే మహిమ

రాజ్యములో అత్యధికమైన మహిమను పొందాలని మన ప్రభువైన యేసు చూపిన మాదిరి".

నేను శ్రమల ద్వారానే మన పరలోక తండ్రిని చేరుకోవడం ఆయన చిత్తమని గ్రహించాక, ప్రభువైన యేసు యొక్క మరణంలోని కొన్ని విషయాలు గ్రహించి అవి మన విషయంలో కూడా జరగాలని గ్రహించాను. నేను చేప్పేది కాదు గాని ప్రభువు సెలవిచ్చేది కూడా అదే. దేవుడు శ్రమ పొందినట్టుగా మనం కూడా అంత కఠిన శ్రమ అనుభవించాలా? అనంటే యేసుప్రభు మనం సహించగల్గిన దానికంటే ఎక్కువ శ్రమ మనకు అనుమతించడు అనేది ఖచ్చితమైన మాట. యేసు ప్రభువు మరణం లోని కొన్ని విషయాలు వివరిస్తాను.

ఎ. యేసుప్రభువుకు తాను ఎందుకు జన్మించాడో, తన పట్ల దేవుని చిత్తము ఏమైయున్నదో ఆయనకు తెలుసు. ఒక దైవకుమారుడిగాకాక, ఒక సామాన్య మానవుడిగా, ప్రార్థనలో తన సమయాన్ని గడుపుతూ పరిశుద్ధాత్ముని సహాయము, నడిపింపుతో దైవచిత్తాన్ని కనుగొన్నాడు. మనం కూడా సామాన్యులమే అయినా, పరిశుద్ధాత్ముని సహవాసముతో, నడిపింపుతో, ప్రార్థనా సమయంలో దేవుని వద్ద కనిపెట్టడం ద్వారా దేవుని చిత్తాన్ని గ్రహించగలం. నేను మల్యా హాస్పిటల్‌లో 2005వ సంవత్సరం ఏప్రిల్ 27వ తారీఖున ప్రార్థనలోనే నా పట్ల దేవుని చిత్తాన్ని కనుగొన్నాను.

బి. యేసు ప్రభువు తాను కనుగొన్ని దేవుని చిత్తాన్ని ఈ భూమిపైన జరిగించాలని, కంకణం కట్టుకున్నాడు. అది పూర్తిగా నెరవేరేవరకు ఎన్నిసార్లు మరణాపాయాలు ఎదురైనా సాతాను శక్తులతో పోరాడుతూ సిలువలో మరణించే క్షణంలో కూడా దేవుని చిత్తాన్ని తాను సంపూర్ణంగా నెరవేర్చాడో లేదోనని తన్ను తాను పరీక్షించుకొని దానిని నెరవేర్చానని రూఢిగా తెలుసుకున్న తర్వాత 'సమాప్తమైనదని' చెప్పి నిత్యుడైన ఆత్మ ద్వారా తండ్రియైన దేవునికి తన ఆత్మను సమర్పించుకున్నాడు. అదే విధంగా మనం కూడా మన జీవితంలో దైవ చిత్తాన్ని జరిగించడానికి విధేయత చూపి, అది ముగించే లోపల ఎన్ని విషమ పరిస్థితులు, ఉపద్రవాలు, మరణాపాయాలు ఎదురైనా పోరాడి, ఆయన జీవాన్ని పొందుకుంటూ ఆయన బయలుపరచిన తన చిత్తం మన జీవితంలో నెరవేరినదా లేదా అని మనలను మనము పరీక్షించుకుంటూ సాగిపోవాలి. ఈ విధమైన స్వపరీక్ష చేసుకోవాలంటే 'అన్ని అవయవాలు పాడైపోయినా స్పృహ మాత్రం కోల్పోకూడదని ఆకృప కావాలని' మనం కోరుకోవాలి. అహర్నిశలు ఆయన చిత్తాన్ని పూర్తి చేయడానికి శ్రమించాలి. **మన మరణంలో కూడా క్రీస్తు మహిమ పరచబడాలి**. అది బాధైనా సరే, కష్టమైనా సరే **మనం ఆయన మహిమ కొరకు సహించాలి.** 'సాక్షిగా నువ్వు నా కొరకు నిలవాలి, బలహీనతలోనే నా శక్తిని పరిపూర్ణం చేస్తానని' చెప్పిన దేవుని కొరకు సాక్షిగా నేను బ్రతకాలని, ఎన్ని అవమానాలు ఎదురైనా నా గురించి ఎవరేమనుకున్నా ధైర్యంగా నా ప్రభువు చిత్తాన్ని నెరవేర్చాలని ఇష్టపడ్డాను, దానికై ప్రయాసపడుతున్నాను.

సి. యేసు ప్రభువుకు తన మరణం ఎలా ఉండబోతుందో, అది ఎపుడో, మరణించాక



ఏం జరుగుతుందో, తాను ఎక్కడికి వెళ్తాడో తెలుసు. ఇది కూడా ప్రార్థనలో కనిపెట్టి పరిశుద్ధాత్ముని ద్వారా తెలుసుకున్నదే.

మనం కూడా మన మరణం ఎలా ఉండబోతుందో, అది ఎపుడు రాబోతుందో మన దినముల అంతం ఎలా ఉండబోతుందో, మరణించాక ఏం జరుగుతుందో, ఎక్కడికి వెళ్ళతామో కనుగొనగలము, పరిశుద్ధాత్ముడు మనకు సహాయం చేస్తాడు ఆయన మనతో, మనలో ఉండి, మనలను ఆవరించి నడిపించే ఆదరణ కర్త. నా విషయంలో నా దినముల అంతము గురించి ఈ విధముగా ఆయన కొరకు సాక్షిగా ఉండి, ఆయనను కీర్తించి ఘనపరచాలని అనేక మందిని ప్రభువు వద్దకి నడిపించాలని నాకు బోధపరచాడు. నా మరణం వేదనతో కూడినదని చూపించాడు. నా కొరకు సర్వస్వము సమర్పించిన ప్రభువు అనుభవించిన వేదన, బాధలో నాది చాల కొద్దిగా మాత్రమే.

నా మరణం ఎలా ఉండబోతుందో తెలియజేసిన దేవుడు నాకు కొంత సమయాన్ని ఇచ్చి, ఆయుస్సును పొడిగించి ఆయన చిత్తాన్ని జరిగించాలని నా బాధ్యతలను పూర్తి చెయ్యాలని కూడా దేవుడు సూచించాడు.

డి. దేవుని భక్తుల మరణం ఆయన దృష్టికి విలువైనదని పరిశుద్ధ గ్రంథంలో చూస్తాము. అది ఎందుకు విలువైనదో కనుగొనడానికి దేవుడు సహాయం చేసాడు. అవి ఏమిటంటే **అకస్మాత్తు మరణాలు దేవుని పిల్లలకు ఇవ్వడం ఆయన చిత్తం కాదు.** దేవుని పిల్లల మరణం వేదనతో కూడుకున్నది. కాబట్టి చాల మంది భక్తులకు దేవుడు ఒక వ్యాధిని అనుమతిస్తాడు. వ్యాధి లేకుండా కూడా కొన్ని మానసికమైన, ఆర్థికపరమైన, సామాజికపరమైన ఆధ్యాత్మికమైన, శారీరకమైన కొన్ని వేదనలు దేవుడు అనుమతించవచ్చు. అయితే శారీరకమైన వేదన పడినపుడే మనిషి త్వరగా దేవుని వైపు తిరిగి, తన బ్రతుకు మార్చుకొని, ఆయన మహిమ కొరకు జీవించే అవకాశాలు ఎక్కువ.

దేవుడు తన భక్తులకు, దైవజనులకు, విశ్వాసులకు అనారోగ్యాన్ని, వ్యాధిని అనుమతించి, ఆ అనారోగ్యముతో మంచముపైనున్న తనవారిని శుద్ధిచేసి, పరిశుద్ధముగా అలంకరించి, మంచి సువర్ణముగా మార్చి, శ్రమ, బాధ, నొప్పి ద్వారా ఆయన మహిమలోనికి చేర్చుకోవడం నేను గుర్తించాను.

10. యేసు ప్రభువు తనకు విరోధముగా నిలిచిన వారందరిని సిలువ మీద వ్రేలాడుతూ క్షమించిన రీతిలో క్షమాపణ అనే ముఖ్య లక్షణాన్ని తన భక్తులకు మంచముపైన నలుగుడులో నేర్పిస్తాడు. ఎంతో మంది భక్తులు ఆరోగ్యంగా ఉన్నపుడు క్షమించలేనిమనసుతో ఉన్నా శ్రమననుభవించే సమయంలో సమాధానపడడం నేను గమనించాను. నా విషయంలో నేను కొందరిని ఏ స్వార్థం లేకుండా ఆదరించినా ఏదో స్వార్థంతో చేసానని నన్ను నిందించి నందుకు నేను మనసులో వారిని క్షమించ లేకపోయాను. కొన్ని సంవత్సరాలు గడిచినా వారిని తలచుకొన్నపుడు దుఃఖముతో భారమైన

హృదయం కలిగేది. పైకి వారితో మామూలుగా మాట్లాడుతున్నా వారి ముందు ప్రవర్తించిన తీరును తలంచుకొని బాధపడేదాన్ని. అది 'నా క్షమించలేని తనము' అని నలుగుడులో అది తప్పు అని దేవుడు నేర్పించాడు. అపుడు నేను ఎవరెవరి విషయంలో క్షమించలేకపోతున్నానో వారి పేరును చెప్పి, 'యేసు నామంలో వారిని క్షమిస్తూ ఉన్నాను' అని నా రోజూ ప్రార్థనలో చెప్పడం ప్రారంభించాను. ఇది యేసు ప్రభువు యొక్క మాదిరి అని గ్రహించి, ఆ క్షమాపణా గుణాన్ని అలవరచుకొన్నాను. కొద్ది నెలలకే నాకు కీడుచేసి, నష్టపరచి, బాధ పెట్టిన వారిలో దేవుడు కార్యం చేయడం మొదలుపెట్టాడు. వారి మనసులో నాపై దయ కలుగునట్లు దేవుడు కృప చూపించాడు. వారు నిష్కల్మషంగా నన్ను ప్రేమించి, మాట్లాడునట్లు పరిస్థితులను దేవుడు మార్చాడు. ఒక వేళ మనం క్షమించకపోతే మన పరలోకపు తండ్రి కూడా మనలను క్షమించడు. క్షమించబడక నిలిచిపోయిన పాపాలతో నేను ఈ లోకాన్ని విడిచి పెట్టి ప్రభువును సంధిస్తే, ప్రభువు నాకు పరలోకంలో స్థానం ఇవ్వడని గ్రహించాను.

11. సిలువపై నున్న క్రీస్తు ప్రభువుకు చనిపోయాక తాను ఎక్కడికి వెళ్తున్నాడో తెలిసికొని నిశ్చింతగా ఉన్న రీతిగా తన బిడ్డలకు సంపూర్ణ రక్షణ నిశ్చయతను నిచ్చి పరలోకము చేరబోతున్నాననే నిశ్చింతను దృఢముగా మంచము మీద అనారోగ్యముతో ఉన్న వారికి కలిగించడం దేవుని పద్ధతి. నాకు నేను ప్రభువు బిడ్డననే నిశ్చింత ఉంది. నేను మరణిస్తే నేను నా ప్రభువు రొమ్మున ఆనుకొని ఉంటాననే నిశ్చింత మరి ఎక్కువగా నా ప్రభువు నా వ్యాధి బాధలో కలుగజేసారు.

12. యేసుప్రభువు మరణ ఘడియలలో ఉండి దేవుని చిత్తాన్ని సంపూర్ణంగా జరిగించాలని ఆశతో ఉన్నట్టే ఇహలోకపరంగా తన వారిని ఆదరించడం, వారికి ఒక దారి ఏర్పరచడం మనకు మాదిరి. ఆయన శరీరంలో చాలా బాధ నొప్పి పడుతూ కూడా దాన్ని బయటికి చెప్పుకోకుండా ఇతరులను ఆదరించిన ఆయన మాదిరి నేను కూడా అలవరచుకోవాలని ప్రభువు నాకు సూచించారు. ఎంతో మంది భక్తులు, అనారోగ్యంతో నలిగిపోతూ దేవుని సంపూర్ణ చిత్తాన్ని పూర్తిగా గ్రహించలేక, శారీరకంగా నలిగే విషయంలో ప్రభువుపై ఆధారపడకుండా, దేవునిపై సణుగుకుంటూ, దూషిస్తూ, దేవునికి విరోధంగా మాట్లాడే వారిని, దేవునిపై తిరుగుబాటు చేసే వారిని నేను చూచాను. దేవుడు అలాంటి వారి విషయమై నాలో భారాన్ని పెట్టాడు. అదే నాకు దేవుడిచ్చిన పని. వారిని శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఆదరించాలని నా బాధ ఎక్కువగా ఉన్నా, దాన్ని సహిస్తూ, వారిని ప్రోత్సాహపరచాలన్నదే దేవుడు నాకిచ్చిన దర్శనం. నా దుఃఖాన్ని ఇతరులకు గాని, ప్రియమైన వారికి గాని కనబడనివ్వకుండా ఎపుడూ సంతోషంగా ఉండాలని, ఇతరులు నన్ను చూసినపుడు వారికి ప్రోత్సాహాన్ని, నెమ్మదిని కలిగించే విధంగా ఉండాలని నా ప్రభువు తెలియజేసాడు. అది ఆయన చూపిన మాదిరి



కాబట్టి ఆ మాదిరి నా జీవితంలో ఖచ్చితంగా అనుసరించాలని నేను ప్రయాసపడుతున్నాను. అలాగే సంతోషంగా ప్రభువులో జీవించగలుగుతున్నాను.

నా బాధలో నాకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడినా వారి కొరకై మరి ఎక్కువగా ప్రార్థించి వారిలో మార్పు కలిగి, దేవుని కృప నాపై హెచ్చుగా ఉన్నదని గుర్తెరుగునట్లు నా మానసిక ఒత్తిడిని కన్నీటి ప్రార్థనగా మార్చుకున్నాను. వారి విషయమై నాలో ఏవిధమైన వ్యతిరేక భావనా రాకూడదని ప్రార్థించాను. నిందారోపణ చేసి మాట్లాడినపుడు నేను ఎలాగ మొదట బాధపడ్డానో అలాంటి బాధ వేరెవ్వరూ అనుభవించకూడదని, నేను చేతనైతే మేలు చెయ్యాలి, దీవెనకరమైన మంచి మాటలనే పలకాలని నిర్ణయించుకున్నాను. ఇది నా స్వర సమర్పణలో భాగమే, అయినా దాన్ని పాటించడంలో మరల మరల ఆ సమర్పణ దృఢపరచుకుంటూ వచ్చాను.

13. యేసు ప్రభువు యొక్క రక్త ప్రభావము ఎంత శక్తి వంతమైనదో నేను తెలుసుకోగలిగాను. నాకు బాధ అయినపుడు లేక ఎవరైన అనారోగ్యములతో ఉన్నపుడు నా ప్రతి కదలికలోను ప్రయాణాల్లోను నేను ప్రార్థించే వారందరిపైన, అందరిలోనికి, నా లోనికి, ప్రతి అవయవములలోనికి శారీరకమైనవే కాక, మానసిక మైనవాటి మీద కూడ యేసురక్తాన్ని విశ్వాసముతో ప్రోక్షించుకోవటం తద్వారా రానున్న అపాయము తప్పించుకోవడం బాధ నుండి విడుదల పొందడం నాకండ్లారా చూసాను.

రాబోయే అపాయాలను ప్రభువు మనకు ఒక్కొక్కసారి మన కలల్లోగాని, స్వప్నాలద్వారా గాని చూపించి వాటి విషయమై ప్రార్థించే భారాన్ని మనలోపెడతాడు. ఉదాహరణగా ఒక చిన్న విషయాన్ని వివరిస్తాను. నా కుమారుడు రాన్ సామ్యూల్ గురించి నాకొక కల వచ్చింది. వాడు ఆటలాడుతుండగాపడి, వాని ఎడమకాలు విరిగినట్టు ఆ కలలో కన్పించింది. నేను వానిని చూసి దుఃఖపడుతూ, ఆ దుఃఖముతోనే నేను మేల్కొన్నాను. నన్ను నేను చూసుకొంటే నిజంగానే నా కన్నీటితో నాదిండు తడిచి ఉంది. అపుడు దేవుని ఆత్మ నాలో నుండి "వాని కాపుదలకై ప్రార్థించు" అని నన్ను ప్రేరేపించి, నన్ను మోకరింపచేసాడు. నేను ఆ కలలో చూసిన విధంగా నా బిడ్డకు కాకూడదు అని ప్రార్థిస్తూ ఉండగా దేవుని ఆత్మ 'యేసు రక్తాన్ని ఉపయోగించుకో, వాని పైన ప్రోక్షించు' అని నన్ను ప్రేరేపించాడు. అపుడు నేను వాని తల నుండి అరికాలి వరకూ అన్ని అవయవాలలోనికి యేసు రక్తమును ప్రవహింపచేస్తున్నాను. వాడు సంచరించే ప్రాంతమంతా యేసురక్తాన్ని ప్రోక్షిస్తున్నానని విశ్వాసముతో పలికాను. ఆ ప్రార్థన ముగించాక నాలోనికి నిశ్చింత వచ్చింది. దేవుడు నా ప్రార్థన విన్నాడు అనే నిశ్చింతతో ఉన్నాను. ఆ తర్వాత రెండు రోజులకి నా బిడ్డ నా ప్రక్క కొచ్చి కూర్చున్నాడు. నేను వానితో ఏవేవో సంగతులు మాట్లాడుతూ వాని ఎడమ కాలి మీద చూసాను. ఆ కాలు నిండా చాల గాయాలు అయి అవి అప్పుడే రంగుమారి ఉండడం గమనించాను. నా బిడ్డని ఏం జరిగిందని అడిగితే

"నిన్న ఆటలాడుతుండగా పడ్డానమ్మా, అయినా పర్వాలేదు, నొప్పేమీ అంతగా లేదు" అని అన్నాడు. నాకు వెంటనే దేవుడు నన్ను ముందే హెచ్చరించి యేసు రక్తాన్ని ప్రయోగించుమని ప్రేరేపించిన విధానం నాకు జ్ఞాపకానికొచ్చి దేవుని కాపుదలకై ఆయనను కొనియాడాను. అందరి కొరకై చిందించబడిన నిర్దోషమైన యేసు రక్తమునకై వందనాలు చెప్పాను. ఇలాంటివే ఎన్నో నా జీవితంలో జరిగినాయి. ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే నా జీవితంలో నేను రోజూ ప్రయోగించుకొనే శక్తివంతమైన ఔషదం యేసు రక్తం.

14. దేవుడు తన పిల్లలతో ఎలాగ మాట్లాడుతాడు? వ్యక్తిగతంగా అది ఆ సందర్భానికి ఎలా వర్తించుకోవాలి? నిజంగా దేవుని చిత్తము అంటే ఏమిటి? దాన్ని ఎలా తెలిసికొనగలను? నేను ఆ ప్రకారంగా చేస్తున్నానా, నిజంగా ఇలాగ జరగడం దేవుని చిత్తమా? వంటి ప్రశ్నలు ఎన్నో మనల్ని వేధిస్తాయి. వీటిలో చాల విషయాలు నాకు తెలియచేసాడు. 'దేవుడు ఫలాన సందర్భంలో నన్ను ఇలాగ చెయ్యమని చెప్పాడు' అని కొందరు చెప్తూ ఉంటే అని చాల మందికి దేవుడు నిజంగా ఎలా మాట్లాడుతాడు? స్వరం వినిపిస్తాడా? ప్రత్యక్షమౌతాడా? వంటి సందేహాలు మనలో వస్తూ ఉంటాయి.

నా విషయంలో దేవుడు నన్ను ఎలా తన మాటలతో ఆదరించాడో కొన్ని ఉదాహరణలు చెప్తాను.

ఎ. దేవుడు నాతో మాట్లాడడానికి ముందు నా హృదయంలో ప్రతిసారీ కూడా దేవుడు నాతో మాట్లాడాలి, నా సమస్యకి పరిష్కారం చూపాలి అనే కోరిక, ఆశ ఉన్నట్టు స్పష్టంగా గమనించాను.

నేను బైబిలును రోజు ఒక పద్ధతి ప్రకారం చదువుతాను. దాన్ని ఇంతకుముందే వివరించాను. 5 అధ్యాయాలు ఒకే పుస్తకం నుండి కాక ఒకటి మోషే వ్రాసిన పంచకాండాల నుండి 2వది ప్రవక్తల గ్రంథం, 3వది కీర్తనల నుండి, 4వది సువార్తల నుండి, 5వది పత్రికల నుండి చదువుతాను. ఒక్కోసారి నాకు జవాబు రాకపోతే ఇంకా ఎక్కువ చదువతాను. కొన్ని కంఠస్థం చేస్తుంటాను.

నేను జూలై 3వ తారీఖు 2002 రక్తపు వాంతి అయి, చాల భయంకరమైన స్థితిలో మరణకరమైన పరిస్థితిలో ఉండగా, నన్నెవరూ ఆదరించని సమయంలో దేవుని వాక్యం చదివితే నిజంగా ధైర్యం పొందుతాననే ఆశ కలిగి, బైబిలు ఆ సమయంలో లేనందువల్ల చాల బాధ పడ్డాను, వాక్యం చదువుకోవడానికి బైబిల్ కావాలని వచ్చిన వారందరితో చెప్పాను. వాళ్ళు మరుసటి రోజు తెచ్చి ఇచ్చే లోపల ఒక మహా అద్భుతం ఆ రాత్రే జరిగింది. 'ఎందుకిలాంటి విషమ పరిస్థితి నాకొచ్చింది? ఇలాంటి స్థితిలో నా దగ్గర బైబిలు లేదే!' అని మరింత దుఃఖపడుతూ ఉండగా నా మనసు ప్రశ్నించే సమస్యల స్వరం ఒకటైతే, ఆ ప్రశ్నలకు జవాబుగా మరొక స్వరం నా హృదయం నుండే బయటకు



రావడం నేను విన్నాను. ఆ స్వరము చాల మెల్లనైన, మృధువైన స్వరం. 'బైబిలు ఇపుడు నీ వద్ద లేదని బాధపడకు, చిన్నప్పటి నుండి నువ్వు నేర్చుకొనిన కంఠత వాక్యాలు గుర్తు చేసుకో' అని ఆ స్వరం నాతో పలికింది. వెంటనే 23వ కీర్తన నా ముందు తెరిచి పెట్టినట్లయి పెద్ద అక్షరాలతో కనబడుతున్నట్టుగా అయింది. ఆ కీర్తనలోని ప్రతి మాట నా హృదయ భారాన్ని, బాధని తొలగించింది. అది నిజంగా దేవుడు ఆ సందర్భానికి తగ్గట్టుగా ఆయన చిత్తమేమిటో ఒక స్వరం వినిపించుట ద్వారా పరిశుద్ధ గ్రంథములోని వాక్యాన్ని ఏది ఆ సమయానికి కావాలో దాన్నే ముందు గుర్తు చేసి నా ముందుంచి నన్ను బలపరిచాడు. దానికి ఋజువు నేను బ్రతికి బయటపడడమే, ఈనాటికీ అదే ధైర్యముతో ముందడుగు వేయడమే.

బి. కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో తన పిల్లలకు మెల్లనైన తన స్వరమును, వినిపించి, వాక్యాన్ని గుర్తు చేసి తన చిత్తాన్ని తెలియజేస్తాడు.

సి. మరొక సందర్భం లివర్ ఆపరేషన్ ముందు ఆ రోజు పత్రికలలో నా పోర్షన్ 2 పేతురు 1వ అధ్యాయం చదువుతూ 13-15 వచనాలు చూచి అవి చాలా విచిత్రంగా కనిపించడం గమనించాను. కొన్ని క్షణాల్లో అది నీ కొరకే అనే ప్రేరేపణ ప్రభువు నాలో కలిగించాడు. ఆ వాక్య భాగంలో నుండి "మరణించడం అందరికి వర్తిస్తుంది. నీవు కూడా ఒకనాడు నా దగ్గరికి రావాలి, అయితే వచ్చే ముందు నీవు చేయవలసిన పనులు, భద్రము చేయవలసిన విషయాలు ఉన్నాయని" ఆ వాక్యం ద్వారా ప్రేరేపించాడు దేవుడు అపుడు నేనేమి పనులు చెయ్యాలి? ఏమి భద్రం చేసి తర్వాత తరాలకు సిద్ధం చెయ్యాలి? అని మోకాళ్ళపై ఉండి ప్రార్థిస్తు ఉండగా నేను కన్నులు మూసుకొని ఉండగా కొన్ని చిత్రాలు నా ముందు త్వరత్వరగా కదలడం గమనించాను. మామూలుగా మనుష్యులు కండ్లు మూసుకొని గమనిస్తే మన కన్నుల ముందు కొన్ని బొమ్మలు, కొన్ని ఆకారాలు ఉన్నట్టు, కళ్ళు మూసుకొని ఉండగానే ఎన్నో చిత్రాలు దొర్లిపోతుంటాయి. అయితే మనం దేవుని చిత్తమేమిటో తెలిసుకోవాలని చేసే ప్రయత్నంలో కన్నులు మూసుకున్నపుడు కొన్ని అర్థవంతమైనవి, మాములుగా అనిపించనివి కనిపిస్తాయి. నాకు ఏప్రిల్ 26, 2005 సం॥లో మల్య హాస్పిటల్‌లో కొన్ని నా ఫోటోలు కన్పించాయి. అందులో ఒకటి నేను సాక్ష్యం చెప్తున్నట్టు, 2వది నా అనుభవాలలో వ్రాసిన పాటలు పాడుతుంటే ఎంతో మంది ఆదరింపబడుతున్నట్టు, 3వది వాక్య పరిచర్యలో కూడా నా అనుభవాన్ని కలిపి వాక్యాన్ని బోధిస్తున్నట్టు నాకు కన్పించాయి. నాకు మామూలుగా కన్నులు మూసుకున్నపుడు కనిపించే బొమ్మలకన్నా ఇవి వేరేగా కనిపించాయి. ఆ విషయమై ప్రార్థన చేసినపుడు దేవుడు దాన్ని ధృడపరిచాడు. దేవుడు మనతో ఈ విధంగా కూడా మాట్లాడుతాడు. దేవుడు తన చిత్తాన్ని ఈ విధంగా నాకు తెలిపాడు.

ఇంకా కొన్ని సందరర్భాలు తర్వాత సాక్ష్యములో మీరు చదవగలరు. దేవుడు మనతో

అనేక విధాలుగా మాట్లాడుతాడు, కాని వాటన్నిటికి వాక్యము మనకు ఆధారముగా ఉండాలి.

15. నేను ఇక్కడ ఇంత శ్రమను, బాధను దేవుని కొరకు అనుభవించడానికి ఇష్టపడ్డాను, దానికి మరొక కారణం ఏమంటే దేవుని రాజ్యంలో నేను పొందబోయే మహిమ అధికంగా ఉండగలదు. అంటే మనకు దేవుని రాజ్యంలో మనం ఇక్కడపడే శ్రమకి తగిన మహిమ ఉంటుంది. ఇక్కడ ఎక్కువ శ్రమ దేవుని కొరకు అనుభవించి, దేవుని మహిమపరిస్తే ఆయన రాజ్యంలో ఆయన ఇచ్చే మహిమ మరింత ఎక్కువగా ఉంటుంది. మనము పరలోకములో పొందబోయే మహిమ ఎదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావు అని ఎంచుకొనుచున్నాను అని పౌలు భక్తుడు, ఏ శ్రమలనైతే కోరుకున్నాడో అదే విధంగా నేను కోరుకున్నాను.

16. కొందరు శ్రేష్ఠమైన పునరుత్థానము కోరి విడుదల పొందనొల్లక మరింత యాతన పెట్టబడ్డారు అని విశ్వాసుల పట్టికలో హెబ్రీ 11వ అధ్యాయంలో వ్రాయబడిన వాక్యానికి ఆధారంగా నా జీవితంలో మా అమ్మమ్మ శ్రీమతి కె.ఎస్. మిరియాంగారు నాకు ఆదర్శంగా నిలిచారు. ఆమె చాల శారీరక వేదన భరిస్తూ కూడా స్తుతులు, స్తోత్రాలు, ప్రార్థన, విజ్ఞాపనలు చేస్తూ ఉండేవారు. చాల ఓర్పుగా అన్ని చివరి వరకూ సహించుకోవడం నాకు ప్రేరణ. నా శ్రమకు తగిన బహుమానం అధికమైన మహిమ ఆ మహిమ గల రాజ్యంలో ప్రభువు నాకు తప్పక అనుగ్రహిస్తాడు.

17. నా శ్రమలో పోరాడి నేను గెలిచి పొందే మరొక బహుమానం నీతికిరీటము ఇది ఎవరైతే మంచి పోరాటమును పోరాడి విశ్వాసాన్ని కాపాడుకుంటారో వారికే దేవుడిచ్చే బహుమానము. కొంతమంది దేవుడు ఇచ్చిన పని చెయ్యకుండా, వారి స్వంత పనులే చేసుకొంటూ, దేవుడు చేసిన మేళ్ళను వివరిస్తూ సాక్ష్యమియ్యకుండా, తమకున్న భక్తి సంతృప్తి కరమైనదే అని సంబరపడిపోతూ, ఇతరుల భక్తి విషయమై నీచముగా మాట్లాడుతూ ఒక విధంగా పరిసయ్యుల భక్తిని పోలి, ఏమాత్రం తగ్గించుకోకుండా తమ స్వనీతిని హెచ్చించుకొనే వారిని నేను ఎంతో మందిని చూసాను. "ఏమి? నీకేనా దేవుడు నీతి కిరీటం ఇచ్చేది మాకు నీతి కిరీటం ఉండదా?" అని కొందరు అడిగారు. దాని విషయమై నేనెలా తీర్పు తీర్చగలను? అది దేవుడు న్యాయాధిపతిగా ఉండి మన పరుగు కడముట్టించినపుడు ఇచ్చే బహుమానం. ఆ పరుగులో అంటే విశ్వాస యాత్రలో ఎంతో మంది రక్షణ పొందినవారే జతగాండ్రుగా ఉంటారు. అందరూ గురి వద్దకు పరుగుతీసే వారే. కాని బహుమానం అందరికీ రాదు అని నేను ఖచ్చితంగా చెప్పగలను.

కొందరు తమ కున్న వ్యాధిని బయట పెడితే తమ భక్తిని వేరే విధంగా అందరూ తలపోస్తారనే అది కుటుంబంలో వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి అయితే తమ పిల్లలకి వివాహాలు జరగవేమోనని, ఆ వివాహాలు జరిగాక నేను దేవుని కొరకు సాక్షిగా



నిలబడతానని కొందరు తమ్మును తామే బుజ్జగించుకొని, తమ ఇష్టానికే విలువ ఇస్తూ, దేవుని కార్యాలని వృధాపరుస్తూ, వాయిదావేస్తూ, నిజంగా పోరాడేవారిని ప్రోత్సహించ కుండా నిరుత్సాహపరుస్తూ, ఒక విధంగా దేవుని కార్యాలని చెడగొట్టే సాతానుకు దూతలుగా ఎంతో మంది వ్యవహరించడం నేను చూసాను. దేవుడు మనం ఎన్నాళ్ళు ఉండాలని ముందే నిర్ణయించినా, మనం ఆయన నడిపింపులో నడిచే విధానం మన జీవితకాలాన్ని పొడిగించవచ్చు, అలా నడవకపోతే తగ్గించనూవచ్చు. దేవుడు సర్వ జ్ఞాని.

నిజానికి నేనెప్పుడో మరణించాల్సింది కాని దేవుని కృప, ఎంతో మంది ప్రార్థన ఫలితంగా ఈ రోజు ఇంకా బ్రతికి ఉన్నాను. నేను బ్రతికి ఉండడానికి ఇంకో కారణం దేవుని చిత్తాన్ని కనుగొని, స్పష్టంగా కనుగొనిన దేవుని చిత్తం జరిగించడానికే ఎంతో శ్రమిస్తూ, దివారాత్రులు కష్టపడినపుడు ఎంతో మంది బలహీనులు ప్రభువు ద్వారా బలము పొందుకోవడం, వ్యాధి గ్రస్తులు స్వస్థత పొందుకోవడం, నిరీక్షణ లేకుండా మరణపడకపై ఉన్నవారు దేవుడిచ్చే నిరీక్షణ పొందుకోవడం, అటువంటి వారు తిరిగి నా ద్వారా ప్రభువు వారి జీవితంలో జరిగించిన మేళ్ళను నాతో పంచుకోవడమే. దాని ద్వారా నాలో రెట్టింపు ప్రోత్సాహం కలిగేది. నా జీవితాన్ని అది చిన్నదే అయినా ఎంతో మందికి మార్గదర్శకంగా, మాదిరిగా, నిజంగా ప్రోత్సాహాన్ని కలిగించేదిగా దేవుడు చేసాడని, ఆయన కొరకు మరింత ఎక్కువగా నేను శ్రమించాలని ఆశపడుతూ ముందుకు కొనసాగుతూ ఉన్నాను. కొంత మంది నా బాగుకోరి వ్యాధి వచ్చాక నేను సరిగ్గా విశ్రాంతి తీసుకోకుండా ఎక్కువగా ప్రయాణాలు చేస్తూ, సేవకి వెళ్ళడం చూచి, తర్వాత నా వ్యాధి ఎక్కువైనదని తెలిసి "నువ్వు సరిగ్గా విశ్రాంతి తీసుకోనందువల్ల వ్యాధి ఇలా ఎక్కువైనదని" హెచ్చరించారు. మానసికంగా నన్ను బాధపడితే వెళ్ళడం మానేస్తానని నొప్పించే మాటలు పలికారు. కాని నేను వారి మాట ఖాతరు చెయ్యలేదు. నాకు శక్తి, బలము ఎక్కడ నుండి, ఎలాగ వస్తున్నాయో నాకు అనుభవ పూర్వకంగా తెలుసు. అయినా దేవుని సముఖంలో, దేవుని పనిలో నేను పాట పాడుతూ ఉండగానే వాక్యపరిచర్యలో నా అనుభవం జతచేసి చెప్పినపుడో లేక సాక్ష్యాన్ని పంచుకుంటూ ఉండగానే నేను ఈ లోకాన్ని విడిచి నా ప్రభువు వద్దకి వెళ్ళిపోతే అంతకన్నా ధన్యత మరొకటి ఉండదని నేననుకుంటాను. నేనదే మాట వారితో చెప్పాను. నేను స్వస్థత కొరకై ప్రత్యేకముగా ప్రార్థించినపుడు నా దేవుడు ఆ రోజు నా డైలీ పోర్షన్‌లో నుండి మాట్లాడిన మాట "బలహీనతలోనే నా శక్తిని నేను పరిపూర్ణము చేస్తాను. నా కృప నీకు చాలు". నేనపుడు దేవుడు నన్ను స్వస్థపరచకుండానే అంటే క్యాన్సర్ వ్యాధిని నాలోనే ఉంచి తన శక్తిని నిరూపిస్తాడని అర్థమైంది. అలాగే దేవుడు ఎంతో మంది జీవితంలో నా ద్వారా మేలు చేయడం చూసి, వాక్యాన్ని ఎన్నో విధాలుగా నేర్పించడం గమనించి "నీ కృపకు పాత్రురాలనుకాని నన్ను ఇంతటి దానను చేసి నన్ను ఘనపరిచావు. నువ్వు

నన్ను స్వస్థపరచకపోయినా పర్వాలేదు, అయితే నువ్వు నాతో ఉండాలి, నాలో ఉండాలి, నీ కృప నన్ను విడిచి పోనియ్యకు, నీ శక్తిని నా వ్యాధిలోనే పరిపూర్ణం చెయ్యి తండ్రీ!" అనేది నా అనుదిన ప్రార్థన అయింది.

18. అయితే నేనెక్కడికి వెళ్ళినా అక్కడ నా సాక్ష్యాన్ని విన్నవారు ఎంతో మంది నా కొరకు, నా స్వస్థత కొరకు, నా పరిచర్య మరింత ఫలించాలని కోరుతూ ప్రార్థనలు, విజ్ఞాపనలు, యాచనలు దేవునికి సమర్పిస్తున్నారు. దేశ విదేశాల్లో నా కోసం ప్రార్థించేవారు నాకున్నారు. వేల మంది ప్రార్థనలలో నా అంశము ప్రత్యేకించి దేవున్ని అడిగేవారు, మామూలుగా కాక నా కోసం ఉపవాసం ప్రతిష్ఠించుకొని ప్రార్థించేవారు, ముఖాముఖిగా నేను ఎరగని వారే ఎంతో మంది ఉన్నారు. నన్ను అధికముగా ప్రేమించి నా కొరకు వారానికి ఒకసారి ఉపవాసముతో ప్రార్థించే వారిని నాకోసం దేవుడు ఏర్పరచాడని తెలిసి నా మనసు ఎంతో సంతోషముతో నిండి పోయింది. జనములలో నాఘనతను ఇంతగా హెచ్చించిన నాప్రభువుకు నేనేమివ్వగలను? కావాలంటే నన్ను తీసుకొని, నా ఆయుష్షును ఆమెకి పోసి బ్రతికించు అని ప్రార్థించే వారిని కూడా చూసాను. అది వారి ప్రేమకు, త్యాగానికి పరాకాష్ఠ.

19. కొందరు నా పాటలలో కొన్నింటిని ఫోన్‌లో స్వయంగా పాడితే వినాలని ఫోన్ చేసి మాట్లాడి పాడించుకుంటారు. ప్రత్యేక ప్రార్థనలు కోరతారు ఫోన్‌లోనే ప్రార్థన చేయించుకుంటారు. కష్టపడి అనుభవంతో పాటలు మీరు వ్రాసారు కాబట్టి ఆ పాటల ద్వారా మాకెంతో ఆదరణ, ఒక తల్లి లాలించిన అనుభవము కలుగుతుంది అని చెప్పినవారెంతోమంది ఉన్నారు. ఆ పాటలకు దేవుడు తన అభిషేకము ఇచ్చి వాడుకొనుట ద్వారా ఎంతో దేవుని మహిమ కలుగుతూ ఉన్నది.

20. ఈ శరీరము పాప స్వభావముతో నిండి, పాపము నియమమునే నెరవేర్చాలని కోరుకుంటుంది. కాబట్టి వ్యాధి కలిగినపుడు స్వస్థత కావాలనుకుంటే యేసు నామము ద్వారా స్వస్థత కలుగుతుంది. కాని ఈ శరీరములో ఉండే పాప స్వభావము మనలను మరల మరల చిన్ని వ్యాధులు లేక పెద్ద వ్యాధులను ఏదైనా పొంది బలహీనులయేటట్టు చేస్తుంది. అందుకే ఈ తాత్కాలికమైన స్వస్థత కన్నా శాశ్వతమైన స్వస్థత కావాలని కోరుకున్నాను. అది ఏ విధంగా ఎపుడు పొందగలనో దేవుడు నాకు బోధించాడు. మన క్షయమైన, మర్త్య శరీరము అక్షయతను, అమర్త్యతను పొందుకొనినపుడు అనగా మన మందరము ప్రభువును ఎదుర్కొన్నపుడే మన శరీరము రూపాంతరము పొంది మహిమ శరీరముగా మార్చబడుతుంది. ఆ మహిమ శరీరానికి ఇక ఏ విధమైన వ్యాధి, బాధ, వేదన కలుగవు. అది శాశ్వతమైన స్వస్థత. దేవుడు నాకు ఈ సత్యాన్ని బయలు పరచినపుడు శరీరములో తాత్కాలిక స్వస్థత కన్నా, శాశ్వతమైన స్వస్థత ఉండాలని, కోరుకోవడానికి నేను క్యాన్సర్ నుండి స్వస్థత పొందకపోయినా పర్వాలేదని, ఓర్చుకోవడానికి మాత్రం



దేవుని కృపను కోరుకుంటూ ఎంతటి బాధనైనా భరించగలనని తలంచాను. **శ్రమలో దేవుడ్ని దూషించకుండా, సహించుకోవడము ద్వారా కూడా దేవుడ్ని ఘనపరచగల ఒక పద్ధతి** అని అర్థమైంది.

21. కొంత మంది దేవునిలో విశ్వాసముంచిన వారే తాము ఏ వ్యాధి భారిన పడకుండా ఉన్నారంటే అది దేవుని కృపగా కాక తాము చాల పరిశుద్ధులమని, పాపము చేయలేదు అందుకే చక్కగా ఉన్నామని అనుకుంటారు, ఇంకా కొంత మంది ఏదైనా క్యాన్సరు లాంటి వ్యాధి నుండి బయట పడి బాగుంటే అది కూడా దేవుని కృప అని పైకి చెప్తున్నా వారి జీవన విధానంలో మాత్రం తమ విశ్వాసంలో గొప్పదని, తమ ప్రార్థనా జీవితమే (చేసే కొద్ది ప్రార్థనే చాలా ఎక్కువ అని అపోహపడిన వారిని) చాల గొప్పగా ఉంచినదని తమ్మును తామే గొప్పగా చెప్పుకొనే వారిని చూసాను. నిజనికి వారి విశ్వాసం గొప్పదని, వారి ప్రార్థనా జీవితం చాల ఉన్నతమైనది దేవుడు సాక్ష్యమివ్వాలి. వీరు నేను శ్రమ పడినపుడు నాకు విశ్వాసం లేదు, నీ భక్తి సరైనది కాదు అని నన్ను నిరుత్సాహపరచిన వారున్నారు. అపుడు దేవుడు నాకు స్వస్థత కన్నా ఎంతో మిన్నైన విషయాలు నాకు బోధించాడు నా వ్యాధి ద్వారా. యోబు, యోసేపుల జీవితాన్ని నాముందు పరచి "వారు అధికంగా శ్రమ పొందడానికి, కారణం విశ్వాసం లేకపోవడం కాదు, నా మహిమను అధికంగా పొందడానికి ఎందరికో గొప్ప మాదిరిని, క్రీస్తు మాదిరిని చూపడానికి" అని నా ప్రభువు తెలియ చేసాడు.

కాబట్టి మన ప్రక్కవారిని వ్యాధి బాధతో నలుగగొట్టే దేవుడు ఎందుకు నీకు అనుమతించడం లేదంటే మనం తట్టుకోలేమని, ఆ కష్టములో ప్రభువుని ఘనపరచలేమని, ప్రక్కవారు నలుగుతుంటే బుద్ధి తెచ్చుకొని జాగ్రత్తగా తమ్మును తాము తగ్గించుకొని క్రీస్తుకు సంపూర్ణ విధేయత చూపుట అలవరచుకోవాలని దేవుడు దీర్ఘశాంతము చూపుతున్నాడు. ఎందుకంటే దేవుని దృష్టిలో అందరం ఘోరపాపులమే. ఏపాపం నాలో లేదు అనే ఆత్మీయగర్వం, వేరొకరు కష్టం అనుభవిస్తుంటే వాడు చేసిన పాపమే దీనికి కారణం అని తీర్పు తీర్చేతత్వం చాల విషపూరితమైన పాపం. అది వేషధారణ. ఎందుకంటే మనం చేసిన పాపాలు బయట వారికి తెలియకపోవచ్చు. గుట్టుచప్పుడు కాకుండా పాపాలు చేసిఉండవచ్చు. అయినా దేవుడు మనం సహించుకోలేమని మనపై జాలి చూపి దీర్ఘశాంతము చూపడాన్ని మన గొప్ప తనమే అనుకొని, దేవుని ఉగ్రత నుండి తప్పించ బడినది మన నిర్దోషత్వమేనని గొప్పగా బావిస్తూ వాటి విషయమై ఏమాత్రం పశ్చాత్తాపపడము. కాని దేవుడు కోరుకునేది ఏదైన మనమేలుకే అని ఎరగాలి. ప్రక్కవారి కష్టం, శ్రమ, మరణం కూడా 'మన మేలు కొరకే' అని తలంచినపుడు దానిలో ఉండే మేలు గ్రహిస్తాము. ముఖ్యంగా మన జీవిత వైఖరిని క్రీస్తుకు ఇష్టమైన రీతిలో మార్చుకొంటాము. కాబట్టి మనకు చేతనైనంత వరకూ ఆదరణకరంగా, మేలుకరంగా

ఉండడానికి మన మాటలను, నోటిని, నాలుకకు పెదవులను కాపాడుకోవాలి.

అందుకే ఎవరైనా నాకు విరుద్ధంగా, దూషణకరంగా మాట్లాడినా, శపించినా ప్రతిగా 'సాత్వీకము' అలవరచుకొని, వారిని ప్రేమించి, వారి కొరకై ప్రార్థించడం దాని ఫలితాన్ని నా కన్నులారా వారు మార్చబడడం చూచి దేవునిలో మరింత ఆనందం పొందుతున్నాను.

ఇలాగ ఈ వ్యాధి ద్వారా నేను పొందిన ఆత్మీయ మేలులు ఎంతో గొప్పవి. మరణ ఘడియలలో కూడా నవ్వుతూ, నొప్పిని భరిస్తూ, దేవునిలో నేను ఆనందించే కృపను ఎంతోమంది కన్నులారా చూచి "ఆ కృప అందరికి ఉండదు, క్రీస్తులో మీరు ప్రత్యేకింపబడినవారు" అని ఎందరో సాక్ష్యమిచ్చారు. "మీరు మాకు మాదిరిగా కనిపిస్తున్నారు" అని అన్యులు సైతం గుర్తించే స్థితిలో అనేకులకు నన్నొక వింతగా చేసిన నా ప్రభువును మనసారా ఆరాధిస్తున్నారు. హృదయమారా సన్నుతించుచున్నాను. నా జీవితం, నా సమస్తం నా దేవునిదే. ఆయనకే నేను అంకితం. ఆయన నాకై సిలువలో చేసిన యాగం నాకెంతో మాదిరిని చూపింది. సిలువను బట్టి అతిశయించినట్టే నేను నా వ్యాధిని బట్టి నేను ప్రభువులో ఆనందిస్తున్నాను, అతిశయిస్తున్నాను. బలహీనతే నా అతిశయ కారణం.

నాకొక సంవత్సరం పాటు కీమోథెరపీ ఇచ్చారు. సంవత్సరం పూర్తయ్యాక ట్రీట్‌మెంట్ ఎంత వరకు పనిచేసిందో తెలియడానికి PET CT SCAN చేయించాలని నా డాక్టర్ సలహా ఇచ్చారు. అది అప్పటికి ముంబై, హైదరాబాద్‌లలో ఉంది. చేయించాలంటే దాని ఖర్చే 27,500రూ.లు. దానికి మా ఫ్యాక్టరీ భరించదు అని తెలిసింది. నేను దాని విషయమై ప్రార్థిస్తూ ఉన్నాను. 2006 సం॥ము జూన్‌లో నేను మూడు చోట్ల ఆంధ్రలో మీటింగులకు హాజరయ్యాను. రాత్రి పగలు చాల శ్రమించి, ప్రయాణించి, సాక్ష్యమిచ్చి అనేక మందిని ప్రోత్సాహపరచాను. ఆ మూడవ స్థలం అమలాపురం మన్నా సిల్వర్ జూబిలీ చర్చ్ అక్కడ స్త్రీల కూడికలకు ఆహ్వానించబడ్డాను. నేను ప్రభువు కార్యంలో నిమగ్నమైనందుకు దేవుడు నా స్కానింగ్‌కు అవసరమైన డబ్బును మా మేనమామగారు రెవ॥ కార్ల్ డి కొమానపల్లి దంపతుల ద్వారా సమకూర్చారు. ఆ రోజున నేను ఇంటికి వస్తూ భీమవరంలో కూడా మీటింగ్ చూసుకొని మధ్యరాత్రి 2:30 గంటలకి కరపలో ఇంటికి చేరి ఆ డబ్బు చూచినపుడు 22,000రూ ఉంది. నాకు చాల ఆశ్చర్యము, భయము కలిగింది. ఎందుకంటే నా స్వంత డబ్బు నా కొరకు ఖర్చుపెట్టాలని నా ఇష్టం కాదు. దేవుని పని చెయ్యాలని, పాటలు, సాక్ష్యం, సి.డి.లు చెయ్యాలని మెడికల్ క్యాంప్‌లో మందుల కోసం ఇంకా ఎంతో పరిచర్య ఉంది. దానికి ఎక్కువ ఖర్చు అవుతుందని తెలిసి నా రాబడి అంతా దానికై సమకూర్చుతూ ఉన్నాను. అందుకే స్కాన్ చేయించడం వద్దు, ఆ డబ్బు దేవుని పనిలోనే పెడదాం అని తలంచిన నాకు ఆ స్కాన్ కోసమే డబ్బు సమకూర్చబడడం చూచి చాలా భయం కలిగింది. బెంగుళూరుకు వచ్చాక నేను చాల



కలత చెంది ప్రార్థనలో ఎక్కువ సమయం గడిపాను. వద్దనుకుంటూండగా దాని కోసమే దేవుడు డబ్బు సమకూర్చితే దానికి కారణం ఏముండవచ్చు? అని మోకాళ్ళపై దేవున్ని ప్రశ్నిస్తూ ఆ స్కాన్ చెయ్యడం అంత అత్యవసరమని తెలుసుకున్నాను. అంటే "దానిలో ఏదైనా వ్యాధి ఎక్కువైనదని వస్తుందా?" అని అడిగినపుడు దేవుడు నా మనసులోనికి 'అవును' అనే ఆలోచన పెట్టాడు. అలాగే మోకాళ్ళ మీద ఉండి దేవునితో పెనుగులాట మొదలు పెట్టాను. "ప్రభువా, నీ సాక్షిగా ఉండాలని అన్నావు, అలాగే నిన్ను గురించి నా శ్రమలో, వేదనలో కూడా నిన్ను హెచ్చిస్తూ వస్తూ ఉన్నాను. బలహీనతలోనే బలపరుస్తూ నడిపిస్తూన్నావని బలహీనతలోనే నేను అతిశయిస్తున్నాను, బలహీనతే నా అతిశయ కారణం అని చెప్తూ వస్తున్నాను. నీవు ధ్యానసమయంలో నాకు నేర్పిన ఎన్నో సంగతులను నేను తెలియచేస్తూ వస్తూ ఉన్నాను, అయినా ఎందుకు ప్రభువా మరల నాకు అనారోగ్యాన్ని ఎక్కువ చేస్తున్నావు? ఈసారి కూడా నేను ఆపరేషన్‌కి వెళ్ళక తప్పదా? అని అడిగినపుడు 'అవును' అనే ఆలోచన ప్రభువు నా మనస్సులో పెట్టాడు. "ఎన్నో సంగతులు నేర్చుకున్నాను కదా నేనింకా ఏమి నేర్చుకోవాలి ప్రభువా ఈసారి ఆపరేషన్ జరిగినపుడు ఎలా ఉండబోతుంది నా పరిస్థితి?" అని అడిగాడు "నువ్వు ఇంకా ఎంతో నేర్చుకోవాలి, ఎంతో ఫలించాలి, సహించుకోవడం ఇంకా నేర్చుకోవాలి, ఆత్మఫలాలు ఇంకా ఫలించాలి" అనే మాట నా మనసులో పెట్టాడు. నేను ఇంత వరకు నీ కొరకు చాల సహించుకున్నాను కదా ప్రభువా! నేను ఇంకా ఏమి, ఎంత వరకు సహించుకోవాలి అని అడిగినప్పుడు "యోబు సహనము గురించి నీవు విన్నావు కదా!" అని ప్రభువు అన్నాడు. మరల" అయ్యో అంతటి సహనమా? నావల్ల అవుతుందా?అయినా అంతగా సహించుకుంటే నాకేమి లాభము ప్రభువా?" అని అడిగాను "సహించు కున్నావాళ్ళు ధన్యులు" అని ప్రభువు మరల నా మనసులో పెట్టాడు.

దేవుడు ఏ విధంగా మనతో మాట్లాడుతాడు? అనే ప్రశ్నకు సమాధానం కావలసిన వారికి పైన వివరించిన సందర్భమును చదివి కనిపెట్టవచ్చు. నేను మోకాళ్ళపై దేవునితో నేను ప్రశ్నలు అడిగినప్పుడు ఎంతో స్పష్టముగా వెంటవెంటనే నా మనసును ఒప్పించే జవాబులు వాక్యధారముగా దేవుడు నా మనసులో పెట్టాడు. దేవుడు మాట్లాడే పద్ధతులలో ఇది ఒకటి .

నేను "సరే ప్రభువా! నేను సహించుకోవడం నీ చిత్తమైతే నేను సహించుకుంటాను, నాకు నీకృప మాత్రం చాలు" అని పలికిన వెంటనే దేవుడు నాకొక సంభాషణ వినిపించాడు అది పరలోకంలో దేవునికి సాతానుకు మధ్య నా విషయమై జరిగిన సంభాషణ.

**దేవుడు :** "నా కుమార్తె విజయసుధను నువ్వు చూసావా? ఆమె తన మరణ లోయలో కూడా నన్ను స్తుతిస్తూ ఉన్నది?"

**సాతాను :** "నువ్వు ఆమెను నీ రక్తముతో కప్పి మరణం చేరువైన ప్రతీసారీ ఆమెను

కాపాడుతున్నావు. నీవు నీ కాపుదల లేకుండా ఆమెను విడిచిపెడితే ఇంకా ఆమెను శ్రమకు అనుమతిస్తే ఆమె నిన్ను దూషించి చనిపోతుంది."

**దేవుడు :** "అలాగా! అయితే సరే నువ్వు వెళ్ళి నీకేమి కావాలంటే అది ఆమె పట్ల చేసుకో, ఆమెను ఇంకా శ్రమపెట్టు కాని నా కుమార్తె తప్పక నన్ను తన మరణగడియలలో కూడా స్తుతిస్తుంది. ఆమెకు నేను ఆమె కోరుకొనిన నా కృపను దూరం చేయను."

పైన వ్రాసిన సంభాషణ ఎంత యధార్ధమైనదంటే నేను మొదట నమ్మలేక పోయాను. ఈ విధమైన సంభాషణ జరిగినట్టు దేవుడు నాకు అది చూపటం నాకిదే మొదటిసారి. నాకపుడు మరల దేవుని వాక్కు నాలో నుండి నాకు వినిపించడం మొదలు పెట్టింది. "నేను ఈసారి నీకు అనుమతించే శ్రమ ముందు నువ్వు పొందిన వాటికన్నా ఎక్కువగా ఉంటుంది. అయితే నా కృప నిన్ను వెంటాడుతుంది" అని దేవుని వాక్కు స్పష్టముగా వినిపించింది. నేను అన్నిటికి సిద్ధమై హైదరాబాదు వెళ్ళాలనుకున్నాను.

అయితే నేను ఆధ్యాత్మికముగా ఎంత బలముగా ఉన్నా దాని నుండి పడగొట్టి, నన్ను బలహీనపరరచి, ఆత్మీయముగా దిగజారిపోయి, దేవున్ని స్తుతించకుండా చెయ్యాలని సాతాను వేసిన పన్నాగములో నేను చాలా సులభంగా చిక్కుకున్నాను. అదేమిటంటే నేను చనిపోతే నా భర్త మరల పెళ్ళి చేసుకుంటారని సాతాను పదే పదే నా మనసుకు తెస్తూ ఉన్నాడు. నేను అడగకూడదను కుంటూనే "నేను చనిపోతే మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా" అని అడిగాను నా భర్తను. ఆయన నాకు వెంటనే సమాధానం చెప్పకుండా కాసేపు ఆగి "నూటికి తొంభై శాతం చేసుకోను. కాని ఆ మిగిలిన పది శాతం నేను చెప్పలేను" అని అన్నారు. సాతాను ఇక నా మనసును బలహీన పరచడం మొదలుపెట్టాడు. ఆ పదిశాతం కనుక జరిగితే ఇక నీ పిల్లల సంగతి ఏమిటి? వాళ్ళకి తల్లి రాదు, ఆయనకు భార్య మాత్రం ఉంటుంది అనే ఆలోచన పదే పదే మనసుకు వస్తూ ఉంది. రెండు మూడు సార్లు ఆయనని ఆ విషయమే అడిగాను. కాని నాకు "నేను మళ్ళీ పెళ్ళి చేసుకోను, నువ్వు నిశ్చింతగా ఉండు" అనే మాట ఆయన చెప్పలేదు కాని రెండవ పెళ్ళి చేసుకున్న వాళ్ళ కుటుంబాలు ఏవీ నెమ్మదితో నేను చూడలేదు" అని అన్నారు. నేను చివరికి "2వ పెళ్ళి చేసుకుంటే చేసుకోండి కాని నా పిల్లలకు మాత్రం అన్యాయం చెయ్యవద్దు" అని అన్నాను. ఆయన నిద్రపోతూ ఉంటే నేను ఆ విషయమై ఆలోచిస్తూ నిద్రలేని రాత్రులు గడిపాను. దేవుని సన్నిధిలో ఆ విషయం ప్రార్థించలేదు. నా భర్తకి, నాకు జరిగిన ఈ సంభాషణ బయటికి వారికి నా భర్త ద్వారానే తెలిసింది. వారు నన్ను సూటిగా అడిగినపుడు ముందు నా నోట మాట రాలేదు. కాని దీనికి పరిష్కారం ఆలోచిస్తూ నా కుమార్తె పెండ్లి నేనుండగానే జరిగేటట్టు నేనే ఒక వ్యక్తిని చూసి పెళ్ళి జరిగించి నా బాధ్యత నిర్వర్తించాలని తలంచాను. నేను దేవుని చిత్తము కనుగొనడానికి దేవుని సన్నిధిలో పెట్టాను కాని నా ప్రయత్నాలు నేను చేస్తూ ఒక వ్యక్తిని చూశాను. అతడు దైవసేవకుడు,



బాగా చదువుకున్నాడు. దేవుని ఆత్మ వరములు కలిగిన వ్యక్తి అని తలంచి నేను అతన్ని నా కుటుంబానికి, నా తల్లిదండ్రులకు చూపించాను. అతని విషయమై నేను అల్లునిగా తలంచిన విషయం కూడా వారికి వివరించాను. ఆ విషయమై ప్రార్థించమని నా తల్లిదండ్రులకు చెప్పాను. అతని ఇంటి వారు కూడా అదే విధముగా తలంచారు.

నేను స్కాన్ విషయమై హైదరాబాదుకు వెళ్ళాను. స్కాన్‌లో మొదట జీర్ణాశయములో పెరిగిన క్యాన్సరు మళ్ళీ మూడు నాలుగు గడ్డలుగా మరొక ప్రక్క ఏర్పడినట్లు రిపోర్టు వచ్చింది. నేను మరల మా డాక్టర్లను కలిసాను. వారు అందరూ కలిసి కూలంకషగా చర్చించి చెప్పడానికి కొంత సమయం అడిగారు. నేను వారు మరల రమ్మన్నపుడు వెళ్ళాను. అందరూ చర్చించి చివరికి ఆపరేషన్ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. నేను అప్పటికీ నా సాక్ష్యాన్ని పత్రికలలో వచ్చేటట్టు చేసాను. కాని సి.డి ఆల్బమ్‌గా, క్యాసెట్‌గా ఇంకా చెయ్యలేదు. అందుకే నేను డాక్టర్ గారిని 10 రోజులు సమయం అడిగాను. మొదటి ఆల్బమ్‌లోని పాటలు వారు విన్నారు. అందుకే ఆయన "సరే! వెళ్ళి ఆల్బమ్స్ చేసుకుని రండి" అని అనుమతి ఇచ్చారు.

నేను త్వరగా హైదరాబాదుకు వెళ్ళాను. అదే సమయంలో నేను తీసుకున్న మందులు కొన్ని రియాక్షన్ ఇచ్చి నా ఒళ్ళంతా నల్లగా కాలిపోయినట్లయి, విపరీతమైన మంట కలిగింది. అయినా దేనినీ లెక్కచేయకుండా రికార్డింగ్‌లో పాటలు, సాక్ష్యం రెండు ఆల్బమ్స్ తయారు చేసి వచ్చాను. సాక్ష్యాన్ని కూడా రికార్డు చేయగలిగాననే దైవిక తృప్తి, నెమ్మది నాలో కలిగి కృతజ్ఞతతో దేవుని యెడల నా హృదయం ఉప్పొంగుతూ వుండగా బెంగుళూరుకు వచ్చి మరల డాక్టర్లని కలిసాను. నేను వెళ్ళిన పని విజయవంతమైనదని వారు కూడా సంతోసించారు. హాస్పిటల్లో అడ్మిట్ అవ్వడానికి వ్రాసి ఇచ్చారు. అంతలో నా తల్లిదండ్రులు కూడా కరప నుండి బయలుదేరి వచ్చారు.

నేను ఆగస్టు 20న హాస్పిటల్‌లో (మల్య హాస్పిటల్) అడ్మిట్ అయ్యాను. డాడీ, అమ్మ వచ్చి అప్పటికే ఒక వారం పైన అయింది. ఇంట్లో నాకు వ్యక్తి గతంగా ప్రార్థించి దేవుని సన్నిధిలో గడపడానికి ఆ వారంలో వీలవ్వలేదు. అందరం కలిసి ప్రార్థించే వాళ్ళం కాని నాకది మనసులో సమాధానం ఇవ్వలేదు (అందరి మనసులు కలవనందు వలన). నేను ఒక్కదాన్నే దేవుని సన్నిధిలో ప్రార్థించే సమయము కొరకు ఎదురుచూస్తు ఉన్నాను. నా దేవుడు నాతో ముఖాముఖిగా మాట్లాడి నన్ను ధైర్యపరచాలని ఆశించాను. ఎందుకంటే డాడీ మరల ఈసారి కూడా ఆపరేషన్‌కి ఒప్పుకోలేదు. డాడీ నాకు ఆపరేషన్ కాకుండానే స్వస్థత కలగాలని ఆయన ఉద్దేశం. ఆ ఉద్దేశం మంచిదే కాని దేవుడు నన్ను నడిపించిన రీతి, శ్రమను అనుమతించి నన్ను సానబెట్టిన విధానం, ముందు ఆపరేషన్ల సమయంలోను తర్వాత దేవుడు నాకిచ్చిన ప్రత్యక్షతల విషయమై నేను చెప్పినవి ఆయన మనసుకు చేరలేదు. అందుకే "ఆపరేషన్ వద్దు" అని చెప్పారు. మరల తర్వాత చేయించుకోమని

చెప్పారు కాని ద్వంద్వ వైఖరి అవలంభించారు. దానితో నేను సతమతమయ్యాను. దేవుని చిత్తాన్ని నేను నెరవేర్చాలని శ్రమకు అప్పగించుకోడానికి నేను సన్నద్ధమైనా, తండ్రిగా ఆయన నాపట్ల అధిక ప్రేమతో ఆపరేషన్ ద్వారా హాని కలుగుతుందేమోననే ఆయన అలాగ చెప్పారు. నా పిల్లలు కన్నీళ్ళతో హాస్పిటల్‌కి సాగనంపారు. రాన్ బాబు తట్టుకోలేక పోయాడు. వెంటనే టెన్షన్‌తో తలనొప్పి తెచ్చుకొని వాంతులు చేసుకున్నాడు. నేను ధైర్యం చెప్పి వెళ్ళాను.

దేవుడు నాకు తెలియజేసిన రీతిగా నా కష్టం, బాధ, శారీరక వేదన మునుపటికన్నా ఎక్కువగా ఉంటుందని తెలిసాక నాలో చిన్న అనుమానం బయలుదేరింది, అన్ని సహించుకొని చివరి వరకు దేవున్ని మహిమపరిచాక నేను శారీరక బాధ నుండి విముక్తి పొంది బ్రతికి బయట పడతానా, లేదా? లేక చనిపోతానా? అనే అనుమానం నన్ను ఎక్కువ ఆలోచింపజేసింది. 21 తారీఖున అన్ని పరీక్షలు చేస్తూ ఆపరేషన్‌కి సిద్ధంచేస్తున్నారు. అయితే నాకు అక్కడ ఒంటరిగా దేవునితో ఎక్కువ సమయం గడపడానికి వీలైంది. 'నేను బ్రతికి బయట పడతానా లేదా?' అని ప్రభువును అడగడం మొదలుపెట్టాను. నా ప్రార్థన అయ్యాక నాకు బైబిల్లోని రెండు మాటలు పదేపదే జ్ఞాపకానికి వస్తూ ఉండడం గమనించాను. ఆరవసారి అవి నా మనసులో మెదిలినపుడు ఆ మాటలు ఎందుకు పదే పదే గుర్తొస్తున్నాయి? అవి ఏ భాగంలో ఉన్నాయి? బహుశ ఆ మాటల ద్వారా దేవుడు తన ఉద్దేశాన్ని బయలు పరచాలనుకుంటున్నాడా? అనే ఆలోచన కలిగి వాటిని వెదకడం మొదటి పెట్టి ఆ మాటలు 2 థెస్స వ్రాసిన పత్రికలో కనుగొన్నాను. **1.నిత్యమైన ఆదరణ 2. శుభప్రదమైన నిరీక్షణ** అనే ఈ రెండు మాటలు నేను చూసినపుడు దేవుని ఆత్మ ఆ పుస్తకంలోని మూడు అధ్యాయాలు నీ కొరకు నేనిచ్చే జవాబు, నీ ప్రశ్నలకు సమాధానం అందులో నీకు దొరుకుతుంది, చదువు" అని ప్రేరేపించాడు. అందులో ఉన్న ప్రతి మాట నాకొరకే అన్నట్టుగా, సజీవముగా బలముగా నా గుండెలోనికి సూటిగా వెళ్ళాయి. దేవుడు మనతో మాట్లాడే మరొక పద్ధతి ఇది. ఎంత కష్టమైనా నేను స్పృహ కోల్పోకూడదు ప్రభువా! ఆ కృప నాకివ్వు అని ప్రార్థించాను. 5వ వచనంలో 'దేని కొరకు మీరు శ్రమపడుచున్నారో ఆ దేవుని రాజ్యమునకు మీరు యోగ్యులని ఎంచబడు నిమిత్తము మీరిట్లు ఓర్చుకొనుట దేవుని న్యాయమైన తీర్పునకు స్పష్టమైన సూచనయైయున్నది.' అని వ్రాయబడినది. నాకు 'ఓర్పు, దీర్ఘశాంతము, సహనము అనుగ్రహించు ప్రభువా' అని ప్రార్థించాను.

3వ అధ్యాయంలో 3వ వచనంలో దేవుడు నమ్మదగినవాడు, ఆయన సమస్త కీడు నుండి తప్పించును అనే వాక్యం చదివాక 'నేను బ్రతుకుతాను, దాని కొరకు నా శ్రమ అంతటిలో పోరాటి నేను గెలవాలి, సాతాన్ను ఓడించాలి' అనే పట్టుదల కలిగింది.

22వ తారీఖు ఆపరేషన్ జరిగింది. రెండు రోజులు ICU లో ఉంచి తర్వాత వార్డుకు



షిఫ్ట్ చేసారు. 5రోజులు పూర్తయ్యాక అంతా బాగున్నదని గ్రహించి సర్జన్ డా.గోపినాథ్ గారు నీళ్ళు, కొబ్బరినీళ్ళు సిప్ చెయ్యవచ్చని చెప్పారు. 7వ రోజు సూప్ తాగవచ్చని అన్నారు. కాని నాకు మధ్యాహ్నం నుండి కడుపులోని ప్రేవులు కదలకుండా బిగబట్టినట్టు గమనించాను. సాయంకాలానికి అది ఎక్కువైంది నన్ను చూడటానికి వచ్చిన విజిటర్సు నా తల్లిదండ్రులు అందరూ వెళ్ళిపోయాక రాత్రి నుండి తీవ్రముగా ఎడతెరిపిలేకుండా 35-40 సార్లు వాంతులు అయ్యాయి. ఉదయం డాక్టర్లు వచ్చేటప్పటికి పూర్తిగా నీరసించి పోయాను. నాలుగు రాత్రులు నా భర్త నాతో ఉన్నారు. కడుపులో నొప్పి, వాంతులతో నాలుగు దినాలు గడిచాయి. నా పరిస్థితి విషమిస్తున్నదని నాకు డాక్టరుగా అర్థమవుతువుంది. ప్రేవులు కొంచెం కూడా కదలడం లేదు ఐదవ దినం ఉదయాన్న కడుపులో చాల తీవ్రమైన నొప్పి అయి తర్వాత వాంతులలో రక్తం పడటం మొదలైంది. లోపల ఆపరేషన్ చేసిన భాగం బరస్ట్ అయ్యేలా ఉందని మరల ముక్కులో నుండి జీర్ణాశయం లోపలకి రైల్స్‌ట్యూబ్ వేసారు. విపరీతమైన నీర్సం ఆవరించింది. ఆ రోజు నుండి డాడీ హాస్పటల్‌లో నాతో ఉండటం మొదలు పెట్టారు. ఇది మరణపాయమే కాని మరునటి దినానికి రక్తం పడేది తగ్గింది. మరణం దూరంగా ఆక్షణం నెట్టబడింది. డాడీ ఉపవాసంతో 12 రోజులు నా ప్రక్కనే ఉండి ప్రార్థన చేస్తూ ఉన్నా నాలో కొంచెం కూడా మార్పులేదు. ప్రేవులు ప్యారలైజ్ అవ్వడానికి కారణం కూడా బయటపడలేదు. డాక్టర్లు మరల ఆపరేషన్ చేయవలసి వస్తుందేమోనని చెప్పారు. ఆరోజు ఎక్స్‌రే, స్కానింగ్ చేసాక మరల ఆపరేషన్ విషయమై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నేను మానసికంగా ధైర్యంగా ఉన్నాను. దేవుడు 'నాతో ఉన్నాడు' అనే విశ్వాసంతో ఉన్నాను. ఎక్సరే, స్కానింగ్‌కి తీసుకెళ్తూ ఉండగా నేను ఉత్సాహంగా ఉండకుండా, బేలగా అయ్యానని నాలో నేను గ్రహించి అపుడు లిఫ్ట్‌లో వీల్ చెయిర్ మీద ఉండగా పాట పాడుకుంటే బాగుంటుదని **దేవగానాలు** ఆల్బమ్‌లో ఆరార్కేగారు వ్రాసిన **నమ్మదగినవాడు ఇమ్మానుయేలు యేసు నన్నెపుడు ఎడబాయని వాడు** అనే పాట గొంతులో ట్యూబ్ ఉన్నా, అపశృతులు వస్తూ ఉన్నా పైకి పాడాలని ప్రయత్నించాను. నిజంగా లిఫ్ట్ నుండి క్రిందికి వెళ్ళేటప్పటికి ఎక్స్‌రే రూమ్ బయట నా భర్త నన్ను చూచి ఏడ్వడం మొదలు పెట్టారు. కాని ఆ పాట ద్వారా **దేవుని ఆత్మ కలిగించు ఆదరణ నన్ను తాకినందుకు** నేను నవ్వుతూ, ఏడ్వకూడదు అని చెప్పాను. ఎక్స్‌రేలో ఇన్‌టెస్టినల్ అబ్ట్రక్షన్ ఉన్నా అలాగే ఉత్సాహంగా వార్డులోకెళ్ళాను. ఆ మరుసటి రోజుకి చాల కొద్దిగా ప్రేవులు కదిలాయి. ఆ సంగతి డాడీకి చెప్పినపుడు గట్టిగా Praise The LORD అని అరిచారు. సంతోషంతో డాడీకి కళ్ళలో నీళ్ళొచ్చాయి. డాక్టర్లు ఇంకా వేచి చూద్దాం అన్నారు. ఆ తర్వాత రెండు రోజులకి మిగతా అవయవాలు పని చేయకుండా మొరాయించడం మొదలు పెట్టాయి. ప్రేవులు కదలడం నార్మల్‌కి వస్తూ ఉన్నా రెండు ఊపిరితిత్తుల్లో న్యుమోనియా, కిడ్నీ, లివర్

ఫంక్షన్ టెస్ట్‌లు అబ్‌నార్మల్‌కి రావడం, ఇన్ఫెక్షన్ అవయవాల నుండి రక్తం అంతా ప్రాకినందుకు సెప్సిస్ అయి చలి, కుదుపులతో జ్వరం విపరీతమైన ఆయాసం, గుండెదడ పెరిగిపోయాయి. ఊపిరి అందక ఆక్సిజన్ ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రతి ఊపిరిలో మూలుగు రావడం మొదలైంది. మెడ దగ్గర కాన్యులా ద్వారా ఈ సెప్సిస్ అయిందని గ్రహించి దాన్ని మార్చి వేరొక చోట వేసారు. అక్కడ నుండి విపరీతంగా రక్తస్రావం జరుగుతూంటే సెప్సిస్ వలన రక్తంలోని ప్లేట్‌లెట్ కణాలు 7000కి పడిపోయి రక్తం విషపూరితమై, అది గడ్డ కట్టే స్వభావం కోల్పోయి, EARLY DIC కి వెళ్ళిపోయాను. దీని నుండి కోలుకొనే వారు మెడికల్‌గా 5% మాత్రమే ఉంటారు. ఇంచుమించు అన్ని అవయవాలు దెబ్బతిన్నాయి. నా మెదడు మాత్రం బాగున్నందువల్ల నేను స్పృహ కోల్పోకుండా తెలివిలోనే ఉన్నాను. అయితే వెలుగు చూడడానికి శబ్దం వినడానికి నాకు కష్టముగా ఉన్నది.

అప్పటికి ఆపరేషన్ అయ్యి 20 రోజులు గడిచాయి. ఏమి బాగు అనేది లేకుండా ఇంకా రోజురోజుకీ క్షీణించిపోతూ ఉన్నాను. అయితే నా ప్రార్థన 'సహించుకొనే కృప నివ్వు ప్రభువా' అన్నదే. అన్ని రోజుల్లోనూ ఒక్క అరగంటయైనా నేను నిద్రపోలేదు. అన్ని రోజులూ చాలా భయంకరమైన బాధ ఒళ్ళంతా ఆవరించి ఉంది. డాక్టర్లు ఆ రోజు చాలా నిరుత్సాహంతో వెళ్ళారు. నా పరిస్థితి నాకు తెలుస్తూ ఉందని నాతో ధైర్యంగా ఏమి చెప్పలేని స్థితిలో వారున్నారు. అమ్మని నాతో ఉండనివ్వడం లేదనే బాధ నాలో ఎక్కువైంది. నేను చావుకు అతి చేరువలో ఉన్నానని వారు చెప్పకపోయినా నాకు తెలుస్తూ ఉంది. గత కొద్ది రోజులుగా అంటే Intestines Paralise అయినప్పటినుండి మా డాక్టర్ల టీమ్‌లో ఉన్నవారందరికి చాల నిరుత్సాహంగా ఉంది నన్ను చూచి. నేను బ్రతికి బయట పడగలననే ఆశ వారిలో లేదని నాకు తెలుస్తూవుంది. నేను ప్రేక్షకురాలిగా చూడడం, బాధ అనుభవించడం ఎక్కువైంది.

ఆ రోజు ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోయాయని తెలిసిన రోజున నా భర్త గారు 11 గంటలకు నా దగ్గరకి వచ్చారు. డాడీ అప్పటికే ప్లేట్‌లెట్స్ తీసుకొచ్చే పని మీద బ్లడ్‌బ్యాంక్‌కి వెళ్ళారు. ఇన్ని రోజుల తర్వాత మరల నా భర్త నాతో ఏకాంతంగా కొంత సమయం గడిపారు. నా పరిస్థితి పూర్తిగా విషమించినదని ఆయనకి నన్ను చూస్తూనే అర్థమైంది. నాకు అపుడు ఎవరైనా మాట్లాడినా, వెలుతురు కోసం లైట్స్ ఆన్ చేసినా, వెలుగు చూడడానికి, ధ్వని వినడానికి ఎంతో కష్టపడుతున్నాను. నా మనసు సహకరించడం లేదు. నాకు ఇన్‌ఫెక్షన్‌లో భాగంగా అన్ని అవయవాలు పాడైనట్టుగా నా మెదడు కూడా ఎఫెక్ట్ అయ్యే సూచనలు ఉన్నాయని డాక్టరుగా నాలో నేను కనిపెట్టి అంత వరకూ ధైర్యంగా ఉన్నా ఎందుకో పిరికితనం చోటుచేసుకుంది. ఆ పిరికితనం పోగొట్టుకోవతడానికి నేను నా భర్తని బైబిల్‌లోని యోబు గ్రంథం మొదటి 2 అధ్యాయాలు చదివి వినిపించమని



అడిగాను. దేవుడు యోబు సహనము గురించి నేను తెలుసుకోవాలని, దానిని ఈ సమయంలో అభ్యాసము చెయ్యాలని చెప్పినందుకు నేను ఆ అధ్యాయాలు చదవమని చెప్పాను. ఆయన చదివి వినిపించారు. ప్రార్థన చేసి వెళ్ళారు. నేను ఆయన వెళ్ళాక మరల సూటిగా దేవునితో పెనుగులాడాలని అనుకుంటున్నా సాతాను నా ప్రక్కనే నిలబడి **'యోబు భార్య రూపంలో'** నాతో మాట్లాడుతూ నా ఆలోచనలను కలుషితం చేసి పిరికితనం కలిగిన ఆత్మను నాలోనికి పంపిస్తూ "ఏమి? చావు ఇంతగా నీకు దగ్గరగా వచ్చింది, డాక్టర్లకి నువ్వు బ్రతుకుతావనే నమ్మకం లేకుండా నీ అవయవాలు అన్నిటిని మొత్తాను. అయినా ఇంకా నువ్వు దేవున్ని దూషించవా? నీ దేవుడు నిన్ను ఇంకా బ్రతికిస్తాడని అనుకుంటున్నావా? నీ పరిస్థితి చూస్తే నీకే అర్థమౌతుంది కదా! ఇక నువ్వు కొన్ని గంటల్లో చనిపోతావు. నువ్వు నీ కష్టంలో ఎంతో దేవున్ని స్తుతించినా చూడు ఇపుడు దేవుడు నిన్ను విడిచిపెట్టాడు. పూర్తిగా నీ ఆరోగ్యం నిన్ను విడిచిపోయింది. ఇపుడున్న ఈ స్థితిలో దేవుడ్ని దూషించి చనిపోకూడదూ? ఆయన నీకేం చేసాడు? నువ్వింతగా బాధపడుతూ ఉంటే నీకు దూరంగా వెళ్ళి పోయిన నీ దేవుడ్ని ఇంకా మహిమపరుస్తాననే అంటావా? ఒక్కసారి దూషించి చావు! చచ్చిపో!" అని నన్ను ప్రేరేపిస్తూ ఉండగా నాలో చాల కలవరం, బాధ, మనసులో దుఃఖం బయలుదేరింది. అవును నేను చనిపోతూ ఉన్నాను కాని నా దేవుడు సమస్త కీడునుండి నన్ను తప్పించే దేవుడు నాకు దూరంగా వెళ్ళడు. నన్ను తన కృపతో ఆవరించి ఉంటాడు. ఆయన నాకోసం ఎంతో చేసాడు ఆయన కోసం నేను మరణించనైనా మరణిస్తాను కాని ఆయన్ని నేను దూషించను. "ఓ సాతానా! విను! యేసునామంలో నువ్విక్కడ నుండి పారిపో, నువ్వు నన్నేమీ చేయలేవు, నేను ప్రభువు బిడ్డను" అని పైకి చెప్పినపుడు నా కళ్ళ నుండి కన్నీరు ధారగా కారుతూ ఉండగా "ప్రభువా! ఒక్కసారి నన్ను దృష్టించవా? ఇన్ని రోజులు నీవిచ్చిన మాట ప్రకారం నేనెంతగా సహించుకున్నానో!! సహించుకోవడము ద్వారా నిన్ను ఘనపరిచాను కదా ప్రభువా! ఇపుడు మరణఘడియలు నన్ను సమీపించిన సమయంలో ఈ బాధ తట్టుకోలేక దేవుడు నాకు అన్యాయం చేసాడు అని నిన్ను దూషించి మరణిస్తానేమో! ఇన్నాళ్ళ నా భక్తి అంతా వ్యర్థమై, నేను నిన్ను దూషించి నరకానికి పోతానేమో! నువ్వు సాతానుతో నా విషయమై చేసిన సవాలు విషయంలో ఓడిపోకుండా నాకు సహాయం చెయ్యి ప్రభూ! నేనే స్పృహకోల్పోతే నువ్విచ్చిన వాగ్దానమెత్తి ప్రార్థించే వారెవరు ఉండరు ప్రభువా" అని ఒక పదినిమిషాలు పాటు ఆ మరణ పడకపై ప్రార్థించాను. నా దేవుని అదృశ్యహస్తము నా తలను స్పృశించి నిమిరినట్టయింది. దేవుడు నా ప్రార్థన ఆలకించాడనే నిశ్చయత నాలో కలిగి దుఃఖం తగ్గింది. ఒక ఇరవై నిమిషాల పాటు నిద్రపోయాను.

హాస్పిటల్‌లో ఉన్నన్ని రోజుల్లోనూ పడుకుని నిద్రపోయే 10-15 నిమిషాల్లో ఎపుడూ భయంకరమైన పీడకలలు ఎవరో నన్ను ఈడ్చుకొని పోతున్నట్టు, లాక్కొని పోతున్నట్టు,

తోసేస్తుంటే పడిపోతున్నట్టు, క్రింద ఎక్కడో మునిగి పోతున్నట్టు వస్తూ ఉండేవి. అందుకే నిద్ర పోవడానికి ఇష్టమయ్యేది కాదు. కాని ఇపుడు నిద్రపోయిన ఇరవై నిమిషాల్లో నాకొక కల వచ్చింది. దానిలో నీళ్ళు నింపబడిన ఒక పెద్ద సంప్‌లో పడిపోయానట. వెంటనే మా నాన్నగారు నా చేయి పట్టి పైకి లాగారు. రెండవసారి కూడా పడిపోతే మరల మా నాన్నగారు నన్ను పైకి తీసారు. మూడవసారి ఆ సంప్ దగ్గరకి వెళ్తూ" ఇందులో ఏదో ఉంది, నన్ను మాటిమాటికి పడేలాగ చేస్తూంది. ఈసారి పడిపోకూడదు అని అనుకుంటూనే మరల పడిపోతూ ఈసారి నేను చనిపోవడం ఖాయం, నన్నెవరు పైకి తీస్తారు అని అనుకుంటూనే మునిగిపోయాను. అంతలో మళ్ళీ డాడీ చాలా బలంగా నన్ను బయటికి లాగారు. "సంప్‌లో ఏదో ఉంది, అది మరేదో కాదు మృత్యువే, నిన్ను చంపాలని చూస్తుంది" అని డాడీ ఆ సంప్‌లోని నీళ్ళు తోడేస్తూ ఉంటే చివర్లో ఒక ఎత్తైన, బలిష్టమైన వ్యక్తి జుట్టు జులపాలు కలిగి, చూడడానికి చాల భయంకరంగా ఉన్న వ్యక్తి శవము బయట పడింది. నాకు మరల మెలకువ వచ్చి కల గురించి ఆలోచిస్తూ ఉండగా ప్లేట్‌లెట్ ఫెరిసిస్ తీసుకొని డాడీ వచ్చారు. డాడీకి నాకొచ్చిన కల విషయం చెప్పాను. డాడీ "ఇక నీకు మరణం లేదు, తప్పించబడ్డావు, దేవుడు నిన్ను ముట్టాడు దాన్నే దేవుడు ఈ కలరూపంలో చూపాడు" అని చెప్పారు. వాక్యం చదివి, గ్రహించే ఓపిక శరీరంలో లేనప్పుడు దేవుడు స్వప్నం ద్వారా మాట్లాడతాడు.

దేవుడు నాకు ముందు సెలవిచ్చినట్టుగా కలలో నాకు చూపించిన రీతిగా నాకు మరణం తప్పించబడినది అనే దానికి ఋజువుగా నా ప్రేవులు బాగా కదలడం మొదలు పెట్టి వాంతులు పూర్తిగా తగ్గాయి. సెప్సిస్ తగ్గ ముఖం పట్టింది, ప్లేట్‌లెట్స్ కొద్దిగా పెరిగాయి. ఆయాసం, గుండెదడ తగ్గడం మొదలు పెట్టింది. నా ముఖంలో ఉన్న చావు కళ పోయి జీవకళ మొదలైంది. ఇవన్ని రెండు మూడు రోజుల్లోనే జరిగాయి. ఆక్సిజన్ ఇవ్వడం నిలిపేసారు. లేచి మెల్లగా నడవడం మొదలుపెట్టాను. అదేరోజు మూలుగడం తగ్గి మరల మాట్లాడడం మొదలు పెట్టాను. అన్ని రోజులు పిల్లలతో కూడా మాట్లాడడానికి వీలుపడని నాకు మరల పిల్లలతో ఫోన్లో మాట్లాడాను. ముక్కులో ఉన్న ట్యూబ్ సెప్టెంబర్ 14న తీసేసారు. జ్వరం కూడా రావడం తగ్గింది. 13వ తారీఖున మా లాల్ మామయ్య (రెవ।। కార్ల్ డి. కొమానపల్లిగారు) అమెరికా నుండి వచ్చిన వెంటనే మరుసటి రోజు బెంగుళూరుకు అంటే 14 వ తారీఖున వచ్చారు. ఆయన నా గురించి ఫోన్‌లో మాట్లాడి అన్ని విషయాలు కనుక్కుంటూనే ఉన్నారు. ఆయన నా దగ్గరకి హాస్పిటల్‌లో నన్ను చూడడానికి వచ్చేటప్పటికి నేను తేరుకుని నవ్వుతూ పలకరించే సరికి ఆయన కూడా సంతోషంగా పలకరించారు. మంచి స్థితిలో నన్ను చూడగలిగినందుకు ఆయనలో తృప్తి కనిపించింది. ఆ మరుసటి రోజు నేను డాక్టర్లని డిశ్చార్జ్ చెయ్యమని కోరడంతో సరే చేస్తానని చెప్పి నా శరీరంలో ఉన్న అన్ని ట్యూబులు తీసేసారు. అసిస్టెంట్ సర్జన్ "మరల



ఎపుడూ ఇలాంటి స్థితిలో మీరు హాస్పిటల్‌కి రావద్దండి" అని అన్నారు. నేను తేరుకొని కోలుకున్నాననే తృప్తితో అందరి కళ్ళలోను సంతోషం కనిపించింది.

ఇంకా ఆయాసంగానే ఉంది, అయినా అలాగే త్రాగడానికి కొద్దికొద్దిగా తీసుకుంటూ, ఓపిక తెచ్చుకొని మరుసటి రోజు నుండే పేషెంట్స్ వస్తే చూడడం మొదలుపెట్టాను. 3వ రోజు ఆదివారం చర్చిలో సాక్ష్యం చెప్పి దేవుని మహిమపరచాను.

డాడీ ఆయన జీవితంలో చేసిన అతి పెద్ద ఉపవాస ప్రతిష్ఠ నా కొరకే. నేను 26 రోజులు హాస్పిటల్‌లో ఉంటే ఇంచుమించు ఇరవై దినాలు ఉపవాసంతోనే గడిపారు. ప్రార్థన, ఎడతెగని ప్రార్థన చేస్తూ గడిపినా, నాకెంతో ఉపచారం చేసినా, నేను దేవుని సేవకురాలిననే ఉద్దేశ్యంతో పరిచర్య చేసినా, అమ్మ విషయమై కొన్ని కారణాలతో నేను ఆయన మీద మనసులో క్షమించలేనంత కోపం పెంచుకున్నాను. కాని మరల వెంటనే దేవున్ని క్షమాపణ అడిగాను.

అక్టోబరు 4వ తారీఖు రాత్రిలో నేను పడుకున్నా మంచి నిద్ర పోలేదు కాని అప్పుడప్పుడు పట్టే మగతలో బైబిల్లోని ఒక మాట 'నేను ఎక్కలేనంత ఎత్తైన కొండపైకి నన్నెక్కించుము' అని అస్తమానం తెల్లవారే వరకూ నాకు ఆ విషయమై ప్రార్థించాలని ఎవరో చెప్తూ ఉన్నట్టు వినబడింది. ఆ మాట 61వ కీర్తనలో ఉన్నది. ఆ వాక్య ప్రకారం నేను ఈ లోకంలో మరణమే వచ్చినా పోరాడుతూ, ప్రయాసపడుతూ శిఖరాగ్రం చేరాలని ఒకనాడు ప్రభువును కలవాలనేది దేవుని చిత్తమని గ్రహించాను.

6వ తారీఖున అందరం కరప ప్రయాణమయ్యాము. 8వ తారీఖున ఆదివారం మన్నా సిల్వర్ జూబిలీ చర్చిలో రక్షణ ప్రాకారమా, నా జీవితానుభవ సాక్ష్యము అనే రెండు ఆల్బమ్స్ మామయ్య రెవ।। కార్ల డి. కొమానపల్లిగారి ద్వారా రిలీజ్ చేసాము. 'ఆశ్రయశైలమా' అనే పాట హృదయ పూర్వకముగా కృతజ్ఞతతో ఆ రోజు పాడగలిగాను. దేవుడే నిజంగా పాడగలిగే బలము ఇచ్చాడు. సాక్ష్యం చెప్పాను. 14 తారీఖున కొమానపల్లి గెట్‌టు గెదర్‌లో కూడా సాక్ష్యం పంచుకోవడానికి దేవుడు కృప చూపించాడు.

ఆ విధంగా హాస్పిటల్ నుండి బయటికి వస్తూనే ఏ మాత్రం బ్రేక్ తీసుకోకుండా సాక్ష్యం ఇస్తూ అవకాశం దేవుడు ఇచ్చిన కొలదీ పాటలు, సాక్ష్యం ద్వారా దేవున్ని మహిమపరచగలిగాను.

3వ ఆపరేషన్ అయ్యాక నేను అల్లుడుగా చేసుకోవాలనుకున్న వ్యక్తి విషయంలో మానసిక వేదనపడ్డాను. 4 నెలలు గడిచిన తర్వాత ఎమ్.ఆర్.ఐ. స్కానింగ్ చేసినపుడు సరైన డయాగ్నోసిస్ రాలేదు. కాని నాలో శారీరకంగా బలహీనత ఎక్కువైంది నొప్పి, బాధ ఎక్కువైంది. నేను చాల తట్టుకోగలిగేదాన్నే కాని ఇంకా 2 నెలలకి మరింత నొప్పి ఎక్కువైంది. అప్పటికి బెంగుళూరులోనే PET CT SCAN చెయ్యడానికి అనుకూలమైంది. డా. రవి దివాకర్‌గారు చెయ్యాలని చెప్పారు. మే నెల 28న స్కానింగ్ చేయించాను.

29కి రిపోర్టు రెడీ అయినట్టు హాస్పిటల్ నుండి ఫోన్ వచ్చింది. 30వ తారీఖున నేను, రాన్ బాబు ఆంధ్ర వెళ్ళడానికి (మామయ్య కొడుకు జాషువా పెళ్ళికి) టికెట్ చేయించుకున్నాము. నేను రిపోర్టు తీసుకు రమ్మని చెప్పి నా భర్తని పంపించాను. రాన్ బాబు కూడా ఆయనతో వెళ్ళాడు. ఇంటికి రాత్రి లేట్‌గా వచ్చారు. రిపోర్టు ఇచ్చే కౌంటరు వెళ్ళేటప్పటికి మూసేసారని చెప్పారు నా భర్త. నేను నిజమేననుకున్నాను. రాత్రి పడుకున్నాక నా భర్త “మరొక పాటల క్యాసెట్ త్వరగా చెయ్యడానికి ప్లాన్ చెయ్యి, సాక్ష్యం వ్రాయడం త్వరగా పూర్తి చెయ్యి” అని అన్నారు. ఆయన ఆ సమయంలో అలాగ చెప్పడం నాకు ఆశ్చర్య మేసింది. తెల్లవారాక నేను త్వరగా లేవబోతే “ఇంకొంచెం పడుకో, రెస్ట్ తీసుకో” అన్నారు. అంతలో రాన్ బాబు “నాకు ఏదోలా ఉందమ్మా, తలనొప్పిగా ఉంది, రాత్రి వాంతులయ్యాయని” అన్నాడు. మధ్యాహ్నం ప్రయాణం పెట్టుకుని ఇపుడు వాంతులేమిటో అని నేను కొంత మనసులో నిరాశపడ్డాను. నా భర్త ఆఫీసుకు రెడీ అయితే నేను త్వరగా రండి 10 గంలకే బయలుదేరి హాస్పిటల్‌లో రిపోర్టు చూసుకొని అక్కడ నుండి స్టేషన్‌కి వెళ్ళి ట్రైన్ ఎక్కేస్తామని చెప్పాను. ఆయన నా ప్రక్కనే కూర్చుని “ఊరు నుండి వచ్చాక రిపోర్టు చూసుకోవచ్చు కదా!” అని అన్నారు. “చూసుకోకుండా వెళ్ళితే మనసు దాని మీదే ఉంటుంది. చూసుకుంటే ఒక విధమైన తృప్తితో వెళ్ళతాను” అని అన్నాను. “అందులో ఏమైనా వ్యాధి ఎక్కువైంది అని రిపోర్టు వస్తే ఏం చేస్తావు? మరల మీ వాళ్ళతో సంతోషంగా ఉండలేవు కదా!” అని అన్నారు. అనవసరంగా పెళ్ళికి వెళ్ళి నా గురించి అందరికి చెప్పి అందరిని బాధపెడతానేమో అని ఆయన బాధ అని అర్థమైంది. నేను “నిండా మునిగిన వాళ్ళకి చలి ఉండదు, అంటే నా రిపోర్టు ఎంత భయంకరంగా వచ్చినా నేను మళ్ళీ కృంగిపోయేది లేదు. నా వ్యాధి ఏమిటో నాకు ఇపుడు క్రొత్తగా తెలిసేది ఏముంది?” అని అన్నాను. అప్పుడు పాపతో, “బుచ్చూ, ఆ రిపోర్టు ఇలా తీసుకురా” అని అన్నారు. నేను ఆశ్చర్యంగా రిపోర్టు వస్తే “ఎందుకు రాలేదని చెప్పారు?” అనంటే “రిపోర్టు చాలా బ్యాడ్‌గా వచ్చింది. లివర్, లంగ్స్, ఫుడ్‌పైప్, స్టమక్, కడుపు నుండి మెడ వరకు ఉన్న లింఫ్ నోడ్స్ అన్నిటిలోను సెకండరీస్ వచ్చేసాయట” అని అన్నారు. నేను రిపోర్టు చదివాను. నా మనసులో మరే భావం లేకుండా “నీ అనుమతి లేకుండా నా శరీరములోనికి ఏదీ రాదు ప్రభువా! నీవు అనుమతించినది ఏదైనా సరే అది నా మేలు కొరకే” అనే భావమే నాలో మెదిలింది. అదే మాట ఆయనతో అన్నాను. డాక్టర్‌తో మాట్లాడే వెళ్దామని అనుకున్నాము కాని ఆయన ఆ రోజు చాల బిజీగా ఉన్నారు. అందుకని ఊరెళ్ళి వచ్చాక కలవాలనుకున్నాను.

రాన్ బాబు మధ్యాహ్నం బయలుదేరే లోపల ఏమీ తినలేదు. తినడానికి అవ్వడం లేదని తలలో ఏదోలా ఉందని, వాంతి వచ్చినట్టవుతుందని అన్నాడు. నాకప్పుడు వాని టెన్షన్‌కి, వాంతులకి కారణం నేను, నా ఆరోగ్య పరిస్థితే కారణమని తెలిసింది. కదిలిస్తే



చాలా భయంకరముగా ఏడ్చేటట్టు ఉన్నాడు. “ఇపుడు పరిస్థితి ఏమిటమ్మా” అని బుచ్చు పదే పదే అడిగింది. అందరూ స్థబ్ధంగా అయ్యారు. సంతోషంగా లేకుండా ముఖాల్లో చిరునవ్వు లేకుండా అయిపోయారు. నేను పెళ్ళికి వెళ్తున్నట్టు కాకుండా ఎవరో చావుకి బయలుదేరి వెళ్తూన్నట్టుగా ఉంది నా పరిస్థితి. పిల్లల్ని చూస్తే నా మనసు తరుక్కు పోతూ ఉంది. రాన్‌ని తీసుకొని ట్రైన్ ఎక్కాను.

రాన్ బెంగతో ఇంకా వాంతులు చేసుకుంటున్నాడు. వాంతి కాకుండా మెడిసిన్ ఇచ్చినా ఇంకా వాంతులు అవుతున్నాయి. నేను వాడిని కదిలించి వాని మనసులో ఏముందో తెలుసికోవాలని పించింది. అంతకుముందే వాడు వాళ్ళ అక్కతో, “మమ్మీ త్వరగా చనిపోతుందా?” అని పదేపదే అడిగాడని తెలిసింది. వాడి ముఖం చూస్తే నాకు దుఃఖం అవుతూంది. దేవుడు త్వరగా నన్ను తీసుకోవాలనే అనుకుంటున్నాడేమో! అయితే పిల్లల విషయం ఎలాగ? వాళ్ళని నేనే ఓదార్చాలి, నేనే ధైర్యపరచాలి, ఇక బాధితురాలిగా బాధ పడకుండా, పిల్లలకి తల్లిగా రాబోయే పెనుతుఫానులను ధైర్యంతో ఎదుర్కొనేలాగ చెయ్యాలని మనసును ధృడపరచుకున్నాను. నాలో దుఃఖం. బాబులో కూడా దుఃఖం. కదిలిస్తే వర్షించే మేఘములా ఆవరించుకుని ఉన్నా నా దుఃఖాన్ని దిగమింగుకున్నాను. పాప విషయంలో తాను పెద్దది, కొంత అర్థం చేసుకొనే వయస్సు ఉంది. ఎన్నోసార్లు నేను మీటింగుల్లో సాక్ష్యమివ్వడం చూసింది, నేను ఎలాగ దేవునిలో ఆదరణ పొందుకున్నానో తాను కూడా ఎంతటి బాధనైనా ప్రభువులో సహించుకుంటూ ఆదరణ పొందగలను అని చాలాసార్లు నాతో అన్నది. అందువల్ల పాప విషయంలో నేను కొంత నెమ్మదితోనే ఉన్నాను. కాని బాబు విషయం అలాకాదు. వాడిని ధైర్యపరచే వాళ్ళు ఎవరూ వాడి దగ్గర లేరు. అప్పటికపుడు వాని మనసును తాత్కాలికముగా సంతోషపరచే స్నేహితులు ఉన్నారు కాని దానిని శాశ్వతముగా పరిష్కరించాలంటే నేనే చెయ్యాలి. అది నా భర్త కూడా చెయ్యలేరనిపించింది. రాన్‌తో మెల్లగా మాట్లాడడం మొదలు పెట్టాను. యేసు ప్రభువు ఎవరు? మనకి ఏమవుతారు? మనం ఈ లోకంలో ఎందుకు పుట్టాము? పుట్టకముందు ఎక్కడ ఉన్నాము? ఈ లోకం శాశ్వతమా? తాత్కాలికమా? చనిపోయే వారందరూ ఎక్కడికి పోతున్నారు? చనిపోవడం అంటే ఏమిటి? వంటి ప్రశ్నలకు బాబు దగ్గర నుండి జవాబులు పొందాను. ఆశ్చర్యం ఏంటంటే ఏసు ప్రభువు తనకు స్వంత రక్షకుడని, ప్రభువని తాను క్రీస్తు బిడ్డనని, పుట్టక ముందు దేవుని వద్ద ఉన్నానని, ఇపుడు ఈ భూమి మీదికి అమ్మ కడుపున పుట్టి వచ్చానని, ఇక్కడ కొన్ని సంవత్సరాలయ్యాక మరల దేవుడు ఒక్కొక్కసారి వారివారి సమయంలో దేవుడు పిలచుకుంటాడని వాడు చెప్పాడు. అపుడు నేను బాబుకు మానసికంగా ధైర్యం చెప్పి “మనం ఈ లోకంలో ఉండిపోడానికి రాలేదు. దేవుడు అప్పగించిన పనిచేసి ముగించాక దేవుడు పిలిస్తే ప్రతి ఒక్కరము వెళ్ళిపోవాలి, నేను కూడా వెళ్ళాలి, నాయనమ్మ వెళ్ళిపోయినట్టుగా ఆమె

తర్వాత తరము, ఆ తర్వాత ఇంకో తరము ఇలాగ అందరమూ వెళ్ళిపోవాలి, వయస్సును బట్టి వ్యాధిని బట్టి దేవుడు మొదట నన్ను పిలుచుకోవచ్చు తర్వాత ఒకరి తర్వాత ఒకరం అందరం దేవుని పిలుపు అందుకోవడం అంటే ఈ శరీరం నుండి ఆత్మ వేరై దేవుని వద్దకి పోవడం అంటే శారీరక మరణం. ఆఖరున అందరము యేసుప్రభువు రొమ్మున ఆనుకొని సంతోషంగా ఉంటాము. అక్కడ మరల ఏ వ్యాధిగాని, బాధగాని, ఏడ్పుగాని, ఆకలిగాని ఉండదు. మనం దేవునితో సంతోషంగా గడపడానికే మనం చనిపోతాము. అయితే యేసు ప్రభువును మనం స్వంత రక్షకుడుగా అంగీకరిస్తేనే మనం నరకానికి పోకుండా ప్రభువుతో పరలోకంలో ఉంటాము. ఎవరైనా చనిపోయినప్పుడు మనం ఏడుస్తాము, దుఃఖపడతాము అది కొద్దిరోజులే. అయినా దేవుడు ఆ బాధ తీసేసి మన నోట నవ్వు ఉంచుతాడు. నేను వెళ్ళిపోయినా మీరు కూడా నన్ను కలుస్తారు కాబట్టి అదే ఆశతో మీరుండాలి. నేను మీ కోసం ప్రభువు దగ్గర కనిపెడుతూ ఉంటాను, కాబట్టి సంతోషమే కదా!" అని చెప్పాను. ఇంత చెప్పాక వాడి ముఖంలోనికి నవ్వు వచ్చింది. "ఇంతలో బాగా చదువుకొని ప్రయోజకుడవు కావాలి. PET CT SCAN మెషీన్ లాంటివి కనిపెట్టడమో క్యాన్సర్ పేషెంట్లకు ఆసరా ఇవ్వడమో చెయ్యాలి. ఎంతోమందిని దేవుని వద్దకు నడిపించాలి. "సమూయేలు" లాగ పేరుకు తగ్గట్టు దేవుడు పని చెయ్యాలి "రాన్ అనే పేరుకు తగ్గట్టు ఆరాధకుడవుగా, గొప్ప ప్రార్థనా పరుడివిగా ఉండాలి. పెద్దయ్యాక నాలాగ మీ జీవితానుభవ సాక్ష్యాన్ని ఇతరులతో పంచుకోవాలి. మీ జీవితం చూసి వారికి మంచి దైవభక్తిలో పెరిగిన వారిగా తెలియాలి. తల్లిగా నేను మిమ్మల్ని చూసి పరలోకంలో ఆనందిస్తాను. నా జీవితం ధన్యమైనదని తలుస్తాను. నా సాక్ష్యములో భాగం మీది కూడా అవ్వాలి. దాని కోసమే ప్రయాసపడాలి" అని చెప్పాను. వాడు తృప్తిగా తల ఊపాడు. ఈ రిపోర్టు గురించి ఊళ్ళో ఎవరికి చెప్పకూడదని ముందే చెప్పినందుకు వాడు ఎవరికీ ఏమి చెప్పలేదు. అందరితో సంతోషంగా గడిపాము.

ఆ నాలుగు రోజుల్లో నా వాక్య భాగాలు మరింత ఎక్కువగా నన్ను ఆదరించాయి "చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమ పరచితిని ప్రభువా" అని యేసు ప్రభువు చెప్పిన రీతిగా "యేసు తనకు సంభవింపబోవున వన్నియు ఎరిగినవాడై" అన్నట్టుగా నా దినముల అంతము ఎలా ఉంటుందో తెలిసికొని దేవుని సంపూర్ణ చిత్తము నెరవేర్పు కొరకు మరింత ఎక్కువగా ప్రార్థించి ఆదరణ దేవునిలో నేను పొందడానికి దేవుడు నాకు సహాయము చేసాడు.

మరల బెంగుళూరు వచ్చాక డా॥ రవి దివాకర్‌గారిని కలిసాము. ఆయన చాల బాధ పడ్డారు. స్కాన్ చేయించినపుడే ఆయన రిపోర్టు కనుక్కున్నారు. నాకు మరల కీమోథెరపీ ప్రారంభించారు.

అమ్మ డాడీల 40 సంవత్సరాల వివాహ వార్షికోత్సవం రోజున (జూన్ 29, 2007న)



కృతజ్ఞతా కూటము పెట్టి కుటుంబస్థులు, బంధువులు అందరూ కలుసుకొని సంతోషించాలని ఏర్పాట్లు చేసాము. కరపలో అందరం కలుసుకున్నాము. నన్ను నా ఉత్సాహాన్ని, సంతోషాన్ని చూస్తే ఎవరికీ నా వ్యాధి ముదిరినదని ఏమీ అనుమానం రాలేదు. ఆ మరుసటి రోజు నేను విశాఖపట్టణంలో ప్రీతమ్ వాళ్ళ నర్సింగ్ కాలేజిలో చర్చిలో సాక్ష్యము పంచుకోవడానికి ముందే నిర్ణయించిన రీతిగా వైజాగ్ బయలు దేరాను. ట్రైన్ ఎక్కడానికి ముందు నా స్కాన్ రిపోర్టు విషయం ప్రూటీకి చెప్పాను.

అయితే ప్రూటీ ఆ సంగతి తట్టుకోలేక వెళ్ళి ఇంట్లో చెప్తే ఒకరి తర్వాత ఒకరికి తెలిసింది. ఎవరి అభిప్రాయాలు వారివి. అయితే నా కోసం పిల్లలకు తల్లిగా నేను బ్రతికి ఉండాలని వారి ఆశ, ప్రార్థన.

ఏ స్త్రీలోనైనా తల్లి మనసు ఉంటుంది. ఆమె వ్యభిచారైనా మరేమైనా సరే తల్లి తల్లే! స్త్రీలో ఎప్పటికి తల్లితత్వం అంటే మాతృత్వం మూర్తీభవించి ఉంటుంది. ప్రతి స్త్రీలోనూ అమ్మని చూడగలిగితే కష్టకాలంలో మన దగ్గర అమ్మలేని లోటు వారే తీరుస్తారు అనేది నా అనుభవం. నాకెంతోమంది ఆత్మీయ తల్లులు, తండ్రులు నాకంటే చిన్నవారు కూడా ఉన్నారు. నా కష్టకాలంలో నావారు నాదగ్గర లేరు అనే లోటు తెలియకుండా వారే నన్నెంతగానో ఆదరించారు.

కొందరు నన్నెక్కువ అభిమానించి, తమకు పుట్టిన పిల్లలకు నా పేరు పెట్టుకొని పిలుచుకోవడానికి ఇష్టపడ్డారు. కొందరు తమ పిల్లలకు నా చేత పేర్లు పెట్టించుకున్నారు. నా చిన్న తమ్ముడు బున్ని తన రెండవ కుమార్తెకు నా పేరే పెట్టాడు. ఎంతో మంది బయటి వారు కూడా తమ పిల్లలకు నాపేరు పెట్టకుంటామని చెప్పారు. నాకింత ఘనత నేను బ్రతికి ఉండగానే దేవుడు నాకిచ్చాడు.

తర్వాత కూడా నా మీటింగులకు వెళ్ళడం నేను మానలేదు. దేవుడు అవకాశం ఇచ్చిన కొలదీ నా సాక్ష్యం పంచుకోవడానికి, వాక్య పరిచర్య చేయడానికి, పాటలు పాడి దేవుని మహిమ పరచడానికి వెళ్ళాను. ఒక్క దాన్నే ప్రయాణించాను.

కొన్ని క్రొత్త పాటలు "నా ప్రాణ దుర్గమా అనే సి.డి ద్వారా తయారుచేసాను. మరల రికార్డింగ్ హైదరాబాదులోనే, స్వరశిల్పి డా॥ పి.జె.డి కుమార్‌గారితోనే చేయించాము. ఆయన, ఆయన భార్య మెర్సిమోనికగారు (మెర్సక్క) నాకు ఎంతో పరిచర్య చేసారు. వ్యాధి గ్రస్తురాలినని నా కోసం వారు తీసుకొనే జాగ్రత్తలు చాలా ఎక్కువ. నిజముగా కష్టపడి సేవ చేస్తున్నానని వారు స్వచ్ఛందంగా, మానుండి ఏడబ్బు, కానుకలు ఆశించకుండా, వ్యాపారపరంగా చూడకుండా, నేను చేసే దేవుని పనిలో వారు కూడా పాలిభాగస్థులు అన్నట్టుగా తలంచి నాకు సహాయం చేసారు. అన్నిపాటలు దేనికదే అన్నట్టుగా ఇది బాగోలేదు అనడానికి వీల్లేదన్నట్టుగా పాట అర్థానికి తగిన రాగము, దానికి తగిన సంగీతం సమకూడి ప్రజలలోనికి దూసుకు వెళ్ళాయి. ఎంతో ప్రజాదరణ

పొందాయి. దేవుని అభిషేకం ఆ పాటల్లో ఉందని, నా క్లిష్ట సమయంలో మీరు వ్రాసిన పాటను జ్ఞాపకం చేసి దేవుడు నాతో మాట్లాడి, నన్ను ధైర్యపరచాడు అని ఎంతో మంది సాక్ష్యమిచ్చారు. కొందరైతే నా సాక్ష్యపు స్వరమే వినబడినదని సాక్ష్యమిచ్చారు. దేవుడు సాక్ష్యాన్ని, పాటలను తన సేవలో వాడుకుంటున్నాడు. ఎంతో మంది తన స్నేహితులకు, బంధువులకు వాటిని కానుకలుగా విదేశాలకు కూడా పంపిస్తున్నారు.

కొందరు సాక్ష్యము సిడి. క్యాసెట్లను ఎక్కువ సంఖ్యలో తీసుకొని ఊళ్ళల్లోని వారి స్వంత సంఘాలకు అందించారు. పత్రికలలో వచ్చిన సాక్ష్యాన్ని చదివి ఎంతో మంది బలపడినట్టు ఫోన్లద్వారా తెలిపారు. నా కాలేజి ఫ్రెండ్స్ కూడా నా గురించి తెలిసికొని నాతో మాట్లాడారు. కొందరు నన్ను చూచి అన్యులైనా నా దేవుని కృపను కొనియాడారు.

సాక్ష్యం చెప్తూ ఉన్న ప్రతీసారి కూడా "నేను సాతాను తలను చితక త్రొక్కుతున్నానని, నా కాలితో సాతాను తలను గట్టిగా మోదుతున్నట్టుగా" అన్పిస్తుంది. ఎప్పుడు హాస్పిటల్‌లో అడ్మిట్ అయినా డిశ్చార్జ్ అయ్యి వచ్చిన వెంటనే 2 లేక 3వ రోజుకే ఆదివారం రావడం, ఆ ఆదివారమే నేను సాక్ష్యం పంచుకోవడం జరిగింది. అంత త్వరగా చర్చికి వెళ్ళితే అందరికీ ఆశ్చర్యం కలుగుతుంది.

చాలమంది సాక్ష్యాన్ని, రక్షణ ప్రాకారమా పాటల్ని రిలీజ్ చేసాక నేను అక్కడితో ఇక ఆపేస్తానని తలంచారట. వారితో "నా ప్రాణమున్నంత వరకు దేవుడు నన్ను ప్రేరేపించిన కొలది పాటలు వ్రాస్తానని, వాటిని ఆల్బమ్స్ చెయ్యడానికి నా శాయశక్తులా కృషి చేస్తాన"ని చెప్పాను. వాటి కోసం నా రాబడియంతటిని పెట్టడానికి నేను సిద్ధమే. చిన్నదే అయిన నా జీవితాన్ని ఎందరికో ఉపయోగకరంగా, మనిషిగా భూమిమీద జీవించినందుకు, దానికొక అర్థాన్ని కలిగించిన నా ప్రభువుకు నేనేమి చేసినా నేనెంతో ఋణస్థురాల్ని. ఆయన సేవలో చివరివరకూ పోరాడుతూ, నా అంతిమ శ్వాస కూడా నా నోట కీర్తనతో ఆయన సన్నిధిలో వదలాలన్నదే నా ఆశ.

నా డాక్టర్ వృత్తి విషయంలో నేను ఎందరికో సహాయ పడాలనుకున్నాను. ఇంకాపై చదువులు చదువుకొని ఎంతో మందికి సహకారము అందించాలనుకున్నాను. కొందరం దేవుని చిత్తము మన జీవితాల్లో జరుగకుండా అడ్డుపడి ఆ ఉన్నత తరహా సేవ అందించకపోవచ్చు. నా విషయంలో ఆ ఉన్నతమైన వైద్యవిద్య చదవకుండా, ఏ ప్రోత్సాహము లేకుండా అవ్వడానికి కారణం నా వివాహము, ఇంట్లో ఉన్న పరిస్థితులు, నా బాధ్యతలు. నా కుటుంబ పరిస్థితులు నన్ను అణచివేశాయి. నిన్ను మొన్నటి వరకు కూడా ఆ విషయం ఆలోచించుకుంటే నన్ను ప్రోత్సాహపరచలేదని నా ఇంటి వారిపైనే నేను కోపం తెచ్చుకొనేదాన్ని. వారి విషయమై కోపం తెచ్చుకోకూడదని, వారిని క్షమించాలని యేసు నామములో దినదినమూ నేను ప్రార్థిస్తూనే ఉన్నాను. ఇక చివరికి నా ఆశలు ఏదీ ప్రొఫెషనల్‌గా నెరవేరలేదని, అయినా డాక్టరుగా నా బ్రతుకును సార్థకము చెయ్యమని



నేను చేసిన ప్రార్థనకు జవాబుగా ప్రైవేట్ హాస్పిటల్‌లో పని చేయడం, క్లినిక్ పెట్టుకోవడము, క్లినిక్‌లో ఎంతో మందికి ఉచితముగా వైద్య సేవ చెయ్యడం చేసాను. ఉచిత వైద్య శిబిరాలు ఇక్కడ కర్ణాటకలో, ఆంధ్రలో పలు ప్రాంతాల్లో నిర్వహించాను. నా సంపాదనలోనే కొంత మందులకి కేటాయిస్తూ ఉచితముగా మందులు కూడా పంపిణీ చేసాను. ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులు కూడా నేనిచ్చిన వారం రోజుల మందుల కోర్సుకు తగ్గినట్లు సాక్ష్యమిచ్చారు. ఎన్నో ఏళ్ళుగా గర్భం ధరించకుండా, అన్ని ప్రయత్నాలు చేసి బిడ్డలు లేనివారు చాల దూరం నుండి కూడా వచ్చి నా క్లినిక్‌లో ట్రీట్‌మెంట్ తీసుకొని, ప్రార్థన సహాయముతో బిడ్డల్ని కనగలిగారు. కొన్ని భయంకరమైన క్యాన్సర్ వ్యాధులను అతి తక్కువ వ్యవధిలోనే స్పెషలిస్టులు సైతం డయాగ్నోసిస్ కనుక్కోలేకపోయిన వారికి డయాగ్నోసిస్ చేసి ఎంతో ఖరీదైన మందులను చాల తగ్గింపు ధరలకే మందు తీసుకోగలిగేటట్టు సహాయపడడానికి దేవుడు కృప చూపాడు.

ఉదాహరణకు నా క్లినిక్‌లో జరిగిన ఒక మహా అద్భుతాన్ని నేను వివరిస్తాను. గత సంవత్సరం 2007 మే నెలలోని నా స్కాన్ రిపోర్టు ప్రకారం వ్యాధి చాలా వ్యాపించినదని భయంకరమైనదిగా నాకు తోచింది. ఆ సమయంలోనే నా దేవుడు నన్ను బలపరచడానికి ఈ అద్భుతాన్ని జరిగించాడు. అది జూలై నెల. ఒక రోజు రాత్రి 11:30 గంటలకు ఇంటి వాకిలి ఎవరో తట్టారు. నా భర్త ఎవరో చూచి "పేషెంట్స్ వచ్చారు. అయితే వారితో వచ్చిన అటెండర్లు వేరే చర్చికి సంబంధించిన వారు. వారితో మనకి ముఖ పరిచయం ఉంది. వెళ్ళి చూసి రా"! అన్నారు. నేను చూడడానికి క్రిందకి వెళ్ళాను. నా క్లినిక్‌లోని క్రింది ఇంట్లోనే హాల్లో పెట్టుకున్నాను. వారు నాకు తెలిసిన వారే కాని ఈ సమయంలో ఎందుకొచ్చారో అనుకుంటూ క్రింద కాలింగ్ బెల్ రింగ్ చేసాను. క్రింద లోపలి ఇంట్లో పాస్టరమ్మగారు ఉంటారు. తలుపు తీయడానికి ఆవిడ లేట్ చేసారు. వచ్చిన వారిని బయట నిల్చునే విషయం అడిగాను. వారి చేతిలో చాల చక్కగా చుట్టబడిన ఒక ప్రిమెచ్యూర్ మగబిడ్డ ఉండడం చూసాను. అయితే ఆ బిడ్డ చనిపోయినట్టు గమనించాను. నాడి, ఊపిరి, గుండె చప్పుడు ఏమీ లేకుండా తెల్లగా పాలిపోయి ఉన్నాడు. నాకు మనసులో కంగారైంది. "బిడ్డ 18 రోజుల క్రితం తల్లికి 7వ నెల గర్భిణిగా ఉండగానే పుట్టాడు. 3 రోజుల క్రితం బేబిని నియోనేటల్ కేర్ నుండి డిశ్చార్జ్ చేసి పంపించారు. ఒక డ్రాప్స్ వెయ్యాలని ఇచ్చారు. అది వేశాక వాంతి చేసుకుని, ఇక కదలికలు, లేకుండా అయిపోయాడు, అక్కడ చుట్టు ప్రక్కల డాక్టర్లు ఎవరూ చూడలేదండి, ఇక్కడ వీలు పడదని పంపేశారు. ఇప్పటికే గంటసేపయింది. మీరు చూసి చెప్పండి మేడమ్" అని అన్నారు. నేనిక చూసి చెప్పేదేముంది బిడ్డ చనిపోతేనూ! అయినా వారి తృప్తి కొరకు స్టెతోస్కోప్ పెట్టి చూడాలని ఆగాను. పాస్టరమ్మగారు ఇంకా గాఢనిద్రలో ఉండి తలుపుతియ్యలేదు. అంతలో నేను "ఏమిటి ప్రభువా, చావును ధృవీకరించడానికా

ఈ బిడ్డను నా దగ్గరకి పంపించావు? ఏదేమైనా నేను బిడ్డ చనిపోయాడనే మాట నా నోట రాకూడదు, నేను డెత్ డిక్లేర్ చెయ్యకూడదు" అని ఖండితమైన మాటలతో ప్రార్థన చేసుకున్నాను. పాస్టరమ్మగారు తలుపు తీసారు. నేను మనసులో చాల తీవ్రతతో నేను మరణ సాక్ష్యము వ్రాయకూడదు అని ప్రార్థిస్తూనే ఉన్నాను. వాళ్ళని కుదురుగా కూర్చోబెట్టి బిడ్డని చూసాను. అది ఒక కేజీకి తక్కువే బరువు ఉంది. స్టెత్‌తో చూసాను. ఎక్కడో నీరసంగా గుండె కొట్టుకుంటున్నట్టు 10–20 బీట్లు ఒక నిమిషానికి ఉండింది. అయితే నాకు బిడ్డలో కొద్దిగా జీవం ఉన్నదని ధైర్యం వచ్చింది. త్వరగా మరల రిఫర్ చెయ్యాలని చూడడం మొదలు పెట్టాను. ఇంకొక 5 నిమిసాల్లో బిడ్డకి గుండె చప్పుడు 40కి పెరిగింది. తెల్లగానే పాలిపోయిన బిడ్డ ఒక్క సారిగా పెద్ద ఊపిరి తీసుకున్నట్లయింది. నేను గుండె మీద మసాజ్ చేసి మరల హార్ట్‌బీట్ చూసాను. ఇంకా కొద్దిగా పెరిగింది. క్రమంగా ఊపిరి తీసుకోవడం గమనించాను. ఇంకో 5 నిమిషాలకి బిడ్డ రంగు పింక్ కలర్‌లోనికి మారడం మొదలైంది. ఇంకొక 5 నిమిసాలకి ఊపిరి తీసుకుంటూ, నార్మల్ హార్ట్‌బీట్ రావడం గమనించి గట్టిగా స్టిమ్యూలేట్ చేసాను. ఒక్కసారిగా గాఢనిద్రలోనుండి బయటపడిన రీతిలో ఒళ్ళు విరుచుకొని, ఇంకొక 5 నిమిషానికి ఏడ్వడం మొదలుపెట్టాడు. వచ్చిన బిడ్డ అమ్మమ్మ, అటెండర్లకి నోట మాట రాలేదు. సంతోషంతో వారు ఉక్కిరిబిక్కిరై పోయారు. బిడ్డతల్లి ఇంట్లోనే ఉండిపోయింది. ఆమెకు ఫోన్‌లో బిడ్డ ఏడ్పును వినిపించారు. ఆమె సంతోషంతో ఏడ్చేసింది. "ఈ క్లినిక్ లోపల అడుగు పెట్టాము. దేవుడు బిడ్డను ముట్టి బ్రతికించాడు మేడమ్" అని వారు సాక్ష్యమిచ్చారు. నేను కూడా డెత్‌డిక్లరేషన్ వ్రాయకుండా దేవుడు అద్భుతం చేసాడని దేవుని స్తుతించి, ప్రార్థన చేసి పంపించాను. పాస్టరమ్మగారు చూస్తూనే ఉన్నారు. ఆమెకు కూడ నమ్మశక్యముగా ఉండలేదు. నేను పైకి వచ్చి నాభర్తకు అంతా వివరించాను. చర్చిలో దేవుడు చేసిన మహా అద్భుతాన్ని సాక్ష్యమిచ్చి దేవుని మహిమ పరచాను. ఇది నన్నింకా శక్తిమంతురాలిగా చెయ్యడానికే దేవుడు ఇది నాపట్ల జరిగించాడని తన వాక్యము ద్వారా మాట్లాడాడు.

"అయినను ఆ బలాధిక్యము మా మూలమైనదికాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు.

యేసు యొక్క జీవము మా శరీరమందు ప్రత్యక్ష పరచబడుటకై యేసు యొక్క మరణానుభవమును మా శరీరమందు ఎల్లపుడును వహించుకొని పోవుచున్నాము కావున మాలో మరణమును మీలో జీవమును కార్యసాధకమగుచున్నది.

కావున మేము అధైర్యపడము. మా బాహ్యపురుషుడు కృశించుచున్నను ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడుచున్నాడు.

క్షణమాత్రముండు మా చులకని శ్రమ మాకొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగ జేయుచున్నది 2 కొరింథీ 4:7–18



మంటి దానను, బలహీనరాలను, వ్యాధిగ్రస్థులైన నాలో బలాధిక్యము కలుగజేయటానికి దేవుడు ఈ మహా అద్భుతాన్ని నాకండ్ల ఎదుట జరిగించాడు. బలహీనతలోనే తన శక్తిని పరిపూర్ణము చేసిన నాదేవునికి వందనాలు. ఆయన కృపయే నాకు చాలు.ఆ బిడ్డ ఇపుడు చాల చక్కగా పెరుగుతూ ఉన్నాడు.

నా క్లినికల్ ప్రాక్టీసును అనేక మందిని ఆశీర్వాదకరముగా దేవుడు చేసాడు చర్చిలో ఎంతోమంది వేరే డాక్టర్లు ఉన్నా, అందరూ నా దగ్గరకే వచ్చి తమ సమస్య చెప్పి ప్రిస్క్రిప్షన్ తీసుకొని ప్రార్థనా పూర్వకముగా వెళ్తారు.

నా పాటలు, సాక్ష్యము సువార్త పరిచర్య విషయములో నాభర్త మొదట నన్ను అంతగా ప్రోత్సహపరచలేదు కాని రానురాను ఎందరో తమజీవితాలకు నా జీవితాలను నాజీవితనుభవ సాక్ష్యము ఏవిధముగా సహాయపడినదో వివరించినపుడు ఆయన నన్ను ఎక్కువగా ప్రోత్సహపరచడం నా ప్రయాణాలు వీలయినంతవరకు సుఖకరముగా జరిగేటట్టు జాగ్రత్తలు తీసుకోవడం చేస్తూ ఉన్నారు.

నాపిల్లలు కూడా మొదట నేను వారికి దూరమౌతున్నట్టుగా బెంగగా అయ్యారు కాని నాపైన ఉన్న దేవుని కృప వారికి కూడా అర్థమైంది. వారు నాతో పాటు ఎన్నో మీటింగులకు హాజరై అక్కడ దేవుని కార్యాలు చూసారు అందువలన వారు కూడా "ఎవ్వరెవరికో లేని ఆధిక్యత దేవుడు నీకిచ్చాడు, నీకు వీలయినంతవరకు ఎంత దూరమైనా వెళ్ళిదేవుని సాక్షిగా నిలబడాలి. మాప్రోత్సహము ఎపుడూ నీకు ఉంటుంది. ఎవరెన్ని విధాలుగా మాట్లాడినా నీదేవుని పని చేయడం మానవద్దమ్మా, నువ్వు బయటికి వెళ్ళినపుడు మేము ఏదో విధంగా అడ్జస్ట్ అవుతాము అని అన్నారు. నాకు దేవుడు ఎంత ప్రేమ గలిగిన పిల్లలను ఇచ్చాడో! వారు చిన్నవారు నేను వారికి జాగ్రత్త తీసుకోవడం కన్నానన్నే వాళ్ళు జాగ్రత్తగా కనిపెట్టుకుంటూ ఉంటారు. నేను ఏసమయానికి ఏమి తినాలో,త్రాగాలో, మందులు వేసుకోవాలో వారికి బాగా తెలుసు. నేను చేసుకోలేకపోతే వారే చేస్తారు. "మా అమ్మ ధన్యురాలు" అని చెప్పే మంచి పిల్లల్ని దేవుడు నాకిచ్చినందుకు నా దేవునికి వందనాలు.

నేను నా కుమార్తె విషయమై బలహీనముగా ఆలోచించి అల్లుడిని చేసుకోవాలని చూసిన వ్యక్తిలో అస్సలు నాకు ఇష్టం లేని ఒక సంగతి గమనించాను. నేనెపుడూ మన కష్టార్జితంతో దేవుని సేవ చెయ్యాలి అనేది నా అభిప్రాయం. వేరే దేశాల నుండి దైవసేవకు పంపే దేవుని సొమ్మును దుర్వినియోగపరచి, దేవుని మోసగించడం, ఇంకా వారి తర్వాత తరములలోని పిల్లలు పూర్తిగా భ్రష్టులుగా అవ్వడం చూసాను. ఆ ధన వ్యామోహంలో నేను చిక్కుకోకూడదని వేరే దేశాలనుండి దైవసేవకులు పంపే దేవుని సొమ్ముతో నేను ఎప్పటికీ సేవ చేయకూడదని నా వివాహం కాకముందే నిర్ణయించుకున్నాను. ఇది నా అభిప్రాయమే కాని ఎవరినీ కించపరచడం కాదు. నేను అల్లుడుగా చేసుకోవాలనుకున్న

వ్యక్తి ముందు నాతో ఏకీభవించాడు కాని తర్వాత అతనికి కూడా అటువంటి ఆశ ఉందని తెలిసింది. దాని కొరకు ఎన్నో ప్రయత్నాలు చేయడం, నా బలహీనత పేరు చెప్పి, నా కోసమే అన్నట్టు ఫండ్ రైజ్ చెయ్యడం వంటివి చూసాక అతడు నా కుటుంబములోనికి రావడానికి వీల్లేదని నిర్ణయించుకున్నాను. దాని విషయమై ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. ఇక్కడ నాకు మాట ఇచ్చి, వారి తల్లిదండ్రులతో కూడా మాట్లాడించి, మరొక అమ్మాయితో పెళ్ళి కుదుర్చుకోవడం దానికి ఎన్నో అబద్ధ కల్పనలు చేయడం, నిందలు వేయడం కూడా నాకు చాల దుఃఖాన్ని కలిగించింది. అతన్ని కూడా మనసులో క్షమించలేకపోయాను. ఈ విధంగా నేను కొంత నా స్వంత శక్తి మీద ఆధారపడుతూ చేసిన ప్రయత్నాలు సరైనవి కావని, "అది నీ పని కాదు, ఇది సమయం కాదు నా మీద ఆధారపడు" అని నా ప్రభువు "నీ కుటుంబ మేలు కొరకే అతన్ని నేను తప్పించాను" అని తెలియజేసినపుడు అతన్ని క్షమించగలిగాను. దీనికి చాల కాలమే పట్టింది. అతన్ని నాకు ఉదాహరణగా చూపించి దేవుడు నాకు వివాహము యొక్క ఘనత గురించి మన కుటుంబాలు ఎలా కట్టబడాలి? కుటుంబ ఐక్యత, ఏకత్వము అనే అంశాలు నాకు ఎన్నో బోధపరచారు. వాటిలో కొన్నింటిని క్లుప్తంగా వివరిస్తాను.

1. వివాహము అన్ని విషయములలో ఘనమైనది కాబట్టి దేవుడు ఘనముగా ఎంచిన వివాహమును ఘనహీనమైనదిగా ఎంచి, భర్త భార్యను గాని, భార్య భర్తను గాని పరిత్యజించకూడదు, ఎడబాయకూడదు. ఏ మత ప్రకారం లేక ఏ మర్యాద ప్రకారం జరిగినా సరే దానిని ఎవరూ వేరు చేయకూడదు.

2. చేసుకోబోయే వివాహము దేవుని చిత్త ప్రకారమే జరుగుతుందా అవునా? కాదా? అనేది వివాహానికి ముందే దేవున్ని అడిగి తెలుసుకోవాలి. ప్రార్థన పూర్వకముగా నిర్ణయం తీసుకొని ముందడుగు వేయాలి. విడిగా ఉండాలి అని అనుకుంటే అది వివాహానికి ముందే నిర్ణయించుకోవాలి. కలిసి జీవించాలి అని నిర్ణయించుకొని, ప్రమాణాలు చేసి వివాహ బంధములోనికి ప్రవేశించిన వారు మరణము వరకు కలిసి జీవించాలి.

3. భార్య భర్తని అవమానపరచినా, దుఃఖపెట్టినా భర్త భార్యని దుఃఖపెట్టినా వారు దేవుని వద్ద చేసిన ప్రమాణము విషయములో వివాహబంధాన్ని ఘనహీనమైనదిగా ఎంచుతున్నారని అర్థం. దేవుని చిత్తాన్ని కనుగొని చేసుకొన్నా లేక తమ ఇష్టానుసారంగా చేసుకున్నా ఆ బంధానికి జీవితాంతం కట్టుబడి ఉండాలి.

యౌవనస్థులకు, పెండ్లి కాని వారికి నేనిచ్చే సలహా ఏమిటంటే మన స్వజనులలో నుండి వివాహ జీవిత భాగస్వామిని, రక్షణ పొందిన వారిని చేసుకొంటే వివాహం తర్వాత వచ్చే చాల సమస్యలను రాకుండా చేసుకోవచ్చు. తల్లిదండ్రులను సన్మానించి వారిని బాధపెట్టకుండా చూసుకోవాలి. ఒక వేళ తల్లిదండ్రులే తప్పుడు నిర్ణయం చేస్తే వారిని ఒప్పించేంత వరకు ఓపికతో ప్రార్థనాపూర్వకముగా ఎదురు చూడాలి. ప్రార్థన



ద్వారా ఏ ఆటంకాలనైనా ఎదుర్కొని జయం పొందవచ్చు.

4. కొన్ని జంటలు దైవసన్నిధిలోనే జతపరచబడినా దేవుని చిత్త ప్రకారము జరుగ నందు వల్ల అనగా వారి స్వచిత్తము వలన జరిగినందుకు కొంత అసమాధానాన్ని పొందుతారు. కొన్ని శాపగ్రస్త కార్యాలు వారి మధ్య జరిగినపుడు, ఈ పెండ్లి చేసుకోవడం దేవుని చిత్తము కాదని తెలుసుకొని దానికి పరిష్కార మార్గాన్ని ఆలోచించినపుడు విడాకులు తీసుకోవడం పరిష్కారమని ఎంచి, విడాకులు తీసుకోడానికి ఇష్టపడతారు. దేవుని చిత్తాన్ని కనుక్కోకుండా పెండ్లి చేసుకోవడం ఒక తప్పైతే, జతపరచబడిన తరువాత విడిపోకూడదని చెప్పే దేవుని మాటకి విరుద్ధంగా విడాకులు తీసుకున్నట్టయితే తప్పు మీద మరొక తప్పు చేసి జీవితాన్ని నాశనం చేసుకోవడానికి తప్పుడు మార్గం ఎంచుకోవడమే. అయితే దైవచిత్తాను సారముగా కాకుండా వివాహం చేసుకున్నా, వారికి విడిపోవడం పరిష్కారం కాదుగాని దేవుని సన్నిధిలో "దైవచిత్తానుసారం కాని వివాహాన్ని చేసుకున్నందుకు పశ్చాత్తాపపడుతూ, తప్పుచేసామని ఒప్పుకొని క్షమాపణ కోరాలి." మరల దైవాశీర్వాదం కొరకు ప్రార్థించడమే దీనికి పరిష్కారం. ఈ విషయంలో ఎంతోమంది దైవజనులు కూడా తప్పటడుగులు వేసి, తమపై ఆధారపడిన వారికి సరైన ఆలోచన చెప్పడం లేదు.

5. నరునికి ఒకే భార్య ఉండాలి (ఒక్క ఎముక–ఒక్క పురుషుడు). మరొకరిని పెండ్లి చేసుకొవడం దేవుని దృష్టికి వ్యభిచారమే. అది జీవితాంతం విడిపించుకోలేని వ్యభిచారం. విడాకులు తీసుకున్నవారు ఆడదైన మగాడైన ఇక వివాహమే చేసుకోకుండా ఉండడమే దేవుని చిత్తము. దేవుడు ఆదాము నుండి ఒక్క ఎముకను తీసి ఒక్క స్త్రీనే చేసి భార్యగా అతనికి ఇచ్చాడు. పురుషుడు క్రీస్తుకు సాదృశ్యము స్త్రీ సంఘానికి సాదృశ్యమైయున్నది. క్రీస్తు కొరకు సిద్ధపడుతున్న సంఘము ఒక్కటే, ఆమె వధువు. క్రీస్తుకు సాదృశ్యముగా ఉన్న పురుషునికి ఒక్క భార్యే ఉండాలి. ఒక వేళ భార్య చనిపోతే (బిడ్డలు లేకనే చనిపోయినా సరే) కూడా భర్త ఆ ఒంటరి స్థితిలోనే దేవుని మహిమపరచడం దేవుని చిత్తం. స్త్రీకి మాత్రమే విధవరాలైతే మరల వివాహము చేసుకోవచ్చునని వాక్యం అనుమతి ఇస్తున్నది. కాని పెండ్లి చేసుకోవడం కంటే విధవరాలిగా ఉండడమే ధన్యకరమని మనకు వాక్యము చెప్పుచున్నది.

6. మూడు పేట్ల బంధములో ఒక పేట భర్త, 2వ పేట భార్య, 3వ పేట ఆత్మ దేవుడు కలిసి ఉండాలి. భర్త దేవుని పోలి ప్రేమస్వరూపిగా జీవించబద్ధుడై యున్నాడు. స్త్రీ క్రీస్తును పోలి సంపూర్ణ విధేయతకు మారు పేరుగా జీవించబద్ధురాలై యున్నది. భర్త తన స్వంత శరీరమును ఎలా ప్రేమిస్తాడో అలానే తన భార్యను ప్రేమించాలి. భార్య ఒక వేళ అతని ప్రేమకి అర్హురాలు కాకపోయినా కళంకము, కలిగి ఉన్నా క్రీస్తు సంఘాన్ని ప్రేమించిన రీతిలో ప్రేమించ బద్ధుడైయున్నాడు. స్త్రీ క్రీస్తు చూపిన విధేయత తన

జీవితములో చూపించాలి. తన భర్త ఎలాంటివాడైనా, భయంకరుడైనా, బాధించేవాడైనా అతనికి మారు మాట్లాడక విధేయత చూపించాలి. తండ్రియైన దేవుడు తన ఏకైక కుమారుని ఎంతగా నలుగగొట్టుటకు అప్పగించినా మారు పలకని క్రీస్తు విధేయత భార్యలో ఉండాలి. ఈ విధమైన ప్రేమ, విధేయతలు కలిగిన భార్య భర్తల మధ్య ఆత్మ దేవుడు అన్యోన్య సహవాసము చేస్తాడు. భర్త తండ్రియైన దేవునికి, భార్య కుమారుడైన క్రీస్తుకు, ఆత్మ దేవుడు అన్యోన్య సహవాసముకు పోలికలై యున్నారు.

7. ఈ రోజుల్లో స్త్రీ వైపు నుండి ఎందరో పురుషులు ఆస్తిని, వరకట్నాన్ని ఆశిస్తున్నారు. పెండ్లి చేసుకోగలిగిన స్థోమత ఆ పురుషునికి ఉన్నా స్త్రీ తరపు వారినే పెండ్లి జరిగించడానికి డబ్బు అడుగుకుంటున్నారు. కట్నం తీసుకోవడం, ఖర్చులకి డబ్బు పెట్టుకోమని అడగడం క్రైస్తవ కుటుంబాలలో ఎంతో భక్తి పరులైన వారిలో కూడా చూస్తున్నాము. అది డబ్బు మీద పిచ్చి, వ్యామోహం, దేవుని వాక్యానికి విరుద్ధం. క్రీస్తు సంఘాన్ని ప్రేమించి ఆమె కొరకు తన సర్వస్వాన్ని ధారపోశాడు. అంతేగాని సంఘం ఆయనను కొనలేదు. క్రీస్తుకు, సంఘానికి సాదృశ్యమైన వివాహ బంధం ఈ విధంగా డబ్బుతో ముడి పెట్టబడి, ఆ బంధాన్ని శాపగ్రస్తమైనదిగా మార్చబడడానికి సాతాను వేసిన పన్నాగమే. కాబట్టి వరకట్నాన్ని ప్రోత్సహించకూడదు. ఈ విధంగా వచ్చిన ఆస్తి నష్టానికే దారి తీస్తుంది. జీవితాన్ని కష్టాలు, కన్నీళ్ళ పాలు చేసుకోవద్దు. ఇంకా పురుషుడే స్త్రీకి ఇచ్చుకోవడం దేవుని చిత్తం.

8. ఎవరైనా విడాకులు తీసుకున్న తరువాత మరల భర్త భార్యని, భార్య భర్తని కావాలని కోరుకున్నట్లయితే 2వ వివాహపు ఆలోచన మాని, వివాహ బంధాన్ని గౌరవిస్తూ తండ్రియైన దేవుని పోలి పురుషుడు ప్రేమ కలిగి తన భార్యను మరల కలుసుకోవచ్చు. అది దీవెనకరరము, స్త్రీ క్రీస్తు చూపిన విధేయత కలిగి తన భర్తను మరల చేరుకోవచ్చు అది ఎంతో ఆశీర్వాదకరం.

9. కొందరు రెండు లేక మూడు వివాహాలు చేసుకొని తమ ముందు జీవితాన్ని ఎంతో దుఃఖమయం చేసుకుంటూ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వలేకపోతారు. మన దేవుడు ఎంతైనా నమ్మదగినవాడు. మన తప్పిదములను మనము ఆయన సన్నిధిలో ఒప్పుకున్నట్లయితే ఆయన మనలను క్షమించి మన సంబంధాలను ఆశీర్వదిస్తాడు. ఆయన దృష్టిలో మొదటి వివాహమే చెల్లుతుంది. విడాకులు, 2వ వివాహం ఆయన దృష్టిలో చెల్లవు. తెలిసి తెలిసి మన జీవితాన్ని మనమే తప్పులమయం చేసుకోకుండా దేవుడు మనకిచ్చిన జ్ఞానము వినియోగించుకుంటూ ముందుకు సాగాలి.

10. విడాకులు తీసుకున్నవారు తమ తప్పు తెలుసుకొనే లోపల కలుసుకునే వీలు లేనపుడు ఒంటరిగానే జీవితాన్ని కొనసాగించడం మేలు. ఎంతోమంది బైబిలులోని గొప్ప భక్తులు ఆ తప్పులు చేసినా దేవుడు వారిని కనికరించడం అలుసుగా తీసుకొని మేము



కూడా చెయ్యవచ్చులే అని అనుకుంటారు. కాని వారిలాంటి తప్పిదములు చేసి అవసరమైన సంతానమును కని, భూమిని నింపించి దేవుని పిల్లలకే వ్యతిరేకమైన జనాంగాలకు మూల పితరులయ్యారు. యుగాలు గడుస్తున్నా వారి మధ్య యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. మనకు కూడా మూలపితరులకున్నట్టి దేవుని కృప దొరుకుతుందో లేదో! కాబట్టి సాతాను సులభముగా చిక్కులలో పెట్టే పాపము నుండి తప్పించుకోవాలి. అవి యుగాంతములో ఉన్న మనకు బుద్ధి కలిగించడానికి దేవుడు వాటిని పరిశుద్ధ గ్రంథములో పొందుపరిచాడు.

11. చట్టము కూడా కొన్ని విషయాలలో తప్పుడు నిర్ణయాలు చేస్తూ కుటుంబాలు విడిపోయేటట్టు చేస్తుంది. కొందరు తమలో ఉండే కొన్ని వ్యాధులు. ఉదా: ఫిట్స్, మానసిక రుగ్మతలు మొదలైనవి ఉన్నాయని ముందే చెప్పకుండా పెళ్ళి చేసుకుంటున్నారు. వీటి కారణంగా విడాకులు తీసుకుంటున్నారు. ఇది అవతలి వారిని మోసంచెయ్యడమే అవుతుంది, ఇలా మోసకరంగా బలైపోవడం జరుగుతుంది. తల్లిదండ్రుల బలవంతం మీద ఇష్టం లేని పెళ్ళిళ్ళు చేసుకున్నా దానికి కారణం సరైన విధముగా దేవుని చిత్తాన్ని కనుక్కోలేకపోవడమే. అయినా దీనికి పరిష్కారం సరైన రీతిలో దేవున్ని క్షమాపణ వేడుకొని, ఇక మీదట దేవుని ఆశీర్వాదము కావాలని ప్రార్థించాలి. విడిపోయి వేరొక పెండ్లి చేసుకోవడం పరిష్కారం కాదు. పెండ్లియైన తరువాత వ్యాధిగ్రస్తులని తెలిసినా కృంగిపోక, విడాకులు కోరుకోక, దేవున్ని క్షమాపణ పొంది ఆశీర్వాదాన్ని పొందుకోవాలి.

12. వివాహంలో వధువరుల మధ్య ఏకత్వం ఏ విధంగా ఉండాలంటే త్రియేక దేవునిలో ఉన్న ఏకత్వం, ఐక్యత కలిగి ఉండాలి. దేవునిలో తండ్రి, కుమార, పరిశుద్ధాత్ముల ముగ్గురు వ్యక్తులు ఉన్నా ముగ్గురూ ఒకే దేవుడై, ఒక్కరై ఉన్నట్టుగా వివాహంలో జతపరచబడిన భార్య భర్తలు కలిసి ఉండాలి. ఆ ఐక్యతకు త్రియేక దేవుడే మనకు మాదిరి.

13. విడనాడబడిన ఒక స్త్రీని ఆమె భర్త బ్రతికియుండగానే ఎవరైనా 'నేను ఆమెకు జీవితాన్ని ఇస్తాను' అని జాలిపడి ఆమెను పెండ్లి చేసుకోవడం కూడా దేవుని దృష్టిలో వ్యభిచారమే. దేవుని దృష్టికి అది ఆమెకి జీవితాన్ని ఇవ్వడం కాదు గాని తన జీవితాన్ని శాపగ్రస్థముగా మార్చుకున్నట్టు అతడు జీవితంలో ఎన్నో అవమానాలు, శాపము పొందవలసి ఉంటుంది. ఆమె మొదటి వివాహములోని ప్రమాణం వారికి శాపంగా మారుతుంది.

ఈ విధంగా దేవుడు ఈ సంగతులు బయలు పరచి పెళ్ళిళ్ళు చేసుకోబోయే యౌవనస్థులకు కౌన్సిలింగ్ ఇవ్వడానికి, విడిపోయిన కుటుంబాలకు పరిష్కారము చెప్పి, ఆలోచన ఇవ్వడానికి దేవుడు నాకు జ్ఞానమిచ్చాడు. 2008 సంవత్సరానికి మీటింగుల్లో దేవుడు మాట్లాడమని నాకిచ్చిన అంశము కూడా ఐక్యత, ఏకత్వమును గురించే.

కొందరు తమ కుటుంబాలలోని సమస్యలను తీర్చుకోవడానికి నా కుటుంబస్థులను వాడుకోవడానికి పరోక్షముగా నా చావు కోరుకున్నట్టు నాతో స్నేహంగా ఉన్నట్టుగా ఉంటూ నా మరణం తర్వాత మాటలు కూడా మాట్లాడుకొన్నట్టు తెలిసి నేను కృంగినప్పటికి దేవుడు నా కుటుంబములో అలాగ దేవుని చిత్తానికి వ్యతిరేకముగా జరగనివ్వని మాటిచ్చి నందుకు నేను బలపడ్డాను. వారికి కూడా దేవుని కృపను బట్టి క్షమించగలిగాను.

నేను క్షమిస్తేనే నా పాపములు కూడా క్షమించబడతాయని తెలిసాక నాకు కష్టము కలిగించిన వారినందరిని యేసుక్రీస్తు కృపను బట్టి క్షమించగలిగాను. అయితే నా శ్రమలో తీవ్రత పెరుగుతూ వెళ్ళిన రీతిగానే నన్ను ఇంకా ఇంకా మానసిక క్షోభకి గురి చేసి క్షమించడానికి ఎంతో బలము కూడగట్టు కొనేటంత సమస్యలు సాతాను కలిగించాడు. నాకిక ఆశలు లేవని తెలిసినా నన్ను ప్రేమించేవారు, నన్ను ఆదుకున్న వారు ఉన్నా కొన్నాళ్ళే ఆదరించివదిలేసినప్పటికి దేవుని కృపను బట్టి ఎప్పటికప్పుడు కృంగి పోకూడదు, నేను ఎదుటి వారిని ఆదరించే విధంగానే ఉండి క్రీస్తు మాదిరిగా ఉండాలనే ఆశ నన్ను బ్రతికిస్తూ బలపరుస్తూ ఉంది. సంతోషంగా కష్టాల్లో సైతం చిరునవ్వుతో ఉండగలిగే శక్తిని దేవుడు ప్రసాదిస్తూ ఉన్నాడు.

ప్రార్థనా జీవితంలోనూ, వాక్యం నేర్చుకోవడంలో, వాక్య పరిచర్య చేయడంలో దేవుడు ఎన్నో మెళకువలు నేర్పించాడు. ఎందరో గొప్ప గొప్ప భక్తులు కూడా ఆశ్చర్యపోయేటట్టుగా దేవుడు తన జ్ఞానముతో నింపాడు. తన అభిషేకంతో వాడుకున్నాడు. తన వాగ్ధానాలు ఎన్నో నా యెడల నెరవేర్చాడు.

2008వ సంవత్సరం ఫిబ్రవరి నెల నుండి నేను గుడ్‌ఫ్రైడే ముందు "ప్రభువా, నన్ను మరలా దర్శించు" అని పదే పదే ప్రార్థించాను. "దానిని నాకు అనుభవములో కూడా ప్రసాదించు ప్రభువా" అని అడిగాను. నాకు తెలుసు దానికి నేను చాలా శ్రమ మరలా పొందాలని, ఎందుకంటే సిలువ ధ్యానాలలో నన్ను దేవుడు నడిపించాడు. అన్ని సన్నివేశాలకంటే ముఖ్యంగా గెత్సెమనే తోటలో క్రీస్తు ప్రభువు పొందిన శ్రమ గురించి దేవుడు నాకెన్నో సంగతులు బోధపరచాడు. నన్ను ఎక్కువగా ఆకర్షించి తన వాక్యాన్ని నేర్చుకొనేటట్టు చేసిన దేవుడు నాకు చెన్నైలో మీటింగుల కొరకు శ్రమల దినాలలో వాక్య పరిచర్య కొరకు పిలిచిన దైవజనుల ద్వారా కూడా ఎంపిక చేయబడి ఇచ్చిన వాక్య అంశము కూడా గెత్సెమనే ప్రార్థన.

అదే సమయంలో నా రక్త పరీక్షల రిపోర్టులలో నాకు రక్తము తగ్గిపోయిందని, రక్తం ఎక్కించాలని చెప్పారు. నేనలాగే ముందు విశాఖపట్టణంలో మీటింగులకు తర్వాత చెన్నై రెండు సార్లు మీటింగులకు వెళ్ళాను. దేవుడు తన అభిషేకమిచ్చి వాడుకున్నాడు. తర్వాత హాస్పిటల్‌లో చేరి రక్తం ఎక్కించుకొని మరల విజయవాడ దగ్గర కవులూరు అనే ప్రాంతానికి పరిచర్య నిమిత్తం వెళ్ళాను. అక్కడ కూడా నా పరిచర్యలోని అంశాలు సిలువ ధ్యానాలు



– నా సాక్ష్యము.

గెత్సెమనే తోటలో యేసు ప్రభువు ఎంతో వ్యాధిగ్రస్థుడై తాను సిలువ కార్యం చేయకుండానే సాతాను ఆయనను చంపచూచినట్టు దేవుడు నాకు బయలు పరచాడు. సిలువ ఇంకా మోయకముందే యేసుప్రభువు ఎన్నోసార్లు మరణ ఘడియలు ఎదుర్కొవలసి వచ్చిన సందర్భములలో గెత్సెమనే తోట అనుభవం కూడా ఒకటి. అక్కడ ఆయన తన దేవుని చిత్తానికి వ్యతిరేకముగా తనను సాతాను మొత్తాడు. అందువల్లనే ఆయన ఆ తోటలో తూలిపడిపోతూ నడవలేకపోయాడు. తన ప్రాణము మరణమగునంతగా శ్రమ పొందుతున్నట్టుగా తన ప్రియమైన స్నేహితులైన శిష్యులను ప్రార్థించమని కోరాడు. శారీరకంగా ఆయన ప్రార్థించడానికి కూడా శక్తిలేనివాడుగా అయ్యాడు. తన శిష్యులను ప్రార్థించమని కోరినా వారు చెయ్యలేని స్థితిలో ఉన్నారని చూచి తానే ప్రయాసపడ్డాడు. ఒక మానవునిగా ఆయన మనకు మాదిరి చూపించాడు. తాను ఈ లోకానికి వచ్చిన ఉద్దేశమేమిటో, దాన్ని ఎపుడు నెరవేర్చాలో" ఎలా చెయ్యాలో అన్ని ప్రార్థనా జీవితం ద్వారా కనుగొన్నాడు. పరిశుద్ధాత్మునిపై ఆధారపడ్డాడు. సిలువ కార్యాన్ని నెరవేర్చడానికి కంకణం కట్టుకున్న ఆయనను అంతకు ముందు కబళించాలని ప్రయత్నిస్తున్న సాతాను శక్తులతో పోరాడుతూ ఒకసారి రెండుసార్లు కాదుగాని మూడుసార్లు ఆతురతపడి ఒకే విషయమై ప్రార్థించాడు. ఆయన స్పృహ కోల్పోయేస్థితికి వెళ్ళాడు. కాని తన దేవుని చిత్తాన్ని నెరవేర్చకుండా తాను మరణించకూడదని ఆయన పోరాడాడు. ఆయన అనారోగ్యాన్ని గాని, పోరాటాన్ని గాని శిష్యులు అర్థం చేసుకోలేకపోయారు. అందువలన పరలోక శక్తి పై ఆధారపడి అక్కడ సాతాను శక్తులతో పోరాడి గెలిచాడు. ఆ పోరాటంలో ఆయన చెమట రక్తపు బిందువులవలె నేల మీద పడింది. సిలువ మీద సంపూర్ణ విజయాన్ని సాధించే వరకు ఆయన పోరాడుతూనే ఉన్నాడు.

ఈ సన్నివేశాన్ని దేవుడు నా జీవితంలో కూడా అనుభవపూర్వకంగా దయచేశాడు. దేవుడు నన్ను అలాగ అనుమతించి విజయాన్ని ఇచ్చాడు. ఏప్రిల్ 12 తారీఖున విజయవాడ నుండి ఇంటికి వచ్చాను. మరల 17న బయలుదేరి అమలాపురం మీటింగులకు వెళ్ళ వలసి ఉంది. కాని 13 వ తారీఖున నుండి నాకు కడుపులో నొప్పి ఎక్కువౌతూ వచ్చింది. 16న మరింత ఎక్కువై రాత్రిలో ప్రేవులు కూడా పని చేయడం మానేసినట్లు నాకు అర్థమైంది. దాని ద్వారా వాంతులు, కడుపులో విపరీతమైన నొప్పి అయ్యాయి. 17న ఉదయాన్నే డాక్టర్లలో ఫోన్‌లో మాట్లాడాను. వారు వెంటనే రమ్మన్నారు. హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాను. ప్రేవుల్లో కదలికలు ఆగి పోటు నొప్పి ఇంకా ఎక్కువైంది. స్కానింగ్ ఎక్స్‌రేలలో అది రూఢిగా తెలిసింది. స్కానింగ్‌లో వ్యాధి ఇంతకు ముందుకన్నా ఎక్కువైనట్టు లివర్‌లో ఉన్న పెద్ద గడ్డ పగిలి బ్లీడింగ్ అయిందని తెలిసింది. ఆపరేషన్ చేసే పరిస్థితి అయినా వ్యాధి ఎక్కువైనందుకు ఆపరేషన్ చేస్తే బ్రతకనని వారికి అర్థమైంది. ఆపరేషన్

చేసే అవకాశం లేనందు వలన మందులతోనే అది గుణమవ్వాలని ప్రయత్నించారు. అయితే నేను పడిన వేదన, నొప్పి ఆపరేషన్ చెయ్యకుండానే నాలుగు ఆపరేషన్లు ఒకే సారి చేస్తే వచ్చేంత విపరీతమైనది. నొప్పి ఎక్కువైనపుడు కొన్ని సందర్భాలలో ఊపిరి అందక నరకాన్ని అనుభవించాను.

అంత బాధలో కూడా "ఎందుకు ఇంత విపరీతంగా నొప్పిని దేవుడు అనుమతించాడు? నేను చెయ్యాల్సిన పనులు దేవుని పని ఇంకా ఎంతో ఉంది. నరకం వంటి నొప్పిని ఇచ్చిన కారణం ఏమిటి? ప్రభువా! సహించుకునే కృప నా కివ్వు, ఊపిరి అందక ఇలా చనిపోతానేమో!" అనే ప్రార్థన చేస్తూ నేను చెయ్యవలసిన పనులు పూర్తి కాకుండానే సాతాను మధ్యలోనే నన్ను కబళించాలని ప్రయత్నిస్తున్నట్టు గుర్తించాను. నా బాధను ఎవరూ కూడా పంచుకోలేని స్థితి. నేను మాట్లాడలేనంత నిశ్శక్తురాల్ని అయ్యాను. నాకు పరిచర్య చేస్తూన్న చిట్టి, వజ్రాలు కూడా దివారాత్రులు ప్రార్థన చేస్తున్నారు. నేను ఇక కొన్ని రోజులు మాత్రమే బ్రతుకుతానన్నట్టు నా రిపోర్టులు చెప్తూ ఉంటే డా. గోపినాథ్ గారు చాల ఖిన్నులైపోయారు. నేను ఏ మందు ఇమ్మని అడిగితే అది ఇవ్వమని సిస్టర్లకి ఆయన చెప్పారు. ముక్కులో నుండి ట్యూబ్ కడుపులోనికి వేసి చూద్దామన్నారు.

ఒకరోజు ఒక దైవజనుడు నన్ను దర్శించి మీ విషయమై దేవునికి సాతానుకు మళ్ళీ సంభాషణ జరిగింది. మీరు దేవుడ్ని అడిగి తెలుసుకోండి అని అన్నాడు. నేను ఆ విషయమై కూడా ప్రార్థించాను. నేను ఈసారి ఖచ్చితంగా ఓడిపోతానని దేవునిలో సాతాను ఛాలెంజ్ చేసినట్టు ప్రభువు నా విషయమై నేను ఓర్చుకొని ఆయనను తప్పక ఘనపరచి, గొప్ప అనుభవము పొందుకుంటాను అని చెప్పినట్లు దేవుడు నాకు ఆ సంభాషణ వినిపించాడు.

నొప్పితో విలవిలలాడినపుడు ఊపిరి ఆగిపోయే స్థితి వచ్చినపుడు ఇక నేను ఇంతేనా అని దేవున్ని అడిగినపుడు ఆ గెత్సెమనే తోటలో నా ప్రభువు పడిన శ్రమను నాకు సజీవంగా చూపి నీకు ఆ అనుభవాన్ని ఇస్తున్నాను. అని తన వాక్కు నాలో పెట్టాడు. అపుడు నాకు వెంటనే నేనిపుడు మరణం చెందడం లేదు, విజయం కోసం నేను పోరాడాలి, క్రీస్తు పోరాడిన రీతిగా దేవుని సంపూర్ణ చిత్తాన్ని నేను నెరవేర్చాలి, దేవుని నామం ఘన పరచబడాలి అని క్రీస్తును పోలిన అనుభవం దేవుడు నాకిచ్చినందుకు దేవునికి వందనాలు. చెల్లిస్తూ వచ్చాను. యేసుప్రభుని బాధని ఉచ్చరింపశక్యముకాని మూల్గులను శిష్యులు అర్థం చేసుకోలేని రీతిగా నా చుట్టు ఉన్నవారు నన్ను ప్రేమించినా ఏమీ చెయ్యలేక నిలబడిపోయేవారు. అయితే నా విజయం కొరకు తండ్రి కుడి పార్శ్వాన విజ్ఞాపన చేస్తున్నట్టు గ్రహించి నేను నా శక్తి వంచన లేకుండా పోరాడి పరలోక శక్తిని క్రిందికి దించి బలం పొందాలని పట్టుదల కలిగింది యేసు ప్రభువుకు పోరాటంలో చెమట రక్తంగా కారితే నాకు నా లివర్‌లో రక్తం ఒలికింది. క్రీస్తుతో సమానమైన అనుభవం నేను పొందడమంటే మాటలా? కాని దేవుడు నాకు దానిలో గెలుపునివ్వాలని నా పక్షాన



పోరాడి నాకు విజయాన్నిచ్చాడు. ఆయన అతి పరిశుద్ధుడు కాని పాపాత్మురాలనైన నాకు ఈ అనుభవము ఇచ్చాడు.

వాంతులు 12 రోజులకి తగ్గాయి. వెంటనే నేను దయచేసి నన్ను ఇంటికి పంపమని డాక్టర్ గారిని అడిగాను. ఆయన చాల జాలిగా నన్ను చూచి పరామర్శించి ఇంటికి పంపించారు. ఇంజెక్షన్లు నేనే తీసుకోవడం, నొప్పి కలిగినపుడు బాధ సహించుకోవడం ఇంచుమించు హాస్పిటల్ నుండి వచ్చిన 21 నెలల వరకూ జరిగింది. ఈ పోరాటంలో నేను మరలా నా బరువు కోల్పోయాను. కాళ్ళు చేతులు ఊచకాళ్ళు అయ్యాయి (ఎముకల గూడుకు చర్మము తొడిగినట్టుగా) కాని నేను దేవుని మహిమ రూపంతో, సహనంతో క్రీస్తును పోలిన అనుభవం కలిగిన తృప్తితో హాస్పిటల్ నుండి వచ్చిన మరుసటి రోజు ఆదివారం చర్చిలో సాక్ష్యమిచ్చాను దేవుడు అనేక మందికి నన్ను మాదిరిగా, ఒక వింతగా పెట్టాడు. దేవుడు నా యెడల దయచూపించాడు అని డాక్టర్ గారూ పదేపదే అన్నారు.

నా చెల్లి మోని (శారాకమల)లో నేను ఒక తల్లిని చూచాను. నన్ను ఆమె ఆదరించిన తీరు అప్పుడే పుట్టిన పాపను అతి జాగ్రత్తతో తల్లి కనిపెట్టి చూసే రీతిగా నన్ను చూసుకుంది. నేను త్వరగా కోలుకొనేటట్టు చాలా జాగ్రత్తలు తీసుకుంది. హాస్పిటల్‌లోను, ఇంటికి వచ్చాక కూడా ఇప్పటికీ కూడా ఏవిధమైన రక్త సంబంధం లేకపోయినా నన్ను ఆదరించి, నాకు పరిచర్య చేయడానికి చిట్టి, వజ్ర ఇంకా శైలజ సిస్టర్‌ని, పాస్టరమ్మ గారిని దేవుడు వాడుకున్నాడు. వారందరికి, నా కొరకు ప్రార్థించిన వారందరికి నేను ఋణస్థురాలిని.

నా పాటలను, సాక్ష్యాన్ని వీడియో రూపములో చేయడానికి దానికి అయ్యే ఖర్చు అంతటిని తానే భరిస్తానని ముందుకు వచ్చారు నా స్నేహితులు ప్రీతమ్ లూక్‌గారు. ఆయన దేవుని పరిచర్యని ప్రేమించి కొన్ని పాటలను సాక్ష్యములో కొంత భాగం "స్తోత్ర సుమాంజలి" అని పూర్తి సాక్ష్యాన్ని "క్రీస్తుకై విరిసిన ఓ సాక్ష్య కుసుమము" అనే పేరున విడుదల చేసారు. నాకింత మంచి స్నేహితుని ఇచ్చిన నా దేవునికి వందనాలు. దేవుడు వారిని, వారి కుటుంబాన్ని ఆశీర్వదించాలని నా ప్రార్థన.

నేను రాన్‌బాబు చేత "నా ప్రాణదుర్గమా" అనే ఆల్బమ్‌లో "చిన్నారి స్వరములతో" అనే పాటకు పల్లవి పాడించాను. అయితే నా కుమార్తె ఎస్తేర్ చేత కూడా పాడించాలని తద్వారా వారుకూడా దేవుని సేవలో వారి భవిష్యత్ అంతా గడపాలి అనే దేవుని ఉద్దేశానికి ముద్రగా రికార్డింగ్‌కి తీసుకెళ్ళాలనుకున్నాను. మార్చి నెల నుండి చెయ్యాలని ప్రయత్నిస్తున్నా నా అనారోగ్య కారణంగా కుదరలేదు. ఇక నేను కోలుకున్న తర్వాత ఈ పనులు చెయ్యాలని మరల రెట్టింపు ఉత్సాహముతో ముందుకుసాగాను.

"నా హృదయేశ్వరా" అనే ఆల్బమ్ చెయ్యాలని పాటలు రెడీ చేసుకొన్నాను. నా

భర్తగారు చిన్నచిన్న కోరస్‌లతో ఇంకొక ఆల్బమ్ కూడా చేద్దాము, రెండు కలిసే చేసి వద్దాము, అందుకు కూడా సిద్ధపడమని చెప్పారు. నేను రెండు రోజుల్లోనే అన్ని కోరస్‌లు వ్రాసి వాటికి కూడా రాగాలు కూర్చాను. అందరం హైదరాబాదులో రికార్డింగ్‌లో పాల్గొన్నాము.

ఈసారి కూడా డా. పి.జె.డి. కుమార్ గారు వారి సతీమణి చాలా సహకరించారు. పాటలు కోరస్‌లు చాలా బాగా వచ్చాయి. ప్రతి పాట, ప్రతి కోరస్ కూడా నా అనుభవములో వ్రాసినవే. “నా హృదయేశ్వరా, సర్వోన్నతునికి స్తోత్రార్పణ” అనే ఆల్బమ్‌లు సిద్ధమయ్యాయి. వీటి కొరకు డా.పి.జె.డి. కుమార్‌గారు చాలా చక్కని సంగీతాన్ని అందించారు. వారి మిగతా కళాకారుల బృందములోని అందరూ ఆ పాటల్ని మెచ్చుకున్నారు. అదంతా బలహీనురాలనైన నా యెడల దేవుడు చూపిన కృప అని వారు గ్రహించారు. గత రెండు మాసాలకు ముందు నేను పడిన అనారోగ్యము ద్వారా నేను పాడలేక వారిని ఇబ్బంది పెడతానేమో అని అనుకున్నాను. కాని అటువంటి అననుకూలత దేవుడు కలుగనివ్వలేదు.

రికార్డింగ్‌లో 2వ రోజు మధ్యాహ్నం నాకు తీవ్రమైన నొప్పి రావడం ప్రారంభించింది. అపుడు నేను సహకరించకపోతే పని ఆగిపోతుంది. నొప్పి ఎక్కువ అవుతూఉండగా సాతాను “నువ్వు ఎవరికోసం ఇదంతా చేస్తున్నావు? దేవుని కోసమే కదా! అయినా నీ దేవుడు నువ్వు ఆయన పని చేస్తూండగా నీకు నొప్పి ఇస్తున్నాడు” అంటూ ఇంకా ఏవేమో చెప్పి నా చేత దూషణ మాటలు పలికి రావాలని చేస్తూన్న వాని ప్రయత్నాన్ని గమనించి ఇలాంటి సమయంలోనే నేను పాడాలి, దేవున్ని మహిమ పరచాలి, వాడు సిగ్గుపడి పారిపోవాలి అని పాడడం మొదలు పెట్టాను. కొన్ని నిమిషాలకి ఆ నొప్పి తగ్గింది. పరిశుద్ధాత్ముడు నన్ను కనిపెడుతూ, అన్ని సమయాల్లోనూ నన్ను ఆదరిస్తూ, తన చల్లనైన మాధుర్యమైన స్పర్శను నన్ను అనుక్షణము అనుభవింపచేస్తూ ఎత్తైన శిఖరానుభవములోనికి నన్ను నడిపిస్తున్నాడు. దాని కొరకు శ్రమపడాలి, శ్రమ అనుభవించి దేవుడిచ్చే దివ్య మహిమలోనికి నేను ప్రవేశించాలి అనే ఆశ నాలో దినదినము అధికమౌతూంది. నేనెప్పటికి సోలిపోకూడదు ఓడిపోకూడదు ఎందుకంటే నా దేవుడు జయశీలుడు. ఈ అనుభవాల లోతుల్లోనికి దేవుడు నడిపించే కొలదీ, నాకు ఎన్నో సంగతులు బయలు పరుస్తున్నందుకు నేను శ్రమనే మరి ఎక్కువగా కోరుకోవడం, ఎన్నో విషయాలలో నన్ను నేను సరిదిద్దుకోవడం నన్ను నేను మరింత తగ్గించుకోవడం, విధేయతతో నేను చూడని పరలోకాన్ని అందుకోవడానికి విశ్వాసముతో ప్రయాణం చేస్తున్నాను. నా భావాలతో ఎందరో ముందు వ్యతిరేకించినా క్రీస్తు కొరకు శ్రమ అనుభవించడానికి ఇష్టపడనివారు తర్వాత వారు నాతో ఏకీభవించవలసి వచ్చింది. ఎందుకంటే వారికి మరణ భయము ఆవరించి ఉన్నది కాబట్టి వ్యతిరేకించారు. కాని నేను మరణానికి భయపడను. ఎందుకంటే ఎన్నో మరణ



లోయలలో దేవుడు నన్ను బయటికి రప్పించాడు, ఇక ముందు కూడా రప్పిస్తాడు. నా చేయి పట్టి నడిపిస్తాడు. భౌతికంగా నేను ఎప్పటికైనా ఈ లోకాన్ని విడిచిపెట్టి మరణించాల్సిందే కాని నాకున్న నిరీక్షణ ఏమిటంటే నేనిక్కడ కన్నుమూసిన మరుక్షణం ప్రభువు రొమ్మున నా కన్నీటిని తుడిచి, నిత్య సంతోషం, నెమ్మది, విశ్రాంతి నిచ్చే, నా ప్రభువు కౌగిలిలో శాశ్వతంగా ఉంటాను. కాబట్టి నేను బ్రతికినా మరణించినా ప్రభువు బిడ్డను నేను మరణచ్ఛాయలో ఉన్నా నా దేవుని స్తుతిస్తాను. ఈ నిరీక్షణ నన్నెనటికిని సిగ్గుపరచదు.

ఈ సాక్ష్యమును చదువుతూ ఉన్న ప్రియులారా! మీరిపుడు మీ హృదయములో నా విషయమై ఎంతో భారము కలిగి నేను త్వరలో చనిపోతానని బాధపడుతూ ఉండవచ్చు కాని నేను నా శ్రమలో నా దేవుని చిత్తాన్ని కనుగొనగలిగానని దాని కొరకు విధేయురాలినైనందుకు నేను ఈనాడు ఎంతో సంతోషముగా ఉన్నాను. ఆయన సేవను చేయగలుగుతున్నానని ఆనందముగా నేను జీవితాన్ని గడుపుతున్నాను. నేనింకా బ్రతికియుండగానే దేవుని చిత్తాన్ని నెరవేర్చుతున్నానే తృప్తితో ఉన్నాను. దేవుడు ఎంతో అర్థవంతముగా చేసిన నా జీవితము గురించి మీరు బాధపడవద్దు కాని మీ గురించి మీ కుటుంబస్థుల గురించి చింతించండి. “యెరూషలేము కుమార్తెలారా! నా నిమిత్తము ఏడ్వకుడి, మీ నిమిత్తమును, మీ పిల్లల నిమిత్తమును ఏడ్వుడి” లూకా 23:28. నేనే కాదు మీరు కూడా ఒకటి దినాన్న మరణించాలి. అయితే మరణించే ముందు మీ జీవితం అర్థవంతమైనదిగా దేవునికి మహిమకరముగా ఉన్నాదా? దేవుని కొరకు మీరు శ్రమించి ఏదైనా చేయగలిగారా? దేవుని చిత్తం నీ జీవితంలో ఏమైయున్నదో కనుగొన్నావా? లేకపోతే ఇప్పుడే దేవుని దగ్గర మొఱ్రపెట్టు నీ జీవితంలో ఆయన చిత్తాన్ని కనుగొని ప్రయాసపడు. ఈ సాక్ష్యాన్ని చదువుతున్న మీకు కొన్ని ప్రశ్నలు వేస్తూ ఉన్నాను. వాటికి జవాబులు మీకు మీరే నిజాయితీగా ఇచ్చుకోండి.

1. క్రీస్తు ప్రభువులో తిరిగి జన్మించిన అనుభవము నీలో ఉన్నదా? రక్షణ పొందిన దినము నీకు గుర్తున్నదా? గుర్తుంటే ధన్యుడవు. క్రీస్తుకు నీకు మధ్యన ఉన్న నిబంధన నిన్ను మరణము వరకూ కాపాడుతుంది.

2. మీరు మీ పిల్లలను సండేస్కూల్‌కి పంపిస్తున్నారా? దేవుని వాక్యాన్ని నేర్పుతున్నారా? నీవు నీ పిల్లలకు నేర్పించే దేవుని వాక్యం వారి కష్ట సమయాలల్లో నిజముగా సజీవముగా నిలిచి ఆదరిస్తుంది. మంచి తల్లిదండ్రులుగా మీ బిడ్డల జీవితాలకు ఆదర్శముగా బ్రతకండి.

3. నీ జీవితాన్ని నీ తలాంతులను దేవుని కొరకు సమర్పించావా? దేవుని మందిరంలో ఉన్నపుడు క్రీస్తు పాట, బయటికి వెళ్ళాక లౌకికమైన పాటలు పాడుతున్నావా? నీకున్న వాయిద్యాలు వాయించే తలాంతును క్రీస్తు కొరకు మాత్రమే వినియోగిస్తున్నావా? లేక అదే జీవనోపాధి అని సరిపెట్టుకుంటున్నావా? నీకున్న దానిని ప్రభువుకు ఇచ్చి ఘనపరిస్తే

దేవుడు నీ సమర్పణను ఘనపరచి తగినకాలములో నిన్ను హెచ్చిస్తాడు.

4. నీ జీవితములో శ్రమలు, శోధనల గుండా పయనిస్తున్నావా? నాతో ఎవరూ లేరే అని చింతిస్తున్నావా? పరిశుద్ధాత్ముడు నీతో నీలో ఉన్నాడని జ్ఞాపకము ముంచుకో ఆయన నినెన్నటికీ విడువడు ఎడబాయడు.

5. శ్రమలో ఉన్న వారిని, కష్టాల పాలైన వారిని చూసి నీ కఠినమైన మాటలతో బాధపెడుతూ, విమర్శిస్తూ, తీర్పు తీరుస్తున్నావా? అలాంటి వారిని చూచి మేలైన మధురమైన మాటలతో ఆదరించు. వారెంతటి పాపాత్ములైన సరే. నీ స్వరాన్ని, నోటిని, నాలుకని, పెదవులను వారిని ఆదరించడానికి ఉపయోగించు. ఎందుకంటే నీకు కూడా భవిష్యత్తులో అటువంటి శ్రమ కలిగినపుడు ఆదరించే వారు నీకుండాలి. వరిస్తే నీ దేవుడు నీ కష్ట సమయంలో ఆదరించే వారిని నీ దగ్గరకు పంపిస్తాడు.

6. నీ కష్ట సమయాలలో, మరణలోయలలో దేవున్ని స్తుతిస్తున్నావా లేక దేవుని దూషిస్తున్నావా? శ్రమలు దేవుని పిల్లలకేనని జ్ఞాపకముంచుకో.

7. దేవుని యొక్క పునరుత్థానబలమును, శక్తిని పొందాలని ఆశిస్తున్నావా? క్రీస్తు పునరుత్థాన బలము, శక్తి పొందాలంటే క్రీస్తు యొక్క మరణములోనికి సమానానుభవము కలిగి యుండాలి అంటే శ్రమలను సహించాలి.

8. నా మరణ పరిస్థితి సాతాను బంధకాలలో ఉన్న మా నాన్నగారి విడుదలకు కారణమైన రీతిగా మన చుట్టు ప్రక్కలలో ఉన్నవారి శ్రమ, బాధ లేక వారి మరణం మనము గుణపాఠం నేర్చుకొనేటట్లు వర్తించుకుంటున్నామా? లేక మనము పరిశుద్ధులము, వారు పాపాత్ములు అని విర్రవీగుతూ ఉన్నామా?

9. దేశంలోను, ఇతర ప్రాంతాల్లో ఏర్పడే ప్రకృతి వైపరిత్యాలకు, భూకంపాలకు, సునామీల వంటి వాటికి కారణం ప్రత్యక్షంగా కనబడకపోయినా పరోక్షంగా క్రైస్తవుడు క్రైస్తవురాలిగా ఉన్న నీ పాప జీవితమేనని, అన్యజనుల పాపము కాదని గ్రహించావా? నిన్ను నీవు సరిచేసుకోవడానికి ఇష్టపడుతున్నావా? క్షమాపణ కోరుతున్నావా?

10. మీకు కష్టము కలిగించి బాధపెట్టినవారు బయటివారైనా, ఇంటిలోవారైనా, బంధువులైనా, స్నేహితులైనా వారు బ్రతికిఉన్నా, చనిపోయినా వారిని మనస్ఫూర్తిగా హృదయాంతరాళాలలో నుండి క్షమించగలుగుతున్నావా? గుర్తు చేసుకున్న ప్రతిసారీ మీరు బాధపడుతున్నారంటే, వారిని గూర్చి పదేపదే కఠినముగా మాట్లాడుతున్నట్లయితే మీరు వారిని హృదయపూర్వకముగా క్షమించలేదని అర్థము. మీరు వారిని క్షమిస్తేనే మీరు కూడా క్షమించబడతారు.

11. ఇంత సాక్ష్యమును పూర్తిగా చదివాకైనా, నీ సమర్పణ ఎలాంటిది? నీ యెడల దేవుని చిత్తము ఏమిటో కనుగొన్నావా? ఏ మాత్రం గర్వము, అతిశయము లేకుండా ప్రభువు కృపనే హృదయాంతరాళములో నుండి ధ్యానిస్తావా?



12. నువ్వు ఒకవేళ శ్రమలో ఉన్నా క్రీస్తు మాదిరిని అనుసరిస్తూ ఎదుటి వారిని (వారు నీ దృష్టిలో చెడ్డ వారైనా) ఆదరిస్తావా? నిస్వార్థముగా నీ సత్ప్రవర్తన ద్వారా ప్రభువు వారిలో మార్పు కల్గించునట్లు సహకరిస్తావా?

మహా శ్రమలలో సంతసించుచూ
మహిమ రూపి ఆత్మలో శక్తి బలము నొందుచు
మహిమ రాజ్యమునకై నిరీక్షించుచూ
మహిమాన్వితుడేసుకై మహిలో సాక్షిని
క్రీస్తు సాక్షిని సజీవ సాక్షిని.

ప్రభువైన యేసుక్రీస్తు కృప
మీకు తోడై యుండును గాక,
ఆమేన్.

